# లోకానికి నేనే వెలుగు

## క్రైస్తవ సుగుణాల సుగంధం - సాతాను దుర్గుణాల దుర్గంధం





సంపుటి - 39 అక్టోబరు - డిసెంబరు 2016 సంచిక - 2

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ
భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.



## సంపాదక వర్గం
ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ నందిపాము జోజప్ప
ఫాదర్ రెడ్డిమాసు పాపయ్య
ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి

## గురు విద్యార్థుల వర్గం
బ్రదర్ పాల బాలస్వామి
బ్రదర్ ప్రత్తిపాటి అమృత్
బ్రదర్ కుచ్చర్ల మార్టిన్
బ్రదర్ లింగతోటి రత్న కిషోర్
బ్రదర్ యజ్జల అశోక్
బ్రదర్ నల్ల సుధీర్ కుమార్
బ్రదర్ కత్తుల సునీల్ బాబు
బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
బ్రదర్ మనూరి మార్కో
బ్రదర్ కల్లేపల్లి యేసు బాబు


## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :


**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com



Printed at : holycrossprinters 9848145417

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-39 అక్టోబర్ - డిసెంబర్ 2016 సంచిక-4

# క్రైస్తవ సుగుణాల సుగంధం - సాతాను దుర్గుణాల దుర్గంధం

ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ప్రధాన సంపాదకులు

ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి
సంచిక సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక


సంపాదకీయం

1. క్రైస్తవ జీవితం – సుగుణాల సంధానం ....................................... 9
   – బ్రదర్ చింతగుంట్ల జగన్

2. విశ్వాసం – క్రైస్తవ జీవనానికి పునాది – మూలం .......................... 17
   – బ్రదర్ పుల్లా కిరణ్ తోమాస్

3. నమ్మికం – క్రైస్తవ జీవనాన్ని నడిపించే ఇంధనం ........................... 32
   – బ్రదర్ సూరెపల్లి అరుణ్ జోసెఫ్

4. ప్రేమ – సృష్టిలో, సృష్టికర్తతో అనుబంధాన్ని పెంచే కర్పూరం.............. 46
   – బ్రదర్ నల్లా సుధీర్ కుమార్

5. నీతి – న్యాయం: శాంతియుత క్రైస్తవ సంఘానికి పట్టుకొమ్మలు ........... 60
   – బ్రదర్ బొట్టె మనోహర్

6. వివేకం: సమయానుకూలంగా బుద్ధితో జీవించే క్రైస్తవ విధానం............ 70
   – బ్రదర్ సింహాద్రి జాన్

7. నిగ్రహం – భావోద్వేగాలను అదుపులో ఉంచే దండం...................... 83
   – ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి

8. దృఢత్వం – పట్టుదల: క్రీస్తు విలువలతో ధైర్యంగల
   సాక్షులుగా మార్చే లోహం.................................................... 96
   – బ్రదర్ వడ్లపాటి మరియదాస్

9. దుర్గుణాలు – స్వేచ్ఛ, జ్ఞానం, బాధ్యతారహిత జీవనం ................... 111
   – బ్రదర్ మనూరి మార్కో

10. పునీత మదర్ థెరెసా – సుగుణాల రాశి.................................. 123
   – బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్

ముగింపు ....................................................................... 133

# సంపాదకీయం

క్రైస్తవత్వం అంటే క్రీస్తును పోలిన విధంగా జీవించటం. క్రీస్తును పోలిన జీవితం అంటే క్రీస్తును ధరించటం (రోమీ 13:14), క్రీస్తు ప్రభువు కోరిన ప్రకారం జీవించటం (కొలొస్సీ 1:10). క్రీస్తును పోలిన జీవితం అంటే క్రీస్తు బోధించిన విధంగా జీవించటం. పునీత పౌలుగారు అన్నట్లుగా, “అపవిత్రత యందు జీవింపమని దేవుడు మనలను పిలువలేదు. పవిత్ర జీవమును గడుపుమనియే ఆయన పిలుపు” (1 తెస్సలో 4:7). క్రీస్తును మనము అనుకరించి జీవించాలి. అంటే ఆయన బోధించిన సుగుణాల ప్రకారం జీవించటం. క్రీస్తు ప్రబోధించిన లక్షణాలను/గుణాలను ప్రతి ఒక మానవుడు అలవాటుగా, జీవిత విధానంగా, స్వభావంగా, తత్వంగా చేసుకొన్నప్పుడే, వాటిని మన సుగుణాలని భావిస్తాం. దీనికి భిన్నంగా గుణాలు ఉంటే వాటిని దుర్గుణాలు అంటాం. ఎప్పుడైతే మనం పిశాచపు, సైతాను స్వభావంతో, లక్షణాలతో జీవిస్తామో అవే దుర్గుణాలు.

అనేకమార్లు మనం ఈ విధంగా ఆశిస్తాం. మంచిగా జీవించాలని, సన్మార్గంలో నడవాలని, విలువల ప్రకారం జీవించాలని, దైవభీతితో జీవిస్తూ దేవున్ని చేరుకోవాలని, నిత్యజీవాన్ని, మోక్షాన్ని పొందాలని ఆరాటపడుతాం. మరి మానవుడు ఈ గమ్యాన్ని చేరుకోవాలంటే, తన జీవితం విలువలమయమైన, సుగుణాలతో నిండి యుండాలి.

ప్రియ పాఠకులారా! మనము ఈ ప్రస్తుత శీర్షికలో సుగుణాలు, దుర్గుణాల గూర్చి తెలుసుకుంటాం. ఆంగ్లంలో సుగుణాలను వర్ట్యూస్ (virtues) అని, దుర్గుణాలను వైసెస్ (vices) అని అంటారు.

మానవ జీవితం సుగుణాల, దుర్గుణాల కలయిక. అదే ప్రకారం క్రైస్తవ జీవితం కూడా సుగుణాల, దుర్గుణాల సమ్మేళనం. కాని దేవుడు మానవుని నుండి ఆశించేది సుగుణాలు మాత్రమే.



మంచిని చేయటానికి అలవాటుపడిన దృఢ వైఖరియే సుగుణం. పునీత గ్రెగోరి ఆఫ్ నిస్సా ఇలా అంటున్నారు, “దేవునిలా కావటమే సుగుణశీలమైన జీవన లక్ష్యం.” సుగుణాలు రెండు రకాలు: అవి దైవీక సుగుణాలు, మౌలిక సుగుణాలు. దైవీక సుగుణాలు మూడు, అవి ఏమన: విశ్వాసం, ఆశాభావం (నిరీక్షణ), ప్రేమ. విశ్వాసమనే సుగుణం ద్వారా దేవున్ని, దేవుడు మనకు చెప్పిన దాన్ని లేదా బయలుపరచిన దాన్ని, పవిత్ర శ్రీసభ మనకు ప్రతిపాదించేవన్నింటిని నమ్ముతాం. నిరీక్షణ ద్వారా ఆశిస్తాం. శాశ్వత జీవం కోసం, దాన్ని పొందటానికి అవసరమయ్యే కృపావరం కోసం సడలని నమ్మకంతో దేవుని దగ్గర నుండి వస్తాయని వేచి ఉంటాం. అన్ని వస్తువులకంటే మిన్నగా దేవున్ని ప్రేమించటం, ఆ దేవుని పట్ల ఉన్న ప్రేమ కారణం చేత తోటి మానవుని పట్ల అనురాగంతో వ్యవహరించటమే ప్రేమ.

మౌలిక సుగుణాలు నాలుగు. అవి ఏమన: వివేకం, న్యాయం, స్థైర్యం, నిగ్రహం. అన్ని పరిస్థితుల్లో మంచిని, చెడును తెలుసుకొని ధర్మ జీవితం జీవించుటయే వివేకం. దైవానికి చెందిన దానిని దైవానికి, మానవునికి చెందిన దానిని మానవునికి ఇవ్వటమే న్యాయం. కష్టాల్లో దృఢత్వాన్ని, ధైర్యాన్ని వ్యక్తపరచటమే స్థైర్యం. చివరగా లోకాకర్షణల తీవ్రతను తగ్గించి, సృష్టి వస్తువుల వినియోగంతో సమతుల్యాన్ని పాటింపజేసే సుగుణమే నిగ్రహం. పైన పేర్కొన్న సుగుణాలకు విరుద్ధంగా ఉండే లక్షణాలే దుర్గుణాలు. సైతానుకు దాసోహం పలికే గుణాలే దుర్గుణాలు. చివరిలో మనం పునీత మదర్ తెరెస్సాగారు తన జీవితంలో ఈ సుగుణాలను ఎలా పాటించిందో మనకు నేర్పిస్తుంది. ప్రతి క్రైస్తవ బిడ్డ క్రీస్తు బోధనల ప్రకారం జీవిస్తూ తన జీవితాన్ని సుగుణాలమయం చేసుకోవాలి.

క్షణంలో చెడ్డపేరు తెచ్చుకోవచ్చు కాని అదే మంచి పేరు, మంచి లక్షణాల మయం కావాలంటే ఎంతో శ్రమించాలి. ఈ క్రింది సన్నివేశం ద్వారా తెలుసుకోవచ్చు. ఒకసారి వ్యాపార స్థలంలో ఎందరో ఏమేమో అమ్ముకుంటున్నారు. వారిలో ఒక గుడ్డావిడ అమ్ముకుంటుంది. అంతమందిలో ఎవరి చెయ్యో తాకి, గంప క్రిందపడి, పళ్లు అటు ఇటు దొరలిపోయాయి. ఆమె స్పర్శిస్తూ వెదుకుంటున్న

సమయంలో ఒకతను వచ్చి ఆమెను కూర్చోబెట్టి, అమ్మ నేను నీకు సహాయం చేస్తాను అని, అతను పండ్లను గంపలో వేసి, ఆమెకు ఇవ్వగా ఆమె ఇలా అన్నది: “అయ్యా, నీవు క్రైస్తవుడవా?” అని. “ఎందుకమ్మా అలా అన్నావు?” అంటే “క్రీస్తు సుగుణాల గూర్చి బోధించారు కదా, మరి నీవు నాకు సహాయం చేసావు కదా” అంది. విలువల ప్రకారం జీవిస్తే, మన జీవితం సుగుణాలమయం అవుతుంది.

ఈ ఆధునిక ప్రపంచంలో, ప్రతి మానవుడు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, సోషల్ మీడియాపై మక్కువ చూపిస్తూ సుగుణాలు, విలువలను మరచిపోతున్న తరుణాన ‘సుగుణాలు/దుర్గుణాలు’ అను దైవశాస్త్రపరమైన అంశం ఎన్నుకోవడం జరిగింది. ఈ వ్యాసాలను రచించిన మొదటి, రెండవ సంవత్సరపు (2016-17) భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యార్థులకు నా వందనాలు. వారు ఎంతో శ్రమించి, ఎన్నో పుస్తకాలను పఠించి, క్రైస్తవ జీవితం సుగుణాలమయం కావాలని ఆశిస్తూ వ్రాసారు. ఈ రచనలు అన్నీ కూడా ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్‌గారు, ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డిగారి పర్యవేక్షణలో జరిగాయి. భాషాపరంగా, అచ్చుపరంగా, దైవశాస్త్ర పరంగా దోషరహితంగా ఉండాలని శ్రమించిన ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్‌గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రియ పాఠకులారా! మీకు హృదయపూర్వక వందనాలు. మీరు చదవండి, ధ్యానించండి, జీవితాలను మలచుకోండి. చదివిన దానిని నలుగురికి పంచండి, క్రీస్తు రాజ్యాన్ని పెంచండి.

ఇట్లు ప్రభు సేవలో
**ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి**
సంచిక సంపాదకులు

# 1. క్రైస్తవ జీవితం - సుగుణాల సంధానం

- బ్రదర్ చింతగుంట్ల జగన్

**ఉపోద్ఘాతము**



మానవుడు ఎప్పుడు ధనం కోసం ఐశ్వర్యం కోసం ప్రాకులాడుతూ సంపాదించిన దానితో తృప్తిపడక, అధికంగా సంపాదించాలని ఆరాటపడు తుంటాడు. దాని కోసం ఎన్ని తప్పుడు త్రోవలైనా తొక్కడానికి వెనుకంజ వేయడు. అనేకమందికి ధనమే దైవంగా మారింది. ఆస్తిపాస్తులే అలంకారాలుగా మారి, ధనాశతో కళ్లు మూసుకుపోయి, మానవ జీవితపు విలువలన్నింటిని మంట కలుపుతూ, కీర్తి కిరీటాలైన సమసమాజ విలువలను కాలతన్నుతున్నాడు.

మరి! ఈ తరుణంలో ఓ క్రైస్తవునిగా జీవితం ఏవిధంగా ఉంది? క్రీస్తుని సువార్తా విలువలు తనను ఏవిధంగా ప్రభావితం చేస్తున్నాయి, ప్రాపంచిక వ్యసనాలలో తాను కూరుకుపోతున్నాడా లేక దైవరాజ్య విలువలతో అలరారు తున్నాడా అనేది పశ్నించుకోవాలి. సువార్తా విలువలను తనలో నింపుకొని చేసే పనిలో, మాట్లాడే మాటలో, తలచే తలంపులో క్రీస్తును పోలి ఆ ప్రభువలె జీవించి, ఆదర్శప్రాయమైన జీవితాన్ని జీవించాలని తన దైవరాజ్యాన్ని ఈ భువిలో విస్తరింపజేస్తూ, సుగుణపూరిత జీవితాన్ని జీవిస్తూ ప్రపంచానికే ఆదర్శాన్ని ఇవ్వమని ప్రభువు ప్రబోధిస్తున్నాడు. మరి క్రైస్తవునిగా మన జీవితం ఏవిధంగా ఉంది, ప్రభువు ఏ విధంగా జీవించమని ఆహ్వానిస్తున్నాడు. ప్రభు మన నుండి ఆశించేది ఏమిటో చూద్దాం!



ఈ ఆధునిక యుగంలో ప్రతిదానికి పరుగులే! గమ్యం తెలియని ప్రయాణం, ఒకరకమైన సంచలనం, తొందరపాటు మనల్ని పీడిస్తున్నాయి. అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు రోజురోజుకు చాపక్రింద నీరులా వ్యాప్తి చెందుతున్నాయి. మంచితనం, నెమ్మది, నిజాయితీ, ప్రేమ, శాంతి, సమాధానం, దయ, జాలి, కరుణ, నీతి, న్యాయం, ధర్మం అన్నవి అరకొరగా కనిపిస్తున్నాయి.

ఇటువంటి మాయాలోకంలో జీవిస్తున్న మనషికి, ప్రశాంతత ఆహ్లాదకరమైన జీవిత విధానం ఎక్కడ నుంచి వస్తుంది? విలువలతో కూడిన జీవితం జీవించేవారు ఏవిధంగా తనకు తారసపడగలరు? బహుశా ఈ సుగుణ పూరితమైన జీవితం ప్రతి మనిషికి సాధ్యమేనా అనే తలంపు రావచ్చు. దీనికి సమాధానం 'అవును' అని చెప్పవచ్చు, కారణం క్రీస్తు ప్రభువు జీవితమే ఓ గొప్ప ఆదర్శం. చీకటిలో ఉన్నవారికి వెలుగు ఎంత అవసరమో, అవినీతి అక్రమాలతో మునిగిన వారికి, నీతి, న్యాయం, ధర్మం, ప్రేమ, శాంతి, సమాధానం, దయ, జాలి మొదలగు సుగుణాలను మరచి, వాటి అర్థాన్ని గ్రహించలేక, అయోమయంలో ఉన్న ప్రతి వారికి క్రీస్తుప్రభుని జీవితమే ఓ వెలుగు పాఠం. క్రీస్తు ప్రభువు ఈ లోకానికి అరుదెంచిన తరుణం నుండి, తన తండ్రి చిత్తం ముగించుకొని చివరకు తన ప్రాణం ధారపోసేంత వరకు సుగుణపూరితమైన జీవితం జీవించి ప్రేమ, శాంతి, సమాధానం, నమ్మిక, విశ్వాసం, నిగ్రహం, వివేకం, నీతి, న్యాయం, ధర్మం, కరుణ మొదలగు సుగుణాలను ఈ లోకంలో ఒక నదిలా ప్రవహింపచేశాడు.

దైవ కుమారుడైన యేసు తన రాక ఈ లోకానికి వెలుగును నింపుతూ తండ్రి ప్రేమకు నిదర్శనంగా నిలిచాడు. తాను ఈ లోకంలో ఒక సామాన్య మానవునిగా దీనుడై, తనను తాను తగ్గించుకొని దైన్యానికి ప్రతిరూపంగా నిలిచాడు. అంతేగాక తన జననం పెద్ద కోటలో కాక, పేరు గాంచిన సుప్రసిద్ధ భవనాలలో కాక, కేవలం ఓ పశువుల పాకను ఎంపిక చేసుకోవడం అనేది ఆయన జీవన శైలిలో నిరాడంబరత ఉట్టిపడతాయి. తన ఇహలోక జీవితంలో తల్లిదండ్రులకు, పెద్దలకు, విధేయత, గౌరవంను చూపుతూ జీవించాడు. అంతేకాక, అన్యాయాలకు, అక్రమాలకు పాల్పడేవారిని హెచ్చరించగలిగాడు. సమాజంచే వెలివేయబడిన అనేకమందికి ప్రేమ, సోదరభావం, అనురాగం, ఆప్యాయత అంటే ఏమిటో

చూపించాడు. నాకు ఎవరు లేరు, నేనెందుకు పనికిరాను అని నిరాశ నిస్పృహలో ఉన్న వారిని తన అక్కున చేర్చుకొని, వారి ద్వారా, వారి కుటుంబాలలో అలానే వారు జీవించే సమాజాన్నే మార్చి, నూతన ఒరవడిని సృష్టించాడు. తిండిలేక అలమటిస్తున్న వారికి తానే జీవాహారమయ్యాడు. అనేకమైన వ్యాధి బాధలతో క్రుగ్గుతున్న ప్రతి ఒక్కరికి పరమవైద్యుడై వారి గాయాలకు కట్టుకట్టి, సేవా దృక్పథాన్ని చూపుతూ రోగులపాలిట ప్రేమ వైద్యుడయ్యాడు. తాను పలికిన ప్రతి మాటలోను, చేసిన పనిలోను, తలపెట్టిన కార్యంలోను, ప్రేమను ప్రదర్శించి, ఆ ప్రేమకు అర్థం, పరమార్థం తానై ఈ లోకోద్ధరణకై తన ప్రాణాన్ని సహితం, ప్రేమతో కలువరి గిరిపై సిలువమీద అర్పించాడు. ఈ సుగుణపూరితమైన క్రీస్తుని జీవితంను ఓ ఆదర్శంగా తీసుకొని, ప్రతి క్రైస్తవుడు, క్రీస్తుని బాటలో నడుస్తూ, ఆయన ప్రేమను పరిపూర్ణంగా తెలుసుకొని, ఆ ప్రభువలే ఈ లోకంలో జీవించాలి.

క్రీస్తు ప్రభుని బాటలో నడుస్తున్న ప్రతి క్రైస్తవుడు, నైతిక లేక ప్రధాన సుగుణాలైన వివేకం, న్యాయం, స్థైర్యం, సంయమనం (వివేకం) సి.సి.సి. 1834. దైవశాస్త్ర సుగుణాలైన విశ్వాసం, నిరీక్షణ, ప్రేమ (సి.సి.సి. 1841) లను తనలో మమేకం చేసుకొని, ఈ క్రింది విధంగా ప్రతి క్రైస్తవుడు జీవించాలని ఆశిస్తున్నాడు.

### క్రైస్తవుడు - సారవంతమైన ఉప్పులా వుండాలి

అందరికి అందుబాటైన, చౌకబారైన, ఉపయోగకరమైన వస్తువు ఉప్పు. అందుకే 'ఊపిరుంటే ఉప్పుగల్లయినా అమ్ముకొని బతకవచ్చు' అని పెద్దలంటారు. ప్రతి ఇంటిలో ఖచ్చితంగా వుండే నిత్యావసర వస్తువు, ప్రతి వంటకానికి రుచిని చేర్చే పదార్థం. ఎంతటి ఖరీదైన, పాకశాస్త్ర ప్రావీణ్యంతో చేసిన వంట అయినా ఉప్పు లేకుంటే అంతా వ్యర్ధమే.

బహుశా అందుకేనేమో క్రీస్తు భగవానుడు. మత్తయి శుభవార్త 5వ అధ్యాయం 13వ వచనంలో చెప్పినట్లుగా "మీరు భూమికి ఉప్పు వలె నున్నారు" అని బోధించాడు.

యేసు బోధించిన ఈ ఉపమానంలో ఎంతో ఆధ్యాత్మిక భావం ఉంది. క్రైస్తవుడు, ఉప్పుదనం అనే గుణం కలిగి వుంటే ఉప్పులా, ఈ లోకానికి ఎంతో ప్రయోజనకారిగా, అవసరమౌతాడు. ఈ ఆధ్యాత్మిక ఆత్మీయ ఉప్పుదనం కలిగిన



క్రైస్తవుడు ఈ లోకంలో పాపంతో నశించిపోతు, దిక్కు మొక్కు లేని జీవితాన్ని గడుపుతున్న మానవాళిని క్రీస్తు రక్షణలోకి మళ్లించడానికి ప్రయత్నించగలడు. ఇందుకుగాను క్రైస్తవుడు క్రైస్తవ రుచిని కలిగి వుండాలి. రుచికరమైన భోజన పదార్థాలు ఎలా నోరూరించి ఆకర్షించి, తృప్తినిస్తాయో అలాగే క్రైస్తవుడు కూడా క్రీస్తు ప్రభు నుండి స్వీకరించిన క్రైస్తవ రుచిని, తమ పొరుగువారికి, తదనంతరం ఈ లోకానికి రుచి చూపించాలి. ఆత్మీయంగా ఆకలితో అలమటించే వారికి, ఆత్మీయ ఆహారాన్ని సమృద్ధిగా పంచిపెట్టి, సంతృప్తిని సంతోషాన్ని కలిగించాలి. క్రైస్తవ రుచిని భూదిగంతముల వరకు వెదజల్లాలి. అప్పుడే క్రైస్తవులు ఉప్పుతో సమానులు. ఉప్పు ఏవిధంగా అయితే అన్నింటిలో కలిసిపోయి, కలిసిన ప్రతిచోట తన ఉనికిని చూపుతూ, రుచిని కలిగిస్తుందో క్రైస్తవులు కూడా తమ ఉనికిని తమ కుటుంబం మొదలుకొని తన రోజువారి దినచర్యలో ఎదురయ్యే ప్రతీ వ్యక్తితో పాటు ప్రపంచంలో ఉన్న ప్రతీ వ్యక్తితో కలిసిపోయి, తాను స్వీకరించిన క్రీస్తు రుచిని ప్రతి ఒక్కరికి పరిచయం చేయగలగాలి. ఉప్పు ఏవిధంగా అయితే శుభ్రపరుస్తుందో, పాప జీవితంలోను, వక్రమార్గంలోను చెడువ్యసనాలకు బానిసలైన వారిని పవిత్రపరచి, క్రీస్తునిలో శుద్ధీకరించగలగాలి. ఉప్పు ఏవిధంగా అయితే వస్తువులను చెడిపోకుండా నిల్వచేయగలదో, ప్రతి క్రైస్తవుడు కూడా తన పొరుగువారు దేవుని రక్షణ భాగ్యం పొంది, సాతాను శోధనలకుగాని, దాని ఆకర్షణలకుగాని లొంగిపోక నీతివంతమైన మార్గంలో నడుస్తూ, నిరంతరం వెలుగుపుత్రులుగా తయారయ్యేందుకు తోడ్పడగలగాలి. అందుకు ప్రతి క్రైస్తవుడు, తాను క్రైస్తవ ఉప్పుదనం కలిగి వున్నానా? లేక చప్పదనం కలిగి వున్నానా? అని ఆత్మ పరిశీలన గావించుకోవాలి. ఒకవేళ క్రైస్తవ ఉప్పుదనం అనే గుణం మనలో వుంటే దానిని లోకానికి అందించగలగాలి. మనలో ఉన్న క్రైస్తవ ఉప్పుదనాన్ని లోకానికి అందించకపోతే అది నిష్ప్రయోజనమైపోతుంది. అటువంటి వ్యర్ధమైన ఉప్పును (సారంలేని ఉప్పులును) నేలపాలు చేసి కాళ్ళతో తొక్కివేయుదురు. ఒక క్రైస్తవుడిగా, క్రీస్తు ప్రతిరూపంగా, ఆయన సుగుణాలను కలిగివున్న మనమే సారంలేని ఉప్పువలె వుంటే ఈలోక పరిస్థితి ఏమిటి? మరి ప్రభువు పలికినట్లుగా 'మీరు లోకానికి ఉప్పువలె ఉన్నారు' అనే వాక్యానికి అర్థమేముంది? కనుక క్రైస్తవుడైన ప్రతి వ్యక్తి క్రీస్తుని ఉప్పుదనాన్ని ప్రపంచంలో వెదజల్లి, తన కుటుంబం మొదలుకొని,

ఒక్కొక్కరిగా ఈ ప్రపంచమంతా క్రీస్తు ఉప్పదనంతో నింపి, దైవరాజ్యపు రుచిని పెంపొందించాలి.

## క్రైస్తవుడు - వెలుగుమయుని వెలుగు రేఖలా ఉండాలి

రాజు, రవి మంచి స్నేహితులు ఒకరోజు భగవంతుడు వారికి, కనిపించి మీకు ఒక గదిని చూపిస్తాను, అందులో వజ్రాలు, వెలుగు వుంటాయి. మీరు ఆ రెండింటిలో దేనినైనా కోరుకోవచ్చును. అయితే ఒక షరతు వజ్రాలు కోరుకున్నవాడు వెలుగును కోరుకో కూడదు, వెలుగును కోరుకున్నవాడు వజ్రాలను కోరుకోరాదు అన్నాడు. రాజు రవి బాగా ఆలోచించుకున్నారు. రాజు వజ్రాలను కోరుకున్నాడు, రవి వెలుగును కోరుకున్నాడు. అప్పుడు ఇద్దరు భగవంతుడు చూపించిన గదికి చేరుకున్నారు. రాజు గదిలోనికి ప్రవేశించాడు, గది అంతా చీకటిగా ఉంది. గదిలో ఏమి కన్పించలేదు. అంతా తిరిగి బిక్కుబిక్కుమంటూ తిరిగి వచ్చేశాడు. అప్పుడు రవి గదిలోనికి వెళ్ళాడు, గది అంతా వెలుగుతో నిండి ఉంది. అక్కడక్కడ వజ్రాలు కన్నులకు మిరమిట్లు కొల్పేలా కన్పించాయి. ఆనందంతో, పట్టరాని సంతోషంతో వజ్రాలను సేకరించుకొని, వెలుగుతో వెలుగు పుత్రునిలా బయటికి వచ్చాడు. అది గమనించిన రాజు నివ్వెరపోయి బిక్కుముఖంతో తలదించుకుంటాడు. వెలుగులో జీవించువారు, చీకటిని జయిస్తారు.

సీరా పుత్రుడైన యేసు జ్ఞానగ్రంథం 15వ అధ్యాయం 15,16 వచనాలు "నీవు కోరుకొందువేని ప్రభు ఆజ్ఞలను పాటించవచ్చును. అతనిని అనుసరింపవలయునో లేదో నిర్ణయించునది నీవే. ప్రభువు నిప్పును నీళ్ళను కూడా నీ ముందు ఉంచెను. చేయి చాచి వానిలో నీకిష్టమొచ్చినది తీసుకొనుము" అని వ్రాయబడింది. దీనిని బట్టి మనకు ఏది కావాలో నిర్ణయించుకొనే హక్కు ప్రభువు మనకే యిచ్చాడు. నిర్ణయం తీసుకోవలసినది నీవే. ఈ నిర్ణయం తీసుకొనుటలో సాతాను మనలను పరీక్షిస్తూ అనేక విధాలుగా శోధిస్తుంది. ప్రపంచాన్ని గమనించినట్లయితే ప్రపంచంలో మంచి-చెడు, వెలుగు-చీకటి, సుఖం-దు:ఖం, అన్నీ మనముందే వుంటూ మనల్ని ఆకర్షిస్తుంటాయి. అంతేకాక, శోధనలు స్వార్థపు కోరికలు, అవినీతి, అన్యాయం, లోకపు పోకడలు మనల్ని మిలమిల మెరుస్తూ ఆకర్షిస్తూ మనల్ని ఆకట్టుకుంటాయి. దైవరాజ్య విలువలైన ప్రేమ, శాంతి, 



సమాధానం, ఆత్మీయత, అనురాగం, సోదరప్రేమలు కూడా వెలుగుగా ప్రకాశిస్తున్నాయి. మరి మనం ఏమి కోరుకుంటున్నాం? రాజువలే ఈ లోక సంపదలైన వజ్రాలను వాటి క్షణబంగుర మెరుపులనా? లేక రవి వలే దేదీప్యమైన దైవరాజ్యపు విలువలా? ఏది కావాలో ఆలోచించి, అన్వేశించి, పట్టువిడువక ముందుకు సాగాలి. దేదీప్యమైన దివ్యనాధుని వెలుగును స్వీకరించి, ఆ వెలుగుతో ఈ లోకాన్ని నింపి, అజ్ఞానంలోను, అంధకారంలోను ప్రయాణిస్తున్న ప్రతి వ్యక్తిని, క్రీస్తుని వెలుగులోనికి నడిపించగలగాలి. క్రైస్తవులుగా మనం స్వీకరించిన వెలుగు దేదీప్యమైంది. ఇక్కడ ఒక ప్రశ్న, మనం ప్రభువు నుండి స్వీకరించిన వెలుగు మనలో వుందా? ఒకవేళ వుంటే దానిని మంచం క్రింద ఉంచామా లేక దీపస్తంభంపై వుంచామా? (మత్తయి 5:15). దీప స్తంభంపై వుంచితే నిజంగా ఎంతమందిని ఆకర్షించగలుగుతున్నాము. మనలో ఉన్న క్రీస్తు వెలుగును మన చేతలు, మాటలు, క్రియల ద్వారా ప్రపంచానికి ప్రసరింపజేస్తే, ప్రపంచమంతా, ప్రభుక్రీస్తుని వెలుగురేఖలా దేదీప్యంగా ప్రకాశించగలుగుతుంది.

## క్రైస్తవుడు - ఆదర్శప్రాయుడిగా జీవించాలి

ఒకానొక గ్రామంలో ఓ తల్లి కుమారుడు జీవిస్తుండేవారు. తల్లి తన కుమారుని అల్లారుముద్దుగా పెంచి, పెద్దవాడ్ని చేస్తుంది. రోజులు గడుస్తున్నాయి, తల్లి ఆరోగ్యం కాస్త క్షీణిస్తూ వుంటుంది. తన ప్రేమకు ప్రతిరూపమైన బిడ్డకు, వివాహం చేసి తనకంటు ఓ తోడు నీడను ఏర్పాటుచేసి తన కర్తవ్యంను నిర్వహించాలని ఆశపడుతుంది. అనుకున్నట్లుగానే తన కుమారుడికి ఓ అందమైన యువతితో వివాహం జరిపిస్తుంది. వివాహం అయిన కొన్ని రోజులు కుమారుడు గాల్లో విహరిస్తుంటాడు, భార్యను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడు. పెళ్లామే సర్వం అయ్యింది, ఒక ప్రక్క తల్లి ఆరోగ్యం కాస్త క్షీణించడం మొదలుపెట్టింది, సొగసరి కోడలికి అత్తంటే చిరాకు కలగడం ప్రారంభమైంది. కారణం తాను అత్తకు అన్ని సేవలు చేయాలి. కాబట్టి, ఎలాగైనా తన అత్తను ఇంటి నుండి దూరం చేయాలని ఆశించి, కుమారునికి లేనిపోని మాటలు చెప్పి, తల్లిపై విరక్తి కలిగేలా చేసి, అత్తను తీసుకెళ్లి ఓ అరణ్యంలో వదలమని సలహానిస్తుంది. భార్య మాయలో పడిన కుమారుడు తన తల్లికి అడవిలో వదలిరావాలని తీసుకెళ్తూ

వుంటాడు. అలా చాలా దూరం అడవిలో ప్రయాణిస్తూ వుంటాడు, ఈ ప్రయాణంలో తల్లి కొన్ని చెట్టు ఆకులుకోసి, దారి వెంబడి చల్లుతూ వుంటుంది. అది గమనించిన కుమారుడు తల్లితో ఈ విధంగా అంటాడు, "అమ్మా! నీవు దారివెంబడి ఆకులు వేసుకొని వాటిని చూసి తిరిగి ఇంటికి రావాలని అనుకుంటున్నావేమో.. నీవు రాలేవు కారణం నేను నిన్ను చాలా దూరం తీసుకొనివచ్చాను" అని అంటాడు. అప్పుడు ఆ తల్లి కుమారునితో ఈ విధంగా అంటుంది, "కుమారా! ఈ ఆకులు నా కోసం కాదు, నీ కోసమే. ఎందుకంటే అడవిలో నీవు చాలాదూరం వచ్చావు, వెళ్లేటప్పుడు దాని తప్పి పక్కకు వెళితే అడవి మృగాలకు ఆహారమౌతావు అలా జరగకుండా, నీ క్షేమం కోసమే ఈ ఆకులు" అన్నప్పుడు ఆ కుమారుని కళ్లలో కన్నీరు జలజలరాలి, చేసిన తప్పును తెలుసుకొని, పశ్చాత్తాపపడి, తల్లిని హృదయానికి హత్తుకొని ఇంటికి తెచ్చి, కంటి పాపలా చూసుకుంటాడు.

మరి! ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రుల పరిస్థితి ఏవిధంగా ఉంది? వృద్ధాశ్రమాలు ఎందుకు పెరిగిపోతున్నాయి? నవమాసాలు మోసి, కని పెంచిన తల్లిదండ్రులను, కంటి రెప్పలా చూసుకోవాల్సిన కుమారులు, ఎందుకు ఈ విధంగా తయారవుతున్నారు.

మరీ ముఖ్యంగా ఓ క్రైస్తవుడిగా నీ తల్లిదండ్రులను ఏవిధంగా చూసుకుంటున్నావు? నీ తల్లిదండ్రులు నిన్ను కని పెంచి పోషించడమే కాక, నీకు లోకానికి వెలుగైన క్రీస్తు భగవానుని తెలియజేసి, ఆయనకు ప్రియమైన బిడ్డగా ఉండుటకు అవకాశం కల్పించారు. మరి వారిపై నీ ధోరణి ఏవిధంగా ఉంది? మరి ఈనాడు తల్లిదండ్రుల పరిస్థితి ఇంత దీనంగా వుందంటే కారణమేమి? తల్లిదండ్రులు క్రీస్తుప్రభును ప్రేమించి, సేవించి, ఆయనను పిల్లలకు తమ జీవితాల ద్వారా ఇవ్వగలిగారా? ఇంకో విధంగా చెప్పాలంటే పిల్లలు క్రీస్తుప్రభుని, ఆయన ప్రేమను నిజంగా అర్థం చేసుకొని ఆయన ప్రతిబింబాన్ని వారి తల్లిదండ్రులలో చూసుకుంటున్నారా?

తల్లిదండ్రులు తమ పిల్లలకే వారి జీవితాల ద్వారా, మాటలు, క్రియల ద్వారా క్రీస్తుప్రభుని ఇవ్వలేకపోతే, వారి రోజువారి జీవితాలలో ఎదురయ్యే వారికి, అలాగేవారు పనిచేసే సంస్థలలో, కార్యాలయాలలోని వారికి మరీ ముఖ్యంగా



వారితో ఉండే యిరుగుపొరుగు వారికి ఏవిధంగా ఇవ్వగలరు. మరి పిల్లలు కూడా లోకజ్ఞానం ఎరిగి క్రీస్తును గురించి విని, చదివి, దివ్య సంస్కారాల ద్వారా స్వీకరించి ఆ క్రీస్తుప్రభుని వారి తల్లిదండ్రులలోనే కనుగొనలేక, వారిని ప్రేమించక వారి ఆలనా పాలనా చూసుకొనలేకపోతే, ఇక ఏవిధంగా ప్రభువుకి ప్రియమైన బిడ్డలుగా జీవించగలరు, ఏవిధంగా ప్రభుని ప్రజలుగా నిజమైన క్రైస్తవులుగా ఈ లోకంలో సంచరించగలరు?

ఆలోచిద్దాం! అన్వేషిద్దాం!

అందరం, ప్రపంచం మారాలి, ప్రజలందరు నీతి న్యాయంగా జీవించాలి, సుగుణాల సాగరంగా ఈ ప్రపంచం తయారు కావాలని, కలలు కంటే సరిపోతుందా? సరిపోదు. ఒక క్రైస్తవుడిగా నీవు నేను ఈ రోజే నిజమైన ప్రభుని కనుగొని, ఆయన చూపిన ప్రేమబాటలో నడుస్తూ, ఆయనవలే, సుగుణపూరిత జీవనం కొనసాగించాలి. తల్దిండ్రులు పిల్లలకు క్రీస్తుని తమ జీవితాల ద్వారా పరిచయం చేస్తూ, వారికి నిజమైన వెలుగు పుత్రులుగా ఈ ప్రపంచంలో వదలిపెట్టాలి. అలాగే పిల్లలు కూడా, తమ తల్లిదండ్రుల ద్వారా నేర్చుకున్న సుగుణాల సంధానమైన విలువలను, అలవాట్లను, వారి జీవిత విధానం ద్వారా ఇతరులకు తెలియజేస్తూ, ఈ లోకంలో వెలుగు పుత్రులవలె క్రీస్తుకు సాక్షులుగా జీవించాలి.

❋ ❋ ❋ ❋

# ౨. విశ్వాసం - క్రైస్తవ జీవనానికి పునాది - మూలం

**- బ్రదర్ పుల్లా కిరణ్ తోమాస్**



ప్రస్తుత ఆధునిక యుగంలో ఎన్నో మార్పులు కనబడుతున్నాయి. సమాజంలో గల వివిధ రంగాలలో అభివృద్ధి కనబడుతుంది. అవి కేవలం ఒక్క రంగానికే పరిమితం కాకుండా, అనేకమైన రంగాలలో మారుతున్న కాలాన్ని బట్టి, సమాజరీత్య అభివృద్ధి కనబడుతుంది. ఇవన్నీ మారుతున్న మనిషి మనుగడ విధానంపై ఏదో ఒకరకంగా తమ ముద్రను, ప్రభావాన్ని బయలుపరుస్తున్నాయి. కాని తల్లిశ్రీసభ మాత్రం యుగాలు గడచినా, తరాలు మారినా మనందరకు ఒకే విశ్వాసాన్ని ఎలాంటి మార్పు లేకుండా అందిస్తుంది. ఆదిలో మొదలయిన అబ్రహాము విశ్వాసపు యాత్రలో పాలుపంచుకొనమని మనందరకు ఆహ్వానాన్ని ఇస్తుంది. అందుకే పునీత అగస్తీను ఇలా అన్నారు, “విశ్వాసం, నిరీక్షణ, నమ్మిక క్రైస్తవ జీవితానికి నిజమైన బలం, క్రైస్తవులు వెదకవలసినది వీటినే”.

**విశ్వాసము అనగా...**

విశ్వాసము, విశ్వసించుట అను ఈ రెండు పదాలకు గ్రీకు భాషలో పెస్తిన్, 'పిస్తేయన్, అంటారు. 'పెస్తిన్' అనగా అభయం, నమ్మకం, విశ్వాసం. అదే విధంగా పరిశుద్ధ గ్రంథంలో చూచినట్లయితే “మనము నిరీక్షించు విషయములందు నిస్సందేహముగా ఉండుట మనము చూడజాలని విషయములను గూర్చి నిశ్చయముగా ఉండుట (హెబ్రీ 11:1). నాలుగు అక్షరాల కలయిక అయిన విశ్వాసము (వి+శ్వా+స+ము) ఒక వినూత్న అర్థాన్నీ దానిలో ఇమడ్చుకుంది.



ముందుగా మొదటి అక్షరం 'వి'. ఈ 'వి' అక్షరం నిన్ను నన్ను విజ్ఞానవంతుడైన సర్వేశ్వరుని యందు అన్నివేళలా, వినయ, విధేయతలు చూపడం ద్వారా దేవునికి ఇష్టానుసారంగా జీవించగలిగిన వారం అవుతాం. విధేయించడం, వినయం చూపడం అంటే 'విన్న మాటకు యథేచ్ఛగా ఆధీనం కావడం' అని అర్థం. విశ్వాసం ద్వారా వినయ విధేయతలకు విశ్వాసపు తండ్రిగా నిలిచిన అబ్రహాంను పరిశుద్ధ గ్రంథం నిలువెత్తు దీపంలా చూపుతుంది. ఈ వినయ విధేయతలు ఆ సర్వేశ్వరుడు మనకు ప్రసాదించిన వరం. తల్లిదండ్రుల యందు, విద్యాబుద్ధులు నేర్పే గురువుల యందు, ఆప్యాయత, అనురాగాలను పంచే అన్నదమ్ములయందు, అక్కాచెల్లళ్ల యందు, బంధుమిత్రల యందు, మన పొరుగు వారి యందు చూపించాలని తల్లి శ్రీసభ మనందరకు ఆహ్వానాన్ని అందిస్తుంది. ఎందుకంటే వీరియందు మనం నిజమైన వినయ, విధేయత కలిగివుంటే ఆ దేవునియందు కలిగివున్నట్లే, కాబట్టి మనల్ని మనం ప్రశ్నించుకుందాం.

రెండవ అక్షరం 'శ్వా', ఈ అక్షరం శ్వాసకు ప్రతీకగా నిలుస్తుంది. ఇక్కడ శ్వాస అంటే సృష్టి ఆరంభంలో తండ్రి దేవుడు అంతటిని సృష్టించిన పిమ్మట, నేల మట్టిని కొంత తీసుకొని, దాని నుండి మానవుని చేసి అతని ముక్కురంధ్రాలలో ప్రాణవాయువు అయిన తన శ్వాసను ఊదాడు. కాబట్టి ఈ శ్వాస, తుదిశ్వాస విడిచే వరకు, ఆఖరి వరకు ఎన్ని కష్టాలు, హింసలు, సాతాను శోధనలు ఇలా ఎన్ని ఎదురైనా ఆ దేవుడే పరలోక భూలోక సృష్టికర్తయని విశ్వసిస్తూ, సాక్ష్యమిస్తూ, ఆయన యందు పూర్ణ మనస్సుతో, పూర్ణ శక్తితో, పూర్ణ ఆత్మతో విశ్వాసముంచి ముందుకు సాగమని ఈ 'శ్వా' అను అక్షరం మనలను ఆహ్వానిస్తుంది.

మూడవ అక్షరం 'స', స అను అక్షరం సరైన సన్మార్గానికి ప్రతీకగా నిలుస్తుంది. మనలను ఈ సన్మార్గంలో నడవమని పిలుస్తూ ఉంది. ఆ సన్మార్గం ఎట్టిదన దైవకుమారుడును, మనుష్య రక్షితుడైన క్రీస్తువు పేదవారి పట్ల, అభాగ్యులపట్ల, అనాథల పట్ల, శత్రువులపట్ల, విధవరాళ్ల పట్ల, స్త్రీల పట్ల, రోగుల పట్ల ఆయన చూపిన మచ్చలేని, మలినం లేని జాలి, ప్రేమ, కరుణ, దయ, క్షమ అను సద్గుణాలతో కూడిన సన్మార్గాన్ని చూపుతూ ఉంది. ఇటువంటి సన్మార్గం ఎంచుకోవడం ద్వారా దేవుడు మనకు ఒసగే అనుగ్రహాలకు పాత్రులం అయ్యేలా చేస్తుంది.

చిట్టచివరిగా నాల్గవ అక్షరం 'ము' అను అక్షరం ముక్తిప్రధాతకు ప్రతీకగా నిలుస్తుంది. తనయందు భయభక్తులు కలిగి జీవించడం ద్వారా మనకు విముక్తి ప్రసాదిస్తానని అందుకుగాను విశ్వాసం కలిగి ఉండమని ప్రభువే సెలవిచ్చారు. "విశ్వసించి జ్ఞానస్నానము పొందువాడు రక్షింపబడును. విశ్వసింపనివానికి దండన విధింపబడును". ఎందుకంటే "విశ్వాసము ద్వారా, దేవుని వరము వలననే, మీరు రక్షింపబడితిరి. అది మీ ప్రతిభ కాదు. దేవుని కృపయే" (ఎఫెసీ 2:8). ఈ కృపామయుడు ఒకే ఒక్క మాట ద్వారా భూమ్యాకాశాల్ని సృష్టించి, ఆ వాక్కే మానవరూపం దాల్చి, మరియసుతుడుగా జన్మించి, ఈ లోక రక్షణార్థం భూమ్యాకాశాల మధ్య వ్రేలాడి మానవ రక్షణకు కారణభూతుడైనాడు. కేవలం ఆయన యందు మాత్రమే మనకు ముక్తి లభిస్తుంది.

## విశ్వాసపు క్రైస్తవ జీవితానికి తండ్రి అబ్రహాము (ఆది 12:1)

సర్వజ్ఞానం, సర్వశక్తి, పరమానందం, పరమోన్నత సత్యం, అద్భుత సౌందర్యం, నిత్యశాంతి, అమరణ జీవమునకు మారు పేరు "దేవుడు". ఆ దేవుని కనుగొనడం, అనుభూతి చెందడం మన మేధోశక్తికి అసాధ్యమైన పని. అందుకే, దేవుడు ఆయనను చేరడానికి "విశ్వాసం" అను వరంను దయచేస్తున్నాడు. ఆ విశ్వాసమే దేవుని చేరువలోకి తీసుకెళుతుంది. ఆ విశ్వాసమే అబ్రహాము స్వరాజ్యాన్ని త్యజింపజేసింది. అబ్రహాం ఎంతో సంపన్నుడు. ఎన్నో గొర్రెల మందలు, భూమి, సేవకులు, పశుపక్ష్యాదులు, ఐశ్వర్యాలు ఉన్నా అవేవి అతనికి సంతృప్తినీయలేదు. ఆయనలో ఏదో తెలియని అసంతృప్తి, తపన దేవుని పిలుపుకు స్పందించేలా చేసింది.ఆ పిలుపే అతనికి విధేయత నేర్పింది. ఆ పిలుపే అతని జీవితాన్ని ఒక మలుపు తిప్పింది. అబ్రహాం చూపిన ఆ విశ్వాసపు స్పందనలో మనం మూడు విషయాలు గమనించగలం. అవి పరాక్రమం, నిర్భయం, అంకిత భావం. ఈ అంశాలు అబ్రహాం జీవితంలో గమనించవచ్చు.

## విశ్వాసం విధేయతను కోరుతుంది

విశ్వాసం అనే సుగుణాన్ని కలిగిన వ్యక్తి ఈ ప్రపంచంలో దేనినైనా దేవుని కొరకు త్యజించగలగాలి. ఆ త్యజింపు మాత్రం కేవలం విధేయత వలనే సాధ్యమవుతుంది. "నీ దేశమును, నీ చుట్టుపక్కాలను, నీ పుట్టినింటిని వదలి



నేను చూపు దేశమునకు వెళ్లుము" (ఆది 12:1) అని దేవుడు పలికిన పలుకులకు అబ్రహాం మారు మాట్లాడకుండా తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఇక్కడ అబ్రహాం ఒక అసమాన్యమైన నిర్ణయాన్ని తీసుకున్నాడు. తన చుట్టూ ఉన్న వారిని, తనకంటూ ఉన్న వారిని, తాను ఏర్పరచుకొనిన చిన్న ప్రపంచం అయిన తన ఇంటిని వీడి వెళ్ళాలని ఆయన తీసుకొనిన నిర్ణయం ఇన్ని తరాలకు ఆయనను విశ్వాసమునకు తండ్రిగా నిలిచేలా చేసింది. ఆ నిర్ణయం మనం వినినంత, చదువుకొనినంత సులువైనది కాదు. ఎందుకంటే "విశ్వాసమే, అబ్రహామును దేవుడు పిలిచినపుడు విధేయుడగునట్లు చేసింది (హెబ్రీ 11:8). అబ్రహాం విశ్వసించాడు కాబట్టే, అతడు దేవుడు తనకు వారసత్వంగా ఇవ్వజూపిన దేశానికి, తానెక్కడికి వెళుతున్నది తెలియకపోయినా విధేయతతో వెళ్ళాడు. ఎలా బ్రతకాలి? ఎలా సంపాదించుకోవాలి? సుఖ సంతోషాలు ఉంటాయా? ఆహారం దొరుకుతుందా? నీరు దొరుకుతుందా? అంటూ ఆలోచించి ఇహలోక ఆదరణ కోసం అబ్రహాం ప్రాకులాడలేదు. ఎందుకంటే నన్ను పిలిచిన దేవుడు నా చేయి విడువడు అని అతను విశ్వాసం ఉంచిన తీరు చాలా గొప్పది. ఆ విశ్వాసపు విధేయత వల్లనే ఆయన వాగ్ధాన భూమిలో పరదేశిగా, యాత్రికుడుగా జీవనం సాగించాడు. ఆ విశ్వాసపు విధేయత వల్లనే పండు ముసలి ప్రాయంలో కుమారున్ని పొందాడు. అదే విశ్వాసపు విధేయత వల్లనే తన ఏకైక కుమారుని బలిగా అర్పించేందుకు కూడా వెనుకాడలేదు. ఇప్పుడు మన విశ్వాసపు జీవన విధానాన్ని పరిశీలించుకుందాం. నిజంగా మన జీవితాలలో విధేయతతో కూడిన విశ్వాసాన్ని కలిగి ఉంటున్నామా? కేవలం విధేయత ద్వారానే దేవునియందు దృఢమైన విశ్వాసాన్ని ప్రదర్శింపగలం. "విశ్వాసరహితుడగు ఏ మానవుడు దేవున్ని సంతోషపెట్టలేదు అని హెబ్రీయులకు వ్రాసిన లేఖ తెలియపరుస్తుంది (హెబ్రీ 11:6). కాబట్టి మనల్ని మనం ప్రశ్నించుకుందాం.

## విశ్వాసం పరీక్షకు గురి అవుతుంది

విశ్వాసం తప్పకుండా పరీక్షకు గురి అవుతుంది. పునీత పేతురు వ్రాసిన మొదటి లేఖ 1వ అధ్యాయం 7వ వచనం "నాశనమగు బంగారం కూడ అగ్నిచే పరీక్షింపబడును గదా! అట్లే సువర్ణము కంటే ఎంతో విలువైన మీ విశ్వాసము

కూడా పరీక్షింపబడవలయును. అప్పుడే అది చెడకుండును. దాని వలన యేసుక్రీస్తు ప్రత్యక్షమైన దినమును మీకు కీర్తి ప్రతిష్ఠలును, మహిమయు కలుగును”. ఈ అంశాన్ని బైబిలు గ్రంథం నందు ముఖ్యంగా ముగ్గురి వృత్తాంతాల ద్వారా మనం అర్థం చేసుకుందాం.

**అబ్రహాము (ఆది 22:2)**

తన జీవితాంతం వరకు దేవుని యెడల విశ్వాసంతో జీవించిన అబ్రహాంనకు పరీక్ష తప్పలేదు. ఎన్నో విషమ పరిస్థితులు ఎదురైనా ఈ విశ్వాసాన్ని అబ్రహాం వీడలేదు. తన పండు ముసలిప్రాయంలో కలిగిన ఏకైక కుమారుడు అయిన ఇస్సాకును బలిగా అర్పించేందుకు కూడా వెనుకాడలేదు (ఆది 22:2). తన సొంత కుమారున్ని బలిగా అర్పించేందుకు తన హృదయం ఎంత విలవిలలాడిన, దేవుని ఆజ్ఞకు ఒక్కమాట కూడా బదులు పలుకక ఇస్సాకును బలిగా అర్పించడానికి సిద్ధమయ్యాడు. ఇక్కడ అబ్రహాం దైవభీతిని కలిగి స్పందించాడు. తనకున్న సకల ఐశ్వర్యము కన్న మిన్నయైన తన కుమారుని బలిగా ఇవ్వడమనేది చాలా గొప్ప త్యాగం. ఇప్పుడు మనల్ని మనం ప్రశ్నించు కుందాం. ఆ దేవుని యెడల మనకు గల విశ్వాసాన్ని నిరూపించుకోవటానికి దేన్ని మనం త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం? ప్రభువు అడుగుతుంది మన సంపదలు కాదు, మన పశ్చాత్తాపపూరిత హృదయాలనే బలిగా కోరుతున్నారు; మరి మనం సిద్ధంగా ఉన్నామా?

**నామాను వృత్తాంతము (2 రాజులు 5:9-14)**

కుష్ఠ రోగంతో బాధపడుతున్న నామానునకు ఎలీషా ప్రవక్త చెప్పిన పని నీవు వెళ్లి యొర్ధాను నదిలో ఏడుసార్లు మునుగు అని చెప్పాడు. నీ శరీరానికి మరల ఆరోగ్యం చేకూరును అని. గొప్ప అద్భుతం ఆశించిన నామాను, ప్రవక్త పలికిన పలుకులకు చిన్నబోయాడు. తీవ్ర కోపానికి గురి అయ్యాడు. ఎట్టకేలకు వెళ్లి ఆ నదిలో స్నానం ఆచరించిన తరువాత నామాను దేహం చిన్న బిడ్డ దేహం వలె మారింది. అక్కడ యొర్ధాను కంటే ఎన్నో గొప్ప నదులు సిరియా దేశం నందు గలవు. కాని ఇక్కడ దాగియున్న అర్థం అది కాదు. గొప్పతనం యొర్ధాను



నదిలో గల నీటిలో లేదు గాని ప్రవక్త పలికిన మాటకు విధేయత చూపడంలో ఉంది. ఎందుకంటే ఆ మాటలు ప్రవక్తవి కావు, ప్రవక్త ద్వారా నామానును పరీక్షిస్తున్న దేవునివి. ఒకవేళ ప్రవక్త ఆజ్ఞకు నామాను విధేయత కనబరచకపోయి నట్లయితే తన రోగం నుండి స్వస్థత పొందేవాడు కాదు. ఇప్పుడు మనల్ని మనం ప్రశ్నించుకుందాం. ఇలా ఎన్ని సమయాలలో దేవుడు మనలను పరీక్షకు గురిచేసినప్పుడు ఆఖరి వరకు విశ్వాసం కలిగి ఉన్నాం? ఎన్ని పర్యాయములు ఆయనను వీడి మనకు ఇష్టపూర్తిగా ఉన్న మార్గంలో నడిచాం? ఆత్మపరిశీలన చేసుకుందాం.

**శ్రీసభ పునాది అయిన పేతురుగారు (మత్తయి 14:22-32)**

సీమోను పేతురు, సీమోను అనగా ‘reed’ ‘రీడ్’ అని అర్థం. అంటే ‘రెల్లు” అని. రెల్లు కాడ ప్రత్యేకత ఏమిటంటే అది ఎటు గాలివీస్తే అటు వాలిపోతుంది, దానిని చంచలం అంటారు. మొదటి నుండి కూడా పేతురుగారు ఎక్కువ శాతం ఈ రెల్లు కాడలా చంచల మనస్థత్వాన్ని కలిగి జీవించారు. నాయక లక్షణాలతో తొణికిసలాడిన పేతురులో సైతం ఎన్నో సందేహాలుండడం ఆశ్చర్యాన్ని కలిగించినా, అతన్ని ప్రభువు అడుగడుగునా తీర్చిదిద్దిన వైనం అమోఘం. పేతురు వైఖరిని మొదటి నుండి గమనిస్తున్న ప్రభువు అతని మనోగతిని అర్థం చేసుకున్నారు. తన మీదున్న విశ్వాసాన్ని దృఢపరచుకోవడానికి పేతురు పడుతున్న ప్రయాసను, అవస్థను ప్రభువు గుర్తించాడు. అందుకే చాలా సందర్భాలలో తన విశ్వాసం ద్వారా తాను అవహేళనకు గురికావడం జరిగింది. ఎదురుగా ఉన్న ప్రాణభయం వల్ల ఆ వ్యక్తి ఎవరో నాకు తెలీదు అని గురువునే తిరస్కరించడం జరిగింది. నీటిపై నడచిన సమయంలో పేతురు అవిశ్వాసాన్ని మనం ఇంకా దృఢంగా చూడవచ్చు (మత్తయి 14:22-33) ఎంతో మనోహరంగా ఆహ్లాదకరంగా ఉండే సముద్రం ఒక్కసారిగా ప్రళయ ఘోషతో విరుచుకుపడింది. బండలపై కొరడాలతో పెళ్లుమని ఝుళిపించే అలల తాకిడి, జడలు విప్పిన కారు చీకటి విళయ తాండవం చేయసాగాయి. దరిదాపుల్లో తీరం కనిపించడం లేదు. అందరిలోకి నాయకు డయినందున అదనపు బాద్యత కలిగిన పేతురు భయంతో తన పోరాటాన్ని మొదలుపెట్టాడు. ఇంతలో కంటికి కనిపించి కనిపించని ఒక ఆకారం వారివైపు

వెళ్లసాగింది. అప్పటికే ఎన్నో జవాబులేని ప్రశ్నలతో నిండిన వారి హృదయాలు భయంతో మరింత క్రుంగిపోయాయి. అందరూ దెయ్యం, భూతం అంటూ అరవడం మొదలుపెట్టారు. "నేనే, భయపడకండి" అంటూ తన భరోసాను అందించారు ప్రభువు. "ప్రభూ! మీరే అయితే నేను కూడా మీతో నీళ్లమీద నడుస్తాను" చిన్న పిల్లవానిలా అడిగేశాడు పేతురు. ఇక్కడ శిష్యులందరు అది ప్రభువని విశ్వసించిన పేతురు మాత్రం వారిని రక్షించింది ప్రభువే అని విశ్వసించలేకపోయాడు. క్రిందకు దిగాడు, పడవను వదలి ప్రభునివైపు నడవసాగాడు. ఇంతలో ఒక పెద్ద అల దెబ్బకు అదరిపోయాడు పేతురు, అప్పటి వరకు అతని దృష్టి ప్రభువు మీదే ఉంది. ఎప్పుడైతే అలను చూసి భయానికి లోనయ్యాడో మునిగిపోవడం మొదలుపెట్టాడు.

ఈ వృత్తాంతాన్ని చదివిన వెంటనే మనకు కలిగే ఓ ఆలోచన సర్వసాధారణం. పేతురుకు సంపూర్ణ విశ్వాసముండిన యెడల నీటిపై నడిచేవాడే. కాని ఈ అభిప్రాయాన్ని పూర్తిగా మనం బలపరచలేం. ఎందుకంటే విశ్వాసాన్ని శాస్త్రీయ కొలబద్ధతో కొలవకూడదు. అలాగయితే యిక విశ్వాసమున్న ప్రతి వ్యక్తి ఎలాంటి ప్రమాదాలుగానీ, యిబ్బందులుగానీ ఏర్పడకూడదన్న మాట. ఇక్కడ పేతురు కలిగియున్న అల్ప విశ్వాసమన్నది, కొంచెం మొండి ధైర్యంతోను, మరికొంత అనుమానంతోను మిళితమై ఉంది. పేతురు గురించి పూర్తిగా తెలిసిన ప్రభువు ఆయన చూపిన అవిశ్వాసానికి కోపపడలేదు. ఎందుకంటే పేతురు కనుపరచిన అల్ప విశ్వాసంలో కూడా ప్రభువు నిజాయితీని చూశాడు. అందుకే తన అవిశ్వాసాన్ని ప్రభువు పరిగణించలేదు. పేతురులో అప్పటి వరకు పేరుకుపోయిన అవిశ్వాసపు మురికిని ప్రభువు చివరి వరకు ప్రక్షాళన చేస్తూ వచ్చాడు.

ఒకటి కాదు రెండు కాదు అనేక పర్యాయాలు పేతురు ప్రభువు మీద తనకు గల అవిశ్వాసాన్ని వ్యక్తం చేశాడు. కాని ప్రభువు అతన్ని విడువలేదు. ప్రభువు పెట్టిన పరీక్షలో చాలా వరకు తన విశ్వాసాన్ని నిరూపించుకున్నాడు. అందుకే ప్రభువు పేతురుకు ఒక బాధ్యతను అప్పగించాడు (యోహాను 21:15-19). అది కూడా ప్రభువు పేతురును ముమ్మారు ప్రశ్నించారు "యోహాను పుత్రుడవైన సీమోనూ! నీవు నన్ను ప్రేమించుచున్నావా? అయితే నా గొఱ్ఱెలను మేపుము" అని.



'పేతురు' అంటే 'రాయి' అని అర్థం. రాయి అయిన పేతురును ప్రభువు విశ్వాసం నందు ఇంకా దృఢంగా నెలకొల్పాడు. ఆ రాతిలో గల కఠినతను తీసివేసి విశ్వాసపు నిచ్చలత్వాన్ని ప్రసాదించాడు అందుకే (మత్తయి 16:18-19). ఆ రాతిపై తన శ్రీసభను ప్రభువు నిర్మించాడు. ఆ శ్రీసభపై సర్వ అధికారాన్ని పేతురుకు ప్రసాదించాడు. అధికారం పొందిన వ్యక్తి ఇక్కడ పూర్తిగా ప్రక్షాళనకు గురి అయ్యాడు.

ఇప్పుడు మనల్ని మనం ఆత్మ పరిశీలన చేసుకుందాం. ఎన్ని సమయాలందు ప్రభువు పట్ల నిశ్చల విశ్వాసాన్ని కలిగి ఉంటున్నాం? కొన్నిసార్లు ప్రభువు మనం అడిగిన వెంటనే ఇవ్వకపోవచ్చు, అట్టి సమయాలందు కూడా ఆయన ఇస్తారు అని విశ్వాసముంచగలుగుతున్నామా? 'God may delay but never denies' 'దేవుడు ఆలస్యం చేస్తాడేమోగాని అనాదరం చేయడు. తప్పకుండా కొన్ని సందర్భాలల్లో మన విశ్వాసం కూడా పరీక్షకు గురి అవుతుంది. అప్పుడు నువ్వు నేను ఎలా స్పందిస్తున్నాం? ఇంకొన్ని సందర్భాల్లో ముఖ్యంగా మనం ఆనందంగా ఉన్నప్పుడు ఆ దేవున్ని మనం అసలు గుర్తుచేసుకోం. ఎప్పుడైతే కష్టాలతో, బాధలతో, వ్యాధులతో మన సంసారపు నావ చెదరడం మొదలవుతుందో వెంటనే ప్రభువు సన్నిధి చేరతాం. ఎక్కువ శాతం మనం గమనించినట్లయితే ఏదైన వస్తువుతో మనకు అవసరం లేకుంటే దాన్ని పడేస్తాం. అలాంటి ఆర్థిక బాంధవ్యాన్ని కలిగి జీవిస్తున్నామా? ప్రశ్నించుకుందాం. (We know what is good for us, but God knows what is best for us).

**పునీతుల నోట – విశ్వాసపు మాట**

పునీత అస్సీసిపురి ఫ్రాన్సిస్: "అత్యంత మహోన్నతుడైన దేవా, నా హృదయములోని అంధకారమును తొలగించి వెలుతురు నింపుము. స్వచ్ఛమైన విశ్వాసంను, దృఢమైన పరిపూర్ణ ప్రేమను దయచేయుము".

పునీత అగస్తీన్‌వారు: "దేవుని బయల్పాటును లోలోతుగా, క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను, మరీ ఎక్కువగా, దృఢంగా విశ్వసించేందుకు కృషి చేస్తాను" అంటూ తన విశ్వాసాన్ని వెల్లడించాడు.

పునీత విన్సెంట్ దె పాల్: తన జీవితంలో విశ్వాసానికి వ్యతిరేకంగా అనేక శోధనలను ఎదుర్కొనవలసి వచ్చింది. మారుమనస్సు పొందిన పిమ్మట

క్రీస్తు కొరకు మాత్రమే జీవించగలిగాడు. వచ్చిన శోధనలను జయించుటకుగాను తన అంగీ జేబులో విశ్వాస సంగ్రహమును వ్రాసికొని తిరిగేవాడు, శోధనలను ఎదుర్కొనవలసినపుడు ఆ విశ్వాస సంగ్రహమును జపించి శోధనలను జయించేవాడు.

పునీత *బాల తెరేస:* పునీత బాల తెరేసగారు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ మరణశయ్యపై ఉన్నప్పుడు ఆమె, "ప్రభువా! నా విశ్వాసంను పటిష్ఠం చేయుము' అని ప్రార్థించేది.

పునీత *దోమినిక్ సావియో:* దేవుని ప్రేమ కలిగి, సేవాభావం కలిగి వుండటమే విశ్వాసమని చెబుతూ వున్నాడు. సేవ అనగా మనం చేసే సేవ, గొప్ప పనుల రూపంలో చేయనవసరం లేదు. కాని చేసే ప్రతి పనిని దేవుని నామ మహిమార్థమై చేయాలి.

పునీత *మరియ గొరెట్టి:* ఆదర్శవంతమైన జీవితం జీవించటం, విధేయతను, విరక్తత్వంను నిక్కచ్చిగా పాటించడం ఆమె సొంతం. క్రీస్తునకు వ్యతిరేకముగా మనస్సులో కూడా పాపం చేయకుండా వుండుటకు తపన పడేది. ఆమె విశ్వాసం "తన శరీరాన్ని ముక్కలుగా చేసినను నేను ఎప్పటికి పాపం చేయను, ప్రభువునకు వ్యతిరేకంగా మనస్సులోనైనను పాపం చేయక నా విశ్వాసంను నిలబెట్టుకొందును" అని పలుకుతూ ఉంది.

పునీత *అల్ఫోన్స:* విశ్వాసం అంటే శత్రువులను ప్రేమించటం, త్యాగం, ప్రార్థనా జీవితం జీవించడం అంటూ ఉంది. ఆమె తొలి భారతదేశపు పునీతురాలు. కష్టాలలో ఇతరులకు సహాయం చేస్తూ, శత్రువులను సహితం క్షమిస్తూ, క్రీస్తు పాటులలో పాలుపంచుకొనేలా అనుగ్రహించమని ప్రార్థించేది. బాధలను అనుభవించినను, తన ముఖంలో తేజస్సు, నిర్మలత్వం చెక్కు చెదిరేది కాదు. ప్రజల కోసం, వారి బాధలను స్వీకరించుటకు తన సంసిద్ధతను ప్రార్థన ద్వారా దేవునికి తెలిపేది.

### క్రీస్తు పునరుత్థానమే మన విశ్వాసానికి మూలం

గలిలయా అంతటా తిరిగి దైవరాజ్య శుభవర్తమానాన్ని అందిస్తూ, అందరిలో ఆశలు మొలకెత్తించిన యేసు, అసూయతో పరిసయ్యులు పన్నిన కుట్రకు



బలియై దారుణమైన సిలువ శిక్షకు గురియై మరణించాడు. అంతటితో ఆయన కథ సమాప్తమయిందని పరిసయ్యులు చాలా మందికి అనిపించి ఉండవచ్చు. తాను నమ్మిన, విశ్వాసముంచిన సిద్ధాంతాల కోసం ప్రాణాలర్పించిన మహాను భావుడిగా కొందరు భావించి ఉండవచ్చు. కాని ఆ తర్వాత జరుగబోయే మహాద్భుతం గురించి ఎవరు ఊహించలేదు. అలాగే ఈనాడు కూడా ఎంతోమంది భావిస్తూ వాదిస్తూ ఉంటారు, ఆయన ఎంతో కృషి చేశాడు గాని సాధించింది ఏమీలేదని. నిజమే, ఎందుకంటే యేసుతో సుమారు మూడున్నర సంవత్సరాలు కలిసి జీవించినా, ఆయన చేసిన అద్భుతాలను కళ్లారా చూచినా యేసు మాటల్లోని దివ్యత్వాన్ని శిష్యులు గ్రహించలేదు. ఆయనను, ఆయన మాటల్ని వారు కేవలం భౌతిక దృష్టితో చూసారు. అందుకే యేసు అలా సిలువపై మరణిస్తాడని తిరిగి లేస్తాడని కలలోనైనా ఊహించలేదు. ఎందుకంటే పునర్జీవుడైన యేసు మళ్ళీ మరణించడు అతని శరీరం శాశ్వతమైంది. అతని పునర్జీవం నిత్యమైంది. మూసివున్న తలుపులు మూసినట్లుండగనే ఆయన శిష్యులున్న గదిలో ప్రవేశించడం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

నిజమే, పునీత పౌలు అన్నట్లుగా యేసే గనుక మృతులలో నుండి లేవనట్లయితే, పై భావాలన్నీ అక్షర రూపాలే అయ్యేవి, కాని ఎవరూ అనుకోని రీతిలో యేసు చెప్పిన విధంగా పునరుత్థానమయ్యాడు. తాను జీవవంతుడై లేచి, నిస్పృహతో అవిశ్వాసంతో మృత్యువాతబడిన ఈ లోకానికి నవజీవం ప్రసాదించాడు. శిష్యుల్లో విశ్వాసాన్ని పునర్జీవింపజేశాడు. యేసుక్రీస్తు పునరుత్థానం విశ్వాస నిరీక్షణలకు పునర్జీవం. ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, యేసు పునరుత్థానం, ఆయన దైవకార్య నిర్వహణకు పొందిన బహుమానం. దైవకుమారుడు మనిషిగా పుట్టడం, మానవోద్ధరణకు కృషి సల్పటం, సిలువ మరణం పొందటం దైవచిత్తం. యేసురూపం సకల మానవ హృదయాలలో శాంతి నిలపటం కోసమే ఉద్దేశింపబడింది. యేసు ప్రథమ శిష్యులకు ఆయన పునరుత్థానం ఒక మహోత్కృష్ట అనుభవమే కాదు, వాళ్ళ విశ్వాసానికి పునర్జీవం, వారి జీవితాలకో కొత్త మలుపు. ప్రభు పునరుత్థానం, శిష్యులకు విశ్వాస పునర్జీవాన్ని ప్రసాదించింది. వారి జీవితాలనే మార్చేసింది. భౌతిక చింతన నుండి వారిని ఆధ్యాత్మిక చింతలోనికి, అల్ప విశ్వాసం

నుండి పరిపూర్ణ విశ్వాసంలోకి, శిష్యరికం నుండి గురుత్వంలోకి, నిరాశ నుండి నిరీక్షణలోకి, ఈ లోకం నుండి పరలోకంలోకి వారిని నడిపించింది.

అంధకార జగత్తులో నానాయాతనలు అనుభవిస్తున్న మానవాళికి ఆయన పునరుత్థానమే ఒక ఆశా కిరణం, వెలుగు రేఖ, గొప్ప అనుభవం; 'క్రీస్తు పునరుత్థానం' అంటే ఏమిటో గ్రహించాలన్నా, విశ్వసించాలన్న – ఆ వరాన్ని జ్ఞానాన్ని దేవుడే అనుగ్రహించాలి. సువార్త ద్వారా నారు పోసే దేవుడు తన అనుగ్రహ వరాలనే నీరుపోసి మనలో విశ్వాసాభివృద్ధికి తోడ్పడతారు. దీనికి మనవైపు నుండి ప్రభువు గొప్పకార్యాల్ని ఆశించుటలేదు. ఆయన మన నుండి కోరుతుంది కేవలం మన అంగీకారమే. క్రీస్తుతో పునర్జీవితాన్ని ఆశించేవారు ముందు ఆయనను అంగీకరించాలి. క్రీస్తును అంగీకరించటం అంటే క్రీస్తు అవయవాలైన క్రైస్తవులందరిని సాటివారుగా, సరిసమానులుగా అంగీకరించటమే. క్రీస్తు పునరుత్థానం విశ్వాస వరాన్ని క్రొత్త జీవితాన్ని అందివ్వడమే గాక, జీవితంలో స్వార్థాన్ని సంకుచితత్వాన్ని విడనాడడానికి దోహదం చేస్తుంది. సాటివారితో సర్వస్వాన్ని పంచుకునే జీవనాన్ని అవలంబించేందుకు అది ఒక సవాలు కూడా. కాబట్టి ఈ భూలోకంలో ప్రజల మధ్య సంచరించి జీవించిన క్రీస్తు అప్పరస రూపాల్లో మన మధ్య వేంచేసి ఉన్నారని మనం విశ్వసించాలి. మన కంటికి అగోచరంగా ఉన్నప్పటికీ విశ్వాసంతో, ఆధ్యాత్మిక దృష్టితో ఆయన్ని మనం అంగీకరించాలి. రాచరికపు వస్త్రాలు ధరిస్తేనే లెక్కకు మిక్కుటంగా సైన్యాన్ని కలిగివుంటేనే ఆయన రాజు అని నమ్మకం చూపించేందుకు కొంతమంది యూదులు పూనుకున్నారు. కాని క్రీస్తుని జీవన విధానం దానికి భిన్నంగా ఉన్నందున వారు ఆయనను విశ్వసింపలేదు (ఎఫెసీ 4:5-6). ఒకే ప్రభువు, ఒకే జ్ఞానస్నానం, ఒకే విశ్వాసం. మానవులందరికి అన్నీ ఆ యేసుప్రభువే అని మనం విశ్వసించాలి.

## విశ్వాసంతో కూడిన క్రైస్తవ జీవితం

ప్రస్తుత సమాజంలో అనేకమైన మార్పులు సంతరించుకుంటున్నాయి. మనుష్యులు ఒకరికొకరి మధ్య భేదాభిప్రాయాలతో తమ చుట్టూ గోడలు నిర్మించు కుంటున్నారు. పెరుగుతున్న ఆధునికతతో స్నేహం చేస్తూ పొరుగు వారి ఊసే లేకుండా ఏకాంతంగా జీవితాన్ని సాగిస్తున్నారు. ఇహలోకంలో పరిమిత వస్తువులపై



ప్రేమ చూపుతూ పరలోక విషయాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. కనీసం కన్న తల్లిదండ్రుల యెడల రక్తసంబంధీకుల పట్ల విశ్వాసరహితంగా ప్రవర్తిస్తున్నారు. సమాజరీత్యా పెరుగుతున్న అభివృద్ధి వలన మానవ విలువలను మరచి జీవిస్తున్నారు. మరి ఇలాంటి విషమ పరిస్థితుల్లో దేవున్ని అసలు పట్టించుకోవడమే లేదు. ఇంత దయనీయ స్థితిలో ఉన్న మనిషికి ఊరట కలిగించగలిగింది ఒక్క విశ్వాసం మాత్రమే. కాని ఈ గుణానికి మనిషి చాలా దూరంగా జీవిస్తున్నాడు. రెండవ వైపు చూస్తే ఈక్రింది విధంగా ఉన్నాడు.

బాగా బ్రతకాలనీ, సుఖంగా జీవించాలనీ ప్రతివాడు వాంఛిస్తాడు. అయితే అడుగడుగునా చాలామందికి కష్టాలు, బాధలు, మరణాపాయాలు, వ్యాధులు అకాలంగా సంభవిస్తూ ఉంటాయి. అందువల్ల మానవుడు ఈ జీవితంపై విరక్తి చెంది దేవున్ని దూషిస్తాడు. వీటన్నింటికి కారణం ఆయనేనని కొందరం భావిస్తాం. మరికొందరం దేవుడు మాకు ఏవిధంగా సహాయపడలేదని తలంచి ఆయనపై విశ్వాసం కోల్పోతారు. ఇలాంటి తరుణంలో మన స్వశక్తితో ఈ జీవన ప్రవాహానికి ఎదురు ఈదలేం. మన శక్తి సామర్థ్యాలు సరిపోవు. మరి ఇటువంటి సమయాల్లో మన తోడుగా నిలబడేది మనకు జీవాన్ని, సహకారాన్ని అందించేది ఆ ప్రభువు యెడల మనకు గల విశ్వాసం మాత్రమే. పరిశుద్ధ గ్రంథంలో తెలిపినట్లు యాయీరు కుమార్తె మరణించినపుడు, వారి మాటలను యేసు లక్ష్యపెట్టక, ఆ మందిరాధ్యక్షునితో "నీవు మాత్రము అధైర్యపడకుము. విశ్వాసం కలిగియుండుము" అని చెప్పాడు (మార్కు 5:35,36) అట్లే, రక్తస్రావ వ్యాధితో బాధపడే స్త్రీ యేసు అంగీ అంచును తాకి స్వస్థత పొందింది (మార్కు 5:28). మరి మన విశ్వాస ధోరణి ఎలా ఉంది? ప్రశ్నించుకుందాం? దేవున్ని మన అవసరాలు తీర్చే ఆధ్యాత్మిక వస్తువుగా పరిగణిస్తున్నామా? లేక ఆయనే సర్వమని నమ్మి, ఆయన పాదపీఠాన్ని చేరుతున్నామా? ఆయనయందు విశ్వాసం కలిగి ఉంటే ప్రతి ఒక్కరం రక్షణ పొందుతాం. దేవుని సాన్నిధ్యంలో విశ్వాసంతో జీవిస్తే ఎలాంటి ఉపద్రవాలు జరుగవు, అలా కాకుండా రానున్న విపత్తు గురించి ఆలోచిస్తూ, ఎలా నన్ను నేను రక్షించుకోవాలి అని మదనపడితే ఎటువంటి ఉపయోగం ఉండదు. అలా కాకుండా ప్రభూ మీరే నన్ను రక్షించండి అని చెదరిపోని విశ్వాసంతో ప్రాధేయపడితే, ఆయనే

రక్షిస్తారు. ఎందుకంటే స్వయంగా ప్రభువే పలికారు "నీ విశ్వాసమే నిన్ను రక్షించును". ఆయనయందు గల విశ్వాసమే మనకు జీవం, జీవితం, మనుగడ.

## విశ్వాసానికి వ్యతిరేకమైన పాపాలు

ప్రస్తుత సమాజంలో క్రైస్తవుడి పవిత్రత ప్రధానంగా క్రీస్తుని అనుసరించుటలోనే ఉంటుంది. మనం క్రీస్తులాగ తయారు కావాలి. అనగా మన ఆలోచనలూ, క్రియలూ, విలువలూ క్రీస్తు ఆలోచనలు క్రియలు విలువల్లాగ మారాలి. ఇప్పుడు నేను కాదు క్రీస్తే నాయందు జీవిస్తున్నాడు అన్నట్లుగా ఉండాలి. ఇది కేవలం ఆయనయందు గల విశ్వాసం ద్వారానే సాధ్యమౌతుంది. క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితానికి ఆధారం విశ్వాసమే. కాని మనం భగవంతున్ని ఒక వస్తువుగా భావిస్తున్నాం. ఆయనతో వ్యాపార వాణిజ్య అనుసంధానాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. విశ్వాసంలేని వ్యక్తి తప్పకుండా లౌకిక ప్రలోభాలకు గురికావడం జరుగుతుంది. వాటిలో కొనింటిని ఇక్కడ గమనిద్దాం.

| **విశ్వాసపు క్రియలు** | **విశ్వాసం లేకపోవడం వల్ల చేసే పాపాలు** |
|---|---|
| 1. నిరాడంబరం | – డంబం, డాబూ |
| 2. నిలకడ, నిగ్రహం, నిరీక్షణ (రోమీ 4:18) | – సంచారప్రీతి, చంచల మనస్తత్త్వం |
| 3. పరలోక సుఖాలు ముఖ్యం (అబ్రహాం) | – ఇహలోక సుఖాలు ముఖ్యం (మత్తయి 19:21–22) |
| 4. దేవుణ్ణి మహిమపరచడం (పునీతులు) | – స్వీయ ఘనతను కోరడం, గొప్పలు చెప్పుకోవడం, అసహనం (సౌలు రాజు) |
| 5. దేవుణ్ణి స్తుతించడం (దావీదు రాజు) | – నరుల పొగడ్తలను ఆశించడం (పరిసయ్యులు) |
| 6. దేవునిపై ఆధారపడం (యిర్మీయా 17:7) | – సొంత బలాన్ని నమ్ముకోవడం (అన్యదేశ రాజులు) |
| 7. కష్టాల్లో ఓర్పు (హెబ్రీ 6:15) | – శ్రమలు సహించకపోవడం, అవిధేయత |
| 8. దేవునికి సదా విధేయత కలిగి ఉండటం (హెబ్రీ 11:8) | – అహంకారంతో అవిధేయత కలిగి ఉండటం (తల్లిదండ్రులు) |
| 9. ప్రార్ధన జీవితం (పునీత మోనిక) | – ప్రాపంచిక జీవితం, త్రాగుబోతుతనం, విందులు, మాత్సర్యం (గలతీ 5:21) |
| 10. ఆత్మప్రేరణ | – శరీర ప్రేరణ (గలతీ 5:19–20) అపవిత్రత, కాముకత్వం, అసూయ, స్వార్థం క్రోధం, శతృత్వం |



ఈ విశ్వాసపు క్రియలు అబ్రహాము నుండి ఇప్పటి మన పునీతుల వరకు పాటించారు. కాని మనం మాత్రం ప్రాపంచిక అలవాట్లకులోనై నిర్లక్ష్యపు జీవితాలు జీవిస్తున్నాం. వారు అన్ని సమయాలలో విశ్వాసం కలిగి ఉన్నందున ఎలాంటి అపాయ పరిస్థితుల్లోను వారు భయపడకుండా జీవనాన్ని నిండైన విశ్వాసంతో కొనసాగించారు. పాపానికి కారణం మనిషిలో గల ఆశ. ఈ ఆశ చాలా మొండిది, అది ఎన్నడు తన ఓటమిని ఒప్పుకోదు. ఎందుకంటే ఎప్పుడు నేనే గెలవాలి, ఇతరుల కంటే అధికుడినై ఉండాలి అనే వాంఛ అంతులేని ప్రయాణం చేయిస్తుంది కాబట్టి.

## ముగింపు

ఈనాడు ప్రపంచంలో ఎన్నో మతకలహాల వలన రాజకీయ, సాంఘీక మార్పుల వలన, దేవుని యెడల మన విశ్వాసం సన్నగిల్లుతుంది. మరో విధంగా చూసినట్లయితే, ఈనాటి తీవ్ర సమస్యల వలన దేవుని యందు విశ్వాసం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. సామాన్య ప్రజలు మొదలుకొని, రాజకీయ విమర్శకులు, మత పండితులు, విద్యార్థుల వరకు ఈనాడు వివిధ మతాల విశ్వాసంను తెలుసుకొనుటకు ఆసక్తి చూపుతున్నారు. మానవ జీవిత పుణ్యాలైనటువంటి ప్రేమ, సేవ, ఆనందం, ఐక్యం, శాంతితో ప్రజలందరు అత్యున్నత జీవితాన్ని జీవించుటకు విశ్వాసం ప్రోద్భలాన్నిస్తుంది. తప్పకుండా మనలో కొన్ని సమాధానాలు చెప్పలేని ప్రశ్నలు పుడుతూనే ఉంటాయి. కొన్నింటిని ముఖ్యంగా గమనించినట్లయితే, మనం ఎక్కడి నుండి వచ్చాం? మన మూలం ఏమిటి? మన గమ్యం ఏది? మన జీవితాలకు ఏదైనా ఒక ప్రణాళిక ఉందా? ఏదైనా ప్రాముఖ్యత ఉందా? మనం ఇక్కడికెలా వచ్చాం? ఎందుకు జీవిస్తున్నాం? మనం ఎక్కడికి వెళ్తున్నాం? ఈ లోకంలో మన ఉనికి ప్రమాదవశాత్తుగానో లేక

ఏదో యాదృచ్ఛికంగానో జరిగినది కాదు కదా? ఇలాంటి వాటి గురించి ప్రతి నిత్యం కాకపోయినా కొన్ని సందర్భాల్లో అయినా ఆలోచిస్తుంటాం. ఇలా మన గురించి మనం లోతుగా క్రమంగా అన్వేషించడం వలన మనం దేవుని తెలుసుకొనగలుగుతాం. కాని మన ఈ అన్వేషణ ప్రయాణంలో ఎక్కువ పర్యాయములు అసంపూర్ణత కలుగుతూ ఉంటుంది. అందుకే పునీత అగస్తీను అంటారు "మీలో విశ్రాంతి పొందే వరకు, ఓ ప్రభూ నా హృదయము నెమ్మది గొనలేదు" అని. అయినప్పటికి మానవులైన మనకు దేవుని పూర్ణస్వరూపమును కనుగొనుటకు మన జీవితం సరిపోదు. కాని సాక్షాత్తు ఆ దైవానుభూతిని పొందడానికి దేవుడు మనకు ఒసగిన ఒకే మార్గం 'విశ్వాసం' అందుకే ప్రభువు పలుకుతున్నారు, "నా గొర్రెలు నా స్వరమును వినును. నేను వాటిని ఎరుగుదును, అవి నన్ను వెంబడించును (యోహాను 10:27). కేవలం విశ్వాసం ద్వారానే మనం ఆయన స్వరాన్ని వినగలం.

విశ్వాసం కలవాడే క్రీస్తు రాజ్యంలో భాగస్వామి కాగలడు. విశ్వాసం లేనిదే రక్షణ ఉండదు. విశ్వాసం లేనిచోట క్రీస్తుకు స్థానం ఉండదు. విశ్వాసంతో నిజమైన క్రైస్తవ జీవితం జీవించువారియందు క్రీస్తు రాజ్యం ప్రత్యక్షమై ఉందని మనం భావించాలి. దాన్ని మనం ఒక అమూల్యమైన వరంగాను, సంపదగాను పరిగణించి కాపాడుకుంటూ ఉండాలి. దీనికి శ్రీసభ చరిత్రలో ప్రథమ క్రైస్తవులు మనకు మాతృక. వారు ఎన్నో హింసలకు గురియైనారు. క్రీస్తునందు వారి విశ్వాసాన్ని నిరాకరింపమని, వారి మతాన్ని విడనాడమని రోమను చక్రవర్తులు వారిని శతవిధాల హింసించారు. వారిని చెరసాలలో వేశారు. ఎన్నో విధాలుగా బాధించారు. "బహిరంగముగ ప్రజల యెదుట నన్ను అంగీకరింపని ప్రతి వానిని పరలోకమందున్న నా తండ్రి సమక్షమున నేనును అంగీకరింపను" అని క్రీస్తు పలికిన పలుకులు వారు జ్ఞప్తియందుంచుకున్నారు. మనకు ఇట్టి హింసలు లేకపోయినా మన కష్టాలలో, జీవిత సమస్యలతో చిక్కుకున్నను గాఢాంధకారంలో పడినప్పుడును విశ్వాసపు వెలుగును కోల్పోరాదు.

❊ ❊ ❊ ❊

# 3. నమ్మకం - క్రైస్తవ జీవనాన్ని నడిపించే ఇంధనం

- బ్రదర్ సూరెపల్లి అరుణ్ జోసఫ్

**ఉపోద్ఘాతము**



అంధకారంలో ఉన్నవారు ఆశతో వెలుగుకై ఎదురు చూస్తారు. ఆకలితో ఉన్నవారు అన్నదాతకై నిరీక్షణతో చూస్తారు. రోగంతో బాధపడుతున్న వారు ఆరోగ్యం కోసం ఆవేదనతో చూస్తారు. కష్టాలతో, కన్నీళ్లతో జీవితంలో విసిగి వేసారి, పాపపు వలయంలో చిక్కుకొని, కృశించి క్షీణిస్తున్న వారు తమ విమోచకునకై నమ్మకంతో వేయికళ్ళతో ఎదురు చూస్తారు. ఇక్కడ మన ప్రశ్న ప్రపంచంలో ఎంతోమంది విమోచకులుగా అవతరిస్తున్నా, సత్యవంతుడైన మార్గచూపరి, జీవవంతుడైన నమ్మకస్తుడు ఎవరని అడిగితే? సత్యవంతులు, నిజమైన నీతిగల వేదశాస్త్ర పండితులు, వేదశాస్త్రాలు చెప్పేది క్రీస్తు భగవంతుడేనని ఆయనకు నమ్మకంతో ఆశ్రయించు వారిని చేయివిడువని నమ్మకపాత్రుడు క్రీస్తు ప్రభువు. యెషయా గ్రంథం 40వ అధ్యాయం 31వ వచనం ప్రభుని నమ్మువారు నూతన బలాన్ని పొందుదురని మనకు తెలుపుతుంది. ప్రభుని నమ్మి రక్షింపబడిన వారు ఎందరో కనుక పాపపు ఊబిలో కొట్టి మిట్టాడుతున్న ఈ మానవాళిలో నమ్మకం అనే సుగుణం మనలో మరలా జీవాన్ని చిగురింపజేస్తుంది. భగవంతునిపై ఎందుకు నమ్మకం ఉంచాలి? ఈ నమ్మకం అనే సుగుణం అంటే ఏమిటి? అది ఎలా మనలను పరమాత్ముని దయకు నోచుకొనేటట్లు చేసి, మనలను ఆయన ప్రియపుత్రులుగా చేస్తుందో ఈ చిరువ్యాసంలో తెలుసుకుందాం.

## నమ్మకం అనగా నేమి?

నమ్మకం అను పదం ఇటు తెలుగు భాషలోను అటు ఇతర భాషలలోను గొప్ప నిగూఢత కలిగి ఉంది. హెబ్రీ భాషలోని ''Aman'' అమాన్ పదం, గ్రీకు భాషలోని ''Pistis'' పిస్టిస్ అను పదం సాధారణంగా "నమ్మకం"కు అర్థాన్ని "పిస్టస్" నమ్మకం, నిరీక్షణ అర్థాన్ని ఇస్తాయి. 3వ శతాబ్దం నుండే క్రైస్తవ పితామహులు నమ్మకం పదాన్ని తమ రచనలలో విరివిగా వాడారు. నమ్మడం అంటే ఒక వ్యక్తి నమ్మదగినవాడు, ఆధారపడతగినవాడు అని యెంచి అతడు మంచి వచించిన దానిని సత్యము అని అంగీకరించుట.

## 'నమ్మకం'నకు నిర్వచనం

నమ్మకం ఒక దైవీక సుగుణం అని పవిత్ర గ్రంథం బోధిస్తుంది (1 కొరింథీ 13:13). సాధారణంగా క్రైస్తవ నమ్మికను ఒక లౌకిక సైద్ధాంతిక ఆశయంగా తలంచి పొరపాటు పడుతుంటాం. కాని అది ఒక మహోన్నత గుణం. సుగుణం అని క్రైస్తవ విశ్వాస నావను నడిపే చుక్కాని అని మనం తెలుసుకోవాలి. కతోలిక శ్రీసభ సత్యోపదేశ బోధన ప్రకారం నమ్మకం అనునది ఒక దైవానుగ్రహం. క్రీస్తు వాగ్దానాలలో నమ్మకముంచి దైవరాజ్యం కోసం నిరీక్షిస్తూ నిత్యజీవం పొందాలన్న కోరికను మనలో ప్రేరేపించే దివ్య సుగుణం (క.శ్రీ.స.1817)

పదహారవ బెనడిక్ట్ పాపుగారు తన రచనలలో తరచూ క్రైస్తవ నమ్మికను గురించి వ్రాస్తూ, క్రైస్తవ నమ్మిక ఒక దైవానుగ్రహమని, ఒక ప్రత్యేకమైన క్రైస్తవ లక్షణమని, అది మరణమునకు అతీతంగా దైవరాజ్యంను గమ్యంగా ఆవిష్కరించు వరమని, దేవుడు మనకిచ్చు ప్రేమ కానుక అని పేర్కొన్నారు. పునీత ఘన గ్రెగొరి వేదాంత సుగుణాల గురించి ప్రస్తావిస్తూ – నమ్మకం అను వేదాంత సుగుణం క్రైస్తవుల పరిపూర్ణ విశ్వాసాన్ని ప్రభునిలో ఆవిష్కరింప చేసుకొనే దైవానుగ్రహం. మన విశ్వాస గమ్యం దేవుడు. మన నమ్మక గమ్యం దైవరాజ్యం. మన జీవన ప్రమాణంలో ఎదురొచ్చు కష్టాల కెరటాలను అధిగమించుటకు పాపమనే సాగరాన్ని దాటుటకు అని చెప్పుకోవచ్చు కనుక నమ్మకం మానవులకు దైవంనకు మధ్య ఉన్న ప్రేమబంధం పరిపూర్ణ విశ్వాసం.



## మానవ జీవితంలో నమ్మకం, దాని యొక్క ప్రాధాన్యత

ఈ నవీన యుగంలో ఎటుచూచిన అంధకారం. అటు సమాజం, ఇటు మానవ వ్యక్తిగత జీవితం పాపభుయిష్టమైపోయాయి. దేవుడు లోకాన్ని సృష్టించినపుడు అది స్వర్గతుల్యంగా ఉండేది. క్రమేపి అది చీకటి కార్యకలాపాలకు బానిసై, నీతి, న్యాయంను విస్మరించి, దేవుని నుండి దూరమై పతనంవైపు పరుగెత్తుతుంది. సృష్టికర్తను వీడి, సృష్టి వస్తువులను పట్టుకొని వ్రేలాడుతూ, తనకై దేవుడు సిద్ధపరచిన ఆ పరలోక గృహాన్ని చేరుకోలేక ఆవేదన చెందుతున్నాడు. తన పాపక్రియల వలన క్షీణించిపోతూ సమాజంలో పేరుకుపోయిన స్వార్థం, సంకుచిత స్వభావం, దోపిడితనం, దౌర్జన్యం, గర్వం, అహంభావం, వేర్పాటు వాదం, స్థాయిభేదాలు మొదలగు సమాజ రుగ్మతలలో చిక్కుకొని వాటి బంధీఖానా నుండి బయటకు రాలేకపోతూ మృత్యువు వడి చేరుతున్నాడు. అటువంటి మానవుడికి దైవరాజ్యాన్ని ఆపాదించాలన్న పాపవిమోచన పొందాలన్న కావలసిన సుగుణం నమ్మకం. నమ్మకం అను ఆహ్వాన పత్రిక ద్వారా ప్రభువు మనలను పిలుస్తున్నారు. ఆయనపై నమ్మకముంచి, జీవించడం ముఖ్యమైన అంశం. ఆయన తప్ప మనలను పాప విముక్తులను చేసే దైవం వేరొకరు లేరు. మన స్వశక్తి చేత మన చుట్టూ ఉన్న అంధకారాన్ని ఛేధించలేం. కనుక, ప్రతి ఒక్కరం భగవంతునికి నమ్మకమైన వారంగా ఉండి (1 కొరింథీ 4:2). ప్రభునిపై మన నమ్మకాన్ని నిలుపుకొని ముందుకు సాగాలి. ద్వితీయ వాటికన్ మహాసభ: "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" అనే అధికార పత్రం ఒకటవ భాగం 21వ అంశంలో ఈవిధంగా చెప్తుంది, మానవుల మధ్య బంధం చిగురించుటకు, సఖ్యత, ఐక్యమత్యం, శాంతియుత, జీవనం వర్ధిల్లుటకు అత్యంత అవసరమైనది క్రీస్తు ప్రభునిలో మన ఉనికి, నమ్మకం. నమ్మకంతో జీవించు వ్యక్తి జీవితంలో నిరుత్సాహాన్ని కలిగి ఉండక నూతనోత్సాహంతో ప్రభు దీవెనలకు పాత్రులు/పాత్రురాలు కాగలరు. ఇదీ పవిత్రగ్రంథం బోధించేది. ప్రవక్తలు ప్రవచించేది.

## పూర్వ నిబంధనలో 'నమ్మకం'

ఆదిలో ఆదాముతో మొదలుకొని నేటి వరకు దేవుడు నమ్మకంగా జీవించే వారి కోసం వెదుకుతూనే ఉన్నాడు. ఆయన నమ్మదగినవాడు. ఆయన వారసులైన

ప్రతి మానవుడు సహితం నమ్మదగిన వారిగా జీవించాలని ఆరాటపడుతున్నాడు, ఆశపడుతున్నాడు. పూర్వవేదంలో ఎందరో ప్రభుపై నమ్మకాన్ని నిలుపుకొని మరణ ఛాయల నుండి బయటపడి, జీవపు జలాన్ని ఆస్వాదించిన వారిలో కొందరి నమ్మకం ప్రతి విశ్వాసికి ఒక మార్గదర్శకం. అందువలన పూర్వవేదం మానవునికి దేవునికి మధ్య నమ్మకమైన వేదం. ప్రభుని పూర్తిగా నమ్మి, ఆయనను విశ్వసించి, ఆ దైవ కటాక్షాన్ని పొందిన కొందరి జీవితాలను మనం వల్లెవేసుకుందాం.

## బానిస బ్రతుకుల్లో ఆశా దీపం: నమ్మకం

గాలిలో రెపరెపలాడుతున్న జీవితాలు ఆకలి దప్పులకై, ఆక్రంధన చెందుతున్న జీవితాలు, ఒంటిమీద జానడైన గుడ్డలేని శరీరాలు, కన్నీరేకాని ఆనందం ఏమిటో తెలియని మనుషులు, ఆడపడుచుల కన్నీటి గాథలు, బ్రతుకు జీవుల మృత్యుఘోషలు. ఇవి ఆనాటి యిస్రాయేలు ప్రజలు ఐగుప్తు బానిస జీవితంలోని వేదనలు. అటువంటి క్లిష్ట సమయంలో దిక్కుతోచని స్థితిలో దాస్య జీవితంలో మునిగి ఆశలు ఆవిరైపోతున్న ప్రభుపై నమ్మకముంచి సహాయం కొరకు అర్థించారు. ఆ మృత్యు ఘోషలను ఆలకించిన ప్రభువు తను అబ్రహాం,ఇస్సాకునితో, యాకోబుతో చేసుకున్న ఒడంబడికను జ్ఞప్తికి తెచ్చుకొని, వారి అక్కరకు వచ్చి వారిని బానిసత్వం నుండి విముక్తి చేసి, ఆయన ఉనికికై తన ప్రజలు భగవంతునిపై పెట్టుకున్న నమ్మకాన్ని వొమ్ము చేయకుండా వారి కన్నీళ్లను తుడిచి ఆయనను నమ్మువారిని చేయి విడువడని ఋజువు చేసాడు. వారు ఐగుప్తు నుండి వెడలి వచ్చిన తరువాత కూడా ఎన్నోమార్లు ప్రభు ఆజ్ఞలను మీరి (నిర్గమ 16:3, 17:2, 32:1-6, ద్వితీ 9:22) పాపంను మూటు కట్టుకున్నప్పుడు ఆయనను శరణు వేడగానే కరుణించి, రక్షించిన నమ్మకస్తుడైన కరుణామయుడు అని వ్యక్తపరచాడు.

క్రీస్తు పూర్వం 587 సం॥ యెరుషలేం దేవాలయం వినాశనానికి గురైంది (2 రాజులు 24:10-17). యిస్రాయేలీయులు మరోమారు బాబిలోనుకు బానిసలుగా కొనిపోబడ్డారు, అన్యదేవతారాధకులుగా కూడా మారారు. పాపం మీద పాపం కట్టుకున్నను యిర్మియా పలుకులను ఆలించి ఆయన దయను కోరగా (యిర్మియా 33:14-20) వారి తప్పిదాలన్నీ మరచి, వారికి బంగారు జీవితాన్ని ఇచ్చిన నమ్మకపాత్రుడు యావే ప్రభువు. ఈ యిస్రాయేలీయుల జీవితం మనకు



నేర్పు పాఠం. మన జీవితంలో ఎంత బానిసత్వం ఉన్న దానిని విముక్తి చేసే ఒక విమోచకుడు మనకు సమీపంలోనే మనతోనే ఉన్నాడని గ్రహించి ఆయనను నమ్మడం.

## పాపాత్ముని మహోన్నతునిగా మార్చే సుగుణం: నమ్మకం

కోరికలే జీవితానికి అనర్థం, కోరికలే పాపానికి దారులు అంటాడు గౌతమ బుద్ధుడు. ఒక మంచి కోరిక మనిషిని పుణ్యాత్ముని చేస్తే ఒక చెడు కోరిక మనిషిని మృగాన్ని చేస్తుంది. దేవుని దృష్టిలో గొప్పవాడుగా, మహోన్నతుడుగా ఎంచబడే, దేవుని దీవెనలను దండిగా పొందిన దావీదు మహారాజుని జీవితంలోను కోరికలు బావిలో జలం ఊరినట్లు ఊరాయి. ఆ కోరికలు వలననే వ్యభిచరించాడు. ఊరియా అను వానిని చంపించాడు. ఇలా ఒక దాని వెంట ఒకటి పాపమును మూటకట్టుకొని అతిహీన స్థితికి చేరుకున్నాడు. కాని కృంగిపోక ప్రభువు తనను క్షమిస్తాడనే నమ్మకంతో పైకి లేచాడు. కన్నీటితో అర్థించాడు "ప్రభు నేను విచారము వలన కృషించితిని. ప్రతి రేయి నా పడక కన్నీటితో తడచుచున్నది. నా తలదిండు అశ్రు జలముతో తడిచియున్నది. ఏడ్పుల వలన నా కన్నులు గుంటలు పడినవి. నన్ను కనికరించు (కీర్తన 6:6-7) అంటూ తన మనోవేదనము ప్రభువునకు వినిపించాడు. అంతేకాక ప్రభువు కరుణకై (కీర్తన 51:1-2, 11:1-2, 25:5, 31:5, 51:1-19, 55:22, 57:1, 62:5) రేయింబవళ్లు ప్రాయాసపడ్డాడు. తన జీవితాన్ని సాఫల్యం చేసుకున్నాడు. పవిత్ర గ్రంథంలో ఒక దావీదుడే కాదు ఎంతోమంది పుణ్య పురుషులు దేవుని ధిక్కరించి పాపపు వలయంలో చిక్కుకున్నప్పుడు వారిని బయటకు లాగింది, వారిని దేవుని దయకు ప్రేమకు పాత్రులను చేసింది ప్రభువుపై వారికున్న నమ్మకమే. అటువంటి అచంచలమైన నమ్మకం మనలో సృజింపజేయమని ప్రభుని వేడాలి.

## అన్యుల రక్షణకు కాంతిరేఖ: నమ్మకం

"భగవంతుడు అనేవాడు కేవలం ఒక వర్గానికి, ఒక తెగకు, ఒక సంఘానికి, ఒక మతానికి చెందినవాడైతే అటువంటివాడు దేవుడు కాదు. అందరిని ఆదరించి, అందరికి చెందినవాడే నిజమైన దేవుడు" - లియో టాల్‌స్టాయ్

ఈ సత్యం అక్షరాల ప్రభునిలో నెరవేరింది. భగవంతునిపై పూర్తి నమ్మకాన్నుంచి సర్వం ఆయనే అని నమ్మే వారిని ఎన్నడు చేయి విడువనని చేతల్లో చూపించినవాడు యావే ప్రభువు.

అది నినేవే అను ఒక పట్టణం. ఆ పట్టణం నిండా అన్యజాతి ప్రజలు. వారు యిస్రాయేలు ప్రజలు కారు. వీరు ప్రభుని విడనాడి పాపభూయిష్టులై నిత్యం విందులు వినోదాలతో కాలం గడుపుతున్న వీరిపై ఒకేసారి పిడుగుపడినట్లు యోనా ప్రవక్త వచ్చి, నలుబది దినాలలో నినెవె నాశనం అగునని ప్రవచించాడు. ఆ ప్రజలు దేవుని మాట నమ్మి (యోనా 3:5), హృదయ పరివర్తన చెంది, ఉపవాస ప్రార్థనలతో దేవునికి తమ గోడును విన్నవించారు. తుదకు దేవుడు వారి నమ్మకంను చూచి వారిని రక్షించారు. ఇది పవిత్ర గ్రంథం మనకు బోధిస్తున్న సత్యం. ఎవరైతే ఆ దైవాన్ని పరిపూర్ణ విశ్వాసంతో, ఆయనపై నమ్మకముంచి ఆయన దరిచేరుతారో, వారు ఎవరైనను, దేవుడు వారిని రక్షించుటకు, కనికరించి ఆదరించుటకు సిద్ధంగా ఉన్నాడు. ఆయనకు నా, నీ అనే బేధం ఉండదు. అందరు ఆయన సొంతవారే. ఆయన అందరివాడు, అందరికి చెందినవాడు. ఆయన కోపం తాత్కాలికమని, ఆయన కరుణ, దయ, ప్రేమ మాత్రం శాశ్వతమని విశ్వసించు ప్రజలకు ఆయువుపట్టు 'నమ్మకం'. అతడు మనలను నిత్యం చివాట్లు పెట్టడు. కలకాలం కోపపడడు (కీర్తన 10:9) వాక్యం చెబుతుంది.

"భయం బంధిస్తుంది, నమ్మకం విముక్తిని గావిస్తుంది. భయం అచేతునిని చేస్తుంది, నమ్మకం చైతన్యవంతం చేస్తుంది. భయం నిరాశపరుస్తుంది, నమ్మకం ప్రోత్సాహాన్నిస్తుంది. భయం నిరుపయోగపరుస్తుంది, నమ్మకం సేవకు పురిగొల్పుతుంది. భయం అన్నిటికంటే ఎక్కువగా పనికిరానితనం వైఖరిని హృదయంలో చొప్పిస్తుంది. కాని నమ్మకం దేవునియందు మన ఉనికిని చాటి చెపుతుంది. భయం చంపుతుంది. నమ్మకం బ్రతికిస్తుంది" – హరిఎవర్స్ పోస్టిక్

ఈ పై మాటలను గమనిస్తే, మనిషి అనుక్షణం భయాందోళనల మధ్య బ్రతుకును అటువంటి మానవుడికి 'నమ్మకం'ను మార్గచూపరిగా మనం తీసుకోవాలి. సామెతల గ్రంథం పరిశీలిస్తే, మనం ఆత్మజ్ఞానం సంపాదించాలంటే నమ్మకం అవసరం అన్న సత్యాన్ని బోధిస్తుంది. నీవు మనస్ఫూర్తిగా దేవునిపై నమ్మకం



ఉంచితే ఆయనే నిన్ను కాపాడును అంటున్నాయి సామెతలు (సామెతలు 3:5). అంతేగాక మన కోరిక భగ్నమైనప్పుడు, హృదయం కృంగిపోయినప్పుడు మనలను సజీవంగా లేపునది మనకు ఆ భగవంతునిపై ఉన్న నమ్మకమే (సామెతలు 13:12). మనం చాలా తెలివైన వాళ్లమని, ఏదైనా సాధించగలమని భ్రమపడుతుంటాం. మన స్వబలాన్ని నమ్మి నాశనమవుతుంటాం. సామెతలు 16:3 పలుకుతున్నట్లు ప్రభుని నమ్ము నీవు విజయవంతుడవుకాగలవు. అలాగే ప్రభుని నమ్ము, సుఖము బడయుదవు (సామెతలు 16:10). మనం బలహీనులం, మన జ్ఞానం వలన అంతా సాధించగలం అనుకుంటే మనం మూర్ఖులమే. మనం అభ్యుదయంను పొందాలంటే ప్రభుపై నమ్మకం ఒక్కటే మనలను నడిపిస్తుంది (సామెతలు 28:25). లోకమునకు భయపడువాడు చేటు తెచ్చుకొనును, కాని ప్రభువును నమ్మువాడు సురక్షితముగా మనును (సామెతలు 29:25).

## నూతన వేదంలో నమ్మకం గురించి ఒక అవగాహన

ద్వితీయ వాటికను మహాసభ: ఆధునిక ప్రపంచంలో శ్రీసభ 21 అంశంలో పునీత అగస్తీను మాటలలో నరుల నమ్మకాన్ని వివరిస్తూ ఇలా బోధిస్తుంది: "ప్రభూ, నీ కోసమే నీవు మమ్మల్ని సృష్టించావు. మా ఉనికికి అర్థం నీవు. మా జీవన గమ్యం నీవు. కనుకనే నీ సన్నిధానానికి చేర్చి, నీలో విశ్రమించే వరకు మా హృదయాలకు శాంతి లేదు. మమ్ము నీ వశము చేసుకొని మమ్ము ఆదరించు. మిమ్ము నమ్మిన మమ్ము అనాధారము చేయకుము". ఇదే ప్రతి క్రైస్తవుని ప్రార్థన విన్నపం. పూర్వ వేదంలో వలె నూతన నింధన కూడా, దేవునిపై మానవుల నమ్మకంను, మానవునిపై దేవుని దయను వ్యక్తపరుస్తుంది. క్రీస్తునందు నమ్మకముంచి జీవించువాడు అధికంగా ఫలిస్తాడని (యోహాను 15:6) ఆయనలో మనం మన ఉనికిని, నమ్మకాన్ని నిలుపుకొన్నట్లయితే నిత్యజీవం పొందుతాం అని (యోహాను 10:10) ప్రభు అభయమిస్తూ, ప్రతి మానవున్ని నమ్మకపాత్రునిగా ఉండమని ఆహ్వానిస్తున్నాడు.

## నమ్మకానికి అర్థం పరమార్థం క్రీస్తు

ఆయన ఎల్లప్పుడు దైవస్వభావం కలిగి ఉన్నను, ఏనాడు దేవునితో తన సమానత్వంను స్వార్థ బుద్ధితో పట్టుకొని వ్రేలాడలేదు. ఆయన వినయం గలవాడై

దేవునికి విధేయించెను. మరణం వరకు, చివరకు సిలువ మరణం వరకు ఆయన దేవునిపై నమ్మకాన్ని నిలుపుకొని తన జీవితాన్ని సాగించాడు (ఫిలిప్పు 2:6-8). పునీత అవిలాపురి తెరేసమ్మ పలికినట్లు తనకు అప్పగించిన పని ద్వారా దేవుని సంతృప్తిపరుస్తూ, చివరి వరకు తన నమ్మకంను తండ్రి దేవునిపై నిలుపుకొని వినయాత్ముడుగా జీవించిన పరమాత్ముడు క్రీస్తే నమ్మకానికి సరైన అర్థం పరమార్థం. క్రీస్తు తన జీవితంలో సమస్తమును ఆ భగవంతుని సన్నిధానానికి సమర్పించి, తను ఈ లోకానికి వచ్చిన ప్రణాళికను పూర్తి గావించాడు. తాను అలసిపోకుండా, అలుపెరగని శ్రామికుడిలా నిరంతర దైవకార్యాన్ని చేయుటలో నమగ్రమైన సత్పురుషుడు. తన జీవిత పరిచర్యలో తండ్రి దేవునిపై అపార నమ్మకాన్ని ఉంచి తుదివరకు పోరాడగలిగిన ఒక మంచి సైనికుడు క్రీస్తు. నాస్తికత్వంతో దేవుడే లేడు అని నమ్మి జీవించే వారి ఆలోచనలను పాతాళానికి త్రోసిన మహర్షి క్రీస్తు. తన తండ్రిపై తన నమ్మకాన్ని వ్యక్తపరుస్తూ, తానే నమ్మకానికి చిరునామాగా మారాడు. తను చేసిన ప్రతి కార్యంలో అనగా ప్రార్థన (మత్తయి 6:9-15), పరిచర్య (యోహాను 10:17, స్వస్థతలు (మత్తయి 9:27-31, 9:32-33, 17:27, 8:5-13, 12:22, లూకా 5:1-9, 5:5-6, మార్కు 7:25-30, 4:46-51, యోహాను 4:46-51) చనిపోయిన వారిని లేపడం (లూకా 7:15, యోహాను 21:1-11) మొదలగు కార్యాలలో తన నమ్మకాన్ని తండ్రిదేవునిపై నిలుపుకొని ప్రతి మానవునికి ఆ తండ్రి ప్రేమను రుచి చూపాడు. తాను శ్రమల పాత్రను స్వీకరించే ముందు చెమటను రక్త బిందువుల్లా కార్చుతూ (లూకా 22:44). ప్రభును వేడుకుంటూ తనకు తన తండ్రిపై ఉన్న నమ్మకంను తెలియజేసాడు. చివరకు తాను చనిపోతూ "తండ్రి నా ఆత్మను నీ చేతికి అప్పగిస్తున్నాను" (లూకా 23:46) అంటూ కడవరకు తన తండ్రిపై ఉన్న నమ్మకానికి ఊపిరి పోస్తూ ప్రభువు మరణించాడు. క్రీస్తు ప్రభు మానవ కోటికి అందించేసత్యం. ఆదియును, అంతమునైన దేవుడు తనను నమ్మి శరణుజొచ్చిన వారిని కడఖండ వరకు చేయి విడువని భాగ్యవంతుడు.

## అపోస్తులను నడిపిన నావ: నమ్మకం

అపోస్తులు "విశ్వాసం" అనే పునాదిపై తమ జీవితాలను నిర్మించుకొని, "ప్రేమ" అనే ఇంటిలో నివసించి, "నమ్మకం" అనే సుగుణంతో తమ జీవితయాత్రను



సాగించిన మహోన్నతులు, నమ్మకానికి ప్రతి రూపాలు. ఈ నవీన యుగంలో కొంతమంది క్రైస్తవ యువతీ యువకులనుగానీ, పిల్లలనుగానీ వారి తల్లిదండ్రులు గుడికి రమ్మన్నా, దేవున్ని నమ్మమన్నా, ఎందుకు ఏమిటి అనే యక్ష ప్రశ్నలు వేస్తారు. ఎందుకంటే వారే తెలివైనవారు అనే భ్రమ. కాని అపోస్తులలు అలా కాదు. ప్రభువు వారిని పిలువగానే ఎందుకు, ఎక్కడికి అనకుండా ఆయనపై తమ నమ్మకాన్నుంచి ఆయనను వెంబడించి పావనులయ్యారు. మానవులమైన మనది చంచల నమ్మకం కాని వారిది అచంచలమైన నమ్మకం. వారిలో కూడా చాలామంది బలహీనులు. ఉదాహరణకు పేతురు, యోహాను, తోమా... వీరు ఎన్నోమార్లు తప్పులు చేసి పాప ఊబిలో చిక్కుకున్నా, ప్రభువుని నమ్మి రక్షింపబడినవారు. అపోస్తులలో ప్రథముడైన పేతురు నమ్మకాన్ని ప్రస్తావించుకుంటే, పేతురు బలహీనుడిగా పుట్టి, బలహీనుడిగా పెరిగి బలవంతునిగా క్రీస్తుకు సాక్షిగా మరణించాడు. పేతురు ప్రభువుని ఎరుగనని అబద్ధమాడినా, తొలి దశలో శ్రీసభ వేద హింసలకు గురి అవుతున్నప్పుడు వాటి నుండి పారిపోదలచినను, ప్రభువు పలికిన మాటలను జ్ఞప్తికి తెచ్చుకొని మారుమనస్సు పొంది ప్రభువుకై హతసాక్షిగా మారి తన నమ్మకాన్ని బ్రతికించుకున్నాడు. నిత్యజీవపు కిరీటాన్ని అందుకున్నాడు.

పేతురులా నమ్మకాని తన జీవితంలో అలవర్చుకోలేకపోయాడు యూదా ఇస్కరియోతు. తాను బలహీనుడిగా పుట్టి, బలహీనుడిగా పెరిగి చివరికి బలహీనుడుగానే చనిపోయాడు. తాను ఆత్మహత్య చేసుకునే ముందు ఒక్క క్షణం ఆగి ప్రభుని నమ్మి ఉంటే దైవరాజ్య వారసుడై ఉండేవాడు. కనుక అపోస్తులను నడిపింది వారికున్న నమ్మకం. అదే వారిని దైవరాజ్య వారసులను చేసింది. అయితే వారి రక్త తర్పణం వలన అందిపుచ్చుకున్న విశ్వాసాన్ని మనం కడ వరకు పేతురులా నిలుపుకోగలుగుతున్నామా? లేక యూదా వలే నమ్మకాన్ని అమ్మివేస్తూ జీవిస్తున్నామా? ఆలోచించాల్సిన విషయం.

## పరివర్తనకు మూలం, దైవరాజ్యంకు ద్వారం: నమ్మకం

కడుపు కాలినవాడిని అడిగితే, మెతుకు విలువ చెబుతాడు. కష్టపడ్డవాన్ని అడిగితే బ్రతుకు విలువ చెబుతాడు. అలాగే క్రైస్తవులను హింసించిన వారిని క్రూరంగా చంపినవాడు ఎవరని అడిగితే సౌలు అని పరిశుద్ధ గ్రంథం తెలిసిన

ప్రతి వ్యక్తి చెప్పుతాడు. క్రైస్తవ మత వ్యతిరేకి, క్రైస్తవత్వాన్ని యూదా దేశంలో రూపుమాపాలని కంకణం కట్టుకున్నవాడే క్రీస్తును పొందిన తరువాత క్రీస్తుపై తన నమ్మకాన్ని నిలుపుకొని అలుపెరుగకుండా నిరంతర శ్రామికునిలా పోరాటాన్ని సలిపాడు. క్రీస్తును మనసారా నమ్మి క్రీస్తు కోసం శ్రమలు, మరణం వరకు వెళ్లటానికి సాహసించిన గొప్ప ధైర్యశాలి పునీత పౌలు.

తను నమ్మిన సత్యం కొరకు, సిద్ధాంతం కొరకు, తనను పిలిచిన వ్యక్తి కొరకు, తనను నమ్మిన యూదా జాతిని, మతాన్ని విడిచిపెట్టి మతపెద్దల చూపులు శూలాలై దిగుతున్నా తాను నమ్మిన క్రీస్తును విడువని వ్యక్తి పౌలు. క్రీస్తు లేకుండా నేను లేనంటాడు పౌలు. నేను మరణించినను జీవించినను క్రీస్తు కోసం అని పలికిన ధీరుడు (గలతీ 2:20). నమ్మకపాత్రుడు. ఇక జీవించునది నేను కాను నాలోని క్రీస్తు అని క్రీస్తుపై తన పూర్తి నమ్మకాన్ని వెల్లబుచ్చిన భక్తాగ్రగణ్యుడు పౌలు. తనలో కలిగిన పరివర్తనకు మూలం ఆయనకు ఆ క్రీస్తుపై ఉన్న నమ్మకం అదే ఆయనను నడిపించింది. దైవరాజ్యానికి వారసున్ని చేసింది.

పరివర్తన కలిగి నమ్మకంతో జీవించిన పౌలు ఒక ఉదాహరణ. అయితే పవిత్రగ్రంథంలో తన కడగతులలో క్రీస్తుపై నమ్మకముంచి పరలోక రాజ్య బహుమానాన్ని పొందినవాడు క్రీస్తునకు కుడివైపు స్లీవవేయబడిన దొంగ. ఈ దొంగ వాని జీవితంలోను తన పరివర్తనకు మూలం క్రీస్తుపై నమ్మకమనే చెప్పుకోవచ్చు. అందుకే పునీత అగుస్తీనువారంటారు. దేవుడు అసహ్యించుకొనేది పాపాన్నే కాని పాపిని కాదు. కనుక ప్రతి పాపికి పౌలు, క్రీస్తును నమ్మిన ఈ దొంగవాడు ఒక ఆదర్శమే క్రీస్తుపై మన నమ్మకాన్ని కడవరకు ఉంచి, మనం పరివర్తన చెంది దైవరాజ్యాన్ని పొందుదాం.

## వేద హింసల్లో గుభాళించిన సుగుణం: నమ్మకం

"నాడు వేదసాక్షులు చిందించిన రక్తపు బిందువులే నేడు క్రైస్తవ జీవనానికి విశ్వాస బీజాలు అంటాడు తెర్తులియన్. క్రీస్తు శకం రెండు మూడు దశకాలలో క్రైస్తవత్వం అంకురార్పణం గావించబడుతున్న రోజులలో క్రీస్తును నమ్ముకున్న వారిని అతిక్రూరంగా హింసించి మృత్యువు ఒడిలోకి చేర్చుతున్న రోజులు. ఎటు చూసినా వేదసాక్షుల రక్తపుటేరులు. అటువంటి స్థితిలోను క్రీస్తును నమ్ముకున్నవారు



సడలని నమ్మకంతో క్రీస్తుకు సాక్షులుగా నిలబడి తమకు ఆ భగవంతునిపై ఉన్న నమ్మకాన్ని నిరూపించుకున్నారు. ఆ కాలంలో నివసించిన కొందరు పితామహులు క్రీస్తుపై తమకున్న నమ్మకాన్ని ఇలా అభివర్ణించారు.

అంతియోకి ఇగ్నేషియస్, నమ్మకం గురించి తన లేఖలో వ్రాస్తూ "నమ్మకం అనేది క్రైస్తవులు క్రీస్తుపై నిలుపుకొనే తమ ప్రగాఢ విశ్వాసం అంటూ నమ్మిన ప్రతివాడు క్రీస్తు సువార్తను బోధించుటకు చివరి రక్తపు బొట్టు వరకు ప్రయత్నించాలని తమ నమ్మకమే వారికి నిత్యజీవాన్నిస్తుందని వెల్లడించారు. వేదసాక్షి జస్టిన్ క్రైస్తవులకు దేవుని మధ్య ప్రేమ బంధంగా నమ్మకాన్ని వ్యక్తపరచారు. అలెగ్జాండ్రియాకు చెందిన ఒరిజిన్‌గారు నమ్మకం "మానవులను భగవంతుని కృపకు, పాప మన్నింపుకు పాత్రులను చేసే సుగుణంగా వర్ణించారు. రోమాపురి క్లెమెంట్ పునీతుడు "నమ్మకం" మానవులను భగవంతుని ప్రేమకు సాక్షులుగా నిలిపే సుగుణంగా మరియు నమ్మకం అంటే కష్టాలలో, సుఖంలో, వేదనలో, ఆనందంలో, జీవంలో, చావులో ఎల్లప్పుడు క్రీస్తుకు సాక్షిగా ఉండటమే అని తన వేదహింసలో బహిరంగంగా ప్రకటించాడు. ఇరేనియస్ అతనాసియస్, అలెగ్జాండ్రియాపురి సిరిల్, మ్యాకియూస్ వీరందరు నమ్మిన సత్యం ఒక్కటే మరణం క్షణికం మన బాధ్యత. తద్వారా ఆ దైవరాజ్యానికి వారసులుగా నిలబడే వరకు ప్రార్థించుటే మన కర్తవ్యం. అందుకు మరణానికైనా వెనుదీయకూడదు అని ఈ మహోన్నతులు తమ జీవిత మర్మం ద్వారా తెలియజేసారు.

అదే విధంగా పునీతులు ఆంబ్రోసు, అగస్టీను వారి జీవితాలలో ఆది నుండి వీరు ప్రభువుపై తమ నమ్మకాన్ని వల్లిస్తూ 'నీ జీవిత మరణాలలో యేసుకు సమీపంగా ఉండు ఆయనకు నమ్మదగిన వానిగా విశ్వసించు. అందరు విడిచిపెట్టినా ఆయన మాత్రం నిన్ను ఎన్నడు చేయి విడువరు అని తాము విశ్వసించిన సత్యాన్ని రచనల ద్వారా తెలియజేసారు. ఈ పునీతుల జీవితాలలో గతం ఒక విషాదం కాని క్రీస్తునందు నమ్మకం వలన పొందిన జీవితం ప్రభుని నమ్మి పునీతులు అయ్యారు. నేను ఎందుకు పరిశుద్ధుని కాలేను? ఈ ప్రశ్న ఒక్క ఆ పునీతునికి సంబంధించినదే కాదు. నేడు క్రైస్తవ విశ్వాసులమని చెప్పుకొంటున్న మనకు మనం వేసుకోవాల్సిన ప్రశ్న. ఈ పునీతులంతా కాకపోయినా ఎంతో కొంత ఆయనకు

నమ్మకస్తులమౌదాం. మరణం వరకు నమ్మకముగా నుండుము, నేను నీకు నిత్యజీవ కిరీటమిచ్చెదను" అనే ప్రభు వాక్యమును జ్ఞప్తియందు ఉంచుకుందాం (దర్శన గ్రంథం 2:10).

## క్రైస్తవ జీవన మార్గం : నమ్మకం

ఇల్లు పటిష్టంగా ఉండాలంటే పునాది ముఖ్యం. అలాగే ఈ నవీన యుగంలో పాపం విలయతాండవం చేస్తూ, నీతి, న్యాయాలు అడుగంటిపోతూ అటు సంఘం ఇటు కుటుంబాల విశ్వాస జీవితం కుంటుబడుతున్న తరుణంలో మన క్రైస్తవ జీవన మనుగడకు పునాదిలా 'నమ్మకం' నేటి క్రైస్తవ కుటుంబ జీవితాలు నమ్మకాన్ని మరచి అపనమ్మకాన్ని ఆదరించి కుటుంబం అనే ఇంటిని నాశనం చేసుకుంటున్నారు. ఒక కుటుంబంలో భార్యాభర్తల సంసార జీవితం నూరేళ్లు నిలబడి వెయ్యేళ్లుగా ఫలించాలంటే నమ్మకం ఎంతో ముఖ్యం. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అనగా ఇద్దరు మనసుల మధ్య నమ్మకమే ఉండాలి. అపనమ్మకం అనుమానాలు పెనుభూతంగా ప్రవేశిస్తాయి. కనుక కుటుంబం ముక్కలౌతుంది. దీన్ని గ్రహించి కుటుంబంలో నమ్మకం అనే చెట్టును నాటి పెంచితే అది అన్యోన్యత, ప్రేమ అను ఫలాలను ఇస్తుంది. నమ్మకం అను సుగుణాన్ని అవలంబించవలసినది ఒక్క భార్యాభర్తలేకాదు అందరు వారు పిల్లలే కావచ్చు, స్నేహితులు, శ్రేయోభిలాషులే కావచ్చు. కుటుంబ జీవితాలలో కష్టాలు, బాధలు, కన్నీళ్లు వస్తాయి. "తామర పువ్వు బురదలో కొట్టి మాట్లాడుతూ బాధలను భరించి బురదను చీల్చుకొని పైకి వచ్చి తన అందంతో అందరిని ఎలా ఆకర్షిస్తుందో అదే విధంగా క్రైస్తవులమైన మనం మన జీవితంలో ఎదురయ్యే బాధలను, కష్టాలను విశ్వాసంతో ఎదుర్కొనే క్రీస్తుప్రభువుపై మనకున్న నమ్మకాన్ని నిలుపుకొని ఆదర్శప్రాయులంగా ఉండాలి.

## నమ్మికను వెలిగించు జ్యోతి ప్రార్థన

నమ్మకం ఎంత గొప్ప సుగునమో తెలుసుకున్న మనకు దానిని ఆచరణ చూపెట్టుటకు మార్గం కూడా తెలియాలి. ఆ మార్గమే "ప్రార్థన" అంటారు. పునీత తోమాసు అక్వీనాసు క్రైస్తవ ప్రార్థన నమ్మికను వెలిగించు జ్యోతిగా వర్ణించాడు. నమ్మికకు సాధన మార్గము క్రైస్తవ ప్రార్థన అంటారు పునీత పదహారవ బెనడిక్ట్



పాపుగారు (క.శ్రీ.సం.2091). ప్రార్థన అనేది మన నమ్మకాన్ని నిలబెడుతుంది. మనిషిలోని ఆశలను చిగురింపజేస్తుంది అని కలకత్తాపురి పునీత థెరిస్సా తమ జీవితాల ద్వారా వ్యక్తపరచారు. కనుక ప్రార్థన అనేది ప్రతి క్రైస్తవుని జీవితంలో ఎంతో లోతుగా ఉండాలి. పరలోక జపం నమ్మికను నేర్పే ఒక పాఠశాల. అందులో మనం నమ్మికను అభ్యసిస్తున్నాం. కనుక ప్రార్థన అనేది మన నమ్మకాన్ని రగిలించే అగ్ని. ప్రార్థన నమ్మకాన్ని నిలబెడుతుంది, మనిషిలో ఆశలను చిగురింపజేస్తుంది అంటారు పునీత మదర్ థెరిస్సాగారు.

దావీదు నమ్మకంతో వేకువనే ప్రార్థించాడు. దానియేలు మధ్యహ్నా, పౌలు సిలాసులు అర్ధరాత్రి, అన్నా అవసరాలలో, యోబు కష్టాలలో, తిమోతి యవ్వనంలో, సిమియోను వృద్ధాప్యంలో వారు వారి నమ్మకాన్ని ప్రభునందు నిలుపుకోవడం కోసం ప్రార్థించారు. చివరకు యేసుప్రభువు కూడా తాను నమ్మిన తండ్రిని అన్నివేళలలో ప్రార్థించాడు. ప్రార్థనతోనే మనం నమ్ముకున్న సిద్ధాంతానికి సాక్షీభూతులుగా జీవించగలం. అందుకే క్రైస్తవుని జీవితంలో ప్రార్థనను నమ్మిను వెలిగించు జ్యోతిగా అభివర్ణించారు. పునీత పీటర్ జూలియన్ ఈమార్ట్ మాటల్లో దేవుడు నమ్మదగినవాడు, ఆయనకు మనం ప్రియపుత్రులుగా ఉండాలన్నా సైతాన్ శక్తులను జయించాలన్నా ఆ దైవరాజ్య వారసులుగా కీర్తి గడించాలన్నా, మనలను నడిపిస్తుంది, నడిపించబోయేది ప్రభుపై మన నమ్మకం. ఆ నమ్మకానికి సాధన మార్గం ప్రార్థన

## నమ్మకంనకు విరుద్ధంగా చేసే పాపాలు

మానవుడు శరీరకంగా బలవంతుడన్నది ఎంత నిజమో, మానసికంగా ఆధ్యాత్మికంగా బలహీనుడన్నది అంతే సత్యం. లౌకిక కోరికల వలయంలో చిక్కుకొని తాను నమ్మిన సిద్ధాంతమునకు ముఖ్యంగా నమ్ముకున్న దైవానికి విరుద్ధంగా జీవిస్తూ పాపాలను చేస్తూనే ఉన్నాడు. నమ్మకానికి విరుద్ధంగా పాపం చేయడం అంటే మాటలలోను, క్రియలలోను, ఆలోచనలోను ఆ దైవానికి అతీతంగా ప్రవర్తించడం ఒక్కమాటలో చెప్పాలంటే దైవంపై అపనమ్మక ధోరణిని ప్రదర్శించడం, కొన్ని సందర్భాలలో మానవులమైన మనం కొన్ని విషయాలలో భగవంతునిపై కాక మన శక్తి సామర్థ్యాలనే నమ్ముకొని దేవుడే లేనట్టు నాస్తికత్వ సిద్ధాంతాలతో జీవిస్తుంటాం. ఇది మహా పాపం కొన్ని సందర్భాలలో ఒక విషయమై దేవుని దరి చేరినప్పటికి అది సఫలికృతం కానప్పుడు నిరుత్సాహంతో దైవదూషణం చేస్తూ

దేవునికి విరుద్ధంగా పాపం చేస్తాం. మనం గ్రహించాల్సిన విషయం ఏమిటంటే మనలను సృష్టించిన దేవుడు మన ఆపదలలోను కష్ట సమయాలలోను ఎన్నడు చేయి విడువడు. దేవుడు మనలను చేరదీయడంలో ఆలస్యం చేయవచ్చేమో కాని, మనలను ఆదరించకపోవడం అంటూ ఉండదు. దేవునికి మన మీద ఉన్న ప్రేమ అనంతమైనది కాని అపనమ్మకమన్న అలలు మన నమ్మకాన్ని తాకి మనలను పాపానికి ప్రభావితులను చేస్తాయి. కనుక నిరుత్సాహం, పాపం చేయకుండా అబ్రహాము, యోబు, పేతురు, పౌలు వలె మన విశ్వాస జీవితలను కొనసాగించాలి.

**ముగింపు**

యేసుక్రీస్తుపై నమ్మకం అన్నిటికన్నా విలువైనది, దేవునిపై నమ్మకం పెడితే బంగారం, భూమి, వజ్రవైఢుర్యాలు అన్ని దానిముందు దిగదుడుపే, కత్తి, గిత్తి, మనుషులను నమ్మి మోసపోవుటకంటే దేవుని ఆశ్రయించి నిత్యజీవం పొందుట మేలు. కనుక ప్రియ మిత్రులారా భగవంతుడు మనలను సృష్టించి ఆయనను తెలుసుకొని ప్రేమించి, సేవించి ఆయనకు నమ్మకమైన బిడ్డలుగా జీవించి నిత్యజీవాన్ని పొందుటకై క్రైస్తవులమైన మనయొక్క నమ్మకం వేటిపై ఉంది, ఎవరిపై ఉంది. అంత్యదినమున ప్రభువు మనతో చెప్పేమాట ఒకటే. నీవు ఉత్తముడవు, నమ్మిన బంటువు నీవు స్వల్ప విషయములయందు శ్రద్ధ వహించితివి. కనుక అనేక విషయములను నీకు అప్పగింతును, నీ యజమానిని ఆనందంలో నీవు పాలుపంచుకొనుము (మత్తయి 25:23). ప్రభు పలుకుమాటలు అక్షర సత్యాలు క్రీస్తుప్రభుని నమ్ముతున్నాం అంటు జీవిస్తున్న మనతో కూడ ప్రభువు ఈ పలుకులు పలుకుతాడా? ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనుషులమైన మనకు ఈ లోకం యొక్క పోకడ బాగా తెలుసు. కొందరు జీవితంలో జరిగే కొన్ని సంఘటనల ఫలితంగా త్వరగా ధైర్యాన్ని కోల్పోతారు, ఓటమి అంగీకరిస్తారు. ఇక ఈ జీవితమింతేనన్నట్లు నిస్తేజంతో జీవనాన్ని కొనసాగిస్తారు. అన్ని వేళలు ఒకేవిధంగా ఉండవు. ఓపికతో మన చుట్టూ సాలె గూడులా అల్లుకుపోయిన అన్యాయ వ్యవస్థ మరియు ఈ చీకటి సామ్రాజ్యం నుండి బయటకు వచ్చి ప్రభు ఉన్నాడు, ఆయనను నమ్మువారి అక్కరకు ఆయన వస్తాడని గ్రహించి వెలుగు పుత్రులుగా క్రీస్తు సాక్షులుగా నిలబడాలి.

❋ ❋ ❋ ❋

# 4. ప్రేమ - సృష్టిలో, సృష్టికర్తతో అనుబంధాన్ని పెంచే కర్పూరం

- బ్రదర్ నల్లా సుధీర్ కుమార్



ప్రేమ అను ఈ రెండక్షరాల పదం అత్యంత ప్రాచుర్యంలో వున్న పదం. ప్రేమ యొక్క అర్థం గాఢత, ప్రేమ అను పదం కలిగివున్న భావం ఎంతమందికి తెలుసు అన్నది ప్రశ్నార్థకం. భూమి పుట్టినప్పటినుండి ఈ 'ప్రేమ' అను భావాన్ని, అర్థాన్ని ఛేదించే ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. ప్రేమ యొక్క పరమార్థాన్ని గ్రహించి ప్రేమను నిర్వచించడం మన వలన అవుతుందా? ప్రేమ యొక్క నిర్వచనాలు తరాలు మారే కొలది మారుతున్నాయి. అలా వ్యక్తిగత భేదాభిప్రాయాలు వలను ఎవరి నిర్వచనం వారిది. ప్రేమను పంచేవారి నిర్వచనం ఒకటైతే, ఆ ప్రేమను అనుభవించే వారి నిర్వచనం మరొకటి. ప్రేమను పొందినవారి నిర్వచనం ఒకటైతే ఆ ప్రేమకు దూరమైన భగ్న హృదయుల నిర్వచనం ఇంకొకటి, ఇలా అనేక నిర్వచనాలు, అర్థాలు ప్రేమకు కలవు. అందులో ఏది సరియైనది అను దాని గూర్చి అనేకానేక వివాధాలు ఉన్నాయి. కొందరు మనస్తత్వశాస్త్ర నిర్వచనం సరియైనది అని, మరికొందరు సామాజిక శాస్త్ర నిర్వచనం మాత్రమే సరియైనదని ఇంకొందరు అంటారు.

**'ప్రేమ'**

ప్రేమ అనునది ఒక భావనో లేక ఏదో ఒక భావోద్వేగమో కాదు. కాని 'ప్రేమ' ఒక సద్గుణం. ప్రేమ మానవ సంబంధమైనది కాదు, దైవ లక్షణం. దైవ సుగుణం దైవ సద్గుణాన్ని ప్రేమ దైవిక సుగుణం. సోదర ప్రేమ పవిత్రాత్మ

అనుగ్రహం దైవశాస్త్ర గుణాలలో ప్రేమ ప్రథమం, విశ్వాసం, నిరీక్షణ, ప్రేమ అను ఈ మూడు దైవిక సుగుణాలలో ప్రేమ ప్రథమమైనదని పునీత పౌలు ప్రేమ ప్రాముఖ్యతను తన లేఖలయందు తెలియజేస్తున్నారు. ప్రేమ యొక్క లక్షణాలు ఎన్నో. ఆ ప్రేమ లక్షణాల గురించి పునీత పౌలు అధికంగా ప్రస్తావించడం మనం గమనించవచ్చు.

"ప్రేమ సహనము కలది, దయకలది, అసూయకాని డంబముకాని గర్వముగాని ప్రేమకు లేవు. అమర్యాదగాని, స్వార్ధపరత్యముకాని, కోపస్వభావముకాని ప్రేమకు ఉండవు. ప్రేమ దోషములను లెక్కింపదు. ప్రేమ కీడునందు ఆనందించదు. సత్యమునందే అది ఆనందించును. ప్రేమ సమస్తమును భరించును, సమస్తమును విశ్వసించును, సమస్తమును ఆశించును, సమస్తమును సహించును ప్రేమ శాశ్వతమైనది" (1 కొరింతీ 13:4-8).

పౌలుగారి ప్రేమ కావ్యంనందు ప్రేమ అను పదం వున్న ప్రతిచోట దేవుడు లేదా క్రీస్తు అను పదాలను వుంచి చదివినట్లయితే ఈ క్రింది విధముగా వుంటుంది.

"దేవుడు సహనము కలవాడు, దయ కలవాడు, అసూయకాని, డంబముకాని ప్రేమకు లేవు.. దేవుడు శాశ్వతమైనవారు.

ఇలా ప్రేమకున్న లక్షణాలు దైవీకమైనవని, ప్రేమే దేవుడని. పై లక్షణాలన్నీ క్రీస్తుప్రభువు జీవితంలో కూడా ప్రశస్తముగా మనకు కనబడుతాయి. దైవ లక్షణమైన ప్రేమ మనం దేవునిచే వరంగా, అనుగ్రహంగా పొందాం. ప్రేమను పంచడం, దేవున్ని మానవున్ని సృష్టిని ప్రేమించడం ద్వారా దేవునికి మహిమ చేకూర్చినవారమై సంపూర్ణ మానవునిగా జీవిస్తూ, జీవితాన్ని సార్ధకం చేకూర్చుకున్న వారమవుతాం.

## ప్రేమ రకాలు

**భౌతికమైన ప్రేమ:** ఈ ప్రేమ శరీరకమైనదిగా వర్ణించవచ్చు. ఇది కేవలం ఒక వయస్సులో కలిగే ఆకర్షణగా అర్థం చేసుకోవచ్చు. ప్రతి జంతువులోను, మనిషిలోను భౌతికమైన అవసరాలు తీర్చుకోడానికి ప్రేమ కనబరుస్తారు. ఈ భౌతికమైన అవసరాలు తీర్చుకోవడానికి ప్రేమ కనబరుస్తారు. ఈ భౌతికమైన అవసరాలు



తీర్చుకున్న తరువాత ఈ ప్రేమ కనుమరుగవుతుంది. జంతువులకు సంబంధించినంత వరకు తమ తమ ప్రకృతి సిద్ధమైన శరీరక అవసరాలు తీర్చుకోవడానికి వుండే ఆకర్షణే. మనిషికి కూడా తమ వాంఛలు, కోరికలు తీర్చుకోవడానికి తాపత్రయపడడం మనం గమనించవచ్చు. అటువంటి జంతు ప్రవృత్తి మనిషి చూపించడం, మనిషి తన ఉన్నతమైన స్థానము నుండి దిగజారినట్లే శరీరక అవసరాలు, కోరికలు, వాంఛలు తీర్చుకోవడానికి ఇటువంటి ప్రేమను కనబరిచేవారు అనేకులు కాబట్టి మనపై కురిపించే ప్రేమ ఎటువంటిదని మనం గమనిస్తూ ఉండాల్సిన అవసరం ఎంతగానో ఉంది. ముఖ్యంగా కౌమార్యంలో, యవ్వనంలో పుట్టే ఆకర్షణను ప్రేమగా పొరపడితే మోసపోకతప్పదు. భౌతికమైన ప్రేమ స్వార్ధంతో నిండి ఉంటుంది. ఈ ప్రేమ శాశ్వతమైనది కాదు.

## భావోద్వేగ ప్రేమ

ప్రేమ ఒక అవసరం. ప్రతి మనిషి ప్రేమించబడాలని, ప్రేమించాలి అనే తపన మనస్సున అంతర్గతంగా వుండే సహజ గుణం. ఇలా స్వచ్ఛమైన ప్రేమను పొందనప్పుడు మనిషి ప్రేమను పంచలేడు. ప్రేమ కరువైనప్పుడు మనిషి ఒంటరితనానికి లోనై తీవ్రమైన భావోద్వేగాలకు లోనవుతుంటాడు, మానసికంగా కృంగిపోతుంటారు. ఇలా ఆవేశంలో భావోద్వేగాలలో ఇతరుల ప్రేమను పొందాలని ప్రేమ కోసం ప్రేమించినవారిని చంపేవారు. కొందరైతే, అదే ప్రేమ కోసం ఆత్మహత్యలు చేసుకునేవారు ఇంకొందరు. అదే ప్రేమ ఎదుటివారి బలహీనతలను ఆసరాగా చేసుకొని వారి ప్రేమను అవకాశంగా తీసుకొని వారి భావోద్వేగాలతో ఆడుకుంటూ, అవసరాలు తీర్చుకునేవారు ఇంకొందరు. ప్రేమ కొరకు తపించే వ్యక్తులు ముక్కుమోహం తెలియనివారు ఏ కొంచెం చనువుగా ఉండి, ప్రేమగా మాట్లాడితే చాలు, ఏదైనా అవసరంలో ఆదుకుంటే వారు కనబరిచే మంచితనాన్ని ప్రేమగా భావించేవారు ఇంకొందరు. ఈ రకం ప్రేమ నిజమైనది కాదు. ఇది కేవలం ఒక భావన మాత్రమే. ఈ భావోద్వేగపూరితమైన ప్రేమ ఇతరులను ఇబ్బందికి గురిచేస్తు ఉంటుంది. భావోద్వేగపూరిత ప్రేమ వలన మనిషి తాత్కాలికంగా వివేకం, విచక్షణను కోల్పోతుంటాడు. ప్రేమ ప్రేమించువారికి ప్రేమించబడేవారికి ఇద్దరికి హానికరము. ఈ భావోద్వేగ ప్రేమకులోనై విచక్షణను

కోల్పోయి ఉన్మాదులుగా ప్రవర్తించే వారిని గూర్చి మనం దినపత్రికల్లో చదువుతూనే ఉంటాం. ఈ ప్రేమ ఇతరులకు హాని కలిగిస్తుంది. ఈ ప్రేమ నిజమైనదికాదు. కేవలం కొద్దికాలం ఉంటూ ఆ భావోద్వేగం తగ్గిన తరువాత వివేకం కోల్పోయి, విచక్షణ కోల్పోయి నేను ఇలా ప్రవర్తించానేంటా అని వాపోవడం తథ్యం.

**త్యాగపూరిత ప్రేమ**

ఇందులో స్వార్థం ఉండదు. కేవలం ఇతరులకు తనకు చేతనైనంత వరకు మంచిని చేయాలని మాత్రమే తాపత్రయపడే ప్రేమ ప్రేమించడం ద్వారా తిరిగి ప్రేమించబడాలనే ఆశ కూడా ఈ త్యాగపూరిత ప్రేమలో ఉండదు. కాబట్టి ఈ త్యాగపూరిత ప్రేమను నిజప్రేమగా అభివర్ణించవచ్చు. తల్లిదండ్రులు పిల్లలపట్ల చూపే ప్రేమ స్వచ్ఛతలో త్యాగపూరితమైనదిగా ఉంటుంది. మనల్ని ప్రేమించేవారు ఎప్పటికి అలానే నిస్వార్థముగా ప్రేమిస్తారని మనం అనుకోవడం పొరపాటు. మనం మనల్ని ప్రేమించేవారిపట్ల వ్యవహరించే తీరునుబట్టి, కొన్నిసార్లు మనస్పర్థలు కలగటం వలన, ఎప్పటిలా ప్రేమిస్తారన్న కచ్చితత్వములేదు.

కేవలం దైవప్రేమ మాత్రమే శాశ్వతమైనది. ఎన్నటికి మారనిది, సత్యమైనది. మన ప్రేమ ఆ దైవప్రేమను ప్రతిబింబింపజేయడమే మనం చేసే కృషిలో ఉండాలి.

ఒక బాధ్యతాయుత అధికారం కలిగియుండి ప్రకృతిని పరిరక్షించుటకు కూడా దేవుడు మనిషిని ఎన్నుకున్నాడు. ప్రకృతిని పరిరక్షించకపోగా, దానిని నాశనం చేయడం సామాజిక పాపం. దైవసృష్టిని మనం ప్రేమించకపోవడం దానిని దేవుడు ఇతరుల ఇచ్చినట్లు యధార్థస్థితిలో ఉంచకపోవడం పాపమే అవుతుంది.

ప్రకృతిని ప్రేమించడం ప్రకృతిని పరిరక్షించడం అంటే దేవుని పనిని, దైవకార్యాన్ని ప్రేమించడమే. ప్రకృతిలో సంబంధం లేనట్లుగా నమ్మించడం. సాధ్యమేగాని, ప్రకృతి లేకుండా జీవించడం అసంభవం. కనుక సృష్టిలో దేవున్ని చూడగలగాలి. సృష్టి ద్వారా దైవజీవం ప్రవహిస్తుంది. మానవ మనుగడకు కావాల్సిన సమస్తం దేవుని సృష్టినందు అనుగ్రహించబడుతుంది. దైవసృష్టిని ప్రేమించడం దేవుని ప్రేమించడమే.



**సోదర ప్రేమ (సర్వమానవత ప్రేమ)**

ఎవరైనా తను దేవుని ప్రేమిస్తున్నానని చెప్పుకొనుచు తన సోదరుని ద్వేషించినచో అట్టివాడు అసత్యవాది. తన కన్నులారా తాను చూచిన సోదరుని ప్రేమింపనిచో తాను చూడని దేవుని అతను ప్రేమించలేడు" (1 యోహాను 4:20)

మనిషిని మనిషిగా గుర్తించి ప్రేమించడమే సోదర ప్రేమ. లేదా సర్వప్రేమ? ఒకరిని గూర్చి ఒకరిని తప్పులు పట్టని రోజుల్లో మనం వున్నాం. మన పక్కింటిలో ఎవరు ఉంటున్నారో సహితం తెలియని పరిస్థితుల్లో మనం వున్నాం. మనిషిలో స్వార్థం పెరిగి మన చుట్టూ వున్న వారిని గూర్చి ఆలోచించే తీరికలేక ఉంటున్నాం. దీనికి తోడు ఎన్నో భేదాలు, మనిషికి మనిషికి మధ్య అనేకానేక అడ్డుగోడలు, హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి.

దేవుడు మానవులందరిని ఏ భేదము లేక సమానంగా సృష్టించాడు. దైవ దృష్టిలో అందరూ సమానులే. అందరు ఆయన ప్రేమకు పాత్రులు. అందుకే సృష్టి అందరికి, క్రీస్తు రక్షణ అందరిది. దేవుడు ఒక జాతిపట్ల అధిక ప్రేమను కనబరచినట్లు కనిపించవచ్చు కాని ఆయన కేవలం ఎన్నుకున్న జాతి మాత్రమే కాని, ఇతరులను విస్మరించాడని ఎక్కడా లేదు. దైవ దృష్టిలో అందరు ఒక్కటే.

పునీత పౌలు చెప్పినట్లుగా సకల విజ్ఞానం కలిగివున్నప్పటికి ప్రేమ లేకుంటే వ్యర్థం (1 కొరింతీ 13:2) అన్నట్లు మనిషిగా మనం మన తోటివారిని ప్రేమించినట్లైతే మన జీవితంను సాధించేదేమీ వుండదు. నిన్ను నీవు ప్రేమించుకున్నట్లే అందరిని ప్రేమించండి (యోహాను 15, మత్తయి 22:39) అని క్రీస్తు ప్రభువు పలుకుతున్నాడు. అప్పటి సమాజంలో వున్న సకల బోధనలకు తారతమ్యాలు వలన ప్రేమలేకపోవడమే కారణం. ఇప్పుడు కూడా అదే ప్రేమలేని ఇతరులంటే పట్టని తరానికి జీవిచ్చు ప్రేమ మాత్రమే. "నేను మిమ్ము ప్రేమిస్తున్నాను, మీరును ఒకరినొకరు ప్రేమించుకొనండి" (యోహాను 13:34) అని తన అపార ప్రేమను నిర్భాగ్యులపట్ల, రోగులపట్ల సమాజం నుండి వెలివేయబడి వారిని ప్రేమించి చూపించాడు క్రీస్తు.

దైవప్రేమ అంటే దేవుని ప్రేమించి మనిషిని ద్వేషించడం కాదని, మనిషినే ప్రేమించలేనివారు దేవుని ప్రేమించలేడని (1 యోహాను 4:20-21) పునీత

యోహాను పలకడం మనం మొదట చూశాం. సాటి మనిషిలో దేవున్ని చూసి ప్రేమించగల దైవ ప్రేమ. ప్రతి మనిషిలోను మంచితనం వుంటుంది. ఆ మంచి దేవుని నుండి వచ్చినం కాబట్టి ఆ దేవుని పోలికయైన మంచితనాన్ని, ప్రేమ కలిగిన మనిషిగా నీతో సృష్టించబడిన మనిషిని గౌరవించి, ప్రేమించడం అంటే దేవున్ని ప్రేమించడమేనని గ్రహించుకోవాలి.

## సృష్టికర్త ప్రేమ

"మా దేవుడవైన ప్రభూ! నీ మహాత్మ్యము భూమియందంతట చూపట్టుచున్నది" (కీర్తన 8:1).

మానవ మేధస్సు ఎంతో ఘనమైనది, మానవ మేధస్సు వివేచన, వివేకం ద్వారా ఈ సృష్టి రహస్యము బల్పడుతుంది. ఆవిర్భావమును ఛేదించే ప్రయత్నం జరుగుతూనే ఉంది. మనం మన చుట్టూ వున్న ప్రకృతి వన్యప్రాణులు, పక్షులు కీటకాలు, సూక్ష్మజీవులు ఒకటేమిటని అన్ని వాటి వాటి ప్రత్యేకతలను చూచి ఆశ్చర్యపోక తప్పదు. ప్రస్తుతం భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్న కక్ష్యలో కాకుండా కేవలం కొన్ని కిలోమీటర్లు ముందుకు ఉండి పరిభ్రమిస్తున్నట్లైతే సూర్య వేడిమికి అసలు భూమిమీద జీవకోటి ఉండేది కాదు. అదే భూమి కక్ష్య నుండి కొన్ని మీటర్లు సూర్యుని నుండి దూరంగా పరిభ్రమించినట్లైతే కూడా ప్రాణకోటి మనుగడ సాధ్యమయ్యేదికాదు. అంతా మంచుమయమై ధృవం గడ్డకట్టుకుపోయేది. భూమికి తన స్థానాన్ని ఇచ్చిందెవరు? సూర్యమండలంలో భూమికి మనుగడ ఏర్పాటు చేసినది ఎవరు? పాలపుంతలకు, నక్షత్రాలకు వాటి వాటి స్థానాలకు ఏర్పాటు చేసిన ఒక క్రమములో అమర్చినదెవరు? మన చుట్టూ వున్న ప్రకృతిని, జీవకోటిని అంతరిక్షాన్ని పరిశీలించినప్పుడు ఇటువంటి ప్రశ్నలు కలుగక తప్పవు. ఈ సృష్టియావత్తు తటస్తంగా ఏర్పడింది అని అనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. ఎందుకంటే మానవ ఇంగిత జ్ఞానంతో పామరులు సహితం ఇంతటి మహత్తర సృష్టిని కలుగజేసింది, పరిరక్షిస్తున్నది దేవుడు అని ఆయనే సృష్టికర్తని చెబుతుంటారు.

సృష్టి అంతటిని దేవుడు ఎందుకు కలుగజేసాడు? అందు మానవుని ఎంతో ఉన్నతముగా ఎందుకు సృష్టించాడు? అని ప్రశ్నించుకుంటే మనకు దొరికే సమాధానం, 'ప్రేమ'. కేవలం ప్రేమ చేతనే దేవుడు సకల సృష్టిని కలుగజేశాడు.



మానవుని, సృష్టి వృత్తాంతంను గమనించినట్లైతే మానవుని పట్ల దేవునికి గల ప్రేమ స్పష్టమవుతుంది. దేవుడు తన రూపంలో పోలికలో మానవాళిని సృష్టించాడని. సృష్టిలో వున్న ఏ ప్రాణికి దేవుని రూపంలో పోలికలో సృష్టించబడినట్లు ఎక్కడాలేదు. కాని కేవలం మానవునికి మాత్రమే ఈ అదృష్టం. సృష్టిని చూసి ఆశ్చర్యానికి లోనయి మనం దైవ ప్రేమలో సృష్టినంతటిని కలుగజేసాడని చెప్పే మనం, మన శరీర నిర్మాణంను గమనించినప్పుడు కూడా అదే ఆశ్చర్యానికి లోనవ్వడమేకాక ఇదంతా కేవలం దైవప్రేమని మనకు సుస్పష్టమవుతుంది. మానవుని అత్యంత క్లిష్టమైన శరీర నిర్మాణము కేవలం రెండు కరణాల ద్వారా సృష్టించబడిన ఎన్నో అవయవాల సమన్వయ అనుసంధానం. మానవ శరీరం ఈ శరీరంలో దేవుడు తన ఊపిరిని జీవాన్ని ప్రసాదించడం మన ఈ మృత అవయవములలో దైవ జీవం నెలకొని ఉంది. తన జీవాన్ని దేవుడు స్వయంగా మనకు దయచేశాడు. స్త్రీవాద దైవశాస్త్రవేత్తలు దేవుడిని తల్లిగా భావిస్తూ సృష్టి అంతా దేవుని నుండి ఉద్భవించిందని మానవుని దేవుడు తల్లిలా ప్రేమతో కలుగజేశాడని దైవప్రేమ కేవలం సృష్టించి వదిలివేసే ప్రేమ కాదు. కాని సంరక్షించే ప్రేమ మానవుడిపై దేవునికి ఉన్న ప్రేమ సృష్టి జీవులన్నింటి కంటెను కొంచెము తక్కువ వానినిగా మాత్రమే చేసితివి. కీర్తి మహిమలనే కిరీటముతో అతనిని అలంకరించితివి' (కీర్తన 8:5). దేవుడు మానవుని ఉన్నతంగా సృష్టించాడు. దేవుడికి మానవుని పైవున్న ప్రేమ వలన దేవుడు మానవునికి వివేచనను, విజ్ఞానంతో దేవుడు సృష్టించాడు. ఈ వివేకం విజ్ఞానం – లేనట్లైతే మానవుడు జంతుసమానుడు. దేవుడు మానవుని జంతువుగా, కేవలం జీవం కల ఒక ప్రాణిగా సృష్టించలేదు. మానవుడు తన పూర్ణమనస్సుతో, పూర్ణశక్తితో, పూర్ణ హృదయంతో తనను తెలిసికొని ప్రేమించాలన్నదే దేవుని అభిలాష. ఇదియే మానవ బాధ్యత. సృష్టిని చేసిన దేవుని తెలుసుకొని ఆయన్ని ప్రేమించడం కన్నా మానవుని జీవితంను వేరే పరమార్థం, సార్థకం లేదేమో! మనల్ని ప్రేమించి సృష్టించిన దేవుని ప్రేమించడమే మన లక్ష్యంగా వుండాలి.

దైవసృష్టి దేవుని మహిమను వెల్లడి చేయడం మాత్రమేకాక దైవప్రేమను వ్యక్తం చేస్తుంది.

## సృష్టిలో ప్రేమ

"దేవుడైన యావే నరుని తీసుకొనిపోయి ఏదేను తోటను సాగుచేయుటకు, కాచుటకు దానిలో ఉంచెను" (ఆది 2:15). మానవుడు సృష్టి అంతటిలో ఉన్నతమైనవాడు. దేవుడు మానవునికి సృష్టికంతటిపైన అధికారం ఇచ్చాడు. అధికారం అంటే నాశనం చేయడం కాదు. బాధ్యతపూర్వకమైన అధికారం. మానవుడు తన చుట్టూవున్న ప్రకృతిపై గౌరవం కలిగివున్నట్లైతే దానిని సంరక్షిస్తాడు. మానవుడు సృష్టిని పవిత్రమైనదిగా దైవీకమైనదిగా గుర్తించలేకపోతున్నాడు. సృష్టి దైవీకమైనది. "భూమియు దానిమీద నున్న సమస్త వస్తువులును ప్రభునివే. ప్రపంచము దానియందు వసించు ప్రాణులెల్ల ఆయనకు చెందినదే" (కీర్తన 24:1). దేవుని మహాత్యం వెల్లడి చేయబడిన సృష్టిని ప్రేమించడం అంటే దేవుని గౌరవించడమే. మానవ మేధస్సు దైవసృష్టిని, సృష్టిని చేసిన దేవుని మహిమ పరచడానికే కాని సృష్టిపై అధికారం చెలాయించి, దాన్ని మన అవసరాలకు మించి ఉపయోగించి దానిని నాశనం చేయుటకు కాదు. ప్రకృతితో దేవుడు సహజసిద్ధమైన క్రమాన్ని ఏర్పరచియున్నాడు. ఆ క్రమాన్ని మానవుడు తన స్వార్థపు అవసరాలరీత్యా భంగం కలిగించినప్పుడు సృష్టి అంతా మానవుని దుష్క్రియలకు గురి అవ్వాల్సివస్తుంది.

మానవునికి సృష్టి పట్ల ప్రేమ గౌరవము లేనందుననే ప్రకృతి విపత్తులకు గురి కావల్సివస్తుంది. దాని ప్రభావం తిరిగి మానవాళిపై, రానున్న తరాలపై ఇంకా అధికంగా ఉండడం తథ్యం.

దేవుడు మానవాళికి సృష్టిపై అధికారం ఇచ్చినది. దానిది సక్రమంగా వినియోగించుకొని, ఆయన ప్రేమతో ఎదుగుటకు మాత్రమే. సృష్టి ద్వారా ఆయనను మహిమపరచుటకు దేవుడు మానవాళికి ఇచ్చింది. అధికారం మాత్రమే కాక సృష్టిపై మనిషికి బాధ్యతను ఇచ్చాడు. దేవుడు ఆదామును ఏదోను తోటను 'సాగు చేయుటకు' 'కాచుటకు' నియమించెను. ప్రకృతి అంతటిలో ఒక క్రమము జీవరాశికంతటికి అవినాభావ సంబంధం ఉంటుంది. ఏ ఒక్క ప్రాణి జంతుజాతి అంతరించినా సమస్త ప్రకృతిపై దాని ప్రభావం ఉంటుంది. కాబట్టి దాని కాచు బాధ్యత దేవుడు మనిషికి ఇచ్చాడు.



## క్రీస్తు ప్రేమ

ప్రేమకు సాక్ష్యమిచ్చుటకు, ప్రేమ విలువలను తెలియజేయుటకు క్రీస్తు ప్రభువు ఈ లోకానికి వచ్చాడు. కాని తాను చూపించిన ప్రేమ ఆనాటి ప్రజలకు రుచింపలేదు, వారికి తృప్తినివ్వలేదు. ఒక గొప్పరాజుగా, సైనికునిగా రోమీయుల బానిసత్వము నుండి విడిపించే రక్షకుడు క్రీస్తు అని వారు భావించారు. దానికి బదులుగా క్రీస్తు పేదల పాలిటి కల్పతరువై నిలిచారు. వ్యాధిగ్రస్తులను స్వస్థపరిచాడు. అవసరంలో ఉన్నవారిని ఆదుకున్నాడు. పాపాత్ములకు మన్నింపునొసగాడు. వారిని ఉన్నతమైన వారిగా, దేవుని బిడ్డలుగా చేయుటకు క్రీస్తు నిర్ణయించుకున్నాడు. ప్రజలు ప్రధానార్చకులు, పెద్దలు ఆశించినట్లు క్రీస్తు వారికి వంత పాడి వున్నట్లయితే ఆయనకు ఎంతో ఆహ్వానము లభించేది. యూదా చట్టాన్ని పాటించమని బోధించినట్లయితే ఇంకా ఎక్కువ సంతోషించేవారు.

కాని క్రీస్తు దీనికి బదులుగా సబ్బాతు దినంను పక్షవాత రోగిని స్వస్థపరుస్తూ, వాని పడకను ఎత్తుకొని పొమ్మన్నాడు (మత్తయి 9:6-7). మానవాళి కోసం సబ్బాతు దినంకాని సబ్బాతు దినం కోసం మనిషి సృష్టింపబడలేదు అని ఋజువు చేశాడు. దేవాలయమందు సీయోను కొండపైనే గాక, ఆత్మయందు సత్యమందు దేవుని ఆరాధించాలని (యోహాను 4:24) ఆహ్వానించాడు.

తప్పిపోయిన కుమారుని వృత్తాంతం (లూకా 15:11-32) ద్వారా ప్రేమను గురించి అందరికి అర్థమయ్యేలా బోధించాడు. తండ్రి అభిష్టానికి వ్యతిరేకంగా కుమారుడు యిల్లువదిలి తన ఆస్తిని అంతటిని దుర్వినియోగం చేశాడు. కుమారుని చెడు జీవితం తండ్రి మనస్సును నొప్పించింది. కాని తనలోని ప్రేమను నాశనం చేయలేదు. కుమారుడు సిగ్గుతో పశ్చాత్తాపంతో తిరిగి వచ్చినప్పుడు తండ్రి అతనిని హృదయపూర్వకంగా ఆహ్వానించి, వానికి నూతన జీవిత భాగ్యాన్ని దయ చేశాడు.

కల్వరి బలిలో క్రీస్తు చూపిన ప్రేమ ఒక చరిత్రాత్మక నిర్ణయం. శత్రువులు విధించిన మరణశిక్షను అంగీకరించి, వారు చేయునది వారికే తెలియదు. వారిని క్షమించమని తండ్రిని ప్రార్థించి (లూకా 23:34) మహోన్నతమైన ప్రేమకు సాక్షిగా నిలిచాడు.

ఇది రక్షణాయుతమైన ప్రేమ పేదలను, అనాథలను వ్యాధిగ్రస్తులను ఆదరించి బలపరచి, స్వస్థపరిచే ప్రేమ రక్షణ ప్రేమను ఈ లోకానికి అందించి తన ప్రేమ బంధాన్ని విశ్వసించు వారందరి ద్వారా ఇంకా సజీవంగా ఉంచు తున్నాడు.

## నీ శత్రువును ప్రేమింపుము

శత్రువును ప్రేమించుము (మత్తయి 5:44) అను క్రీస్తు మాట చాలామందిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అప్పుడు అది ఆచరణ సాధ్యం కానిదని, ఆలోచించవలసిన విషయం కాదని తలస్తారు. క్రీస్తు బోధన ప్రకారం ప్రేమ ఒక భావన మాత్రమేకాదు, అంతకన్నా గొప్పదే అని తెలియజేస్తున్నారు. మిత్రులు, కుటుంబ సభ్యులు అపార్థం చేసుకున్నప్పుడు శత్రువులు యే మాటలను ఉద్దేశ్యాలను వక్రీకరించి మిమ్ము కించపరచినపుడు అవమానించినపుడు మీరు చేసే ప్రతి పనిలో అడ్డుతగులుతున్నప్పుడు ఆ వ్యక్తిని దూరంగా ఉంచుతారు. ఈ పరిస్థితిలో ప్రేమ అనేది ఒక భావన మాత్రమే అయి ఉండినట్లయితే, ఎదటి వ్యక్తిని లేదా శత్రువును ప్రేమించడం అసాధ్యమే.

శత్రుత్వం అసూయ, ద్వేషంను పగను, కోపంను పెంచుతుంది. ప్రేమ కనుమరుగవుతుంది. ఒంటరితనాన్ని ఛేధించుటకు టి.వీలు చరవాణి, ఇంటర్‌నెట్, సినిమాలపై దృష్టి మళ్లుతుంది. ఎదుటి వ్యక్తి పట్ల మంచి భావన లోపించినపుడు ప్రేమ కూడా దూరమవుతుంది. ఎదుటి వ్యక్తి దూషించినప్పుడు అవమానించినప్పుడు సంతోషించమని యేసుప్రభువు చెప్పుటలేదు కాని సంతోషం లేదా బాధను కలిగించే భావాలతో మోసపోవద్దని కోరుతున్నారు. నీలో కలిగే భావాలకన్నా నీ వ్యక్తిత్వం గొప్పది. అదే విధంగా ఒకే ఒక సందర్భంలో నీవు శత్రువు గురించి ఏర్పరచుకున్న భావనలు ఆ వ్యక్తి మానవ బాంధవ్యాలను దృఢపరుస్తుంది. భావాలే సర్వస్వంకాదని గుర్తు చేస్తుంది. ఆ శక్తి పశ్చాత్తాపం క్షమాపణ మారుమనస్సు అను సుగుణాలు వైపు మరల్చి, మానవ ప్రేమలో ఉన్న ఆంతర్యాన్ని మాధుర్యాన్ని అనుభవించేలా చేస్తుంది.



## రక్షణాయుతమైన ప్రేమ

పేదల అభ్యున్నతికి పాటుబడటం, ప్రేమపూరితమైన బంధాలు బంధుత్వాలకు తగిన అవకాశాలను కల్పించుట ద్వారానే ప్రపంచ శాంతి నెలకొంటుందని ఉపన్యాసాలు వింటుంటాం. ఈ సుందర భావాలు మన జీవితానికి అర్థాన్ని ఉద్దేశాన్ని యిస్తాయి. ఇలాంటి మంచి ఆలోచనలు లేనట్లయితే ప్రపంచం ఎటు పయనిస్తుంది? ఈ ఆలోచనలతో ముందుకు సాగుతున్నదంటే, దానిలో ఏదో కొంత ఉన్నట్లు అత్యాశ, అవినీతి, తారతమ్యాలు, విభేదాలు, యుద్ధాలు, కరువులు, ప్రేమలేమి యిన్నీ కూడా ఈ లోకంలో చూస్తూనే ఉన్నాం. ఇవన్నీ మానవుడు చేసుకున్నవే. కాబట్టి మానవాళికంతటికి విమోచన లేదా రక్షణాయుత ప్రేమ అవసరం ఈ రక్షణాయుత ప్రేమ మనోగాయాలను మాన్పుతుంది. తప్పులను క్షమిస్తుంది. మంచిని ప్రోత్సహిస్తుంది. అందరిని ఐక్యం చేస్తుంది.

క్రీస్తు ప్రభువు సిలువలో వ్రేలాడుతూ తన ఆత్మ శరీరములయందు ఈ లోకపు ద్వేషాన్ని, అసూయ, పగను, అవమానాన్ని భరించాడు. అంతేకాదు తనను మరణం వరకు నడిపించిన వారందరిని మన్నించి, వారిలోని మంచిని వ్యక్తపరచుటకు, దేవునిలో చేరుటకు వారికి మరొక అవకాశాన్ని దయచేశాడు. ఇదే రక్షణాయుతమైన ప్రేమ మన జీవితాలందు ప్రేమను సాధించుటకు ఇది మనలో ఉత్సాహాన్ని కల్గిస్తుంది. బాధలను భరించే శక్తిని దయ చేస్తుంది. ఇంతటి మహత్తరమైన రక్షణను సాధించిన క్రీస్తుప్రభువు. మానవాళి రక్షణార్థమైన సకల శ్రమలను ప్రేమతో భరించారు. రక్షణ ఫలాలు మనందరికి అందించారు. తండ్రితో ఐక్యము చేశాడు.

## ప్రేమ – పాపం

ప్రతి పాపం ప్రేమకు విరుద్ధమైనదే. ప్రేమ సకల సద్గుణాలు వున్నాయి. ఏ సద్గుణానికి వ్యతిరేకంగా పాపం చేసిన, అది ప్రేమకు వ్యతిరేకంగా పాపం చేసినట్లే. మన ఉద్దేశ్యంలో, క్రియలో ప్రేమ లోపించినప్పుడు మనం దేవునికి, సాటి మనిషికి, ప్రకృతికి, తనకు వ్యతిరేకంగా పాపం చేసినట్లే.

**“నిన్ను నీవు ప్రేమించుకున్నట్లే”**

దేవుడు మానవాళిని తన పోలికలో సృష్టించాడు. జీవము పోశాడు. మట్టి శరీరం నందు, తన జీవపు ఆత్మను వుంచాడు. మన శరీరం ఆయన ఆలయమని పునీత పౌలుగారు అంటారు. దేవుని రూపం పోలిక కలిగిన మన దేహాన్ని ప్రేమించకపోవడం కూడా పాపమే. శరీరాన్ని ప్రేమించడం అంటే శరీరాన్ని మన ఆత్మరక్షణకై వినియోగించుకోవడానికి పుణ్యక్రియలు చేస్తూ దైవరాజ్యం చేర వినియోగించుకోవడం. పూర్వం శరీరాన్ని ఆత్మకు శత్రువుగా, ఆత్మ బంధింపబడిన చెరసాలగా భావించి, శరీరం పాప కారణం కాబట్టి పశ్చాత్తాప క్రియలు చేస్తూ శరీరాన్ని హింసించుకునేవారు. కాని మనల్ని మనం ప్రేమించుకోకుంటే మనం ఇతరులను ప్రేమించలేమని గుర్తించాలి. ఇది ముమ్మాటికి తప్పుకాదు. ఇలా ప్రేమించడం వలన మనల్ని మనం గౌరవించుకున్న వాళ్లమవుతాం. అలాగే మన ఈ దేహాన్ని చేసిన సృష్టికర్తను గౌరవించిన వాళ్లం అవుతాం. అలాగే మన ఈ దేహాన్ని చేసిన సృష్టికర్తను గౌరవించిన వాళ్లం అవుతాం. కాబట్టి మన శరీరానికి కావాల్సిన అవసరాలు కూడు, గుడ్డ, నీరు నిచ్చి ఆరోగ్యవంతముగా ఉండాలను కోవడం మనల్ని మనం ప్రేమించుకున్నట్లే. మానవాళి పరిపూర్ణ జీవం కలిగియుండుట యందే దేవుడు మహిమపరచబడుతాడని పునీత ఇరేనియసు చెప్పారు.

“ఆత్మ పరిరక్షణ” మనం కేవలం శరీరమునకు ఈ లోకంనకు సంబంధించిన వాళ్లం కాదు. కాని మనం పరలోకమునకు సంబంధించిన దేవుని జీవం వుందని గుర్తించక కేవలం శరీర సంబంధికులుగా జీవించడం ఆత్మను నిర్లక్ష్యము చేయడం పాపం. ఆత్మ పోషణ దైవవాక్కు ద్వారా క్రీస్తు దేహం రక్తాల ద్వారా, ప్రార్థన వలన ఆత్మ పరిరక్షణ జరుగుతుంది. ఆత్మను ప్రేమించడం అంటే మన ఆత్మ సంబంధమైన క్రియలు చేస్తూ దైవమార్గంలో శరీరంను పాపంనకు లోనవ్వకుండా పవిత్రాత్మ ఆత్మ ప్రబోధంతో ఆత్మను పరిరక్షించుకోవడం. ప్రేమ వల్ల చైతన్యవంతమైన నైతిక జీవిత ఆచరణం క్రైస్తవులను దేవుని బిడ్డల ఆధ్యాత్మిక స్వేచ్ఛనిస్తుంది (సి.సి.సి. 1828).



**“మీరును ఒకరినొకరు ప్రేమించుకొనండి”**

ప్రేమను కొత్త ఆజ్ఞగా యేసు చేశాడు. తన వాళ్లను “చివరిదాక” ప్రేమించుట ద్వారా తాను పొందిన తండ్రి ప్రేమను ప్రదర్శించాడు. అలా కాకుండా సాటి మనిషిని, రంగు, రూపం, వర్ణం, ప్రాంతం, భాష అను వివిధ బేధాలు సృష్టించి ప్రేమించకపోవడం పాపం.

ఇతరులను ద్వేషించడం ప్రేమకు వ్యతిరేకమైన పాపం.

పొరుగువారిపట్ల ఏమి పట్టనట్లుగా ఉండదు. బాధ్యతారాహిత్యంగా మెలగడం కూడా ప్రేమకు వ్యతిరేకమైన పాపం.

**నీ దేవుని మాత్రమే ప్రేమింపుము**

త్రియేక దేవున్ని వీడి కొన్ని వస్తువుల పట్ల వల్లమాలిన ప్రేమను కలిగి ఉండటం వలన అటు దేవున్ని ఇటు తోటివారిని యదార్థంగా ప్రేమించడంలో విఫలం కావడమే పాపం. దేవుడు మనల్ని ఈ లోకంలో తనను తెలుసుకొని ప్రేమించి సేవించడానికి మనల్ని సృష్టించాడు. అవిశ్వాసం లేదా అపనమ్మకం దైవ ప్రేమకు ప్రత్యక్షంగా విరుద్ధమైన పాపాలు.

**దైవదూషణం :** దేవుని మనసును అర్థం చేసుకోవడం ఎవరి తరం. మన జీవితంలో ఏ చిన్ని కష్టం వచ్చినా దానిని ఎదుర్కోలేక దేవున్ని నిందించడం. దైవ దూషణం చేయడం, దేవునిపైన అవిశ్వాసాన్ని వ్యక్తం చేయడమే గాక, దేవుని ప్రేమించకపోగా, మన దూషణం ద్వారా దేవున్ని ద్వేషించడం. దైవ ప్రేమకు విరుద్ధ పాపం. దేవున్ని ప్రేమించువారు ఆయన మాటను ఆయన ఆజ్ఞలను విధేయిస్తారు. దైవాజ్ఞలకు వ్యతిరేకమైన ప్రతి పాపం ఆయన ఆజ్ఞలను విధేయిస్తారు. దైవాజ్ఞలకు వ్యతిరేకమైన ప్రతి పాపం దైవ ప్రేమకు విరుద్ధమైన పాపమే.

**అపవిత్రీకరణము**

దైవ సేవకై అర్పించి, ఆశీర్వదించి, ప్రత్యేకించబడిన వస్తువులను అగౌరవపరచడం, అపవిత్రీకరణము. ఇలా చేయడం పరోక్షంగా దైవ ప్రేమను తిరస్కరించడమే. పవిత్ర వస్తువులు మనం చేయు దైవారాధనకు తోడ్పడు పరికరాలు. దైవవాక్కు అయిన బైబిల్ గ్రంథానికి సమోన్నత స్థానం ఉంది. అటువంటి దైవ

గ్రంథాన్ని సరియైన స్థలంలో వుంచారు. మనం ఆ గ్రంథాన్ని మోసే విధానం కూడా దైవగ్రంథం పట్ల మనకున్న ప్రేమను తెలుపుతుంది.

**ప్రకృతిని ప్రేమించకపోవడం**

ప్రకృతి లేదా ఈ సృష్టి మానవ మనుగడకు అన్ని రకాలుగా తోడ్పడుతుంది. అలాంటి ప్రకృతిపట్ల కేవలం వినియోగించుకోవాలి. ప్రకృతి వనరులను సాధ్యమైనంత వరకు అత్యాశతో దోచుకోవడం ప్రకృతికి, పాకృతిక ప్రేమకు వ్యతిరేకమైన పాపం. ప్రస్తుతం మనం ఎక్కడ చూసినా మాలిన్యం, గాలి, నీరు, నేల, మనం తినే ఆహారం, అన్ని కాలుష్యం చేస్తున్నాం. విచక్షణారహితంగా అడవులను నరికేస్తున్నాం. వాటి పరిణామాలు ప్రకృతి విపత్తుల ద్వారా ఎదుర్కొంటున్నాం. ఇలా దైవసృష్టి అయిన ప్రకృతిని ప్రేమించలేకపోవడం ప్రకృతిని కాలుష్యం చేయడం, ప్రకృతిని పరిరక్షించకపోవడం, ప్రకృతిక ప్రేమకు విరుద్ధమైన పాపం. జగద్గురువులు ఫ్రాన్సిస్ పాపుగారు ప్రకృతి పరిరక్షింపబడాలన్న సదుద్దేశ్యంతో గత సంవత్సరం "లౌదాతోసి' అను విశ్వలేఖను మనకు అందించారు. ప్రకృతిని ప్రేమించి పరిరక్షించడం మన అందరి బాధ్యత. ప్రకృతిని ప్రేమించి గౌరవించడం, పరిరక్షించడం. మన ఉనికిని మనం గౌరవించుకున్నట్లే ప్రేమించుకున్నట్లే.

**ముగింపు**

మానవ భాషలను, దేవదూతల భాషలను కూడా నేను మాటలాడగలిగిన నాకు ప్రేమలేనిచో నా వాక్కు మ్రోగెడి కంచులో, గణగణలాడెడి తాళంతో సమానం... ప్రేమలేని వాడనైనచో వ్యర్థుడనే" (1 కొరింతీ 13:1-2) దైవమానవ ప్రాకృతిక ప్రేమ లేకుండా మానవుడు మనజాలడు. ప్రేమను పంచుతూ ప్రేమను పెంపొందింపజేస్తూ జీవించినవాడే మనిషి. జీవితానకి సార్థకం. వ్యక్తిగతంగా కుటుంబాలలో, సమాజంలోవున్న సమస్యలనే మనం రోజుకన్నా కొద్దిగా ఎక్కువ ప్రేమతో వ్యవహరించినట్లయితే అన్నింటిని పరిష్కరించుకోవచ్చు. క్రీస్తు ప్రభువు తండ్రిని ప్రేమించినట్లే మిమ్మల్ని ప్రేమించినట్లు ప్రకృతిని ప్రేమించినట్లే మనం మన శత్రువులను సైతం ప్రేమించగలిగినట్లయితే క్రీస్తు ప్రబోధించిన ప్రేమరాజ్యం విలసిల్లుతుంది.

❋ ❋ ❋ ❋

# 5. నీతి-న్యాయం: శాంతియుత క్రైస్తవ సంఘానికి పట్టుకొమ్మలు

- బ్రదర్ బొట్టె మనోహర్

**ఉపోద్ఘాతము**



సమాజాన్ని సన్మార్గంలో నడుపుటకు దోహదపడే సుగుణాలే నీతి-న్యాయం అని చెప్పుటలో అతిశయోక్తి లేదు. శాంతియుతమైన జీవనాన్ని ఎన్నుకొని నీతి-న్యాయం అనే సుగుణాలను సోపానాలుగా మలచుకొని జీవించిన, జీవిస్తున్నవారు మన క్రైస్తవ జీవనంలో కోకొల్లలు. ఉదాహరణకు పాత నిబంధనలోని ప్రవక్తలు, క్రొత్త నిబంధనలోని అపోస్తలులు, శ్రీసభ చరిత్రలోని పునీతులు, ధన్యజీవులు, వేదసాక్షుల ద్వారా నీతి-న్యాయం ఏరులై పారిందని చెప్పవచ్చు. కాని ఈ ప్రపంచీకరణ వెల్లువలో మారుతున్న కాలంతోపాటు మనుషుల గుణగణాలు కూడా మారుతున్నాయి. ఈ ఆధునిక ప్రపంచంలో జీవితం చాలా వేగంగా పరుగుతీస్తుంది. "ఏదైనా సరే వేగంగా, వెంటనే చేసేయాలి. ఇలా మొదలుపెట్టి అలా ముగించాలి. అందరికంటే ముందుండాలి, అన్నింటిలో నేనే ఉండాలి" అనేది ఈనాటి మన తపన. తాను పరుగెడుతూ అందరినీ పరుగెత్తిస్తున్నాడు. నిదానం, నెమ్మదితనం, శాంతం, కాస్త వెనుకాముందు ఆలోచించడం, ఎవరిలోనైనా లేదా ఏ పనిలోనైనా కనిపిస్తుందేమో చూద్దామంటే కనపడదు. ఇతరులకు, ప్రకృతికి హాని కలిగినా పరవాలేదు. ఎలాగైనా తాను అనుకున్నది సాధించాలి, ధనం సంపాదించాలి, సంఘంలో మంచి స్థానం సంపాదించేయాలి, మద్యం మానం అనుభవించేయాలి. అందరు తనను గౌరవించాలి, అందరిమీద తాను పెత్తనం చెలాయించాలి అనే

ఆశల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇలాంటి ఆలోచన ప్రవాహంలో మనిషి మానవ సంబంధాలకు అనుసంధానమైన నీతి-న్యాయం అనే సుగుణాలను మరచి మానవ సంబంధాలను అటూ ప్రకృతికి మానవునికి ఉన్న సంబంధాన్ని తెంచేస్తున్నాడు. దాని ఫలితమే నాటి హుద్‌హుద్ తుఫాను, నేటి పెద్దనోట్ల మార్పిడి.

### రూపార్థం

పూర్వనిబంధనలోని కొన్ని హీబ్రూ పదాలను పరిశీలించి, వాటిని వాడిన సందర్భాలను విశ్లేషిస్తే కొన్ని మౌలిక విషయాలు స్ఫురిస్తాయి. ఉదాహరణకు పాత నిబంధనలో సెదెక్, మిష్‌ఫాత్, సెదెకా అన్న పదాలను 'ధర్మానికి' పర్యాయపదాలుగా చెప్పుకోవచ్చు. విలువైన న్యాయసమ్మతమైన, ధర్మబద్ధమైన సంఘ విషయాలలో ఈ పదాలను ఉపయోగించేవారు. వీటన్నింటికి ఓ సంగ్రహ రూపార్థం ఉంది. మంచికి ప్రతిరూపమై, అణగారిన ప్రజలకు ధర్మం కూర్చేదిగాను, అన్ని సంబంధాలను నడిపే క్రమబద్ధమైన విషయాలకు ఈ పదాలను ఉపయోగించారు. బాధితులకు, పీడితులకు కరుణ చూపిస్తూ, వారికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే విషయంలో ఎక్కువగా ఈ పదాలను ఉపయోగించడం గమనార్హం. మిష్‌ఫాత్, సెదెకా అన్న పదాలు పీడితపక్షమై, సాంఘిక విలువలను మానవ ధర్మంతో లేదా మానవ నీతితో కాపాడే విషయంలో ఉపయోగించేవారు.

### నీతి

నీతి అనగా అందరికి ఆమోదయోగ్యమైన మంచి నడవడిక. నీతి అనే సుగుణం ద్వారా వ్యవస్థలో మార్పు వస్తుంది. వ్యవస్థలో మార్పురావాలంటే ముందు మనిషి మనస్సులో మార్పురావాలి. అందుకే బైబిల్ గ్రంథం కూడా హృదయపరివర్తన కోరుతుంది. నీతి నియమంతో కూడిన నిబద్ధత కలిగిన జీవితాన్ని ప్రోత్సహిస్తుంది. మనిషికి ఒక శ్రేష్ఠమైన హోదా కలిగించేది నీతి. నీతియుక్తమైన జీవితం జీవించినపుడు వ్యక్తిగతంగా, బహిరంగంగా తన ఔన్నత్యం మెరుగుపడుతుంది. మనిషి నీతిని ఇతరులతో కలిసి ప్రతిబింబింపచేయాలి. అనగా నిన్ను నీవు ప్రేమించుకొనునట్లే నీ పొరుగువారిని కూడా ప్రేమించడమే. అందుకు మనకు సర్వకాల ఆదర్శం క్రీస్తు ప్రభువు మాత్రమే.



### న్యాయం

సంపూర్ణంగా కాక పాక్షికంగా, స్వల్పంగా ధర్మాన్ని ఆచరించడమే న్యాయం అంటారు. కాని న్యాయం అనేది మనకై మనం సృష్టించిన ఒక సవరింపు అని చెప్పవచ్చు. దేవునిది దేవునికి, తోటివానిది తోటివానికి ఇవ్వాలన్న స్థిరచిత్తం, నిరంతర సంకల్పం న్యాయంలో ఇమిడి ఉన్నాయి. "పేదవాళ్ళకు పక్షపాతం చూపకు, సంపన్నులకు లోబడకు కాని న్యాయసమ్మతంగా తోటివానికి తీర్పు తీర్చు (లేవీ 19:15).

### నీతి-న్యాయం చారిత్రాత్మకమైనది

ప్రాచీన ఆచార్య కాలంలోను, తదుపరి మొగలాయి చక్రవర్తుల పాలనలోనూ, ఇటీవల ఆంగ్ల పరిపాలనలోనూ, నేడునూ న్యాయాలయాలు, న్యాయశాస్త్రంను విపులీకరించి, అన్వయించి నీతి-న్యాయంను తగిన విధంగా చాటిచెబుతున్నాయి. భారతదేశ చరిత్రలో మనకు ధర్మశాస్త్రంలోని "మనుస్మృతి" ఆది గ్రంథం. ధర్మశాస్త్రం, రాజ్యధర్మంగాను, వ్యవహార ధర్మంగాను రెండు విభాగాలుగా విడదీసారు. ప్రస్తుతం మన సమాజంలో ఆచరణలోనున్న సివిల్, క్రిమినల్ వంటి విభజనలు, ప్రాచీన కాలంలో, మనుధర్మశాస్త్రంలో చేయబడినట్లు తెలుస్తుంది.

ధర్మశాస్త్రంను అన్వయింప చేయుటలో నాలుగు సూత్రాలను నిర్ధేశించారు.

1. ధర్మనిబంధనలకు రాజైనను, పేదవాడైనను కట్టుబడి ఉండవలసినదే. ఈ సూత్రంనే ఆంగ్లంలో "లా ఫర్ ఆల్" అని పేర్కొన్నారు.
2. సార్వజనిక న్యాయం గలదన్న భావన ఉన్న ఈ సూత్రమే ఆంగ్లంలో "కామన్ లా" అని అంటారు.
3. ఆచారంను పాటించుట. ఈ సూత్రంనే ఆంగ్లమున "కస్టమ్" అని పేర్కొన్నారు.
4. రాజ శాసనం యొక్క పరమ ప్రమాణికత. దీనినే ఆంగ్లమున "స్టాట్యూట్ లా" అని అంటారు.

పైన పేర్కొన్న నాలుగు సూత్రాలననుసరించి దైనందిన జీవితంలో ధర్మశాస్త్రం ఆచరణలో పెట్టారు. క్రైస్తవ జీవితంలో శాంతియుతమైన జీవితానికి అద్దం పట్టే పది ఆజ్ఞలే మనకు దేవుడు మోషే ద్వారా ఇచ్చారు. ఇదే మనకు

అసలుసిసలైన చారిత్రాత్మక ఆధారం. వాజ్యాలు జరుగునపుడు ధర్మశాస్త్రంను పఠించిన వ్యక్తులు న్యాయవాదులుగా పరిగణించి, నీతి-న్యాయం ప్రకారం తీర్పు చెపుతారు. ఈ ప్రక్రియ అనాది కాలం నుండి ఆచరణలో ఉంది.

## నీతి-న్యాయం ద్వితీయ వాటికన్ మహాసభ నుంచి

ఈ ఆధునిక ప్రపంచంలో నీతి, న్యాయబద్ధమైన సమాజాన్ని నిర్మించడానికి శ్రీసభ ఒసగే మార్గాలేవని చూస్తే "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" అనే వాటికన్-2 అధికార పత్రం మనకు కొన్ని విషయాలను తెలియజేస్తుంది. ప్రతి మనిషిలోనూ మనస్సాక్షి అనే అగోచరమైన వ్యవస్థ ఒకటి ఉంటుంది. దీనినే అంతరాత్మ అని కూడా అంటారు. ఈ అంతరాత్మ నిరంతరం ఒక నీతిచట్టాన్ని బోధిస్తూ ఉంటుంది. "ఈ పని మంచిది ఇది చెయ్యి, ఈ పని మంచిది కాదు, దీన్ని చేయవద్దని, అందరిని ప్రేమించాలే కాని ద్వేషించకూడదని" ఇలా ప్రతిసారి మంచి చెడులను గుర్తుచేస్తూ ఎప్పుడు ఏది చేయాలో, ఏది చేయకూడదో అప్పటికప్పుడు గుర్తు చేస్తూ మనిషికి మార్గదర్శిగా ఉంటుంది. ఇంతకు, అంతరాత్మ వల్లించే నీతిసూత్రాలు ధర్మచట్టాలు ఎక్కడివి? వాటిని మనిషే ఏర్పరచుకున్నాడా? లేదు! మానవుడి అంతరంగంలో అగోచరమైన అంతరాత్మను నెలకొల్పిన దేవుడే ఈ నైతిక చట్టాన్ని అంతరాత్మలో రాసి పెట్టాడు. కనుక ఈ అంతరాత్మ ప్రబోధాలకు కట్టుబడి జీవించడం మీదనే మానవుడి ఆత్మగౌరవం ఆధారపడి ఉంటుంది. అంతరాత్మ చేసే నీతి ప్రబోధాలే తుది తీర్పునాడు దేవుడు మానవుడి మంచి చెడులను నిర్ధారించడానికి పరమ ప్రమాణాలుగా నిలుస్తాయి.

## వ్యక్తిగత నీతి-సామాజిక నీతి

రెప్పపాటు కాలంలోనే ఊహించలేనన్ని మార్పులు జరుగుతున్నాయి. ఈ ఆధునిక సమాజంలో ఎవరు కూడా తన చుట్టూ తాను గిరిగీసుకుని "నా బ్రతుకు నేను బ్రతుకుతా" అని అనుకోవడం జరిగే పనికాదు. వ్యక్తిగత నీతినియమాలు పాటించినా సమాజంలో తనవంతుపాత్ర పోషించాలి. తన చుట్టూ జరుగుతున్న మార్పులకు తప్పనిసరిగా తనదైన రీతిలో స్పందించాలి. తన సామాజిక బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తించాలి. వ్యక్తిగతంగా తాను పాటించే సామాజిక నీతి-న్యాయం, సేవధర్మాలు సమాజంలోని వ్యక్తులు, ఇతర సంస్థలు కూడా



పాటించేలా చూడాలి. సామాజిక ప్రయోజనాలకంటే స్వప్రయోజనాలే ప్రధానమని భావిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ప్రజాక్షేమంతో పాచికలాడే వారు మరెందరో ఉన్నారు. వీరు అడ్డదారుల్లో ధనార్జన చేస్తున్నారు. పన్నులు చెల్లించకుండా నల్లధనం కూడబెడుతున్నారు. సామాజిక బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తూ మేలైన మార్పులకు అడ్డుగోడలుగా విచ్ఛిన్నమైన పాత్ర పోషిస్తున్నారు. ఇదే కోవకు చెందిన మరికొందరు సామాజిక చట్టాలను బుద్ధిపూర్వకంగా ఉల్లంఘిస్తూ ఉంటారు. ఇలాంటి వారికి క్రమశిక్షణ వంటబట్టదు. పరిసరాల పరిశుభ్రత పట్టదు. ఎదుటివారు ఎలా ఉంటే మాకేమి అన్నట్లు దురుసుగా ప్రవర్తిస్తారు.

ప్రతి మనిషి సమాజంలో నియమ నిబంధనలను పాటిస్తూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. వ్యక్తిగత నియమాలు, కుటుంబ బాధ్యతలతోపాటు సామాజిక చట్టాలను పవిత్రమైన జీవన విధులుగా భావించి, క్రమశిక్షణతో వాటిని పాటించాలి. ఆధునిక ప్రపంచంలో విభిన్న దేశాల మధ్య వివిధ జాతుల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు పెరిగే కొద్దీ మానవుల సామాజిక పరిధి సైతం క్రమంగా విస్తరిస్తోందన్న సత్యాన్ని గుర్తించాలి. అంటే ఇంత వరకు తన గురించి, తన కుటుంబం గురించి, తన చుట్టూ ఉన్న సమాజం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తి నేడు ప్రపంచంలోని ఏ దేశంలో ఏ ప్రాంతంలో మానవులు ఎలాంటి అవసరాల్లో ఆపదల్లో ఉన్నా, వారు తన పొరుగువారేనన్న సద్భావనతో స్పందించాలి. వారిపట్ల తనకున్న సామాజిక బాధ్యతను నెరవేర్చడానికి ముందుకు రావాలి. ఇలాంటి విశాల దృక్పథం పెంపొందాలంటే సమాజంలోని వ్యక్తులు, మానవ సంఘాలు, నైతిక నియమాలను నిష్టగా పాటించే చట్టబద్ధంగా జీవించడం అలవరచుకోవాలి. అలా నీతిమార్గంలో సత్యమార్గంలో నడిచే సమాజం దేవుని కృపావరాలతో దీవింపబడుతుంది. దేవుని ఆత్మ ప్రేరణతో నడిచే అలాంటి ఆదర్శ సమాజం నుంచే నవతరం మానవులు ఉద్భవిస్తారు. వారే నవలోక నిర్మాతలవుతారు. సమస్త మానవులు సుఖశాంతులతో వర్ధిల్లే దైవరాజ్యాన్ని నిర్మించగలుగుతారు.

## బైబిల్ గ్రంథం నుండి నీతి-న్యాయం

పాత నిబంధనలో నీతి-న్యాయం అనగానే మనకు గుర్తు వచ్చేవారు ప్రవక్తలు. ప్రవక్తల కర్తవ్యం అవినీతిని ఖండించడం. కావున ప్రవక్తలందరు అవినీతి

అన్యాయంతో కూడిన పాపాలను చేస్తున్న యిస్రాయేలు ప్రజలను హెచ్చరించి, అలా చేయడం ద్వారా దేవునికి విరుద్ధంగా పాపాలు చేస్తున్నారని చెప్పేవారు. ఆ హెచ్చరిక ద్వారా అనేకమంది తమ తప్పు తెలుసుకొని మారుమనస్సు పొందితే, కొందరు మారుమనస్సు కలగక శిక్షను పొందారు. మరికొందరు ప్రవక్తలపైకే విరుచుకుపడి, ప్రవక్తలను అనేక ఇబ్బందులకు గురిచేసి, చివరకు చంపడానికి కూడా పూనుకున్నారు. ఇలా అనేకమంది ప్రవక్తలు ఎన్నో విధాలుగా సమాజంలో అవినీతి-అన్యాయాలను అరికట్టడానికి దోహదపడ్డారు.

**ఆమోసు**

"పండుగలు నాకు గిట్టవు. మీరు నాకు అర్పించు దహన బలులను నేను అంగీకరించను. వానికి బదులుగా న్యాయం ఏటివలె పారునుగాక! నీతి జీవనది వలె ప్రవహించునుగాక" అని ఆమోసు ప్రవక్త దేవుని మాటలను పలికాడు (ఆమోసు 5:21,25). ఈ విధంగా ఆమోసు ప్రవక్త యిస్రాయేలు ప్రజలు కర్మకాండను వీడి దేవునికి అంగీకారయోగ్యమైన పనులను చేయమని కోరుతున్నాడు. ప్రజలకు దేవునికి మధ్యవర్తిత్వంతో ఉండి ప్రజలను రక్షించాడు.

**హబక్కూకు**

హబక్కూకు ప్రవక్త దేవుని రాజ్యంలో జరిగే దుర్మార్గాన్ని ప్రశ్నించాడు. ధర్మశాస్త్రం వలన ప్రయోజనం లేదని నీతి-న్యాయం అణగారిపోతుందని, యూదులను శిక్షించడానికి మూర్ఖులైన బబిలోనియులను ఎందుకు వినియోగించు కున్నావని ప్రశ్నిస్తున్నాడు. యూదా రాజ్యంలోని దుర్మార్గాన్ని, అన్యాయాన్ని, అవినీతిని, న్యాయం తారుమారు అగు ఆసంగతిని హబబక్కూకు యావే దేవునికి ఫిర్యాదు చేశాడు (హబ 1:4). నీతిమంతులు భక్తి విశ్వాసం వలన జీవింతురని నొక్కి వక్కానించుచున్నారు (హబ 2:4). ఈ విధంగా చాలామంది ప్రవక్తలు నీతి న్యాయానికి నిలువెత్తు నిదర్శనాలుగా నిలిచారు.

**క్రీస్తు మాటల్లో**

నీతి నిమిత్తం ఆకలితో అలమటించువారు సంతృప్తి పొందుతారని, ధర్మం కోసం ఎవరైనా పాటుపడితే నీతిమయ జీవితాన్ని ఆచరించడంలో అవమానాలు, నిందలు ఎదుర్కొంటారో వారిదే పరలోక రాజ్యం అని మన క్రీస్తు అష్టభాగ్యాలలో



బోధించగా మనం విన్నాం. ఈ లోకంలో మనం నీతిన్యాయం అనే సుగుణాలను అలవరచుకొని, పట్టుకొమ్మలుగా చేసుకొని శాంతియుతమైన క్రైస్తవ సంఘాన్ని నిర్మించడానికి దోహదపడాలి. నీతి-న్యాయం అనే సుగుణాలను పాటించుటలో ఆరోగ్యకరమైన పోటీతత్వం కూడా మనకు చాలా అవసరం. "ధర్మశాస్త్ర బోధకుల కంటే, పరిసయ్యుల కంటే మీరు నీతిమయమైన జీవితము జీవించిననే తప్ప పరలోక రాజ్యమున ప్రవేశింపరని చెప్పుచున్నాను" అని క్రీస్తు ప్రభువు చెబుతున్నారు (మత్త 5:20). ఈ సమాజంలో కేవలం వ్యక్తిగత అభివృద్ధి కోసమే శ్రమించక, అటు వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి కొరకు కూడా నీతియుక్తమైన ప్రవర్తన కలిగి ఉండాలి.

**బప్తిస్మ యోహాను**

యేసే మార్గం, సత్యం, జీవం అని నమ్మిన బప్తిస్మ యోహాను ధన్యజీవిత చరిత్ర మనకు తెలిసిందే. ఆయన నీతిమంతుడు, సత్యం కోసం నిలిచి రాజునే ఎదిరించి, "నీవు నీ తమ్ముడి భార్యను పెండ్లాడుట తగదు" అని చెప్పి, వేదసాక్షి మరణం పొందాడు. అబద్ధాల నుండి ఇతరులను, మనలను మనం మోసం చేసుకోకుండా అవినీతి, అధర్మంతో చేతులు కలపకుండా, సత్యమైన దేవుని నమ్మిన బిడ్డలుగా సత్యం కోసం, నీతి కోసం, ధర్మం కోసం నిలబడి క్రీస్తు కొరకు మరణమైనా లాభదాయకమేనని నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడు (మార్కు 6:17-29).

**పునీత యోసేపు**

పునీత మత్తయి, లూకా సువార్తలను బట్టి యోసేపు గారు "న్యాయ వర్తనుడు" గొప్ప "నీతిమంతుడని" తెలుస్తుంది. యోసేపుగారికి మరియతో వివాహానికి నిశ్చితార్థం జరిగాక వారు సంసారపక్షంగా కాపురం చేయకమునుపే మరియ గర్భవతి కావడం యోసేపు గారిని కలిచివేసింది. ఆమెను నలుగురిలో అవమానింపక దేవదూత మాట ప్రకారం వినయాన్నే విప్లవంగా మార్చుకొని మరియను అక్కున చేర్చుకున్నాడు (మత్తయి 1:19-24). ఈ విధంగా పునీత యోసేపుగారు గొప్ప నీతిమంతుడిగా గుర్తింపు పొందాడు.

**పునీత పౌలు**

నీతి విషయంలో పునీత పౌలుగారి అభిప్రాయాన్ని, ఆయన ఆలోచన ధోరణిని గమనిద్దాం. మొదటి ఆదాము వలన ఈ లోకంనకు పాపము తద్వారా మరణము వచ్చింది. కాని ఇప్పుడు క్రీస్తు రెండవ ఆదాముగా పాప విమోచన

ప్రసాదించి, విశ్వాసులందరిని నీతిమంతులుగా చేశారు. క్రీస్తు పాపపుశిక్షను తనపై మోపుకొని మనకు తన నీతిని ఉచితంగా అందించారు అని పునీత పౌలు రోమీయులకు వ్రాసిన లేఖలో అంటారు. "పాప జీవితానికి సంబంధించిన దుష్కార్యాలను విడనాడి, మీరు ఒక యజమానుడికి సేవకులై విధేయతతో అతనికి లోబడివుందురో అలాగే నీతికి కూడా బానిసలై ఉండుడు" (రోమీ 6:15-19) అని హెచ్చరిస్తున్నారు. అందరిని సమదృష్టితో చూసి అందరు రక్షణ పొందాలన్నదే దేవుని ఆశ. ఎటువంటి వివక్ష లేకుండా సకల జాతి జనులను కాపాడాలనే తపన మన క్రీస్తుది. అందుకే పునీత పౌలు "తాను ఏర్పరచిన వారిని దేవుడు పిలిచెను. పిలుచుటయేకాదు, వారిని నీతిమంతులుగా చేసెను. నీతిమంతులుగా చేయుటయే కాదు, వారికి తన మహిమలోను పాలుపంచి ఇచ్చెను" (రోమీ 8:30) అని చెప్పారు. పునీత పౌలు నీతిమయమైన జీవంను అలవరచుకోడానికి "విశ్వాసం" అనే సుగుణం మనకు అవసరమని హెచ్చరిస్తున్నాడు. యేసు ప్రభువు మన విశ్వాసం ద్వారానే మనలను నీతిమంతులుగా చేయునని తెలియజేస్తున్నారు (రోమీ 10:10).

**మనవంతు బాధ్యత**

ఒక పడవలో ఒక మూలన ఉన్న రంధ్రము ఆ మూలకు మాత్రమే ప్రమాదకరం కాదు. ఆ పడవ అంతటికి ప్రమాదం అలానే దుర్గుణాలైన అవినీతి-అశ్రద్ధ కనపరచకూడదు. ఇలా ఆలస్యం చేస్తూపోతే అవినీతి అన్యాయం ఏదో ఒకరోజు మన గడప తొక్కడం ఖాయం. ఈ పరిణామాలన్నిటికి కర్తా మానవుడే, దుష్ట ఫలాన్ని అనుభవించేదీ మానవుడే. కావున సమాజంలో మంచి పౌరులుగా ఈ దుర్గుణాలకు వ్యతిరేకంగా మనవంతు బాధ్యతగా మనదైన శైలిలో స్పందించాలి. ఫ్రాన్సీసు జగద్గురువులు చెపుతున్నట్లుగా తప్పిదం చేసినవానిని సరిదిద్దాలనే సదుద్దేశంతోనే హెచ్చరించాలి. అంతేగాని అతని మీద పగతీర్చుకోవాలని కాదు. అబాండం వేసి వేధించకూడదు. సరిదిద్దడం అంటే సత్యాన్ని నీతిని కాపాడడం, సాటి వానిని ప్రేమతో సేవించడం. అంతేకాని పాపాత్ముని ఒక శత్రువుగా భావించి ఈసడించుకోవడం కాదు. ఆ పాపాత్ముడు మన సోదరుడు కాబట్టి సోదరుని సరిదిద్దినట్లుగా మాట్లాడాలిగాని, పరాయివానిని నిందించినట్టుగా వ్యవహరించకూడదు.

**అవినీతి - అన్యాయం**

ఈ ఆధునిక ప్రపంచంలో సమాజిక రంగాన్ని విశ్లేషించి చూస్తే అవినీతి - అన్యాయం అనేక రూపాల్లో దర్శనమిస్తుంది. ఈ అన్యాయం అవినీతి రకరకాల



సమస్యలకు ఆజ్యం పోస్తూ అనేక ఘర్షణలకు కారణభూతమవుతున్నాయి. నీతి-న్యాయానికి వ్యతిరేకమైన దుర్గుణం అవినీతి-అన్యాయం. నీటిలో ఈదడం నేర్చుకున్న మనిషి, ఆకాశంలో ఎగరడం నేర్చుకున్న మనిషి, భూమిపై ఎలా జీవించాలో తెలుసుకోలేకపోతున్నాడు అని మనం బాధపడిపోతుంటాంగానీ, ఆ బాధ కొంతలో కొంతైనా తీరడానికి ఉన్నతమైన, ఆదర్శమైన కలలు కనడానికి మనకు తీరికలేదు. తాను మారడు కాని అందరు మారాలని ఆశిస్తాడు. లౌక్యంగా అందరినీ ఉపయోగించుకొని, తను మాత్రం ఇతరులకు ఉపయోగపడకుండా తప్పించుకోవడం, మాట ఇచ్చి నిలుపుకోకపోవడం, తాను చేయవలసిన పని వదిలి దురాశతో, దురాలోచనతో వేరొకరి పనులలో జోక్యం చేసుకొని, ఆధిపత్యం కొరకు మాత్రమే అరవడం, బాధ్యతలను మరవడం, తప్పులను సమర్థించుకోవడం ఇవన్నీ నీతిమాలిన పనులు అని చెప్పవచ్చు.

తీసుకుంటున్న జీతానికిగానీ, కూలికిగాని తగినంత పని చెయ్యకపోవడం, చేసిన పనికి అదనంగా డబ్బులు వసూలు చేయడం, చేయవలసిన పని చేయవలసిన రీతిలో, చేయవలసిన సమయంలో చేయకపోవడం, శక్తియుక్తులు ఉండి కూడా సేవ, సహాయం, సహకారం, ఉపకారం సకాలంలో న్యాయం చేయకపోవడం, మోతాదుకు మించి శిక్షించడం, నేరానికి తగ్గట్టు శిక్షించకపోవడం, అనవసరంగా వాయిదాలు వేసి నేరాన్ని నిర్లక్ష్యం చేసి, ప్రక్కదారి పట్టించడం, అమాయకులను శిక్షించడమే అవినీతి-అన్యాయం. అందుకనే అవినీతి ద్వారా సఫలతను పొందిన వారినీ, ఆస్తులను సంపాదించి, ఉన్నత స్థాయికి చేరిన వారిని ప్రశంసించకూడదు. అదే పనిగా సహించడం, చూసిచూడనట్లు ఉండడం, ఉదాసీన వైఖరిని అవలంబించడం, క్షమిస్తూపోవడం కూడా అవినీతికి ఒక అవకాశం. నీతి తప్పినవారే విజయం సాధించగలిగే అవకాశాలున్న సమాజం. అనర్హులే అధికారం చెలాయించే సమాజం, నేరస్తులను నాయకులుగా చేసే సమాజమే మన సమాజం. సమాజంలో అవినీతి పెరుగుతుందంటే దానికి కారణం చెడ్డవారి హింస మాత్రమే కాదు, మంచివారు నోరు తెరచి మాట్లాడకపోవడం కూడనని తెలుసుకోవాలి.

**ప్రస్తుత సమాజంలో నీతి-న్యాయం దాని ప్రాముఖ్యత**

ఈ ఆధునిక కాలంలో శాంతి, భద్రతలతో కూడిన సంస్థలను, మనుష్యులను చూడాలంటే తప్పక నీతి-న్యాయం అనే సుగుణం చాలా అవసరం. నీతి-న్యాయంతో కూడిన విషయాన్ని మనం ఎంచుకుని చదవాలి. ఈనాటి

చదువుల్లో నీతి-న్యాయం సన్నగిల్లుతుంది. అందుకే ఎంతో ఉన్నత చదువులు చదివినా తన కన్న తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు, కుమార్తెలు మన సమాజంలో ఉన్నారు. పేరు ప్రఖ్యాతులు మన సంపాదనలో కాదు నీతి-న్యాయంలో ఉంటాయని తెలుసుకోవాలి. ఆర్థిక సంబంధాల కంటే, మానవ సంబంధాలు బలపడాలంటే నీతి-న్యాయం ఈ ఆధునిక కాలంలో చాలా అవసరం. ఇతరులను వస్తువులుగా కాక విలువగలిగిన మనుష్యులుగా చూడాలంటే నీతి-న్యాయం తప్పక అవసరం. సత్యం సమాధి చేయబడుతున్న ఈ సమాజంలో నీతి-న్యాయం పోషించే పాత్ర చాలా ప్రధానమైంది. అధికారులు చట్టాన్ని మన భారతదేశం పెద్దనోట్ల మార్పిడితో అతలాకుతలమైపోతుంది. దీనికి కారణం అక్షరాలా అవినీతి అన్యాయం. నీతి-న్యాయమనే సుగుణాలను మరచి హద్దులు మీరడం వల్లనేనోట్లు రద్దయినాయి. నల్లధనం సమస్య మన దేశంలో సమసిపోవాలంటే నోట్లరద్దు మాత్రమే సరిపోదు ముందుగా హృదయశుద్ధి, ఆ తరువాత అవినీతి రద్దు కావాలి. హృదయశుద్ధి లేకుంటే ఏ నోట్లు రద్దు చేసినా కొత్త నోట్లతోనైనా అదే అవినీతి మళ్లీ దర్శన మీయవచ్చు.

### ముగింపు

ఒక మనిషి నీతి-న్యాయం అనే సుగుణంతో జీవించడం ద్వారా మరణించినా జీవించవచ్చును. మనం అవినీతిలేని భారతాన్ని చూడాలని కలలు కనడంలో తప్పులేదు. కాని ఆ కలల్ని సాకారం చేసుకోవాలంటే అవినీతిపై పోరాడాలి. దానిని సమూలంగా నిర్మూలించడానికి ప్రతిఒక్కరు కంకణం కట్టుకోవాలి. ఎవరో వస్తారని ఏదో చేస్తారని, ఎదురుచూసి మోసపోకుండా, నిజం మరచి నిద్రపోకుండా నిత్యం నీతి-న్యాయం అనే వస్త్రాన్ని డాలుగా ధరించి దేవునిపై అగణితమైన విశ్వాసం కలిగి జీవిస్తూ, దేవుని కరుణపై ఆధారపడుదాం. ఎందుకన ఈ లోకం మానవ పాపం నుంచి అవినీతి నుండి విడుదల పొందేది ప్రభువు చూపే అపారమైన కరుణవల్లనే. ఇదే మానవ రక్షణ చరిత్ర ప్రణాళిక. "నీతికి నిలయమైన క్రొత్త దివిని, భువిని దేవుడు వాగ్దానమొనర్చారు. కనుక, మనము వానికై వేచి ఉందము" (2 పేతురు 3:13).

❀ ❀ ❀ ❀

# 6. వివేకం: సమయానుకూలంగా బుద్ధితో జీవించే క్రైస్తవ విధానం

– బ్రదర్ సింహాద్రి జాన్

### ఉపోద్ఘాతము



ఈ ప్రపంచంలో జీవితానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఎందుకంటే ఇక్కడి జీవిత విధానం బట్టి మన భావి జీవితాన్ని గూర్చి మనం క్లుప్తంగా చెప్పవచ్చు. ప్రతి మానవుడు తన జీవితంలో తాను ఎన్నుకొన్న గమ్యస్థానాన్ని చేరుకోవాలని, అహర్నిశలు కృషిచేస్తూ వుంటాడు. ఇలా చేయడం ద్వారా తానూ తన గమ్యాన్ని చేరుకుంటాడు అని కూడా చెప్పలేం. ఎందుకంటే ప్రతి గమ్యానికి కొన్ని సూచనలు వుంటాయి. ఆ సూచనలు లేదా సూత్రాలను పాటిస్తూ, రాత్రిపగలు కష్టపడితే తప్పనిసరిగా ఆ వ్యక్తి తన గమ్యస్థానాన్ని చేరుకోగలుగుతాడు.

ఇది ఇలా వుంటే, క్రైస్తవులంగా మన గమ్యం ఏమిటి? మనం ఎటువైపుకు ప్రయానం చేస్తున్నాం? మన అందరికి తెలుసు, మన గమ్యం ఇది కాదు మనం ఈ లోకంలో యాత్రికులమని. ఒక క్రైస్తవుడుగా పరలోక రాజ్యంలో చేరడం అనేది ఎంత కష్టమో మనకు తెలుసు. ఎందుకంటే మత్తయి 19:24 తెలిపిన విధంగా పరలోక రాజ్యంలో ప్రవేశించడం చాలా కష్టం. అందుకని, తల్లి శ్రీసభ మనకు కొన్ని మౌలిక సుగుణాలను పరలోకానికి ఒక మార్గంగా చూపింది. ఈ సుగుణాలను ఎప్పుడైతే మనం తు.చ. తప్పక పాటిస్తామో, అప్పుడు తప్పక మనం పరలోకంలో స్థానాన్ని సంపాదించుకుంటాం అని చెబుతుంది. మౌళిక సుగుణాలలో ప్రథమమైన, ప్రాముఖ్యమైన సుగుణం సమన్వయం అనగా 'వివేకం' అంటే

సమయానుకూలంగా బుద్ధి కలిగి జీవించడం. ఈ సుగుణాన్ని ఒక క్రైస్తవుడుగా మనం ఎలా జీవించాలి అనేది తెలుసుకోవాలి. ఈ సుగుణంను అనుసరించటం ద్వారా ఏమి జరుగుతుంది. అలా అనుసరిచటం ద్వారా వచ్చే ఫలితాలేమిటి? ఒకవేళ ఈ సుగుణాన్ని మన జీవితంలో పాటించకపోతే ఏమి జరుగుతుంది? ఈ సుగుణానికి వ్యతిరేకమైన పాపాలు ఏమిటి? అని ఈ వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకుందాం.

**1. వివేకం (సమన్వయము) అనగా ఏమిటి?**

వివేకం ఒక సుగుణం, అన్ని పరిస్థితుల్లోనూ మనం వాస్తవమైన మంచిని గ్రహించటానికి ఆచరణాత్మకమైన ఆలోచనను, దాన్ని సాధించటానికి సరైన సాధనాలను అది ఎంపిక చేసికొంటుంది. వివేకం గల మనిషి తను ఎక్కడికి వెళ్తున్నాడో గమనిస్తాడు.

ఆరిస్టాటిల్ ఈ విధంగా అంటాడు – "చర్చలో ఉన్న సరైన హేతువు వివేకం". దీనిని అనుసరిస్తూ పునీత తోమాస్ అక్వినాస్ ఇలా అంటారు – మీ ప్రార్థనలలో స్వచ్ఛమైన బుద్ధి కలిగి మెలకువతో ఉండండి. సుగుణాలు అన్నింటిలోను ప్రథమమైంది కాబట్టి దీనిని (వివేకం) సుగుణాల రథ చోదకుడు అని అంటారు. పిరికితనం లేదా భయం, వంచన లేదా కపటంతో తికమకపడ కూడదు, అని ఈ సుగుణం మనకు తెల్పుతుంది. అంతరాత్మ తీర్పును వెంటనే నడిపించేది వివేకం. ఈ తీర్పుకనుగుణంగా వివేకి తన ప్రవర్తనను నిర్ణయించి, నిర్దేశించుకుంటాడు. ఈ సుగుణం సహాయంతో నైతిక సూత్రాలను ప్రత్యేకమైన సందర్భాలకు పొరపాటు లేకుండా అనుసంధింపవచ్చు. ఈ సుగుణం ద్వారా మంచిని చేయటంతో, చెడును వీడటంలో సందేహాలను నివారింపవచ్చు.

వివేకం నైతికంగా ఏదో ఒక దాన్ని ఎంపిక చేసుకోవాల్సి వచ్చినప్పుడు, వివేచనా సుగుణం తోడ్పాటుతో, ప్రజ్ఞావంతులు సలహాలతో, పవిత్రాత్మ వరాల సహాయంతో అనుభవాలను, కాలచిహ్నాలను విశ్లేషించడానికి ప్రయత్నిస్తాడు. మనిషి ఔన్నత్యానికి ఉన్నతమైన నైతిక అంతరాత్మ అవసరమని తెలుస్తుంది. నైతిక సూత్రాల గ్రాహ్యతను, ఆయా పరిస్థితుల్లో, వస్తువులు కారణాలకు సూక్ష్మదృష్టితో ఆ సూత్రాలను అనువర్తింపజేయటాన్ని, చివరగా, ఇంత వరకు చేసినా ఇంకా చేయాల్సిన నిర్దిష్ట



తీర్మాణాలను అంతరాత్మ పరిగణలోనికి తీసుకుంటుంది. హేతువాద చట్టంలో ఉటంకించిన నైతిక మంచిని గూర్చిన సత్యాన్ని అంతరాత్మ వివేచనాపూరిత నిర్ణయాన్ని ఆచరణాత్మకంగానూ, నిర్దిష్టంగానూ గుర్తిస్తుంది. ఈ తీర్పునకు అనుగుణంగా ఎంపిక చేసికునే మనిషిని వివేకవంతుడు అని అంటాం.

మంచితనం మన వ్యక్తిత్వం అయితే దాన్ని మనం సుగుణం అని అంటాం. వివేకం అనే సుగుణం ఎల్లప్పుడు మంచి త్రోవలోను లేదా సన్మార్గంలోను నడుచుటకు మనకు ఉపయోగపడుతుంది. దేవదూతలు ఏవిధంగా మనలను సకల ఆపదల నుండి, సంరక్షిస్తూ వుంటాయో, ఇదే విధంగా చెడ్డ త్రోవ నుండి మనల్ని మంచి త్రోవకు నడిపించేది ఈ వివేకమే. మంచి త్రోవకు నడిపించటమే కాదు మంచి పనులను కూడా చేయటానికి ఉపయోగపడుతుంది. సుగుణాలు అన్నింటిలోను వివేకం అనే సుగుణం ఎందుకు ప్రధానమైనదిగా పేర్కొంటాం అంటే ఒక వ్యక్తి మంచివాడో, చెడ్డవాడో అని తేల్చి చెప్పేది ఈ వివేకమే. అందుకని, దీనిని ప్రథమ మౌళిక సుగుణంగా పేర్కొంటారు. బైబిల్ గ్రంథంలో ఈ సుగుణం పలుమార్లు మనం చూడవచ్చు. యేసుక్రీస్తు నుంచి మరియమ్మ వరకును ఈ విధంగా ఈ సుగుణాన్ని వారి జీవితాల్లో వారు 'జీవన విధానాల్లో' ఎలా ఉపయోగపడిందో చూడవచ్చు.

**2. మనల్ని విశ్వాసపు మార్గంలో నడిపేదే వివేకం**

వివేకం అనే ఈ సుగుణం మనల్ని విశ్వాసపు మార్గంలో నడిపించటమే కాదు, ఇది మనల్ని ఒక ఉన్నతమైన శిఖరానికి కూడా చేరుస్తుంది. ఎందుకంటే మనం యేసుక్రీస్తు జీవితాన్ని ఒకసారి పరిశీలించినట్లయితే ఈ వివేకం ఆయన జీవితాన్నే ఉన్నతంగా నిలిపింది. ఇది ఏవిధంగా అంటే 'సమన్వయం' ద్వారా సమయానుకూలంగా బుద్ధితో మెలగటం ద్వారా, అంటే యేసుక్రీస్తు, దేవునితో తన సమానత్వాన్ని తలచి వ్రేలాడలేదు, ఎల్లప్పుడు తన తండ్రికి విధేయత, విశ్వాసంను చూపుతూ, తన పథంలోనే నడవగలిగాడు. తండ్రి చిత్తాన్ని 'వివేకం' పరిపూర్తి చేసి యున్నాడు. అందుకనే, తండ్రిదేవుడు యేసుక్రీస్తుకు అత్యున్నతమైన స్థానాన్ని ప్రసాదించాడు.

అందుకనే మత్తయి 26:39వ వచనంలో, గెత్సమనేలో ఆయన ఎంతో ఆవేదన చెందాడు. తాను చనిపోతాను అని తెలిసి కూడా తన విశ్వాసాన్ని

విడిచిపెట్టకుండా ముందుకు కొనసాగించాడు. ఇక్కడ తాను ఆలోచించి వుండవచ్చును, ఎందుకు నాకు ఈ శిక్ష అని. ఈ శిక్ష నుండి బయటికి కూడా వెళ్లిపోవచ్చు. కాని, అలా చేయలేదు, ఎందుకంటే తన 'వివేకం' తనను విశ్వాసంతో నడిపించింది. అందుకనే తాను మరణాన్నే జయించగలిగాడు. అదే కొద్ది సమయంలో ఆయన తన వివేకాన్ని ఇక్కడ ఉపయోగింపకుంటే ఈ రోజు మనకు రక్షణ లభించేది కాదు, పైగా క్రైస్తవత్వమే వుండేదికాదు. తన వివేకాన్ని చూపించటం ద్వారా యేసుక్రీస్తు ఈనాడు లోకరక్షకుడు అయ్యాడు, తన తండ్రి తనకు ఒక అత్యున్నతమైన స్థానాన్ని కూడా ఇచ్చాడు.

యేసుక్రీస్తు తల్లి 'మరియమ్మ' జీవితాన్ని మనం పరిశీలించినట్లయితే, ఆమె జీవితంలో కూడా ఈ 'వివేకం' అత్యున్నతమైనటువంటి శిఖరానికి ఆమెను చేరవేసింది. ఇది ఏ విధంగా అంటే, లూకా 1:31లో గాబ్రియేలు దేవదూత తనయొద్దకు వచ్చి నీవు పవిత్రాత్మ శక్తి వలన గర్భం ధరించి ఒక కుమారుని కనెదవు, ఆయన లోకానికి రక్షకుడు అవుతాడు అని చెప్పడం మనం చూస్తాం. ఈ సన్నివేశాన్ని ఊహించుకోవడానికి చాలా భయం వేస్తుంది. కాని పురుషుడు లేకుండా ఒక కన్య గర్భం ధరించడం అంటే అంత సులభతరం కాదు, ఎందుకంటే సమాజం అటువంటి వారిపై లేనిపోని నిందలువేసి, సమాజం నుండి దూరంగా పెట్టేవారు. కాని ఇటువంటి సమయంలో మనం అయితే ఏం చేసేవాళ్ళమో ఒక్కసారి ఆలోచించండి. దేవదూత చెప్పినమాటలకు తల్లి మరియమ్మ కలతచెంది, దీని నుండి దూరంగా వెళ్లిపోలేదు. ఆమె తన 'వివేకాన్ని' చాలా బాగా ఉపయోగించింది. దేవదూత చెప్పిన మాటలకు ఆమె విశ్వాసం ముందుకు వెళ్లింది. దేవుని మాట నెరవేరాలి అనే ఆలోచనతో, తన వినమ్రతను వివేకాన్ని చూపిస్తూ 'దేవుని చిత్తం జరుగునుగాక' అని అన్నది (మత్తయి 1:38).

మరియతల్లి ఎటువంటి సమస్యకు భయపడకుండ చివరిదాకా, తన జీవితాన్ని యేసుక్రీస్తుకు అంకితం చేసుకుంటూ నడవసాగింది. ఎన్నటికిని దేవుడు ఆమెను విడనాడలేదు. చివరకు తనను ఆత్మశరీరాలతో మోక్షంనకు ఎత్తబడటాన్ని మనం చూస్తాం, చిట్టచివరకు దేవునికే తల్లి అయిన భాగ్యాన్ని దక్కించుకుంది ఈ తల్లి – ఇది అంతాకూడా కేవలం 'వివేకం' అనే సుగుణం ద్వారా, ఈమెకు ఈ



ఘనత దక్కింది. ఈనాడు మన జీవితంలో, ఈ సుగుణంను ఎంతవరకు ఉపయోగించి, జీవిస్తున్నామో, ఆత్మపరిశీలన చేసుకోవాలి. యేసుక్రీస్తును, తన తల్లి జీవితాలలో ఎంత ప్రాముఖ్యతను ఈ సుగుణం చూపించిందో మనం చూసాం. ప్రాముఖ్యతనే కాదు, ఎటువంటి విశ్వాసపు మార్గంలో నడిపించి ఉన్నతమైన శిఖరానికి చేర్చిందో మనం చూసాం. వీరు యిరువురితో బాటు ఈ సుగుణం (వివేకం) శ్రీసభలో, చాలామంది పునీతుల జీవితాలలో ఎంతగానో ఉపయోగ పడుతూ వీరందరిని దేవుని వైపునకు విశ్వాసపు మార్గంలో నడిపిస్తూ, ఒక అత్యున్నతపు స్థానానికి చేర్చింది.

కాబట్టి మనం కూడా ఈ సుగుణాన్ని మన జీవితంలో కూడా పెంపొందించుకుంటూ, విశ్వాసపు మార్గంలో నడవాలంటూ, అత్యున్నత మైనటువంటి స్థానానికి చేరుకుందాం. ఏ విధంగా అయితే క్రీస్తునాధుని, మరియ తల్లిని, శ్రీసభ పునీతుల జీవితాలల్లో ఈ సుగుణం ఉపయోగపడిందో, మన జీవితాలల్లో కూడా ఈ సుగుణాన్ని ముప్పదంతలుగా, అరువదంతలుగాను, నూరంతలుగాను ఫలింపజేయాలని ప్రార్థించుకుందాం.

**3. వివేకం మనల్ని చెడుమార్గం నుండి మంచి మార్గంలోకి నడిపించే ఓ మంచి సుగుణం**

భగవంతుని కారకంగాని, ప్రజా సేవ కొరకు గాని లేదా ఒక మహోన్నతమైన ఆశయం కొరకుగాని ఒక వ్యక్తి తనను తాను సమర్పించుకొని జీవితాంతం అదే ఆశయంతో జీవించడం అంకిత భావమని అంటారు. ఇటువంటి అంకిత భావం ఎక్కడ నుండి వస్తుంది? ఈ అంకితభావానికి పునాది 'వివేకం' నుంటి పుట్టింది. ఎప్పుడైతే, ఒక మనిషి వివేకాన్ని తన జీవితంలో అలవర్చుకొని జీవిస్తూ ఉంటాడో తప్పక అంకితభావం అనేది తనలో మొదలు అవుతూఉంటుందని మనకు తెలుసు. ఇలా ఉండటం ద్వారా ఉదాత్తమైన ఆశయ సిద్ధి కొరకు అంకితమైన వ్యక్తులు తాము నమ్మిన ఆశయం కొరకు జీవించడమే గాక, అవసరమైతే ప్రాణత్యాగం చేసేందుకు కూడ వెనుకాడరు.

మనం లూకా సువార్త 19:8వ వచనంను, గమనించినట్లయితే, మనకు అర్థం అవుతుంది, వివేకం అనే సుగుణం 'జక్కయ్య' జీవితంలో ఏవిధంగా ఉపయోగపడిందోనని – ఎందుకంటే జక్కయ్య ఒక సుంకరి అధికంగా పన్నులను

వసూలు చేసికొనేవాడు. అన్యాయంగా డబ్బులను పేదవారి నుండి తీసికొనేవాడు, దేవునికి దూరంగా ఉండి చెడు జీవితం జీవించేవాడు. మనకు బాగా తెలిసిన సామెతను ఇక్కడ గుర్తుంచుకోవాలి, 'జీవితంలో తదాస్తు దేవుళ్లు ఒక్కసారి మాత్రం మన తలుపులనూ తడతారు' అపుడే మనం మన వివేకాన్ని ఉపయోగించుకోవాలి. ఇలా చేసినప్పుడే మన జీవితాలలో అద్భుతాలు జరుగుతాయి. ఇలాంటి సమయంలో వివేకాన్ని ఉపయోగించకపోతే మన జీవితాల్లో ఎటువంటి అద్భుతాలు జరగవు. ఎందుకంటే జక్కయ్య జీవితంలో ప్రభువు తలుపు తట్టియున్నాడు. జక్కయ్య ఇదే మంచి అదునుగా భావించుకొని, తన వివేకాన్ని ప్రదర్శించి తన పాపాల్ని ప్రభువు ముందట తుడిచివేసికున్నాడు. మరి ఈ వివేకం అనే సుగుణం హఠాత్తుగా మనలో రావడం అనేది అసంభవం. ఎందుకంటే ఈ సుగుణాన్ని మన జీవితంలో ఎంత అధికంగా పాటిస్తే, అంత అధికంగా మనలో అద్భుతాలు జరుగుతాయి. ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఏమిటి అంటే జక్కయ్యను వివేకం అనే సుగుణం చెడుమార్గం నుండి మంచి మార్గంలోనికి నడిపించింది.

మనం లూకా 15:11-32ను గమనిస్తే, తప్పిపోయిన కుమారుడు ఎప్పుడైతే వివేకం అనే సుగుణాన్ని తన జీవితంలో అవలంబించుకున్నాడో అప్పుడు తన జీవితం కూడా ఫలించింది. తన వివేకాన్ని కోల్పోయి తండ్రి నుండి దూరంగా ఎలా జీవించాడో మనకు తెలుసు. పందులు తినే ఆహారం కూడా దొరకలేదు, అప్పుడు తనకు కనువిప్పు కలిగింది. తన వివేకాన్ని గుర్తించుకొని, తండ్రి యొద్దకు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. తన మొదటి జీవితంలోకి ప్రవేశిస్తున్నాడు. ఈ విధంగా జక్కయ్యను, తప్పిపోయిన కుమారుని, వివేకం అనే మౌళిక సుగుణం చెడుమార్గంలో నడచిన వారందరిని మంచి మార్గంలో నడిపించింది, దేవుని వైపుకు మరలించింది. మన జీవితాలను కూడా పరిశీలించుకున్నట్లయితే, మనం కూడా తెలిసి, తెలియక చెడు మార్గంలో నడుస్తూ ఉంటాం. కాని మనల్ని సృష్టించిన దేవుడు మన కొరకై ఎదురుచూస్తూ ఉంటాడు, ఎప్పుడు నా బిడ్డ నా దగ్గరకు వస్తాడు అని. మనం ఆయనను చేరాలంటే ఈ సుగుణాన్ని మన జీవితంలోకి ఆహ్వానించుకుంటూ, ఎల్లప్పుడు తు.చ. తప్పక ఈ సుగుణ మార్గంలో నడుస్తూ వున్నప్పుడు మాత్రమే మనం ఆయనను చేరగలుగుతాము. చెడు మార్గంలో ఎవరైతే



నడుస్తున్నారో వారిని మంచి మార్గంలో నడిపించడమే ఈ సుగుణం యొక్క ముఖ్య ఉద్దేశం.

'పాత నిబంధనను' మనం పరిశీలిస్తే, ఎంతో మంది గొప్ప వ్యక్తులును, మంచి నుండి చెడు మార్గంలోకి ప్రవేశించిన వ్యక్తులనూ, ఈ సుగుణం చెడు నుండి వారిని మంచికి నడిపించడం చూడవచ్చు. ఈ విధంగా పోతే మొదట 'అబ్రహాము' దేవునియందు జీవించటం ద్వారా ఈ సుగుణం ఆయనను విశ్వాసులకు తండ్రిగా చేసింది. రెండవ వ్యక్తి 'దావీదు మహారాజు'. యావే ప్రభు దావీదు మహారాజును ఎన్నుకున్నాడు. కాని ఈయన దేవునియందు నిలువలేకపోయాడు. ఎందుకంటే వాంఛలు వలన దేవుని నుండి దూరంగా వెళ్లిపోయాడు. కాని దావీదు పాపంలో వుండకుండ తన వివేకం ద్వారా పశ్చాత్తాపం చెంది, మరల దేవుని చేరటం చూస్తాం. మూడవ వ్యక్తి 'సంసోను'. అతనికి దేవుడు అంత బలాన్ని యిచ్చాడు కాని తన బలాన్ని చిరకాలం నిలుపుకోలేకపోయాడు. ఎందుకంటే ఈ లోకపు ఆకర్షణల వలన, తరువాత ఏమయ్యిందో మనకు తెలుసు. దేవుని శరణుకోరి తన వివేకం ద్వారా మరల దానిని పొందుతాడు.

ఇక్కడ మనం తెలుసుకోవలసిన విషయం, వివేకం ప్రతి మానవుని కూడా చెడునుంచి మంచివైపుకు నడిపిస్తుందని, దేవునికి ప్రియమైన బిడ్డలుగా తీర్చిదిద్దుతుందని మనకు తెలియపరుస్తుంది. ఎప్పుడు ఇదంతా నెరవేరుతుంది, అంటే ఈ సుగుణాన్ని ఎప్పుడైతే మనలోకి స్వీకరించి, దానిని ప్రతినిత్యం అనుసరిస్తామో, అప్పుడే ఇది మనల్ని మంచిమార్గంలోకి నడిపిస్తుంది. ఇలా చేయడం ద్వారా మనం దేవునికి ప్రియమైన బిడ్డలుగా వుంటాం అని తెలియజేస్తుంది, ఇలా ఎలా సాధ్యం అంటే మనం పైన పేర్కొన్నటువంటి వ్యక్తులు వలననే మనం కూడా మారి దేవునియందు జీవించగలం అని మనకు తెలియజేస్తుంది.

## 4. వివేకం అనే సుగుణానికి వ్యతిరేకం అయిన పాపములు

ప్రతి మానవుడు దేవునియందు, దేవునితో కలిసి, ఆయన మార్గంలో నడవాలనుకుంటూ వుంటాడు. మరి తన గమ్యాన్ని చేరగలుగుతున్నాడా? అనేది మనం గమనించవలసిన విషయం. మరీముఖ్యంగా ఒక క్రీస్తు అనుచరుడుగా, ఒక దేవుని బిడ్డగా ఎంతవరకు ఆయనతో కలిసి జీవించగలుగుతున్నాం అని

మనసులో ప్రశ్నించుకోవాలి. ఈ సృష్టిలో వికసించే ప్రతి పుష్పం కూడా దేవుని చేరాలని ఎంతో నిరీక్షణతో ఎదురుచూస్తూ ఉంటుంది. ఈ సృష్టిలో ప్రతి జీవరాశి కూడా దేవుని పాదాలు చెంతకు చేరాలని ఎంతో నిరీక్షణతో ఎదురుచూస్తూ వుంటాయి. వీటినన్నిటిని దేవుడు కలుగునుగాక అనే ఒక మాట ద్వారానే కలుగజేసారని మనం ఆదికాండంలో చూసియున్నాం. కాని మానవుని అలా చేయక, తన స్వహస్తాలతో తయారుచేసి తన శ్వాసను ఊది సృష్టించాడు. ఇంత చేసిన ఆ దేవున్ని చేరటానికి మానవుడు ఎందుకు చాలా ప్రయత్నం చేస్తున్నాడు. ఇంత ప్రయత్నం చేసినప్పటికిని ఎందుకు ఆయనను చేరలేకపోతున్నాడు? అనే అంశాన్ని మన మదిలో ప్రశ్నించుకోవాలి. ఎందుకంటే, ఈ లోకపు వస్తువులకు బానిసలు అయిపోతూ, తాను ఈ పాపమసిలో మునిగిపోతూ, ఏది పాపం, ఏది పాపంకాదు అనే తెలిసికోలేని ఊబిలో వున్నాడు. ఎప్పుడైతే, ఇది పాపము అని తెలుసుకుంటాడో అప్పుడే దేవుని చేరగలడు అని పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తుంది. ఇది పాపమా? కాదా? అని తెలిసికోవాలంటే, వివేకాన్ని మన జీవితంలో నిరంతరం పెంపొందించుకోవాలి. ఎందుకంటే ఇది పాపం, ఇది పాపము కాదు అని మనకు క్లుప్తంగా చెప్తుంది ఈ సుగుణం.

### i) తెలివితక్కువతనం

వివేకానికి మొదటి వ్యతిరేకం అయిన పాపం అవివేకం. అవివేకం మానవునిలోని ఒక నిర్దిష్టమైన నిలకడలేనప్పుడు, తెలివిమాలినతనం చోటు చేసికుంటుంది. ఎప్పుడైతే వివేకాన్ని విడనాడి ప్రయాణిస్తాడో, అపుడు తనకు మంచిఏదో చెడు ఏదో అన్న విషయాన్ని గ్రహింపలేడు. ఈ స్థితిలోనే ఎక్కువ పాపస్థితికి దిగజారిపోతూ, ఇందులోనే జీవించడానికి ఎక్కువ శ్రద్ధను చూపిస్తాడు. ఈ స్థితిలో మానవునికి ఏది చేయాలో, ఏది చేయకూడదో తెలియదు. ఇలా తన జీవితాన్ని కొనసాగించడం ద్వారా పాపానికి ఎక్కువగా బానిస అవుతూ అనగా సైతానుకు బిడ్డగా మారి దేవునికి దూరం అవటం జరుగుతుంది.

### ii) శారీరక వాంఛలు

వివేకం అనే ఈ సుగుణానికి మొట్టమొదటి పాపం తెలివి తక్కువతనం అయితే, రెండవ వ్యతిరేక పాపం శారీరక వాంఛలు. ఎందుకంటే, ఈ శారీరక



వాంఛలు ప్రతి మానవున్ని మరణానికి దారితీస్తాయి, ఆత్మీక వాంఛలు మనలను జీవం వైపునకును శాంతివైపునకు దారితీస్తాయి అని పరిశుద్ధ గ్రంథం మనకు క్లుప్తంగా వివరిస్తుంది. ఎప్పుడైతే మానవుడు ఈ శారీరక వాంఛలకు మొగ్గుచూపుతూ, వాటి ప్రకారం నడుస్తుంటాడో, అటువంటివాడు దేవుని ప్రేమను విడనాడి సాతానుకు బానిసయి సాతాను రాజ్యంలో స్థానాన్ని సంపాదించుకుంటాడు. ఒక క్రైస్తవుడుగా మనం ఎప్పుడైతే శారీరక వాంఛలకు ఈ లోకపు వస్తువులకు బానిసవక వాటికి దూరంగా వుంటూ, దేవుని ప్రేమలోనూ, మార్గంలోనూ జీవించగలుగుతామో అప్పుడే మనం 'పరలోక పౌరులం' అని గర్వంగా చెప్పుకోగలం. వివేకం అనే సుగుణాన్ని ఎప్పుడైతే మన జీవితంలో పాటిస్తూ జీవిస్తామో అప్పుడే మనల్ని, పరలోక పౌరులుగా మారుస్తుంది. ఎందుకంటే, ఈ సుగుణంలో చాలా మంచి విషయాలు వున్నాయి. అవి ఏమిటి అంటే –

- ✠ వివేకం అనేది మనల్ని ముందుచూపుదారులుగా ముందుకు నడిపిస్తూ వుంటుంది. అంటే, దీర్ఘదర్శుల్లా భావి జీవితాన్ని దర్శించగలుగుతారు.
- ✠ వివేకం మనల్ని, మన 'దైనందిన జీవితంలో' ఎలా జీవించాలి అని చెబుతుంది. ఈ జీవితాన్ని ఒక మంచి ప్రణాళికతో జీవించాలని బోధిస్తుంది.
- ✠ వివేకం, మనల్ని సమాజంలోను, దేవునియందు ఒక మంచి వ్యక్తులుగా జీవించాలంటే, 'మంచి ఆలోచన జ్ఞానం' కలిగి జీవించామని చెబుతుంది.జీవితంలో మనకు చాలా కార్యాలు ఎదురు అవుతూ ఉంటాయి. అలాంటప్పుడు ఏ కార్యాన్ని ఏ విధంగా చేయాలి, వేటిని విడిచిపెట్టాలి, వేటిని అనుసరించాలి, ఎలా చేయాలి అని చెప్పే ఒక గొప్ప సుగుణం.
- ✠ Prudence pointout which course of action to be taken in concreate circumstance (Time, Place and manner).

### 5. పవిత్ర గ్రంథం వివేకం గూర్చి ఏవిధంగా చెబుతుంది

వివేకం దేవుని వరం అని మనం మొదటిగా తెలిసికోవాలి. ఎందుకంటే సామెతలు 2:6, "జ్ఞానమును నొసగువాడు ప్రభువే మరియు వివేకమును బుద్ధిని ప్రసాదించువాడు అతడే" అని చెబుతుంది. అదే విధంగా, సొలొమోను జ్ఞానగ్రంథము 8:7లో కూడా వివేకం ప్రతి మానవునికి దేవుని వరమే కాదు, ఇది

ప్రతి మానవునికి కూడా ఒక 'సలహాదారునిగా' ఉపయోగపడుతుంది అని సామెతలు 8:14, 8:11, 10:23 తెలియజేస్తుంది. మనకు తెలిసిన విధంగా గుర్రాన్ని యజమానుడు నీటివరకు తీసికొని పోగలడు కాని దానిచేత త్రాగించలేడు. ఎందుకంటే దేవుడు మనకు వివేకాన్ని ప్రసాదించి ఉన్నాడు. కాబట్టి ఒక దేవుని బిడ్డగా మన జీవితంలో వివేకం అనే ఈ సుగుణాన్ని సాధన చేస్తూ వుండాలేగాని మన జీవితాలలో అద్భుతాలను చూడవచ్చు. ఎప్పుడైతే సాధన చేయక వుంటామో అప్పుడు మనం దీనిని కోల్పోతాము అని సామెతలు 1:3, 4:1 ద్వారా తెలిసికోవచ్చు. ఒక సాధారణ మానవునిగా దీనిని పొందటానికి సాధన చేస్తూ ఉండాలి.

వివేకం మనం చేసే ప్రార్థనయందు, పనియందు సహాయపడుతుంది అని సామెతల గ్రంథం 2:11, 7:4, 8:14 ద్వారా తెలుస్తుంది. వివేకమే మనల్ని సంరక్షిస్తుంది, కాపాడుతుంది. ఏ విధమైనటువంటి రక్షణను మనకు ప్రసాదిస్తుంది అంటే, మనల్ని పాపం నుండి దూరంగా పెడుతుంది, ఒకవేళ మనం పాపంలో పడిపోయినట్లయితే, మనం ఎలా బయటికి రావాలో మనకు నేర్పించిన 'ఒక మంచి సుగుణం వివేకం'. ఏ వ్యక్తి అయితే వివేకాన్ని తన జీవితంలోను సాధన చేస్తూ జీవిస్తూ ఉంటాడో, ఆ వ్యక్తికి వివేకం అన్ని విషయాలను నేర్పిస్తుంది. అటువంటి వ్యక్తికి తెలుసు, ఎక్కడ మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి, ఎక్కడ నిశ్శబ్దంగా వుండాలి అని, సామెతలు 10:19, 11:12, 17:27 ఇటువంటి వ్యక్తితో ఎలా జీవించాలి అన్నది సీరాపుత్రుడైన యేసు జ్ఞానగ్రంథం 20:26లో చెప్పియున్నారు. వివేకంతో జీవిస్తున్న వ్యక్తి ఎల్లప్పుడునూ ధర్మంను ఆచరిస్తాడు కాని అవివేకి ఎల్లప్పుడునూ మూర్ఖత్వంను మాత్రమే అనుసరిస్తూ జీవిస్తాడు అని సామెతలు 15:21లో తెలియజేసారు. ఈ వివేకం ప్రతి మానవుని మంచి మార్గంలోనే నడువమనే చెబుతుందిగాని, చెడు మార్గంలో నడవమని చెప్పదు అని సామెతలు 28:11 & 27:19లో ఉంది.

నూతన నిబంధనలో చూస్తే, వివేకం అన్నది ఎల్లప్పుడు కూడా మనల్ని పావురం వలె తీర్చిదిద్దుతుంది కాని, జిత్తులమారి నక్కవలె మనల్ని మార్చదు అని మత్తయి 10:16 ద్వారా తెలియబరుస్తుంది. కాబట్టి, క్రీస్తు అనుచరులుగా మనల్ని పావురం వలే మంచి మనస్సును కలిగి జీవించాలని చెబుతుంది. వివేకానికి



వ్యతిరేకం అయిన పాపం శరీరక వాంఛలు. కాబట్టి వీటి నుండి దూరంగా ఉండమని మనకు రోమా 8:6 ద్వారా క్లుప్తంగా తెలియబరుస్తున్నారు పునీత పౌలు. కర్తవ్యం నందు నిమగ్నమైన సేవకుడు ధన్యుడు అని మత్తయి 24:45 ద్వారా తెలియపరుస్తున్నారు. పునీత పౌలు 1 కొరింథీ 1:19 ద్వారా ఎవరైతే ఈ లోకపు వివేకాన్ని కలిగి ఇందులోనే జీవిస్తూ వుంటారో, అటువంటి వివేకాన్ని జ్ఞానాన్ని దేవుడు ధ్వంసం చేస్తారని మనకు చెపుతుంది. కాబట్టి దేవుని బిడ్డగా మన వివేకాన్ని, జ్ఞానాన్ని ఆయన మహిమ కొరకే ఉపయోగపడేలా వాటిని తీర్చిదిద్దుకోవాలి అని పౌలు చెబుతున్నారు.

**6. ప్రస్తుత సమాజంలో వివేకం.. ఏ విధమైనటువంటి వివేకం కలిగి జీవించాలి**

వివేకం దేవుడు మనకు ఇచ్చిన ఒక గొప్పవరం. ఈ వరాన్ని మనం మన జీవితంలో ఎంతవరకు పాటిస్తున్నాం. ఎంతవరకు ఆయన మహిమ కొరకు ఉపయోగిస్తున్నాం అని ఆలోచిస్తే, చాలా తక్కువ అని చెప్పవచ్చు. ఎందుకంటే 'ఆదికాండంలో' దేవుడు అంతటిని సృష్టించిన తరువాత ఆదాము, అవ్వను తయారు చేసారు. వారికి స్వతంత్ర్యాన్ని యిచ్చారు. ఈ స్వతంత్ర్యాన్ని వారు దేవుని మహిమ కొరకు ఉపయోగించక, సాతాను కొరకు ఉపయోగించారు. అందుకే వారికి పాపం చుట్టుకుంది. తరువాత వారు దేవుని నుండి ఈ స్వతంత్ర్యాన్ని కోల్పోయారు. అయితే ప్రస్తుతం సమాజంలో మనం కూడా దేవుడు యిచ్చిన వివేకాన్ని ఆయన కొరకు ఉపయోగించక ఈ లోకపు ఆశలకు బానిసలు అయిపోతూ, సాతానుకి దాని పనుల నిమిత్తమై ఉపయోగించుకుంటున్నారు. అందుకనే చాలామంది అవివేక జీవితాన్నే జీవిస్తున్నారు. ఒక క్రైస్తవ బిడ్డగా తెలిసికొని దానిలో నుంచి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తూ ఉండాలి. అప్పుడే మనకు క్రీస్తునిలో ఒక నూతన జీవితాన్ని పొందగలం. లేదంటే మనం కూడా దేవుని సన్నిధి నుండి గెంటివేయబడతాం.

'నారుపెట్టినవాడు – నీరుపోయక మానుతాడా' అనే సామెత మనకందరికి గుర్తుకు రావాలి. ఎందుకంటే, వివేకం అనే సుగుణాన్ని మనకు వరంగా ప్రసాదించారు. కాని మనం ఇందులో జీవించలేకపోతున్నాం. అవివేకిగా జీవిస్తున్నాం. కాబట్టి, ఈ అవివేకాన్ని విడనాడి ఒక మంచి వివేకిగా తయారు చేసుకోడానికి మనకు తన పరిశుద్ధ గ్రంథం ద్వారా నిరంతరం దివ్యబలిపూజలో

మనతో మాట్లాడుతున్నారు. వాక్యాల్ని మన మనసుల్లో పదిలం చేసికొని జీవిస్తే తప్పక వివేకవంతులుగా జీవించి ఆయన్ని చేరుకోగలుగుతాం. ఎంతోమంది పునీతులను మనం శ్రీసభ చరిత్రలోను చూడవచ్చు. వారు కూడా ఈ విధంగా జీవించి వచ్చినవారే.

మనం, మన క్రీస్తునే ఉదాహరణగా తీసుకొని జీవిస్తే, తప్పనిసరిగా మనం దేవుని బిడ్డలమని పలువబడుతాం. ఎందుకంటే, క్రీస్తు తన తండ్రిని హత్తుకొని జీవించి తన 'వివేకం' అనే సుగుణాన్ని తన జీవితంలో మాతృక చూపించారు. అందుకని ఆయనకు అత్యున్నతమైన స్థానాన్ని తండ్రిదేవుడు యిచ్చారు. కాబట్టి, ప్రస్తుత సమాజంలో మనందరం ఒక మంచి పౌరులుగా, క్రీస్తు అనుచరులంగా జీవించాలంటే, ఈ సుగుణాన్ని మన జీవితంలో తు.చ. తప్పకుండా పాటిస్తూ, దేవుని మహిమ కొరకు ఈ వివేకాన్ని ఉపయోగిస్తూ జీవిస్తే తప్ప మనం దేవునికి సాక్షులుగా నిలువబడలేము. ప్రస్తుత సమాజంలోను, ఇలా ఎప్పుడైతే జీవిస్తూ ఉంటామో తప్పక దేవుడు, మనల్ని తన పరలోక రాజ్యంలో పౌరునిగా గుర్తిస్తారు. కాబట్టి వివేకాన్ని ఈ లోకపు ఆశలకు ఉపయోగించకుండా, ఆయన మహిమ కొరకు ఉపయోగించుకునే విధంగా మనల్ని మనం తయారు చేసికోవాలి.

**ముగింపు**

ప్రతి మానవుని జీవితానికి వివేకం అనే ఈ సుగుణం చాలా ముఖ్యమైనది. ఈ సుగుణాన్ని ఎప్పుడైతే తన జీవితంలో సాధన చేస్తాడో, ఆ వ్యక్తి ఇతరులకు, తమ కుటుంబాలకు, దేవునికి సాక్షులుగా తయారవుతూ వుంటాడు. దీనిని ఇలానే వుండనివ్వక, ప్రతిదినం మన జీవితాలలో ఒక భాగంగా చేసికొని సాధన చేస్తూ వుండాలి. ఎప్పుడైతే మానవుడు ఈ సుగుణాన్ని తన జీవితంలో తు.చ. తప్పక సాధన చేస్తూ వుంటాడో, దేవునికి సన్నిహితునిగాను, దేవుని బిడ్డగాను పిలువబడుతాడు. అదేవిధంగా "ఎవరి చెప్పులు వారిని రక్షిస్తాయి – ఎవరి తప్పులు వారిని శిక్షిస్తాయి" అనే ఈ సామెత ద్వారా మనం అర్థం చేసికోవలసిన అంశం ఎవరైతే వివేకం కలిగి జీవిస్తారో వారు రక్షింపబడుతారు, ఎవరైతే అవివేకాన్ని తన జీవితంలో పాటిస్తారో వారు శిక్షింపబడుతారు. అంతిమ తీర్పు నందు వారు



పరలోకరాజ్యంలో ప్రవేశింపక, సాతాను రాజ్యంలోకి వెళతారు. మనం దేవుని బిడ్డలం కాబట్టి వివేకాన్ని కలిగి జీవిస్తూ వుండాలి.

"ప్రపంచాన్ని పాలించేది వివేకమే" – నెపోలియన్ అన్నాడు. వివేకాన్ని కలిగివుంటే మనకు మన గమ్యస్థానం ఏమిటి? ఎక్కడకు వెళ్తున్నాం? ఏమి చేయబోతున్నాం అనేది అర్థం అవుతుంది? ఏ మార్గంలో నడుస్తే మనం అభివృద్ధి అవుతాం? అనే అంశాలను మనకు ఈ సుగుణం ద్వారా తేటతెల్లంగా కనిపిస్తాయి. వివేకం అనేది దేవుని అనుగ్రహం కాబట్టి, దీనిని గౌరవిస్తూ, దేవుని పట్ల భక్తికలిగి జీవిస్తూ ఉంటే పరలోక పౌరులంగా గుర్తింపబడతాం. పునీత మధర్ థెరిసా తన జీవితంలో ఈ సుగుణాన్ని నిరంతరం సాధన చేస్తూ జీవించి దేవుని రాజ్యంలో స్థానాన్ని సంపాదించుకుంది. మనం కూడా మన జీవితాలలో సాధన చేస్తూ దేవుని చెంతకు చేరటానికి ప్రయత్నం చేద్దాం.

❊ ❊ ❊ ❊

# 7. నిగ్రహం - భావోద్వేగాలను అదుపులో ఉంచే దండం

- ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి

**ఉపోద్ఘాతము**



మనిషి మానవత్వంతో జీవించాలంటే నిగ్రహం అవసరం. ఎవరైతే అదుపు, హద్దు, నియంత్రణ లేకుండా వాంఛలకు అనుగునంగా, కోరికల ప్రకారం జీవిస్తుంటే వారిని చూసి, ఇలా మండిపడతాం: "ఏమిరా, ఊరిమీద ఆంబోతు పడ్డట్టు పడుతున్నావు" అని; "ఒరేయ్, ఎందుకురా జంతువులా ప్రవర్తిస్తున్నావు" అని; "మనిషిలా ఉండు" అని అంటాం. వేరేవారిని పట్టించుకోక, గబగబా ఎక్కువగా తినేవాడిని చూసి, మండిపడి ఇలా అంటా: "ఏమిరా, పందిలా తింటున్నావు" అని; అదే ప్రకారం అదుపు లేకుండా త్రాగేవారిని చూసి, "మత్తు పానీయాలను కుడితిలా త్రాగుతున్నావేమిరా" అని; కామ వాంఛలలో అదుపు, హద్దు లేకుండా ఉన్నవారిని చూసి, "ఏమిటిరా, ఇలా దేవుడికి వదిలేసిన పోతులా పడ్డావు" అని అంటాం.

మనిషికి ఐదు రకాల అనుభూతులు. వాటిని మనం పంచేంద్రియాలు అని అంటాం. అవి: చూపు, వినికిడి, వాసన, రుచి, స్పర్శ. మనిషికి ఈ అనుభూతులన్ని ఆస్వాదించాలన్న బలమైన కోరికలు కలుగుతాయి, అనుభూతి కోసం వాంఛిస్తుంటాడు. కొన్నిటిని ఆకర్షిస్తాడు, ఇంకొన్నింటిని ద్వేషిస్తాడు. కొన్నిసార్లు తనవి కానివి కూడా తనకు దక్కాలని ప్రయత్నిస్తాడు. దొరకకపోతే దొంగిలిస్తాడు, లేదా దౌర్జన్యానికి దిగుతాడు. మనిషికి హద్దులు, అదుపు లేకపోతే; నిగ్రహం లేకుండా మత్తుతో తూలుతుంటాడు. కామంతో కళ్లు మూసుకొని



ప్రవర్తిస్తాడు, కడుపే దేవుడని ఆరాధిస్తాడు. ఈ విధంగా చాలామంది జీవితాల్లో జరుగుతుంది.

మనిషిలో స్వార్థం పెరిగి, కళ్ళెంలేని కామకోరికలను, వాంఛలను తీర్చుకోవాలని అనుకుంటున్నాడు. ఈ స్వార్థం వలన ఏకాకిలా బ్రతకాలని అనుకుంటున్నాడు. నాది, నేను; నేను బాగుంటే చాలు, ఎవరు ఏమయితే నాకేమని, సహాయం కోసం ఎదురు చూసేవారిని లెక్కచేయక ఒంటరిగా జీవిస్తాం. హలో, ఎలా ఉన్నారు? బాగున్నారా అని ప్రేమపూర్వకంగా పలకరించలేని వాట్సప్పులు, ఫేస్ టు ఫేస్ మాట్లాడలేని ఫేస్ బుక్కులు; ఇంటర్‌నెట్‌తో స్మార్ట్ ఫోను నీ చేతిలో ఉంటే ప్రపంచమే నీ చేతుల్లో ఉందంటారు. కాని ప్రక్కవానితో మాట్లాడలేని స్థితి. ఇలా మనిషి నేడు హద్దులు, అదుపు, నియంత్రణ, మితభావం లేకుండా శరీరక వాంఛల ప్రకారం జీవిస్తున్న సమాజానికి క్రీస్తు బోధిస్తున్న సుగుణమే నిగ్రహం (Temperance).

## 1. నిగ్రహం - దాని అర్థం, నిర్వచనం

మానవునికి ఎన్ని సుగుణాలున్నా, నిగ్రహం లేకున్నట్లయితే, ఏది ఎంత పాలలో చెయ్యాలో తెలియదు. అందుకే నిగ్రహం, మితభావం అనే సుగుణం అన్ని మౌలిక సుగుణాల్లో కనిపిస్తుంది. ఆత్మనిగ్రహం అనేది నాలుగు మౌలిక సుగుణాలలో చివరిది.

**(i) అర్థం :** మామూలుగా నిగ్రహం అందరికి అర్థమవుతుంది. దీనికి అనేక పర్యాయ పదాలు ఉన్నాయి. సంయమనం (ఆత్మ నిగ్రహం), మితభావం అన్నవి వాడుకలో ఉన్నాయి. త్రాగుటలో, తినుటలో, కామకోరికల్లో, అనగా శరీరక వాంఛల్లో హద్దు, అదుపు ఉండే గుణం అని అర్థం. వాంఛలను బుద్ధి, విశ్వాసం సూచించిన ప్రకారం మసులుకోవటమే నిగ్రహం. నిగ్రహం (Temperance) ఆంగ్లో-ఫ్రెంచ్ భాష ప్రకారం టెంపరౌన్స్ (Temperaunce) అని అంటారు. అదే వరవడిలో లతీను భాష ప్రకారం టెంపరెన్సియా (Temperantia) అని, ఆంగ్లంలో టెంపరెన్స్ (Temperance) అని అంటారు. ఈ పదాలు వాంఛలయెడ ఉపవాసం, అదుపు కలిగి జీవింపజేసే లక్షణం అనే అర్థాలను ఇస్తాయి. కొన్నిసార్లు

నిగ్రహంను కాలమానంగా, కోరికలను ఒక పరిధిలో ఉంచుకొనేలా చేస్తుంది అనే అర్థాన్ని కూడా ఇస్తాయి.

**(ii) నిర్వచనం :** మనిషి సామర్థ్యాన్ని సంపూర్ణం చేస్తు, అంతరంగ సామర్థ్యం ద్వారా సంపూర్ణంగా జీవింపజేసే సుగుణమే నిగ్రహం. మితిమీరిన కోరికలను అదుపులో ఉంచి, సరియైన విధంగా ఆనందాన్ని అనుభవించేలా; బుద్ధి, విశ్వాసం, విధించిన పరిమితుల ప్రకారం జీవింపజేసే గుణమే నిగ్రహం.

## 2. క్రైస్తవత్వం - నిగ్రహం

క్రైస్తవత్వంలో నిగ్రహానికి ఎంతో ప్రాముఖ్యతను ఇస్తారు. క్రీస్తుప్రభువే నిగ్రహానికి పునాది, ఆదర్శం. తన బోధనల్లో కూడా నిగ్రహం యొక్క ఔన్నత్యాన్ని చాటిచెప్పాడు. నలుబది రోజులుగా ఉపవాసమున్న క్రీస్తును, సాతాను ఆహారంతో ఆకర్షించినా, నిగ్రహంతో ఉండి, ఆకలి కోరికను నిరాకరించాడు. అలానే ఎన్నోమారులు ఎంతోమంది యేసును కోపానికి గురి చేసినపుడు, తాను మాత్రం ప్రశాంతంగా నిగ్రహాన్ని పాటించాడు అనేకమార్లు యేసుప్రభువు రోగులను నయం చేసి, పాపంలో పడవద్దు అని బోధించాడు. శత్రువలను ప్రేమించమన్నాడు. నీకు హాని చేస్తే, మేలు చేయమన్నాడు. ఒక చెంపపై కొడితే, ఇంకొక చెంపను చూపమన్నాడు. పాపులను మన్నించాడు. మానవత్వం చూపమని కడరా తీర్పులో చెప్పాడు. ఎంతోమందిని చూసి, ఆయన గుండె తరుక్కొనిపోయి, వారిపై జాలి కలిగి, కాపరిలేని గొర్రెలుగా ఉన్నారని దయచూపాడు. కుమారుడు చనిపోయి దు:ఖ సాగరంలో ఉన్న విధవను చూచి, కనికరించి, ఏడువ వద్దమ్మా అని జాలి చూపాడు. తన తండ్రి ఆలయాన్ని వ్యాపార స్థలంగా మారిస్తే, ప్రభువు మండిపడ్డాడు. యేసు ప్రభువు ఏడ్చాడు, నవ్వాడు, కోపపడ్డాడు, కరుణ చూపాడు, మన్నించాడు, జాలి చూపాడు. ప్రేమ తప్ప, అన్ని భావాలను పరిమితితో చూపి, నిగ్రహానికి ఒక ప్రతీకగా, ఒక చిహ్నంగా నిలిచి, తనను అనుసరించు వారందరు ఇలానే నిగ్రహం కలిగి జీవించాలన్నదే ఆయన ఉద్దేశ్యం, బోధన.

**(i) శ్రీసభలో నిగ్రహం :** శ్రీసభ ఎలా నిగ్రహాన్ని పాటిస్తుంది? "అందరు ఉన్నతంగ జీవించాలనుకుంటారు. ఉన్నత జీవితం అంటే దేవున్ని పూర్ణ హృదయంతో,



ఆత్మతో, కృషితో ప్రేమించటమే. ఎప్పుడయితే ఆ ప్రేమను ఆరోగ్యప్రదంగాను, అకలుషితంగాను నిలుపుకొంటామో దానిని నిగ్రహమని, సంయమనమని అంటారు" అని పునీత అగుస్తీను, "దె మోరిబస్ ఎక్లేసియో" (De Moribus Ecclesiae-No.25) లో బోధించారు. చాలా వరకు మన వాంఛలన్నీ స్పర్శతో కూడుకున్నవని. కాబట్టి, పునీత తోమాస్ అక్వినాసు ఇలా వ్రాసారు: "నిగ్రహమనేది ఎక్కువగా స్పర్శావాంఛలకు సంబంధించినవి" (సుమ్మా తెయొలొజియె, 141.5).

పునీత రెండవ జాన్ పౌలు పాపుగారు, "వెరితాతిస్ స్ప్లెన్‌డొర్" (Veritatis Splendor No.100) లో నిగ్రహం గూర్చి వ్రాస్తూ, "ఆర్థిక విషయాల్లో నిగ్రహమును పాటించుట ద్వారా మనిషికి ఉన్న గౌరవాన్ని కాపాడిన వారమవుతాము" అని చెబుతారు. ఆయన మరలా నవంబరు 23, 1978లో జనరల్ ఆడియన్స్ (General Audience) నందు ప్రజలతో ఈ సుగుణాల గురించి ముచ్చటించారు. నిగ్రహం గూర్చి బోధించారు. సుగుణం అనేది మానవునిలో నుండి జనిస్తుంది, మానవున్ని నడిపిస్తుంది అన్నారు. నిగ్రహాన్ని నెమ్మదితో (Sober) పోల్చారు. దానిని తొనకని స్థితిగా లేక నిర్దిష్టమైన విధానంగా చెప్పుకోవచ్చు. నిగ్రహం ఎక్కువగా బాహ్యకార్యాల్లో కనిపిస్తుంది. కాని అది అంతరంగంలో జనిస్తుంది. అందుకే పాపుగారు అంటారు, "అంతరంగిక శక్తి, బాహ్య వాంఛలపై ఆధిపత్యం చెలాయించాలి". ఇలాంటి జీవిత తత్త్వాన్ని సొబ్రైయిటి (Sobriety) అంటారు. దానినే మనం కైపులేనట్టి/స్థిమితమైన స్థితని భావిస్తాం. నిగ్రహంగా ఉండాలంటే దీనత, తగ్గింపుతనం తప్పనిసరిగా ఉండాలి.

**(ii) కతోలిక శ్రీసభ సత్యోపదేశంలో నిగ్రహం :** కతోలిక శ్రీసభ సత్యోపదేశం, 1805లో నిగ్రహం ఒక మౌలిక సుగుణం అని చెప్పారు. 1809లో నిగ్రహమంటే సంయమనం అని అన్నారు. ఈ సుగుణం ఇహలోక సౌఖ్యాలపట్ల ఆకర్షణా తీవ్రగతను తగ్గిస్తుంది (1838). సృష్టి వస్తువుల వినియోగాన్ని సమతుల్యం చేస్తుంది. అది దేహ ప్రవృత్తిపై చిత్తాధిపత్యాన్ని దృఢపరుస్తుంది. ఆమోదయోగ్యమైన పరిధిలోనే కోరికలను నిలుపుతుంది. సంయమనం గల వ్యక్తి తన ఇంద్రియ వాంఛలను మంచివైపు మళ్లిస్తాడు. ఆరోగ్యప్రదమైన వివేచనను కొనసాగిస్తాడు. ఇక్కడే నిగ్రహంను 'మితత్వం' అని నిగ్రహశక్తి అని పేర్కొంటారు. 2407లో వస్తువుల

ఆకర్షణలో ఎలా నిగ్రహం కలిగి ఉండాలని చెబుతుంది. ఆర్థిక వ్యవహారాల్లో, వ్యక్తి జ్ఞానానికి ఆత్మ నిగ్రహ సుగుణాన్ని అలవర్చుకోవాలి. ఈ ఆత్మ నిగ్రహం ప్రాపంచిక వస్తు వ్యామోహాన్ని నియంత్రించి, తగుమాత్రం వ్యామోహం ఉండేలా చేస్తుంది. ఇదే కోణంలో 2290లో శరీర వాంఛలపై ఎలాంటి నిగ్రహం ఉండాలో తెలియజేస్తుంది. ఇంద్రియ నిగ్రహం ఏ రకమైన అతి మంచైనా – ఆహారం, మద్యపానం, పొగాకు, ఔషధ దుర్వినియోగాల నుండి కాపాడుతుంది. ఆ ప్రకారం 2291లో మత్తుమందులు ఉపయోగించటంలో కూడా నిగ్రహం, నియంత్రీకరణ ఉండాలని చెబుతుంది. గమనించండి, క్రీస్తుప్రభువు నిగ్రహం గూర్చి ఏవిధంగా బోధించారో, తన జీవితంలో చూపించారో; అదే ప్రకారం శ్రీసభ తన అధికార పత్రాలలో బోధించింది. మరి మానవులమైన మనం ఈ నిగ్రహంను ఎలా పాటించాలని ప్రశ్నించుకుంటూ ప్రయత్నించాలి. క్రీస్తుని పోలిన వారిగా జీవించాలి.

## 3. బైబిలు గ్రంథంలో నిగ్రహం

నిగ్రహం లేదా సంయమనం అనేది నైతిక సుగుణం. అది ఇహలోక సౌఖ్యాల పట్ల ఆకర్షణా తీవ్రతను తగ్గిస్తుంది; సృష్టి వస్తువుల వినియోగాన్ని సమతుల్యం చేస్తుంది. అది దేహ ప్రవృత్తులపై చిత్తాధిపత్యాన్ని దృఢపరుస్తుంది. ఆమోదయోగ్యమైన పరిధిలోనే కోర్కెలను నిలుపుతుంది. సంయమనం గల వ్యక్తి తన ఇంద్రియ వాంఛలను మంచివైపు మళ్ళిస్తాడు. ఆరోగ్యప్రదమైన వివేచనం కొనసాగిస్తాడు.

బైబిలు గ్రంథంలో ఎన్నోమార్లు యావే దేవుడు ప్రవక్తల ద్వారా యేసుప్రభువు తన బోధనల ద్వారా, పునీత పౌలు తన హెచ్చరికల ద్వారా నిగ్రహం గురించి ఉద్బోధించారు.

**(i) పాత నిబంధనలో నిగ్రహం :** సీరా 5:2, "నీవు కోరిన దానినెల్ల సంపాదించ యత్నము చేయకుము. నీ హృదయ వాంఛల ప్రకారము ప్రవర్తించకుము". అంటే, ఒక హద్దు ఉండాలి. ఈ నిగ్రహం మనల్ని మనం పరిరక్షించుకునేలా చేస్తుంది. అందుకే సీరా 37:27–31 ఇలా అంటుంది: "ఎట్టి భోజనమునైన మితము మీరి



తినకుము. మితిమీరి తిన్నచో రోగము వచ్చును. భోజన ప్రియత్వము వలన పిత్తము ముదురును. ఈ విషయమున జాగ్రత్త వహించుడు. ఈ గ్రంథం సంయమనాన్ని చాలాసార్లు ప్రశంసించింది. సీరా 18:30–33 ఇలా హెచ్చరిస్తుంది: "మీ కామ వాంఛలకు లొంగవద్దు; మీ కోర్కెలను అదుపు చేయండి; భోగ జీవనము వలన అగు ఖర్చులు నిన్ను గుల్ల చేయును. నీ చేత డబ్బు లేనప్పుడు బాకీలు చేయించి, విందులారగించి, బిచ్చగాడివైపోవలదు".

చాలాసార్లు చాలామంది జీవితంలో చూస్తే – కోరికలు మనిషిపై ఆధిపత్యాన్ని చెలాయిస్తుంటాయి. అలాకాక, మనిషే కోరికలపై అధికారం చెలాయించాలి. సామెతలు 25:28లో, "తన్ను తాను అదుపులో పెట్టుకోలేనివాడు, ప్రాకారములు లేకుండ రక్షణమును కోల్పోయిన నగరము వంటివాడు" అని పోలిక చెబుతుంది. నిగ్రహంను పెంచుకోవాలంటే మంచి సహనం ఎంతో అవసరం (సామెతలు 23:20–21 చూడుము), "నీవు త్రాగుబోతులతో కలియవద్దు, భోజన ప్రియులతో కూడవద్దు. త్రాగుబోతులు, తిండిబోతులు దరిద్రులగుదురు. తిని, త్రాగి, తూలువారికి చీలికలు పీలికలు తప్పవు. సామెతలు 28:7లో ఇలా ఉంది: "వివేకియైన కుమారుడు ధర్మశాస్త్రమును పాటించును. తుంటరులతో చెలిమి చేయు పుత్రుడు తండ్రికి అపకీర్తి తెచ్చును. మనం నిగ్రహం గూర్చి ఆదికాండంలో ఉన్న యోసేపు నుండి నేర్చుకోవచ్చు. ఆది.39వ అధ్యాయంలో పోతిఫర్ భార్య యోసేపును మోహించింది. కాని యోసేపు నిగ్రహంతో ఆమె కామలైంగిక చర్యను నిరాకరించాడు.

**(ii) నూతన నిబంధనలో నిగ్రహం :** నూతన నిబంధనలో పౌలు తీతుకు వ్రాస్తు: "మనము ఇంద్రియ నిగ్రహము కలిగి, ధర్మ మార్గములో దైవీక జీవనాన్ని ఈ లోకములో గడపాలి" (2:12) అని బోధిస్తున్నాడు. అలాగే గలతీ 5:22–23లో ఆత్మ ఫలాల గూర్చి చెపుతూ, మనిషి దేవునిలో ఎదగాలని బోధిస్తున్నాడు. ఆత్మ ఫలాలు ఏమన: ప్రేమ, ఆనందం, శాంతము, సహనం, దయ, మంచితనము, విశ్వాసనీయత, సాత్వికత, నిగ్రహం. వీటికి వ్యతిరేకంగా ఎలాంటి చట్టము లేదు. ఇలా నిగ్రహం ఆత్మ ఫలాలలో ఒకటని దేవుని వాక్కు తెలుపుతుంది. పునీత పౌలు చెప్పిన సలహాలను పాటిస్తే, ఏ సంఘమైనా ఎంతో గొప్పగా జీవిస్తుంది. 2

పేతురు 1:6లో "విజ్ఞానమునకు ఇంద్రియ నిగ్రహమును జోడొనర్చుడు. ఇంద్రియ నిగ్రహమునకు సహనమును చేర్చుడు. సహనమునకు దైవభక్తిని జతచేయుడు" అని ఉంది. నిగ్రహశక్తి మనకు లేనట్లయితే మనం దేవుని రాజ్యానికి వారసులం కాలేమని చెబుతుంది. "దుష్టులు దేవుని రాజ్యము పొందరని మీకు తెలియదా? మోసపోకుడు, అవినీతిపరులు, విగ్రహారాధకులు, వ్యభిచారులు, నపుంసకులు, స్వలింగ వ్యామోహ వక్రబుద్ధులు, దొంగలు, దురాశపరులు, త్రాగుబోతులు, పరనిందాపరులు, దోచుకొనువారు దేవుని రాజ్యమునకు వారసులుకారు, (1 కొరింథీ 6:9-10). నిగ్రహశక్తి అనేది మానవుడు ప్రయత్నం చేస్తూ, ప్రయాసపడుతూ సంపాదించుకోవాలి. పౌలు కొరింథీయులతో ఇలా అంటాడు: "మీ నిగ్రహశక్తిని మించి మిమ్ము శోధింపబడనీయడు. అంతేగాక, మీరు శోధింపబడునపుడు, దానిని సహింపగల శక్తిని మీకు ఒసగి, బయటపడు మార్గమును మీకు ఆయన చూపును (1 కొరింథీ 10:13).

**(iii) బైబిలు గ్రంథం ప్రకారం అర్చకులకు నిగ్రహం అవసరం :** దైవ యూడిగం చేస్తున్న యాజకులలో ఎంతో నిగ్రహం, అన్నివేళలా మితత్వం పాటించాలని పరిశుద్ధ గ్రంథం తెలుపుతుంది. దేవుడు అహరోనుతో ఇలా అంటున్నాడు, "నీవు గాని, నీ కుమారులుగాని, సమావేశపు గుడారమునకు వచ్చునపుడు ద్రాక్షాసారాయమునుగాని, ఘాటైన మద్యమునుగాని సేవింపరాదు (లేవీ 10:8). అదే విధంగా యెహెజ్కేలు గ్రంథంలో కూడా, "యాజకులు లోపలి ఆవరణలోనికి పోవునపుడు మద్యమును సేవింపరాదు (44:21). వ్రతం పట్టినవారు కూడా నిగ్రహంతో ఉండాలని బైబిలు చెపుతుంది: "వ్రతము పట్టిన స్త్రీయైన, పురుషుడైన ద్రాక్ష సారాయనమును, ఘాటైన మద్యమును సేవింపరాదు" (సంఖ్యా 6:1-3). ఈ విధంగా వ్యామోహాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తే మనం మన శరీరాన్నే ఎక్కువగా ప్రేమించుకున్నట్లు (2 తిమోతి 3:4). కొన్నిసార్లు ఈ వ్యామోహాలవల్ల యాజక సేవలో బలహీనులను లొంగదీసుకుంటారు (2 తిమోతి 3:6). యాజకులే కాదు, ఉప గురువులు ఎలా ఉండాలో బైబిలు గ్రంథం తెలుపుతుంది. "ఉప గురువులు మంచి నడవడిక గలవారై రెండు నాల్కలుగల వారుగాక, కపటము లేనివారు కావలెను. త్రాగుబోతులు కాని, అత్యాశకలవారు కాని కారాదు" (1 తిమోతి 3:8).



## 4. క్రైస్తవేతర మత విశ్వాస సంప్రదాయాలలో నిగ్రహం

**(i) గ్రీకు నాగరికత - నిగ్రహం :** క్రీస్తుకు పూర్వమే గ్రీకు తత్వశాస్త్రవేత్తలు నిగ్రహం గురించి ఎంతో ప్రభావంతో తమ వ్యాసాల ద్వారా తెలియజేసారు. సేనోఫాన్ (444-357 బి.సి.) "మెమొరాబ్లియ" అనే వ్యాసాన్ని సోక్రటీసుకు వ్రాస్తూ, నాయకులు ఏవిధంగా ఉండాలో సలహా ఇచ్చాడు. నాయకుల్లో తిండియందు, త్రాగుడుయందు, నిద్రయందు, లైంగిక జీవితమందు స్వీయ నియంత్రణ ఉండాలని సూచిస్తున్నాడు. అదే విధంగా చలినైనా, వేడినైనా, కష్టానైనా భరించాలని బోధిస్తున్నారు. గ్రీకు నాగరికత కాలంలోనే నిగ్రహం గూర్చి ఈ విధంగా నిర్వచించారు: క్రియల్లో, ఆలోచనల్లో, కోరికల్లో మితత్వం ఉండటం లేదా వాంఛలను అదుపు చేయుటమని. ప్లేటో తత్వవేత్త నిగ్రంను 'స్వీయ నిరోధకంగా' వర్ణించాడు. దానినే గ్రీకులో సొప్రోసునే (Sophrosune) అని అంటారు. అరిస్టాటిలు (384-322 బి.సి.) నిగ్రహంను ఒక గోల్డెన్ మీన్ అని అంటాడు. గోల్డెన్ మీన్ అంటే గరిష్ట, కనిష్ట మధ్యలో అని అర్థం. యెనేసియుసు (372-289 బి.సి.) కన్ఫ్యూసియసు అనే తత్వవేత్త త్రాగుడులో ఉన్న అపాయాలను బట్టి హెచ్చరిస్తున్నారు. ఆ ప్రకారమే సిసెరో (106-43 బి.సి.), సెనెకా (65 ఏ.డి.), స్టోయిక్ తత్త్వవేత్తలు మితత్వం గూర్చి చర్చించారు.

**(ii) హైందవ మత సిద్ధాంతాల్లో నిగ్రహం :** సంస్కృత భాషలో నిగ్రహంను 'దమ' (Dama) అని పర్యాయపదాలుగా భావిస్తారు. దమ్ అంటే స్వీయ నిరోధం. అంటే, తనను తాను నియంత్రించుకోవటం లేదా అదుపు చేసుకోవటం అని అర్థం. బ్రహదరనాయక ఉపనిషత్తులో (5.2.3) ఇలా ఉంది: "ఉన్నతమైన మంచి వ్యక్తికి మూడు లక్షణములు ఉండును. అవి స్వీయ నిరోధము, దయ, దానము". యోగ ఆసనాల ద్వారా మనిషి తన కోరికలను నియంత్రించుకోగలడని బోధిస్తుంది. సత్సంపద్ ప్రకారం ఆరు సుగుణాలున్నాయి. వాటిలో నిగ్రహం ఒకటి.

హైందవ మతం ప్రకారం, వ్యక్తి నైతిక జీవితం వేదాలపై, ఉపనిషత్తులపై ఆధారపడి ఉండేది. కాని, కాలక్రమేనా నూతన సుగుణాలను మత సిద్ధాంతాల్లో జోడించారు. ఉదాహరణకు 'మను' సంహిత ప్రకారం ధార్మికంగా జీవించాలంటే పది సుగుణాలు కావాలి. అవే - ధైర్యం, క్షమాపణ, నిగ్రహం, దొంగలించకుండుట,

స్వచ్ఛత, ఇంద్రియ నిగ్రహం, విచక్షణ, విజ్ఞానం, సత్యం, అక్రోధం (కోపించకుండుట). ఇలా జీవిస్తే మనిషి తన కోరికలను అదుపులో ఉంచుకొని దైవం కోరిన విధంగా జీవించగలుగుతాడు.

**(iii) ఇస్లాం మతంలో నిగ్రహం :** ఇస్లాం మత గ్రంథమైన ఖురాన్ నిగ్రహం గూర్చి బోధిస్తుంది. పూర్వులు పాటించిన విధంగా ఉపవాస నియమాలు ఎందుకంటే... ఉపవాసం ద్వారా స్వీయ నియంత్రీకరణ (తనను తాను అదుపులో ఉంచుకోవటం) సాధ్యమవుతుంది, (2:183). నీవు చేసేవన్నీ అల్లాకు తెలుసు, కాని నీవు చేయాల్సింది మంచినే ఇంకా స్వీయనియంత్రీకరణ సుగుణంతో జరుగుతుంది, (4:128). ఎవరైతే తమనుతాము నియంత్రించుకుంటారో, అదుపులో తమ వాంఛలను ఉంచుకుంటారో, మంచిని చేస్తారో, అలాంటి వారిలో అల్లా ఉంటాడు, (16:128). ఆ ప్రకారం 2:194లో కూడా ఇలా ఉంది: "తమనితాము అదుపులో ఉంచుకున్న వారిపట్లనే దేవుడు ఉంటారు". ఎవరైతే సహనంతో ఉండి, వాంఛలను అదుపులో ఉంచుకుంటారో అట్టివారిని ఎంతో మెచ్చుకుంటారు, (41:35).

ఇలా ఇస్లాం మతం పవిత్రతను, నిగ్రహంను గూర్చి ఎంతో చక్కగా బోధిస్తుంది. మనిషి సంపూర్ణంగా ఎదగాలంటే మనస్సును, హృదయాన్ని, శరీరాన్ని పవిత్రంగా ఉంచుకోవాలి. మనిషి మెదడును, శరీరాన్ని అనారోగ్య పరిచే పనులు మానుకోవాలి. హానిచేసే మత్తు పానీయాలను, హానికరమైన భోజనానికి దూరంగా ఉండాలి. ఈ నిగ్రహం అనే సుగుణం కేవలం మత్తు పదార్థాల పైనే కాకుండా, చెడు ఆలోచనలపైన, వాంఛలపైన, చెడు కార్యాలపైన గట్టి నిర్దిష్టత కలిగి ఉండాలని ఇస్లాం మతం బోధిస్తుంది.

**(iv) సిక్కు మతంలో నిగ్రహం :** సిక్కుమతం పవిత్రతను, నియంత్రీకరణను ధృవీకరిస్తుంది. ఎందుకు పవిత్రంగ ఉండాలంటే, ప్రతీ మానవ శరీరంలో దైవం ఉంటుంది. కాబట్టి, ఏదైతే మనిషి శరీరానికి హాని కలిగిస్తుందో, జబ్బుకు గురి చేస్తుందో, దానిని దూరం చేయాలి. లైంగిక సంపర్కం కేవలం చట్టం నిర్దేశించిన భాగస్వామితోనేకాని ఇతరులతో ఎలాంటి లైంగిక చర్యలు జరుగరాదు. అంటే,



భార్యభర్తలు నమ్మకంగ జీవించుటయే నియంత్రీకరణకు గుర్తు, అదే నిగ్రహమని చెప్పవచ్చు.

సిక్కుమతం బోధిస్తున్నట్లు ఐదు దుర్గుణాలు ఉన్నాయి. అవి: కామం, క్రోధం, లోభం, మోహం, అహంకారం. (అ) కామం అంటే కోరిక. మనిషిని లోకవస్తువులపై ఆధారపడేలా చేస్తూ, ఆలోచింపనివ్వక పాపం వైపు నడిపిస్తుంది. (ఆ) క్రోధం మనిషి యొక్క విచక్షణా జ్ఞానాన్ని తొలగిస్తుంది. ఆలోచింపనివ్వదు. మనిషికి దేవునికి దూరం చేస్తుంది. (ఇ) లోభం మనిషిని స్వార్థపరునిగా చేసి, నిగ్రహంలేని మనిషిగా నిలుపుతుంది. (ఈ) మోహం చట్టవిరుద్ధమైన సంభోగాలకు, లైంగిక నేరాలకు దారి చూపుతుంది. (ఉ) అహంకారం మనిషిని తనంతటివాడు లేడనే విపరీతమైన గర్వానికి లోనుచేస్తుంది. అది దేవున్ని ధిక్కరించగలదు. ఈ ఐదు దుర్గుణాలను ఎనిమిది సుగుణాలతో ఎదుర్కొనవచ్చునని ఈ మతం చెబుతుంది. అవి: జ్ఞానం, సత్యం, న్యాయం, నిగ్రహం, సహనం, ధైర్యం, దీనత్వం, సంతృప్తి. ఈ ఎనిమిది సుగుణాల్లో నాల్గవది నిగ్రహం. సిక్కుమతం చెప్పినట్లు నిగ్రహంను ప్రార్థన, ధ్యానంతో బలపరచుకోవచ్చు. దేవుని నామాన్ని పదేపదే ఉచ్చరిస్తే, ప్రార్థన చేస్తే మనిషిలోని దురాలోచనలు మాసిపోతాయి. తమని తాము హానిపరచుకొని, నియంత్రించుకునే పద్ధతిని సిక్కుమతం ప్రోత్సహించదు.

**(v) బౌద్ధమతంలో నిగ్రహం :** బౌద్ధమతంను స్థాపించిన బుద్ధమహాశయుడు మంచి నడవడిక గూర్చి బోధించాడు. నిగ్రహ జీవితమను సుగుణంను అష్టమార్గ విలువలలో ఒకటిగా బోధించాడు. మంచి నడవడికను నిగ్రహ జీవితంగా జీవించవచ్చు. ఈ అష్టమార్గ లక్షణాలను పాటించినవారు మధ్యమ మార్గంలో జీవించిన వారిగా పరిగణింపబడతారు. నిగ్రహం అంటే రెండు వైపుల ఉన్న **'అతి'**ని గమనించి జీవించటం. హద్దులెరిగి జీవించటం. ఉదాహరణకు అదుపులేని తినకూడదు. అదుపులేని ఉపవాసం తగదు. ఈ రెండింటికి ఉన్న మధ్యమ అంటే, **'మితము'**ను పాటించాలి. బౌద్ధమతం పంచశీల అను ఐదు విలువలను బోధిస్తుంది. ఈ గుణాలు మనిషిని మంచి మార్గంలో, నీతి ప్రకారం జీవించేలా చేస్తాయి. ఈ ఐదు గుణాల్లో రెండు నిగ్రహం గురించి బోధిస్తున్నాయి. మొదటిగా అవినీతి, లైంగిక చర్యలకు దూరంగా ఉండుమని; రెండవదిగా, మత్తు పదార్థాలను సేవించటం ద్వారా బాధ్యతారహితంగా ప్రవర్తిస్తామని బోధిస్తుంది.

**(vi) కన్ఫ్యూష్యసుని బోధలో నిగ్రహం :** కన్ఫూష్యసు (చైనా) స్థాపించిన మత సిద్ధాంతాల్లో ఇలా ఉంది: మానవ జీవితానికి నిగ్రహం, పవిత్రత ఎంతో అవసరం. **'సగటు లేదా మధ్యమం'** అనే గ్రంథం ఉంది. చైనీయంలో దీనిని **"చుక్ యంగ్"** అని అంటారు. అంటే, దీని అర్థం: 'ఎప్పటికి మధ్యలోనే ఉండటం', సర్వదా మధ్యలోనే ఉండటం. అంటే, రెండు వైపుల ఉన్న 'అతిని' విడనాడాలి.

**(vii) టావో సిద్ధాంతంలో నిగ్రహం :** టావో మతాన్ని స్థాపించిన లావోజు (Lao-Tzu), ఎప్పుడు నిగ్రహపూరితమైన జీవితాన్నే ప్రోత్సహించేవాడు. తను ఇలా బోధించాడు: "ఎవరైతే ధనంపై, వ్యామోహంపై, అధికారంపై నిగ్రహం లేకుండా, ఎలాంటి అదుపు లేకుండా జీవిస్తారో అలాంటివారు తమ వినాశనాన్ని తామే కొని తెచ్చుకుంటారు. వారు తవ్వుకున్న గోతిలో వారే పడతారు".

**5. నిగ్రహమునకు విరుద్ధమైన పాపములు**

**(i) భోజన ప్రియము (Gluttony) :** అదుపు, హద్దు లేకుండ తినే అలవాటును భోజనప్రియం లేక తిండిబోతుతనం అని అంటారు. దేవుడు భోజనంను మన పోషనకు ఇస్తే, మనం దానిపై పరిమితిలేని కోరికను పెంచుకుంటున్నాం. కొన్నిసార్లు తిండిమీదున్న అధిక ప్రీతి, మనుషులను జంతువులతో సమానం చేస్తుంది. జంతువుకు అతీతంగా మనిషికి జ్ఞానం, బుద్ధి, బాధ్యత, తెలివి అనే గుణాలున్నాయి. భోజనం మీద అత్యాశ ఉన్నట్లయితే మనిషి మెదడును, తెలివిని, జ్ఞానాన్ని మందగిల్లేలా చేస్తుంది. ఇలా ఉంటే జంతువులా కాకుండా, దానికంటే హీనంగా మారుతాం. తిండిబోతుతనం మందమతుల్ని చేస్తుంది. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని నశింపజేస్తుంది. చదువును, ప్రార్థనను ఆటంకపరుస్తుంది. ఆధ్యాత్మిక, మానసిక సోమరితనానికి గురి చేస్తుంది. అంతేగాక, పాపపు సంభాషనలు పెంచి, పాపం చేయడానికి ప్రేరేపిస్తుంది. తిండిమీద అధిక ప్రీతికలవారు – తిండిమీద సణుగుకుంటారు. రుచిపసి తెలియకుండ ఆబగా తినేవారు మానవ నైపుణ్యంను పోగొట్టుకుంటారు. ఎవరైనాసరే నిగ్రహంతో పద్ధతిగా భోజనం చేయాలి.

**(ii) త్రాగుడు (Drunkenness) :** మైకానికి గురై, మత్తులో తూలేంత త్రాగినట్లయితే, అలాంటి స్థితికి గురై, తన బాధ్యతలను విస్మరించే వారిని



త్రాగుబోతులని అంటారు. త్రాగుడు మెదడును మందగింపజేస్తుంది. అందుకోసమే వారు ఏమి చేస్తున్నారో వారికే తెలియదు. త్రాగుడు వల్ల తమ మంచి పేరును కోల్పోతారు. అందరు అలాంటి వారిని చీదరించుకుంటారు, ఈసడించుకుంటారు. త్రాగుడు పేదరికానికి, అవమానానికి, కుటుంబ విచ్ఛిన్నానికి కారణమవుతుంది. త్రాగుడుకు బానిసయితే, వారిలో క్రోధం, గొడవలకు దిగే తత్త్వం, ఇతరులను శపించే భావం, మోసం చేయాలనే కోరిక, డబ్బు దొరకనపుడు దొంగిలించటం వంటి దుర్గుణాలు ఏర్పడతాయని నిపుణులు అంటారు. మత్తువలన దాగివున్న కోపంతో భార్యను, బిడ్డలను కొడతాడు. అక్రమ సంబంధాలు పెట్టుకొనే అవకాశం ఉంటుంది. త్రాగి బండి నడిపినపుడు రోడ్డు ప్రమాదాలను చేస్తారు. మత్తుకు బానిసలైన వారు పశ్చాత్తాపపడడం చాలా అరుదు. అలానే నిత్యజీవం పొందడం కూడా కష్టం. అందుకే పౌలు ఈ విషయాన్ని 1 కొరింతీ 6:9–10లో స్పష్టపరిచాడు.

అదే ప్రకారం మాదకద్రవ్యాలు, నార్కోటిక్ పదార్థాల వలన కూడా ఎన్నో వ్యక్తిగత సమస్యలు, ఆరోగ్యపరమైన – వృత్తిపరమైన సమస్యలు తలెత్తుతాయి. మనిషిని బాధ్యతారహితులని చేస్తాయి. అందుకే, నిగ్రహం అనే సుగుణం, మితత్వం, మాధ్యమం గూర్చి చెబుతుంది.

**(iii) లైంగికంగ విచ్చలవిడితనం–కామ పిశాచి :** కామోద్రేకం అనగా అక్రమ లేక మితిమీరిన పైశాచికమయిన లైంగిక సంతోషం. లైంగిక చర్యను పునరుత్పత్తి, భార్యభర్తల పరిపక్వత, ఐక్యతలనెడు ఆశయాల నుండి విడదీసిన లైంగిక సంతోషం నైతికంగా అక్రమమైంది, (కతోలిక సత్యసభ సత్యోపదేశము 2351). దేవుడు ఏర్పాటు చేసిన లైంగిక కోరికలను వివాహ వ్యవస్థలోనే వ్యక్తపరచుకోవాలి. అలాకాక, వేరే ఏవిధమైనా సరే, అది పాపమే! అది విచ్చలవిడి క్రియ అవుతుంది. నిగ్రహం లేనివారు కొందరు వ్యభిచారం ద్వారా తృప్తిని పొందుతారు (క.స.స.2355). ప్రేమికులు కొందరు వివాహం కాకుండానే లైంగిక క్రియలో పాల్గొంటారు. నిగ్రహం కోల్పోయినవారు క్షణిక సుఖం కోసం జీవిత భాగస్వామికి హాని చేస్తారు, కుటుంబ జీవితాన్ని గాయపరుస్తారు. బిడ్డల పట్ల బాధ్యతా రాహిత్యంతో వ్యవహరిస్తారు. ఇలాంటి పాపం విడాకులకు దారి తీస్తుంది (క.స.స.2385). ఇలా ఎందరినో బాధకు గురి చేస్తుంది.

**(iv) కఠినత్వం – రాతి గుండె (Insensibility):** మానవుడు మానవత్వాన్ని పట్టించుకోకపోతే, ఇతరుల మనసును అర్థం చేసుకోకపోతే, భావాలను తెలుసుకోకుంటే నిగ్రహ విరుద్ధమైన పాపంలో పడతారు. మానవునిలోని వాంఛలు తన ఎదుగుదలకు అవసరం. కాని, ఈ వాంఛలతో నేనే ఎదగాలని, ఇక ఇతరులతో, వాళ్ల మనోభావాలతో పనిలేదని భావించే గుణమే కాఠిన్యం. ఇతరుల భావాలను తెలుసుకొని, మసలుకొనేవాడు గొప్పవారు, నిగ్రహశీలురు.

**(v) అమితత్వం (Intemperance):** అమితత్వం (మితం లేకుండ) నిగ్రహానికి విరుద్ధం. ఇది స్వార్థంతో కూడుకున్నది. పునీత తోమాసు అక్వినాసు మాటల్లో, "అమితత్వం చిన్నపిల్లల మనస్తత్వంగా వర్ణిస్తారు. పెద్దవాళ్లలో ఇది దుర్గుణం. అమితత్వంతో ఆలోచన శక్తిని కోల్పోతాం. నాది, నేను అనే స్వార్థంతోనే జీవిస్తాం. శరీరక వాంఛలను అదుపులో ఉంచుకొనని వారు స్వతంత్రులు కారు. వారు వాంఛలకు బానిసలు. అమితత్వం ఆలోచన శక్తిని మందగింపజేసి, జంతు ప్రవృత్తిని ప్రవేశ పెడుతుంది".

**ముగింపు**

నేటి కాలపు మనిషిని చూస్తే, ఎన్నో ఆధునిక పరికరాలను సంపాదించుకుంటున్న నవోన్మేష వ్యక్తిలా ఉన్నాడు. ఆ పరికరాల మధ్యలోనే జీవిస్తున్నాడు. మనిషి యంత్రంగా తయారవుతున్నాడు. కొన్నిసార్లు సహనం లేక, నిగ్రహం లేక జంతువులా మారుతున్నాడు. ఈ నిగ్రహం అనే సుగుణం మనిషిని మానవత్వంతో నింపుతుంది. అందరి యెడల ప్రేమతో జీవించేలా చేస్తుంది. మనిషికి వాంఛలపై అధికారం ఉండాలేగాని, వాంఛలు మనిషిని పాలించరాదు. ఈ వ్యాసం ద్వారా మనం క్రీస్తు ఏవిధంగా నిగ్రహంతో జీవించారో, అలానే ప్రతి మానవుడు జీవించాలని నేర్చుకున్నాం. మనిషిలోని స్వార్థం, క్రోధం, ఈర్ష్య అను దుర్గుణాలన్నీ పోయి, నిగ్రహంతో జీవిస్తూ, క్రీస్తుకు తగిన శిష్యులంగా, ఉన్నతంగా జీవించాలని నా కోరిక, నా ఆశ.

❋ ❋ ❋ ❋

# 8. ధృఢత్వము – పట్టుదల: క్రీస్తు విలువలతో ధైర్యంగల సాక్షులుగా మార్చే లోహం

– బ్రదర్ వడ్లపాటి మరియదాస్

## 1. ఉపోద్ఘాతము



దేవుడు మనిషిని తన రూపంలో సృష్టించి తన ఊపిరిని ఊది, జీవించుటకు స్వేచ్ఛను ప్రసాదించాడు. తద్వారా మానవుడు దేవునికి ప్రియమైన బిడ్డయ్యాడు. ఆయన సన్నిధానంలో ఉంటూ ఆయనను నిరంతరం పొందుతూ ఉండేవాడు కాని పాపం చేయడం వలన ప్రభునితో ఉండే భాగ్యాన్ని కోల్పోయాడు. మరల మానవులు దేవునితో ఉండాలంటే పాపంను విడిచిపెట్టాలి. అది కేవలం మంచి ప్రవర్తన కలిగి జీవించడం వల్ల మాత్రమే సాధ్యమౌతుంది. సుగుణాలతో మాత్రమే అది సాధ్యమౌతుంది. ఇవి రెండు భాగాలు 1. దైవశాస్త్ర సుగుణాలు: విశ్వాసం, నమ్మకం, ప్రేమ (1 కొరింతీ 13:13). ఇవి కేవలం ప్రభుని ద్వారా వచ్చేవి. మనిషి తన శక్తితో సంపాదించుకొనేవి కావు. మౌలిక సుగుణాలు: నిగ్రహం, వివేకం, న్యాయం, దృఢత్వం. వీటిని స్వభావ సిద్ధమైన సుగుణాలు అని కూడా పిలుస్తారు. ఈ సుగుణాలు దేవుని, తోటి సహోదరులను ప్రేమించడం వల్ల కలుగుతాయి. ఈ సుగుణాలలో ఆనందం, శాంతి, ఓర్పు, దయ, మంచితనం, ఔదార్యం, సాధుత్వం, నమ్మక పాత్రం, నిరాడంబరత, ఆత్మనిగ్రహం, సౌశీల్యం ఇమిడి ఉంటాయి (గలతీ 5:22-23). ఈ సుగుణాలను మనిషి జీవితంలో అలవరచుకోవాలంటే దృఢత్వం చాలా అవసరం. కాబట్టి అసలు దృఢత్వం అంటే ఏమిటి? దృఢత్వం ఎలా సాధించాలి. దృఢత్వం కలిగి ఉన్నవారు లేనివారి జీవితాలు ఎలా ఉంటాయో చూద్దాం!

## 2. దృఢత్వం అంటే ఏమిటి?

దృఢత్వం లేదా పట్టుదలకు లాటిన్ పదం ఫోర్‌తిస్ (Fortis) ఆంగ్లంలో దీనిని ఫోర్‌టిట్యుడ్ (Fortitude) అని పిలుస్తారు. అనగ బలమైన లేదా దృఢమైన అని అర్థం. కతోలిక శ్రీసభ సత్యోపదేశం ప్రకారం దృఢత్వం ఒక నైతిక సుగుణం. అది కష్టాల్లో దృఢత్వంనూ, మంచిని సాధించడంలో స్థిరతనూ అందిస్తుంది. శోధనలను ఎదుర్కోవాలన్న నిర్ణయాన్ని బలోపేతం చేస్తుంది. నైతిక జీవనంలోని అడ్డంకులను అధిగమిస్తుంది. స్థైర్యసుగుణం భయాన్ని చివరకు మరణ భయాన్ని కూడా జయించటానికి, కష్టాలను, హింసలను ఎదుర్కోడానికి సామర్థులను జేస్తుందది. న్యాయ పరిరక్షణ కోసం అవసరమైతే తన జీవితాన్ని త్యాగం చేయడానికి, బలిదానం చేయడానికి మనిషిని ఈ సుగుణం ప్రోత్సహిస్తుంది (నెం. 1808).

పునీత తోమస్ అక్వినాస్‌గారు, దృఢత్వం మౌలిక సుగుణాలలో మూడవది అని తెలియజేసారు. ఎందుకంటే నీతి, సమన్వయ సుగుణాలను మనిషి జీవితంలో పాటించడానికి దృఢత్వం ఎంతో అవసరం. అందుకే ప్రొఫెసర్ మాయ ఎన్‌జిలో ఈ విధంగా అన్నారు "ధృఢత్వం" అన్ని సుగుణాలలో ముఖ్యమైనది. ఎందుకంటే ఈ సుగుణం లేకుండా మిగతా సుగుణాలను మన జీవితంలో పాటించలేం.

సుగుణాలతో కూడిన జీవితంను జీవించుటకు ఎటువంటి ఆపదలు, బాధలు, కష్టాలు వచ్చినా దృఢంగా నిలబడి, అనుకున్న విజయాలను సాధిస్తూ ముఖ్యంగా క్రీస్తు విలువల ప్రకారం జీవిస్తూ ఆయన రక్షణను పొందుదాం.

## 3. దృఢత్వం "పూర్వ నిబంధనలో"

మనిషి జీవితంలో సమస్యలు, బాధలు వస్తాయి. వాటిని ఎదుర్కొని జీవించడంలోనే సంతోషం ఉంది. ప్రభువు అబ్రహామును పిలిచి తను చూపించిన ప్రదేశానికి వెళ్లమన్నప్పుడు తను ఎంతగానో ప్రేమించిన సొంత ఊరును, తోబుట్టువులనూ, స్థిరాస్థిని విడిచిపెట్టి వెళ్లాడు. అబ్రహాముకి ప్రభువు తనకు మరల ఇవి అన్నీ ఇస్తాడనే పట్టుదల ఉంది. కాబట్టే ధైర్యంగ వెళ్లగలిగాడు. మరలతన ప్రియ కుమారుడైన ఇస్సాకును బలి ఇవ్వమన్నప్పుడు, బాధ కలిగినప్పటికి, బలి ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. ప్రేమ, ఇష్టం లేనప్పుడు ఇవ్వడానికి సిద్ధపడతాము కాని ప్రేమ ఉన్నప్పుడు ఇవ్వడానికి సిద్ధపడం. అబ్రహాము తన స్వార్థం, సంతోషం



చూచుకోకుండా ప్రభునిమీద తనకున్న ప్రేమను, విశ్వాసాన్ని ప్రకటించాడు. కేవలం తనకు ప్రభునిమీద ఉన్న దృఢత్వమే దీనికి కారణం. ఇటువంటి దృఢత్వం కలిగి జీవించాలంటే మన శక్తి సామర్థ్యాలు సరిపోవు ప్రభుని కృప అవసరం "నా కృప నీకు చాలును. బలహీనతలయందు నా శక్తి పరిపూర్ణమగుచున్నది" (2 కొరింథీ 12:9). కాబట్టి ఎల్లప్పుడు ఆయన కృపలో జీవించుదాం.

ఎలియాజరు, ఏడుగురు మక్కబీయుల సోదరులు, వారి తల్లిని పంది మాంసమును తినమని లేకపోతే ప్రాణాలను తీస్తామని బెదిరించారు, కొరడాలతో కొట్టారు. ప్రాణాలను ఇవ్వడానికి సిద్ధపడ్డారేగాని దేవునికి, ధర్మశాస్త్రంనకు వ్యతిరేకంగ పంది మాంసంను తినడానికి ఒప్పుకోలేదు. ప్రాణాలను ఇవ్వడానికి సిద్ధపడ్డారు. ఎందుకంటే అవమానకరంగా జీవించుటకంటే ప్రాణాలను ఇవ్వడమే మేలన ఎంచారు. యోబు కుమార్తెలను, అల్లుల్లను ఆస్థిని పోగొట్టుకొని చివరకి తన శరీరం అంత రోగములతో ఉన్నప్పుడు తన భార్య, స్నేహితులు అవమానించినా, హేళన చేసినాగాని ప్రభువునందు విశ్వాసం కోల్పోలేదు. ప్రభువు మీద విశ్వాసాన్ని, పట్టుదలతో చూపించాడు. అందుకుగాను ప్రభువు, యోబును ఎక్కువగ ఆశీర్వదించాడు. బాధలు, కష్టాలు ప్రతి మనిషి జీవితంలోను వస్తాయి. అవి వచ్చాయని కృషించిపోతే ఏది సాధించలేం. భయాన్ని వీడి నేను చేయగలను అనే పట్టుదల కావాలి. "నా సేవకులగు యాకోబు వంశజులారా! మీరు భయపడకుడు. ఇస్రాయేలీయులారా! మీరు భీతి చెందకుడు. నేను దూరదేశముననున్న మిమ్ము రక్షింతును" అని ప్రభువు పలికారు (యిర్మియా 30:10). కాబట్టి పట్టుదల, దృఢత్వం మనలో స్థిరంగ నిలవాలంటే మనం ఆయనలో ఉండాలా. ఆయన విలువల ప్రకారం జీవించడానికి కృషి చేయాలి. లేనియెడల ఆయన కృపను పోగొట్టుకుంటాం. సంసోను జీవితం చూచినట్లయితే దేవుడు అతనికి, మానవులకు ఎవరికి లేనంత శక్తి సామర్థ్యాలు యిచ్చి ఇస్రాయేలీయులను ఫిలిస్తీయుల బారి నుండి కాపాడమన్నాడు. తన సంతోషం కోసం ప్రభువు విలువలను తృణీకరించాడు. తన రహస్యములను ఫిలిస్తీయురాలైన దేలీలకు బయలుపరచాడు. జుట్టు తీసిన తక్షణమే తన శక్తిసామర్థ్యాలను కోల్పోయాడు. దీనికి కారణం పట్టుదల లోపించడమే. ఎప్పుడైతే మనిషి దృఢత్వం కోల్పోతాడో తనకు తెలియకుండానే

పాపంలో పడిపోతాడు. దృఢంగా ఉన్నవాళ్లు ఎప్పుడు కూడా పాపం చేయడానికి కాని ప్రభువు విలువలను పెడచెవిన పెట్టరు. దానికి ఉదాహరణ యోసేపు తన యజమానుని భార్య తనతో శయనింపమని అడిగినప్పుడు అంగీకరించలేదు" ఇటువంటి దుష్కార్యమునకు ఎట్లు ఒడిగట్టుదును? ఇది దైవద్రోహము కదా" అనెను (ఆది 39:9). దానికి ప్రతీకారంగా ఆమె యోసేపును చెరసాలయందు త్రోయించెను. యోసేపు తనలో ఉన్న దృఢత్వాన్ని నిరూపించాడు. కాబట్టి ప్రభువు తనని ఐగుప్తు దేశమునకు ద్వితీయ సర్వాధికారిగా నియమించెను (ఆది 44:4-11). కాబట్టి మనకు వస్తున్న ఆపదలను, కష్టాలను చూచి భయపడక వాటిని ఏవిధంగా అధిగమించగలమో చూడాలి. దానికి కావలసిన శక్తి ప్రతీక్షణం ప్రభువు నుండి పొందాలి. తద్వారా మనం అనుకున్న విజయాలను, గమ్యాలను చేరుకోగలం.

## 4. దృఢత్వం "నూతన నిబంధనలో"

జక్కయ ప్రభుని చూడాలని ఆశపడ్డాడు. జనసమూహం ఎక్కువగా ఉండటం చేత, పొట్టివాడైనందుచేత చూడలేకపోయాడు. కాని ప్రభువుని చూడాలన్న పట్టుదల మాత్రం కోల్పోలేదు. అందుకు చెట్టు ఎక్కాలనుకున్నాడు. తోటివారు హేళన చేస్తారని సిగ్గుపడలేదు. భయపడలేదు. అటువంటి దృఢత్వం ఉన్న జక్కయ్యను ప్రభు గమనించి ఆయనే తన దగ్గరకు వచ్చాడు. తద్వారా జక్కయ జీవితమే మారిపోయింది (లూకా 10:1-10). ఎప్పుడైతే మంచిని తెలుసుకోవాలని ఆశపడి, ఆ విధంగా జీవించాలనుకుటామో అప్పుడే బాధలు, కష్టాలు వస్తాయి. అలాంటి సమయంలోనే మనం జక్కయ్యవలె దృఢంగా ఉండాలి. పట్టు విడువకుండ ప్రయత్నించాలి. "మీలో ఒకడు అర్ధరాత్రి వేళ తన మిత్రుని యొద్దకు వెళ్లి ఇట్లు చెప్పెననుకొనుడు. మిత్రమా! నీవు నాకు మూడు రొట్టెలు బదులు ఇమ్ము. నా స్నేహితుడు ఒకడు ప్రయాణమైపోవుచు, నా ఇంటికి వచ్చియున్నాడు. అతనికి పెట్టుటకు నా యొద్ద పక్కమీద ఉన్నారు. నేను ఇప్పుడు లేచి ఇయ్యజాలను అని సమాధానం ఇచ్చెననుకొనుము. నేను మీతో చెప్పునది ఏమన, అతడు మిత్రుడై ఉండి లేచి అతని అవసరము తీర్చును" (లూకా 11:5-8). మన జీవితంలో ఎన్నో సైతాను శోధనలు వచ్చినప్పుడు వాటిని అధిగమించడం చాలా కష్టం కాని జయించాలని, సంపాదించాలని అనుకున్నప్పుడు ప్రతినిత్యం కృషి చేయాలి.



ఏవిధంగానయితే స్నేహితునికి రొట్టె కోసం తన మిత్రుని పదే పదే అడిగి సంపాదించుకున్నడో ఆ విధంగ మనం చేయాలి. అప్పుడు మనలో ఉన్న సైతాను క్రియలుపోయి వాటినన్నిటిని చెత్తగా భావిస్తాం. "క్రీస్తు కోసం నేను వీటినన్నిటిని చెత్తగా భావిస్తున్నాను" అని పునీత పౌలుగారు పలికారు. ఎందుకంటే క్రీస్తు పిలిచిన తరువాత మరల తను వెనుకకు మరలలేదు. తన జీవితాంతం క్రీస్తుయేసు కోసమే జీవించాడు. అందులో ఆయనకు ఎన్నో బాధలు, కష్టాలు, కొరడా దెబ్బలు, చెరసాలలో పెట్టారు. అలాంటి సమయంలో కూడా ప్రభు గురించి పట్టు విడువకుండా బోధించగలిగాడు. ఆయన జీవించినంత కాలం క్రీస్తు విలువల ప్రకారం జీవించి, ధైర్యంగ ఇతరులకు సాక్షిగ నిలిచాడు. "క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎవరు వేరుచేయగలరు? బాధ, కష్టం, హింస, క్షామం, వస్త్రహీనత, ప్రమాదం, యుద్ధం, మరణంగాని అట్లు చేయగలదా?" అని చెప్పగలిగాడు (రోమీ 8:35). ఈ విధంగ మనం చెప్పగలమా? మన జీవితంలో ఏదైన సమస్య వచ్చినప్పుడు వెంటనే కృషించిపోతాం. కాని దానిని ఎలా సాధించగలమోనని ఆలోచన చేయం. ఎప్పుడైతే సాధించగలమని ఆలోచన మనలో వస్తుందో అప్పుడే మనం సగం సాధించిన వాళ్లం అవుతాం. మిగతాది సాధించుటకు పునీత పౌలుగారి వలె ప్రతి క్షణం పట్టుదలతో ప్రయత్నించాలి.

"దావీదు కుమారా నన్ను కరుణింపుము అని గ్రుడ్డివాడు కేకలు వేసినప్పుడు, ప్రజలు వానిని ఊరకుండమని గద్దించారు. వాడు మాత్రం వారింపులను పట్టించుకోలేదు. వాడు మరి బిగ్గరగా "దావీదు కుమారా! నన్ను కరుణింపుము అని అరిచాడు. అందువలన వానికి దృష్టిదానం కలిగింది. ఒకవేళ ప్రజలు ఊరకుండమని అన్నప్పుడు ఊరకుంటే దృష్టిదానం పొందేవాడు కాదు. వారు ఏమైన అంటారా అని భయపడక, పట్టుదలతో ధైర్యంగ నేను దృష్టిని సాధించగలను అని నమ్మాడు. కాబట్టి పొందగలిగాడు. మనం కూడా మంచిని సాధించేటప్పుడు ఎన్నో బాధలు, ఆపదలు ముఖ్యంగా మనవారి నుండే నిందలు, హేళనలు వస్తాయి. అలాంటి సమయంలోనే ధైర్యంగ నిలబడాలి. పట్టు విడువకుండా ప్రయత్నించాలి. పోగొట్టుకున్న నాణెం కోసం, త్రోవతప్పిన గొర్రె కోసం ఏవిధంగానయితే శ్రమించి, పొందగలిగారో ఆ విధంగ మనం

పొందగలగాలి. వీరి ఆనందాన్ని ఇతరులతో పంచుకున్నారు. ఆ విధంగానే దృఢత్వం కలిగినవారు, వారి జీవితాల కోసమే చూచుకోకుండా ఇతరుల క్షేమాభివృద్ధికై పాటుపడతారు. అందులో కలిగిన బాధలను సంతోషంగ స్వీకరిస్తారు. పక్షవాత రోగిని కొందరు పడకపై మోసికొని, క్రీస్తు చెంతకు చేర్చాలనుకున్నారు. కాని జన సమూహం క్రిక్కిరిసి ఉన్నందున అది వారికి సాధ్యపడలేదు. కాని ఇంటిపైకి ఎక్కి, కప్పును తీసివేసి మంచంతో రోగిని క్రీస్తుముందు దించారు. వారి విశ్వాసంను గమనించిన యేసు పక్షవాత రోగికి స్వస్థతనిచ్చాడు. ఇక్కడ గమనించినట్లయితే జనసమూహం ఎక్కువగా ఉన్నా నిరాశ చెందక, ప్రభువుని చేరాలన్న పట్టుదలతో ఇల్లు పైభాగంనకు పడకతో ఎక్కారు. అందుకు వారికి ఎంత ఓర్పు, సహనం కావాలి? మాకు ఎందుకులే అని వారు అనుకోలేదు. కాబట్టి క్రైస్తవులమైన క్రీస్తు విలువల ప్రకారం జీవించేటప్పుడు కష్టాలు, బాధలు వస్తాయి. ఆ సమయంలో నిరాశ చెందక ఆయన మీద విశ్వాసం వుంచి పట్టుదలతో సాధించగలమని ముందుకు సాగాలి. మరియతల్లి జీవితంలో సుస్పష్టంగా ఇది కనిపిస్తుంది. గాబ్రియేలు అతిదూత మరియచెంతకు వచ్చి నీవు కుమారుని కనెదవు అని చెప్పిన క్షణం నుండి క్రీస్తు మరణించే వరకు ఎన్నో బాధలు, కష్టాలు అనుభవించింది. ప్రతిక్షణం ప్రభు విలువల ప్రకారం జీవించి, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచింది. కాబట్టి అటువంటి దృఢత్వాన్ని కలిగి జీవిస్తున్నమా అని ఆలోచించాలి. బైబిల్ గ్రంథంలో వ్యక్తులేకాదు. పునీతులు కూడా క్రీస్తు విలువల ప్రకారం జీవించారు. అటువంటి వారి జీవితాలను పరిశీలిద్దాం.

## 5. పునీతుల జీవితంలో పట్టుదల

దృఢత్వం అనే ఈ మౌలిక సుగుణం పునీతుల జీవితాలలో సహితం అతి స్పష్టంగ మనకు కనబడుతుంది. ఎందుకంటే క్రీస్తు విడుదల ప్రకారం జీవించడానికి వారి ప్రాణాలు సహితం ధారపోసారు. రోమా చక్రవర్తియైన నీరో పరిపాలన కాలంలో క్రీస్తును అనుసరిస్తున్న వారిని హింసించడం, సింహాలకు ఆహారంగా వేయడం చేసేవారు. అటువంటి సమయంలో కూడా సంతోషంగా క్రీస్తు కోసం వారి ప్రాణాలను ఇవ్వడానికి సిద్ధపడ్డారు, కాని క్రీస్తును నిరాకరించలేదు. అటువంటి గొప్ప పట్టుదలను, దృఢత్వాన్ని ప్రదర్శించిన వారిలో మొదటివాడు



పునీత స్తెఫాను. క్రీస్తు దేవుని కుమారుడని, ఆయన మనల్నందరిని రక్షించుటకు వచ్చిన వానిని శత్రువులకు పట్టియిచ్చి చంపితిమని చెప్పినందుచేత యూదులు ఆయనపై మండిపడి, కోపంతో పండ్లు పటపట కొరికి, ఆయనను రాళ్లతో కొట్టి చంపారు. ప్రభుమీద తనకున్న విశ్వాసం, ప్రేమ, పట్టుదలే నిదర్శనం. ఇది మనలో ఉన్న దృఢత్వాన్ని రెట్టింపు చేస్తుంది. ఎవరు ఎన్ని విధాలుగా మనలను కృంగదీయడానికి ప్రయత్నించినను మనం వాటికి లొంగకుండా ఉండాలి. పునీత పెర్పెతువా గారు క్రీస్తు కోసం, ఇతరులకు బోధించి అనేక మందిని క్రైస్తవులుగా చేసారు. దాని వలన సెప్టెమియస్ సవేరసు చక్రవర్తి ఆమెను బంధించాడు. ఖైదీగ ఉన్న ఆమె దగ్గరకు, తన తండ్రి వచ్చి క్రీస్తును విడిచిపెట్టు నీకు విడుదల దొరుకుతుంది అన్నాడు. అందుకు ఆమె ఒక వంట ఇంటి పాత్రను గుర్తుచేసి, నాన్నా! ఆ పాత్రను చూడు ఆ పాత్ర ఆ పాత్రే అవుతుంది కాని వేరే పాత్ర కాదు కదా! అలాగే నేను క్రైస్తవురాల్ని, నేను నేనేగాని వేరేదాన్ని కాను కదా! అని చెప్పింది. ఆమె క్రీస్తు ప్రకటించిన విలువలను దృఢంగా విశ్వసించింది. దానికి తగ్గట్టు జీవించడానికి ప్రయత్నం చేసింది. క్రైస్తవత్వం స్వీకరించిన ఆమె మరల దానిని విడిచిపెట్టడానికి ప్రయత్నించలేదు. "నాగటి మీద చేయిపెట్టి వెనుకకు చూచువాడు ఎవ్వడును దేవుని రాజ్యమునకు యోగ్యుడు కాడు" అని క్రీస్తు పలికారు (లూకా 9:62). అందువలన వారి జీవితంలో ఎటువంటి సమస్యలకైనా సిద్ధపడ్డారు. అలాగే ఇగ్నేషియస్‌వారు క్రూర జంతువులకు బలి కాబోయేముందు 'నా విశ్వాసం కోసం మరణించేందుకు ఆతురతగా ఉన్నాను' నేను ప్రభువు యొక్క గోధుమ గింజను, ప్రభువైన యేసుక్రీస్తుకు స్వచ్ఛమైన ఆహారంగా మారేందుకు సింహాల పండ్ల మధ్య పిండిగా మారాలి అని ధైర్యంగా చెప్పగలిగాడు. క్రీస్తు కోసం వేదసాక్షులుగా మరణించిన వారు వందల్లో కాదు వేలల్లో విశ్వాసం కోసం, శ్రీసభ కోసం పనంగా పెట్టారు.

మన స్వార్థం కోసం జీవించక ఇతరుల ప్రేమను పొందుటకు, వారికి సహాయం చేయటం ద్వారా క్రీస్తు ప్రేమను పొందగలం. ఇది పొందాలంటే ప్రతి క్షణం ప్రార్థన చేయాలి. ప్రార్థన చేసేటప్పుడు ఎన్నో ఇతర తలంపులు వస్తాయి. మనం అనుకున్న పనులు జరుగకపోవచ్చు. అలాంటి సమయంలో నిరుత్సాహం

చెందక దృఢంగా ఉంటూ ప్రార్థనను కొనసాగించాలి. పునీత మోనికమ్మగారు 30 సంవత్సరాలు తన భర్త, కుమారుడు కోసం ఎడతెగక ఉపవాస ప్రార్థన చేసింది. అందుకు ప్రభువు వారి మనసు మార్చి ముఖ్యంగా తన కుమారుడైన ఆగస్టీను గారిని పునీతుడను చేసారు. ఇన్ని సంవత్సరాలు ప్రార్థన చేయడం అంటే ఎంత కష్టం. మనం ఒక గంట కూడా సరిగ్గా ప్రార్థన చేయలేము దానికి కారణం మనలో విశ్వాసం, పట్టుదల లేకపోవడం. నిజంగా ప్రార్థనలో అడిగింది జరుగుతుందా అనే అపనమ్మకం. ఇలా ఉండటం వల్ల భక్తితో ప్రార్థన చేయలేకపోతున్నాం. తద్వారా మనం పాపానికి బానిసలం అవుతున్నాం. దేవునికి దూరమై, సైతాను క్రియలకు అలవాటుపడి జీవిస్తున్నాం. దృఢత్వం కావాలంటే ముందు మనకు ప్రార్థన అవసరం. కాబట్టి ప్రతిక్షణం ప్రార్థనా జీవితాన్ని జీవించుదాం.

పునీత మరియ గోరెట్టిని, అలెగ్జాండరు ఎలాగైనా అనుభవించాలి లేక చంపేయాలి అని నిశ్చయించుకొని కత్తితో రంగ ప్రవేశం చేశాడు. మరియను లోని గదిలోకి గుంజుకెళ్ళాడు, కత్తితీసాడు. కాని మరియ లొంగలేదు. దానికి ఆమె శరీరంపై పద్నాలుగు స్థలాలను పోలి పద్నాలుగు సార్లు కత్తితో కసిగా పొడిచాడు. ఆమె తన కన్యత్వాన్ని ప్రభువుకి ఇవ్వాలని నిశ్చయించుకుంది. కాబట్టి అలెగ్జాండరు ఎంత ప్రేరేపించినా తనలో ఉన్న పట్టుదల కొద్దిగా కూడా తగ్గలేదు. క్రీస్తు అనుచరులైన మనం ఎంత వరకు ఆయన విలువలను పాటిస్తున్నాం. కౌపర్‌గారు ఈ విధంగా అన్నారు "సత్యం కోసం చావడమంటే ఆ వ్యక్తి ఒక మనిషి కోసమో, దేశం కోసమో చావడం కాదు, ప్రపంచమంతటి కోసం మరణించడమన్న మాట. వేదసాక్షులు రుధిరం చిందించి ఒక మహోన్నత యోగ్యత లేక హక్కును దృఢపరచడం కోసం ఆ హక్కు అపారమైన నిత్య సత్యాన్ని పోషించడం, దేవునితో కలిసి నడవడం, దైవ సంకల్పానుసారంగా ఉండటం. ఇలాంటి సత్యం కోసం జీవించినవారే ఒరిస్సాలోని కన్‌దామాలో ప్రజలు. మనం కూడా అటువంటి సత్యం కోసం మన జీవితాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామా? లేదా అని ఆలోచించాలి. లేనియెడల పవిత్రాత్మ ద్వారా దృఢత్వాన్ని మనలో పెంపొందించు కోవాలి. ఎందుకంటే ఇది పవిత్రాత్మ ఇచ్చే వరం.



## 6. మన జీవితంలో పట్టుదల

ప్రతి మనిషి జీవితంలో పట్టుదల అవసరం. మనిషి పుట్టినప్పటి నుండి మరణించే వరకు కూడా ఏదో సాధించాలి అన్న తాపత్రయం. దానికి తగ్గ తన జీవితాన్ని మలచుకోవాలని అనేక మార్గాలు వెదుకుతాడు. తద్వారా తను అనుకున్న విజయాలను సాధిస్తాడు. అందుకు తనలో ఉన్న పట్టుదలే కారణం. మనిషికి పట్టుదల లేకపోతే జీవితంలో ఏదీ సాధించలేడు. విద్యార్థులకు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత రావాలని రాత్రింబవళ్లు కష్టపడి, పట్టుదలతో చదువుతారు. ఉద్యోగం లేనివాడు, ఉద్యోగం కోసం ప్రతి ఆఫీస్ దగ్గరకు వెళ్లి, దొరికినంత వరకు పట్టుదలతో వెతుకుతాడు. వెదకకపోతే తను అనుకున్న ఉద్యోగం సాధించలేడు. ఇలా సాధించాలనుకున్నప్పుడు బాధ కలుగుతుంది. నిరుత్సాహం చెందుతాం. అలాంటి సమయంలోనే దృఢంగా ఉండడానికి ప్రయత్నించాలి. అప్పుడు అనుకున్న దానికంటే ఎక్కువ సాధించగలం.

ఏప్రిల్ 26, 2003లో ఆరోన్ రాల్‌స్టోన్ అనే వ్యక్తి ఇంటిలో ఎవరికి చెప్పకుండ 400 కిలో గ్రాముల రాయికి తాడుకట్టి లోయలోకి దిగడానికి ప్రయత్నించాడు. అనుకోకుండా రాయి కదలి లోయలో పడటం చేత తన చేయి రాయి మధ్యలో ఇరుక్కుపోయింది. ఎంత ప్రయత్నం చేసినా తనవల్ల కావడం లేదు. ఆ పరిస్థితిలో చుట్టు ప్రక్కల ఎవరూలేరు. రెండు, మూడు రోజులు గడిచాయి. తన దగ్గర ఉన్న ఆహారం కూడా అయిపోయింది. ఆకలి, దాహం తీర్చుకోవడానికి తన మూత్రంనే త్రాగేవాడు. ఎలాగైనా బ్రతకాలి అనుకున్నాడు. తన దగ్గర వున్న చిన్న కత్తితో తన చేయిని కోయడం మొదలుపెట్టాడు. కాని దానితో ఎముకను కోయడం కష్టం అయింది. ఆ సమయంలో అక్కడున్న చిన్న రాయిని తీసుకొని ఒకరోజు అంత ఆ ఎముకను పగలకొట్టాడు. తరువాత మిగతా చర్మం కత్తితో కోసాడు. అప్పటికే చాలా రక్తం పోయింది. బ్రతకాలన్న తన పట్టుదల తనను బ్రతికించేలా చేసింది. తను ప్రయత్నం చేయకపోయినా, ఇతరులు అవిటివాడివని హేళన చేస్తారని తలంచినా తన ప్రాణాలు పోయేవి. ఎవరు ఏమీ అనుకున్నా పరవాలేదు, బ్రతకాలి అనే పట్టుదల తనలో ఉండటం చేత అనుకున్నది సాధించగలిగాడు. మనం మాత్రం చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేం. సమస్య

ఉందని భయపడితే ఏమీ సాధించలేము. ముఖ్యంగా క్రీస్తు బిడ్డలమైన మనం ఆయన విలువల ప్రకారం జీవించేటప్పుడు ఎన్నో బాధలు, నిందలు వస్తాయి. ఆ సమయంలో దృఢంగా ఉంటే మనం అనుకున్నవి సాధించగలం. ఇతరులను క్రీస్తు బాటలో నడిపించగలం. ఒక ఊరిలో హైందవురాలు క్రీస్తును విశ్వసించి, ఆయన తప్పకుండా తనకు సంతాన భాగ్యాన్ని ప్రసాదిస్తాడని ప్రతిరోజు ఆయన సన్నిధికి వచ్చి ప్రార్థన చేసేది. ఆ సమయంలో తన తోబుట్టువులు, స్నేహితులు హేళన చేసేవారు. అయినా పట్టు విడువకుండా ప్రార్థన చేసింది. మోనికమ్మగారు ఏవిధంగానయితే 30 సంవత్సరాలు ప్రార్థన చేసారో ఆ విధంగా చేసింది. సమూయేలు మొదటి గ్రంథంలో హన్నా ఏవిధంగానయితే సంతానం కోసం కన్నీటి ప్రార్థన చేసిందో ఆ విధంగా చేయగలిగింది. దానివలన ప్రభువు ఆమెకు సంతాన భాగ్యంను ఇచ్చాడు. ఆమెను హేళన చేసినవాళ్లే తన ద్వారా క్రీస్తును అనుసరించడం మొదలుపెట్టారు. ఎంతోమంది క్రైస్తవులయ్యారు.

బాధలేనిదే సంతోషం ఎలా ఉంటుందో తెలియదు. మానవులమైన మనం బాధలు పొందడానికి అసలు ఒప్పుకోము. ఎప్పుడూ ఆనందంగా ఉండాలని ఆశిస్తాం. నిజమైన సంతోషం ఎలా ఉంటుంది? అది మనం సంపాదించుకునే వస్తువుల్లోనా లేదా క్రీస్తులోనా? అని ఆలోచించాలి. పునీత జాన్ మరియ వియాన్నిగారు ఆర్స్ పట్టణంలో పనిచేస్తున్నప్పుడు ప్రజలు దేవాలయంలోనికి రానప్పుడు ఆయనే వారి యొద్దకు వెళ్లి క్రీస్తు గురించి చెప్పి, ప్రతినిత్యం వారి కోసం ప్రార్థన చేసేవాడు. ఎందుకంటే క్రీస్తు కోసం పని చేయడంలోనే ఎక్కువ సంతోషమని నమ్మాడు కాబట్టి. అటువంటి సంతోషం మనలో ఉండాలంటే ప్రతినిత్యం శ్రమించాలి. దానికి తగ్గట్టు కృషిచేయాలి. ఎక్కువగా మన క్రైస్తవులు తపస్సు కాలంలో సోదరులు మాలవేసినప్పుడు మందు త్రాగకూడదని, పాపాలు చేయకూడదని నిశ్చయించుకుంటారు. ఈస్టర్ పండుగ రాగానే వారు అనుకున్న నిర్ణయాలు కనుమరుగైపోతాయి. క్రీస్తును అనుకరిస్తున్నవారం ఈ విధంగా ఉండకూడదు. ఏదైనా నిర్ణయం తీసుకున్నామంటే జీవితాంతం దానికి కట్టుబడి ఉండాలి. అపుడే క్రీస్తు బిడ్డలమని అనిపించుకోగలం. ఆరోన్ రాల్‌స్టన్ ఏవిధంగానయితే ఐదు రోజులు తిండిలేక బ్రతకాలని పట్టుదలతో ఉన్నాడో ఆ



విధంగా మనం కూడా క్రీస్తు విలువల ప్రకారం జీవించుటకు ప్రయత్నించాలి. తద్వారా మనలో ఉన్న పట్టుదల పెరుగుతుంది, సంతోషంగా జీవించగలం.

## 7. సుగుణాలకు పునాది: కుటుంబం

ఇతరులకు మంచి చేయాలన్న గుణం మనకు కుటుంబం ద్వారా వస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పుడు నుండే మంచి గుణాలతో కూడిన జీవితాన్ని నేర్పించాలి. లేకపోతే పిల్లలు ఇతరులను గౌరవించకుండా ఉండటమేకాక వారికి ఇబ్బందికరంగా నిలుస్తారు. తద్వారా వారి జీవితాలను నాశనం చేసుకుంటారు. ఉదాహరణకు, ఒక వ్యక్తిని ఉరితీస్తున్నప్పుడు నా చివరికోరిక ఏమిటి అని అడుగుతారు. అప్పుడు వాడు నా తల్లిని చూడాలి అని అంటాడు. వారు వాని తల్లిని తీసుకువస్తారు. తల్లి తన దగ్గరకు రాగానే వాడు తన తల్లి చెవిని గట్టిగా కొరుకుతాడు. అక్కడ ఉన్నవారు ఎందుకు ఇలా చేసావు అని అడిగినప్పుడు, “నేను చిన్నప్పుడు బడికి వెళ్లివచ్చేటప్పుడు దారిలో కనిపించే కూరగాయలను దొంగచాటుగా కోసి మా అమ్మకు ఇచ్చేవాడిని. ఆ సమయంలో నా తల్లి మెచ్చుకొనేది ఆ విధంగా ప్రతిరోజు చేసేవాడిని, ఎదిగేకొద్ది పెద్ద పెద్ద దొంగతనాలు చేసాను. చివరకు ఎవరైనా అడ్డుకుంటే ప్రాణాలు తీయడానికి పూనుకున్నాను. అందుకు కారణం నా తల్లి. నా చిన్నప్పుడే గద్దించి వుంటే నేను ఇప్పుడు నాకు ఈ మరణశిక్ష పడేదికాదు” అని చెప్పాడు. చిన్న వయసులో పిల్లలు ఏది నేర్చుకుంటారో అదే వారి జీవితంలో అలవాటైపోతుంది. కాబట్టి తల్లిదండ్రులు చిన్నప్పుడే మంచి సుగుణాలను నేర్పాలి. అందుకే తల్లిశ్రీసభ చిన్నప్పటి నుండే సత్యోపదేశం నేర్పిస్తుంది. దీని ద్వారా వారు క్రీస్తు విలువలను నేర్చుకొని, దానికి తగ్గట్లు వారి జీవితాలను జీవించుటకు ప్రతి క్షణం కష్టపడతారు. అప్పుడు వారి జీవితంలో సాధించాలని అనుకున్న విజయాలు సాధించగలుగుతారు. లేకపోతే చెడు త్రోవలో జీవిస్తూ వారి జీవితాన్ని నాశనం చేసుకుంటారు.

## 7.4 ఘనమైన కార్యాలకు బలం స్వల్ప కార్యాలు

మన జీవితంలో ఏదైనా గొప్పకార్యం చేయాలనుకున్నప్పుడు మొదట చిన్న చిన్న కార్యాలను చేయడానికి ప్రయత్నించాలి. లేకపోతే పెద్ద పనులు చేసేటప్పుడు సాధించడం కష్టంగా ఉన్నప్పుడు మనలో నిరుత్సాహం వస్తుంది.

చిన్న కార్యాలు చేసేటప్పుడు అవి త్వరగా పూర్తి కావడం వల్ల మనలో ఉత్సాహం పెరిగి మంచికార్యాలు చేయాలని అనుకుంటాం. "చిన్న విషయాల యందు శ్రద్ధ వహించిన వానికి పెద్ద విషయాలు అప్పచెప్పబడును" అని క్రీస్తు పలికారు (మత్తయి 25:21). మనలో పట్టుదల స్థిరంగా ఉండాలంటే చిన్న విషయాలందు శ్రద్ధ వహించాలి. తద్వారా పెద్ద విషయాలను లేదా విజయాలను సాధించవచ్చు.

## 8. పట్టుదలలో అడ్డంకులు

ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు, బాధలు వస్తాయి. వాటిని సంతోషంగా స్వీకరించి అధిగమించిన వాళ్లు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. కాని అవి వచ్చినప్పుడు కృంగి కృశించిన వారు జీవితంలో ఏదీ సాధించలేరు. దానికి గల కారణం మనిషిలో ఉన్న పిరికితనం, భయం, అసూయ. ఏది చెడుగా జరిగినా తన దురదృష్టం అని అనుకుంటారు. కాబట్టి మనిషి జీవితంలో ఇవి ఎలా పనిచేస్తున్నాయో చూద్దాం.

### 8.1 పిరికితనం

ప్రతి ఒక్కరిలో పిరికితనం ఉంటుంది. అది మన విజయాలకు అడ్డుగోడలా ఉండకూడదు. ఇది ఒక్కసారిగా మన జీవితం నుండి శాశ్వతంగా పోదు. ప్రతి దినచర్యలో దానిని అధిగమించడానికి కృషి సల్పాలి. అందుకు ధైర్యం కావాలి. కాబట్టి ధైర్యంతో మనలో ఉన్న పిరికితనాన్ని పోగొట్టి క్రీస్తు విలువల ప్రకారం జీవిస్తూ, మన జీవితాన్ని సుందరంగా మలచుకుంటూ, జీవితంలో ఇంకా ఎన్నో విజయాలను సాధించుదాం.

### 8.2 భయం

చిన్నప్పటి నుంచే మనలో భయం చోటు చేసుకుంటుంది. కొంతమంది ఏదైనా కొత్తది చేయడానికి భయపడతారు. మరికొంత మంది కొత్తదేదీ చేయలేకపోతానేమోనని భయపడుతారు. అటువంటి వారికి పట్టుదల ఎంతో అవసరం. ఎందుకంటే పట్టుదల, ధైర్యంగల వ్యక్తి తనలో ఉన్న భయాలను అణచివేయడు. వాటిని ఏ విధంగా అధిగమించాలోనని ఆలోచిస్తాడు. భయం వేరు, దైవభయం వేరు. క్రైస్తవులమైన మనకు దైవభయం ఉండాలి. దైవభయం



మనలో ఉన్నప్పుడు ఈలోక భయాలు పోతాయి. కాబట్టి ప్రతిఒక్కరు తమ జీవితంలో ఎదురయ్యే భయాలకు చలించక ధైర్యంతో వాటిని అధిగమించడానికి ప్రయత్నించాలి. తద్వారా మనలో పట్టుదల ఏర్పడుతుంది.

### 8.3 అసూయ

మనకంటే ముందే ఎదుటివారు అభివృద్ధి చెందుతున్నప్పుడు మనలో మొట్టమొదట కలిగేది అసూయ. అసూయ మనలో ఉన్నప్పుడు జీవితంలో ఎదగలేము. ఎందుకంటే ప్రతి నిమిషం ఎదుటి వారిని చూచి బాధపడతాం. దాని వలన జీవితంలో ఒరిగేది ఏదిలేదు. కేవలం మదనపడటం తప్ప. మనం కూడా వారివలే ఎదగగలం అనే నమ్మకం కలిగి జీవించాలి. వాటిలో కలిగే బాధలను, కష్టాలను అధిగమించడానికి కృషి చేయాలి. దీనికి పట్టుదల అవసరం. ఎప్పుడైతే మనలో అసూయపోతుందో అప్పుడు మన జీవితం గమ్యాలను చేరుకోగలం.

### 8.4 ప్రతికూల (దురదృష్ట) పరిస్థితులు

మనిషి జీవితంలో ఏదో ఒకసారి ప్రతికూల పరిస్థితులు ఎదురౌతాయి. అలాంటి సమయంలో ఏమి చేయలేమని నిరుత్సాహం చెందుతారు. నా జీవితం ఎప్పుడు ఇలాగే ఉంటుంది. నా దురదృష్టం అని బాధపడతారు. ఇలాంటి పరిస్థితులను జయించినవారు ఎంతోమంది ఉన్నారు. వారిలో హెలెన్ కెల్లర్ మూగ, చెవిటి, గ్రుడ్డిది అయినా ప్రపంచంలో పెద్ద రచయిత్రయింది. గ్లెన్ కునింగాన్ కుంటివాడిగా ఎదిగాడు అయినా పట్టుదలతో ఒలంపిక్స్‌లో అథ్లెటిక్స్ ఆడి ప్రపంచ రికార్డునే సృష్టించాడు. నిక్ తనకు రెండు చేతులు, కాళ్లు లేకపోయినా ప్రపంచంలో సువార్త బోధకుడిగా పనిచేస్తున్నాడు. స్టీఫెన్ హాకెన్స్‌కి జబ్బు చేయడం వల్ల నడవలేని మాట్లాడలేని పరిస్థితి వచ్చినా పట్టుదలతో పనిచేయడం వల్ల ప్రపంచంలోనే గొప్ప భౌతికశాస్త్ర నిపుణునిగా పేరుగాంచాడు. వారందరి జీవితంలో ప్రతికూల పరిస్థితులు వచ్చాయి. కాని వారు వాటిని దురదృష్టంగా భావించక ధైర్యంగా ఎదుర్కొని పట్టుదలతో ఏదో సాధించాలన్న తపనతో ముందుకు వెళ్లారు. తద్వారా ప్రపంచములోనే గొప్పగా చెప్పుకొనే వ్యక్తులుగా ఉండగలిగారు. అంగవైకల్యం ఉన్నవారే ఇంతసాధిస్తే అన్నీ ఉన్న మనం ఎందుకు సాధించకూడదు. ఎందుకంటే

మనలో పట్టుదల, ఆశ, కోరిక లేకపోవడం. కాబట్టి ప్రతికూల పరిస్థితులకు భయపడక పట్టుదలతో వాటిని సాధించుటకు కృషి సలుపుదాం.

## 9. పట్టుదల గమ్యం

ప్రతి మానవుడికి, చనిపోయిన తరువాత, ఏమైపోతామనే భయం ఉంటుంది. అటువంటి భయం లేకుండా ఉండాలంటే ఈ లోకంలో జీవించిన కాలం దైవప్రేమ, సోదర ప్రేమను కలిగి ఉండాలి. "నీ దేవుడైన ప్రభువును నీవు పూర్ణ హృదయముతో, పూర్ణాత్మతో, పూర్ణ మనస్సుతో ప్రేమింపవలెను. నిన్ను నీవు ప్రేమించుకున్నట్లు నీ పొరుగు వారిని ప్రేమింపవలెను" అని క్రీస్తు పలికారు (మత్తయి 22:37–38). దేవుడికి అన్ని ఇవ్వడానికి ఇష్టపడతాం కాని తోటి సోదరులకు సేవ చేయడానికిగాని, సహాయం చేయడానికి గాని అసలు ఇష్టపడం. "ఎవరైనా తాను దేవుని ప్రేమింతునని చెప్పుకొనుచు తన సోదరుని ద్వేషించినచో అట్టివాడు అసత్యవాది. తన కన్నులారా తాను చూచిన సోదరుని ప్రేమించినచో తాను చూడని దేవుని అతడు ప్రేమింపలేడు" (1 యోహాను 4:20). క్రైస్తవులమైన మనం ఎటువంటి ప్రేమను కలిగియున్నాం? ఈ లోకంలో చాలా వరకు మానవులు వారి స్వార్థానికై జీవిస్తున్నారు. కాని ప్రక్కవాడి విషయంలో సహాయం చేద్దామన్న ఆలోచన కలిగి జీవించడం లేదు. గమ్యం పరలోకం చేరుకోవడం. దీనిని చేరుకోవాలంటే మనం దైవప్రేమను సోదర ప్రేమను కలిగి ఉండాలి. ధనికుడు – లాజరు ఉపమానం చూసినట్లయితే ధనికుడు లాజరును తన ఇంటి ద్వారం నుండి గెంటివేయలేదు. తనకున్న ఆస్థిని అనుభవించాడు. లాజరు తన ఇంటిముందు ఉన్నాడన్న సంగతి మరచి జీవించాడు. ఇద్దరు మరణించిన తరువాత లాజరు పరలోకంలోకి వెళ్లాడు. ధనికుడు నరకంలోకి వెళ్లాడు. కాబట్టి ఈ లోకంలో జీవిస్తున్నంత కాలం, మన స్వార్థం కొరకేగాక ఇతరుల మేలుకొరకు పనిచేయాలి. మన జీవితం ఏమైపోతుందోనని భయపడనవసరం లేదు. ప్రభువు యోబుకు ఏ విధంగానయితే సకల సంపదలను ఇచ్చాడు. ఆ విధంగా మనకు యిస్తాడు. మనం ఎదుటివారిని ప్రేమిస్తున్నప్పుడు మనలో భయం చోటుచేసుకోదు. 'ప్రేమ యందు భయము ఉండదు. పరిపూర్ణ ప్రేమ భయమును తరిమివేయును" అని యోహాను పలికారు (1 యోహాను 4:18). క్రైస్తవులమైన మనం పరలోకం



చేరుకోవడానికి, క్రీస్తు విలువల ప్రకారం జీవించడానికి కృషి చేయాలి. అందుకు ప్రతినిత్యం పట్టుదలతో పనిచేయాలి. తద్వారా భయాలను అధికమించి పరిపూర్ణ ప్రేమను పొందగలం.

## 10. ముగింపు

మనిషి మంచి పనులను చేయాలనుకున్న సమయంలో లేదా తన జీవిత గమ్యాలను చేరుకోవాలనుకున్నపుడు, జీవితంలో ఎన్నో సమస్యలు, అపాయాలు, బాధలు వాటిల్లుతాయి. అలాంటి సమయంలో నిశ్చలంగా, దృఢంగా ఉండాలి. లేకపోతే మనం అనుకున్న ఆశయాలను చేరుకోలేం. క్రీస్తు విలువల ప్రకారం జీవించడానికి, ఆయన సాక్షులుగా నిలువడానికి, పరలోక నిత్యనివాసం పొందడానికి ఈ సుగుణం మనిషి జీవితంలో ఎంతగానో దోహదపడుతుంది. అటువంటి గొప్ప సుగుణం మన జీవితంలో స్థిరంగా నిలవాలంటే మన శక్తిసామర్థ్యాలు సరిపోవు. దేవుని కృప అవసరం. ఆయన కృప మనలో ఉండాలంటే మనం ఎల్లప్పుడు ఆయనను అంటిపెట్టుకొని జీవించాలి". నేను మీయందు ఉందును. మీరు నాయందు ఉండుడు. ద్రాక్షావల్లి యందు ఉండని కొమ్మ దానంతట అది ఫలింపజాలదు అట్లే మీరు నాయందు ఉండనిచో ఫలింపజాలరు" అని క్రీస్తు పలికారు (యోహాను 15:4). పునీత పౌలుగారు కూడా ఈ విధంగా తెలియజేస్తారు "నీ కృప నాకు చాలును, బలహీనతలయందు నా శక్తి పరిపూర్ణమగుచున్నది" (2 కొరింతీ 12:9). కాబట్టి ఈ సుగుణం మనదైనందిన జీవితంలో స్థిరంగా నిలవాలంటే క్రైస్తవులమైన మనం ఎల్లప్పుడు ఆయనతో ఉండాలి. ఆయనలో ఉండాలి. ఆయనవలె ఉండాలి.

* * * *

# 9. దుర్గుణాలు: స్వేచ్ఛ, జ్ఞానం, బాధ్యతారహిత జీవనం

**- బ్రదర్ మనూరి మార్కో**



ప్రతి మనిషి తన నిత్యజీవితంనందు సంతోషంగా ఉండాలి అని కోరుకుంటాడు. ఒక క్రైస్తవుడు లేదా క్రైస్తవురాలు తమ మరణానంతరం పరలోకం చేరాలనే ఆశతో జీవిస్తారు. కాని సరైన మార్గనిర్దేశం లేక తాము కోరుకున్న సంతోషాన్ని కోల్పోతుంటారు. ఇప్పుడును ఎప్పుడును సంతోషంగా జీవించాలంటే "మంచి జీవితం" జీవించాలి. అనగా చెడు జీవితం పరిత్యజించాలి. చెడు జీవితం అంటే తనను తాను, ఇతరులను, దేవుడ్ని వ్యతిరేఖిస్తూ జీవించే జీవితం.

**మంచి జీవితం ఎందుకు జీవించాలి?**

ఒక మంచి జీవితం కేవలం క్రైస్తవులు నుండి మాత్రమే కాక ప్రతిఒక్కరి నుండి ఆశిస్తాం. సోక్రటీస్ అనే తత్వవేత్త 'జీవితాన్ని మంచిగా జీవించు' అని తెలియజేస్తున్నాడు. ఒక మంచి జీవితం తలయెత్తుకొని తిరిగేలా చేస్తుంది. అందుచేతనే ప్రభువు కయీనుతో "నీవు మంచి పనులు చేసిన యెడల తలయెత్తుకొని తిరిగెదవు" అని బోధిస్తున్నారు (ఆది 4:6-7). బిడ్డలు మంచిగా ఉండాలని తల్లిదండ్రులు, తల్లిదండ్రులు మంచిగా ఉండాలని బిడ్డలు, శిష్యులు మంచి స్థాయికి ఎదగాలని గురువులు, ఇలా ప్రతి ఒక్కరి నుండి మంచితనం ఆశించడముంది. ఆశించివారి ఆశయాలకు, సూచనలకు అనుగుణంగా నడుచుకోకపోతే చెడ్డవాడు అని పిలుస్తుంటారు. మంచి జీవితాన్ని జీవించడానికి రెండు కారణాలు:



1. దేవుడు మనందరిని ఆయన పోలికలో నిర్మించి ఆయన శ్వాసను ఊది జీవాన్ని ప్రసాదించారు. అనగా మనలో ఉన్న జీవం ఆయనదే. ఆయన రూపాన్ని, జీవాన్ని మన 'మంచి జీవితం' ద్వారా కాపాడాలి.

2. మంచి చెట్టు మంచి పండ్లనిస్తుంది. ఒక ముళ్ల చెట్టు నుండి ద్రాక్షకాయలను ఆశించలేము. మనం ఏ విధంగా జీవిస్తే మన తరువాత తరంవారు, మన చుట్టు ఉన్నవారు మన జీవితం ద్వారా ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. "నేను ప్రాణత్యాగము చేయడానికైనా సిద్ధమే కాని చెడు ఆదర్శం ఇవ్వను" అని ఎలియాసరు దృఢంగా చెప్పగలిగాడు (2 మక్క 6:19)

ఒక తండ్రిగా, తల్లిగా, దేవుని బిడ్డగా మనకు ఇవ్వబడిన బాధ్యతను సక్రమంగా, మంచిగా నెరవేరిస్తే దాని ఫలితం మంచిగా ఉంటుంది. మంచి జీవితాన్ని జీవించకుండా చెడు జీవితానికి శిరస్సు వంచి జీవిస్తే మనం దేనినైతే ఆశిస్తామో అది పొందలేము. ఎప్పుడూ సంతోషంగా ఉండాలి అనే ఆలోచనతో మానవుడు అధునాతన పరికరాలను కనిపెట్టడం, అంతరీక్షంలో గుడారం ఏర్పరచుకోవడం, అక్రమంగా ధనాన్ని అర్జించడం, అన్యాయంగా జీవించటం, ఇతరుల గురించి చెడుగా వేరొకరికి చెప్పటం, కలహాలు సృష్టించడం, ఇతరులను అధికారంతో అణచివేయడం ఇలా ఎన్నో స్వార్థపూరిత ఆలోచనలు, ప్రయత్నాలు, క్రియల నుండి వచ్చే ఆనందం అనే ఊబిలో పడిపోయి శాశ్వత ఆనందానికే స్వస్తి పలుకుతున్నాడు. దీనికి గల కారణం దుర్గుణాలే. దుర్గుణాలు మనిషిలో చొచ్చుకుపోయే మలిన గుణాలు. జ్ఞానం, స్వేచ్ఛ అనే రెక్కలతో మనం ఇష్టానుసారంగా, స్వలాభంతో, ఆనందం కోసం బాధ్యతారహితంగా ఎగిరినప్పుడు 'పాపం' ప్రవేశిస్తుంది.

**'పాపం'లో జ్ఞానం, స్వేచ్ఛల పాత్ర**

పాపకార్యంలో జ్ఞానం, స్వేచ్ఛ, సంపూర్ణ పాత్ర వహిస్తాయి. ప్రతి పాపం ఒక చెడు క్రియే. ప్రతి చెడు క్రియ పాపం కాదు. పాపం చేసిన వ్యక్తికి జ్ఞానం, స్వేచ్ఛ లేనియెడల చేసిన క్రియ పాపంగా పరిగణించబడదు. ప్రభువు యిస్రాయేలు ప్రజలను బానిసత్వం నుండి విడిపించిన తరువాత పది ఆజ్ఞలను మోషే ప్రవక్త

ద్వారా ఎరుకపరచిన పిదప, అనుసరించమని తెలియజేసారు. సామాజిక జీవితంలో కూడా చట్టాన్ని తయారుచేసిన పిదప దానిని ప్రజలకు విశదపరచిన తరువాతనే అతిక్రమించినవారిని శిక్షిస్తారు.

ప్రతి కాలంలోనూ జ్ఞానం చాలా విలువైంది. మనిషికి ఉన్న డబ్బును బట్టి కాక ఆ వ్యక్తికి ఉన్న జ్ఞానాన్ని బట్టి విలువ చేకూరుతుంది. దైవాన్ని కలిగి జీవితాన్ని కొనసాగించాలన్నా, ధ్యేయాన్ని సంపాదించాలన్న, జ్ఞానం పాత్ర చాలా ఉంటుంది. జ్ఞానం అనేక రకాలుగా చేకూరుతుంది. మొట్టమొదటిగా జ్ఞానేంద్రియాలు (కళ్లు, చెవులు, ముక్కు, నోరు, చర్మం) ద్వారా మన చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల జ్ఞానం చేకూరుతుంది. రెండవ మార్గం కూడా జ్ఞానేంద్రియాలు ద్వారానే కాని మనం చూసిన వాటిని, విన్న వాటిని, మిగిలిన ఇంద్రియాలతో అనుభవించిన వాటిని విశ్లేషించి సంపాదించుకోవడం. దీనిని బుద్ధి, తెలివిగా పిలుస్తుంటాం. మూడవ రకమైన జ్ఞానం వ్యక్తిగతమైన జ్ఞానం. ఇది ఆలోచన, ధ్యానం, అంత:పరీక్ష, పరిశీలన చేసుకోవడం వలన తన గురించి తెలుసుకోవడం జరుగుతుంది. చివరిగా దైవజ్ఞానం. ఈ జ్ఞానం అన్నింటికంటే ఉత్తమమైనది. సాక్షాత్తు దేవుడే ప్రత్యక్షంగా మనకు ప్రసాదిస్తారు. “సౌలా, సౌలా నీవేల నన్ను హింసించుచున్నావు” (అపో 9:4) అని సాక్షాత్తు దేవుడే ఆయన జ్ఞానాన్ని ప్రసాదించి క్రైస్తవ సంఘాలను నాశనం చేస్తూ, క్రైస్తవులను చెరసాలలో వేయించిన ఒకప్పటి పౌలును మార్చి క్రీస్తు సువార్త వ్యాప్తిలో ఓ స్తంభంగా మలిచారు. అదే విధంగా తనలో ఉన్న అజ్ఞానాన్ని గుర్తించుకోగలిగిన జ్ఞానాన్ని కలిగిన దావీదు కుమారుడైన సొలొమోను రాజు “ప్రభూ! నీ జ్ఞానాన్ని ప్రసాదించు” అని కోరుకోవడం దానిని పొందడం రాజుల దినచర్య రెండవ గ్రంథము మొదటి అధ్యాయంలో కనిపిస్తుంది. వారికి మాత్రమే కాదు మన నిత్యజీవితంలో కూడా రహస్యంగా ఉన్న దేవుని జ్ఞానం బోధించబడుతుంది. బోధింపబడిన దైవజ్ఞానం కేవలం దేవునికి సంబంధించినవారు మాత్రమే ఆలకిస్తారు (1 యోహాను 4:6).

‘స్వేచ్ఛ’ అందరూ కావాలని కోరుకుంటారు. ఏ వ్యక్తి మరొక వ్యక్తికి బానిసగా ఉండకూడదు అనే ఆలోచనతో ఉన్నత చదువులు చదవడం, కష్టపడి డబ్బులు సంపాదించడం చేస్తుంటారు. ఇది సబబే. కాని స్వేచ్ఛ అంటే ఇది మాత్రం కానే కాదు. బలహీన స్వభావానికి బానిసలు కాకుండా దైవత్వంతో మమేకమై




జీవించడమే స్వేచ్ఛ. సాధారణ స్థితిగతులను అధిగమిస్తూ ఒక అత్యున్నతస్థాయికి చేరాలి. సాధారణంగా అందరికి స్వేచ్ఛ ఉంది. స్వేచ్ఛను వినియోగించుకుని దేవున్ని చేరాలి. ఒక ‘నిర్ణయం’ తెలుసుకునే భాగ్యాన్ని దేవుడు ప్రసాదించాడు. పాపము చేయరాదని మీరు నిర్ణయించుకోవాలి (రోమీ 14:13). అనగా ‘నిర్ణయం’ లేదా ‘ఎన్నిక’ చేసుకొనే ఉచిత వరాన్ని ‘స్వేచ్ఛగా’ అర్థం చేసుకోవచ్చు. ఒక బైబిల్ మన ముందు ఉన్నప్పుడు తెరవాలా? వద్దా? అనే నిర్ణయం మనదే. తెరిస్తే చదవాలా? వద్దా? అనే నిర్ణయం మనదే. చదివిన తరువాత ధ్యానిస్తూ పాటించాలా? వద్దా? అనే నిర్ణయం కూడా మనదే. అనగా స్వేచ్ఛను వినియోగించుకుంటూ, మంచి నిర్ణయాలు తీసుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తే దేవునితో సహవాసం చేసే భాగ్యం దక్కుతుంది. దేవుడు మనలను స్వేచ్ఛాపరులై జీవించమని కోరుతున్నారు. ఎందుకన మనం స్వతంత్రులం. దాసి సంతానం కాదు (గలతీ 4:31).

దేవుని బిడ్డలమైన మనకు, మనతోపాటు సృజింపబడిన ఇతర జీవులకు కూడా దేవుడు జ్ఞానాన్ని, స్వేచ్ఛను ప్రసాదించారు. మనకు ఇతర జీవులకు ఇచ్చిన స్వేచ్ఛ, జ్ఞానము సరిసమానమా?

ఏ మాత్రం కానే కాదు. ఇతర జీవులకు, వాటికి ఆకలి వేసినపుడు ఆహారం కొరకు, ఎండ, వాన వచ్చినపుడు నీడకు పోవడం లాంటి నిర్ణయాలు తీసుకోగలిగే ఆలోచన, స్వేచ్ఛ ఉన్నాయి. ఇవి మనలోనూ ఉన్నాయి. అంతేకాక, మరింతగా సంపాదించుకునే వరం కూడా దేవుడు ప్రసాదించాడు. వీటిని సక్రమంగా వాడుకుంటే దేవుని ఆత్మ మనయందు నెలకొని ఉంటుంది.

ప్రస్తుత ప్రపంచంలో స్వేచ్ఛ, జ్ఞానం పట్ల పూర్తిగా అవగాహన లేకపోవడం, దుష్టవాంఛలకు మొగ్గుచూపడం వలన జ్ఞానాన్ని, స్వేచ్ఛను దుర్వినియోగపరుస్తూ పాపం కట్టుకుంటున్నాం. వృద్ధాప్యంలో ఉన్న తల్లిని లేక తండ్రిని లేక ఇద్దరిని ఆస్తి కోసం, వారు లేకపోతే స్వేచ్ఛగా బ్రతకవచ్చు అనే వక్ర ఆలోచనలు కలిగి వారిని ఊరికి దూరంగానో, కానరాని ప్రాంతాల్లో విడిచిపెట్టడం, స్మశానాలలో వదలిపెట్టడం గురించి మనం వింటుంటాం. అంతేకాక తల్లిదండ్రులు పసిబిడ్డలను చెత్తకుప్పలలో, ఆసుపత్రి ఆవరణలలో అనేక చోట్ల వదిలిపెడుతూ స్వేచ్ఛగా జీవించవచ్చు అనుకుంటున్నారు. కాని వారు వారికున్న జ్ఞానాన్ని, స్వేచ్ఛను

దుర్వినియోగపరచుకుంటూ దేవునికి వ్యతిరేకంగా పాపం కట్టుకుంటున్నారు. 'నా తండ్రివద్ద ఎందరో పనివారికి పుష్టిగా భోజనం లభిస్తున్నది', 'నా తండ్రి వద్దనే స్వేచ్ఛ ఉంటుంది' (లూకా 15) అనే జ్ఞానం, స్వేచ్ఛ, వాంఛ అనే ముసుగుతో కప్పివేయబడ్డాయి. వాంఛ పాపానికి దారి తీసింది. పాపం పరిపక్వం కాకమునుపే చిన్నకుమారుడు వెనుదిరిగాడు. మానవ సంబంధం ఈ విధంగా ఉంది:




ఒక గుర్రం పక్షిలా గాలిలో ఎగరలేదు, ఒక పక్షి గుర్రంలా పరుగెత్తలేదు. మానవులతో సహా ఇతర జీవులకు కొన్ని కొన్ని శక్తి సామర్థ్యాలు ఉంటాయి. కాని అవి మానవుడిలా, దేవుడిలా మాత్రం మారలేవు. మానవులకు ఇతర జీవుల్లా ఎగిరే సామర్థ్యం, నీటిలో వాసం చేయడం లాంటి శక్తి సామర్థ్యాలు లేవు. మానవుడికి వున్న జ్ఞానం, స్వేచ్ఛలతో దేవుడిలా మారపోవు అనగా దైవత్వాన్ని తనలో నింపుకొనే వరం ఉంది. మనం మానవత్వాన్ని కాపాడుకుంటూ మంచిపనులు చేస్తూ మంచి జీవితం జీవిస్తే మనల్ని మనం అధిగమిస్తాం. లౌకిక వాంఛలకు, గురై మానవత్వాన్ని కోల్పోతూ, క్రింద ఉన్న ఇతర జీవులకంటే కూడా హీనంగా మారడం జరుగుతుంది.

స్వేచ్ఛ, జ్ఞానం చాలా విలువైనది. అవి వాడే రీతిలో వాడితే జ్ఞానం, స్వేచ్ఛలను బాధ్యతారహితంగా, అజాగ్రత్తగా, అశ్రద్ధగా ఉంటే మనం మన సోదరుని పాపంలో నెట్టుతూ, మనం దేవునికి వ్యతిరేకంగా ప్రవర్తించి పాపం కట్టుకుంటాం (1 కొరింతీ 8) అని పునీత పౌలుగారు తెలియజేస్తున్నారు.

## దుర్గుణాలకు మార్గం : పాపం

హేతువునకు, సత్యానికి, సరైన అంతరాత్మకు వ్యతిరేకమైన దోషమే పాపం అని కతోలిక శ్రీసభ సత్యోపదేశం చెబుతుంది. దేవుని ఆజ్ఞలను తిరస్కరించడం, దేవుని మార్గం నుండి వైదొలగడం పాపం. పాపం అంటే సాధారణంగా ఒక సన్నివేశాన్ని, సంఘటనో, వస్తువునో, వ్యక్తినో ఊహించుకుంటాం. కాని



'కోల్పోవటమే' పాపం. మంచి, చెడు రెండు మన ముందు ఉన్నపుడు మంచికి బదులు చెడును ఎన్నుకుని పాపం చేసి, దేవుని కృపను కోల్పోతూ ఉంటాం. పుణ్యం చేసిన ప్రతిసారి ఆయన కృప అధికమవుతుంది. మేలైనది చేయ ఎరిగియు, దానిని చేయనియెడల అది పాపమే (యాకోబు 5:17). "నేను ఎల్లప్పుడు ఎవరికి చెడు చేయటం లేదు కాబట్టి నేను మంచివాడిని అని నిర్ధారించుకోకూడదు. నీవు ఇతరులకు మంచి చేయగలిగే అవకాశం ఉండి కూడా చేయని యెడల అది పాపమే" అని పునీత అతనాసియస్ గారు చెబుతున్నారు. మనం ఎపుడైతే పాపం చేస్తామో అపుడు దుర్గుణాలకు ఎర్ర తివాచి పరచినట్లే.

సాతాను మనతోనూ, ప్రపంచంతోనూ పెనవేసుకొని ఎల్లప్పుడు మనం పాపం చేయడానికి సర్వవేళలా చురుకుగా పనిచేస్తుంది. పునీతులకు సహితం సాతాను నుండి పూర్తిగా విముక్తి కలుగలేదు. సాతాను వెంటాడుతూ వేటాడుతూనే ఉంటుంది. అది ఒక గర్జించు సింహం వలె మ్రింగివేయడానికి ఎదురుచూస్తూ ఉంటుంది. పునీత జాన్ మరియ వియాన్నిగారు తమ జీవిత కాలంలో ఒక పునీతవంతమైన జీవితం కొనసాగిస్తున్నప్పటికి, దేవునితో మమేకమై జీవిస్తున్నప్పటికి సాతాను వారిని వదిలిపెట్టలేదు. వారిని పదే పదే శోధిస్తూనే ఉండింది. సాక్షాత్తు క్రీస్తు భగవంతుని కూడా సాతాను వదలిపెట్టలేదు. ఆయన సృష్టిలోనే సాతాను తన రాజ్యం ఏర్పరుచుకోవాలని యత్నించింది. విశ్వాసుల జీవితంలో సాతాను ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నిజమైన క్రైస్తవులుగా జీవించాలి అనే ఒక దృఢ నిర్ణయం తీసుకుని, జీవించే ప్రయాణంలో ఒక విధమైన ఆధ్యాత్మిక సంతోషం, శాంతి, దేవునికి దగ్గరవుతున్నామనే తృప్తిని పొందుతున్న తరుణంలో ఏవమ్మకు ఏదేను వనంలో పండును చూపించినట్లుగా, జాలరులు చేపలు పట్టడానికి ఎరవేసినట్లుగా సాతాను మన ముందు ఈ లోక తాత్కాలిక ఆనందాన్ని చూపిస్తుంటుంది. ఈ ఆనందాన్ని అనుభవించటమే స్వర్గంగా, శాశ్వత ఆనందంగా అనిపించినా పరోక్షంగా నరకం రుచి చూస్తున్నట్లే. సాతాను పంపించే శోధన అనే ఆహ్వానాన్ని అంగీకరించి, అనుకూలంగా స్పందిస్తే పాపం కట్టుకుంటాం. తాను ఎప్పుడు పిలిస్తే అపుడు దేవుడు పలికే విధంగా దేవునితో మోషే ప్రవక్త యొక్క సంబంధం ఏర్పడినప్పటికి సాతాను ప్రలోభానికి గురై దేవుని శక్తిని, ప్రభావాన్ని అనుమానించాడు. తత్ఫలితంగా కనాను ప్రాంతంలో తన పాదాన్ని

మోపలేకపోయాడు. క్రీస్తు మనందరిని తన మరణ, పునరుత్థానంతో స్వతంత్రులను చేసాడు. స్వతంత్రులమైన మనం పాపం చేసినపుడు 'బానిసత్వం' అనే కాడి మనపై మోపబడుతుంది (గలతీ 5:1). మనం ఈ లోకంలో ఉన్నది ఏదో సాధించడానికి. ఆశయం భగవంతుని చేరడమే. మన ఆశయానికి మనకు మధ్య ఉన్న దూరం పాపం చేయడం వలన పెరిగిపోతుంది. ఆది తల్లిదండ్రులు చేసిన పాపం వలన కొన్ని గాయాలు మనలను నేటికీ వెంటాడుతూనే ఉంటాయి. అజ్ఞానం, అసూయ, బలహీనత, విచ్ఛిన్నమైన వ్యామోహాలు లాంటి కొన్ని గాయాలు పుణ్యక్రియల ద్వారా నయం చేయబడితే, పాపక్రియల ద్వారా పెద్దవిగా మారుతాయి. ఇవి మనకు ఏ విధమైన హాని చేయవు కాని దుష్క్రియల వల్ల హానికరంగా మారతాయి. ఇది నా బలహీనత, నా అజ్ఞానం. అందువల్లనే పాపం చేసాను. దేవుడు నన్ను శోధిస్తున్నాడు అని పలుకరాదు (యాకోబు 1:13-14). ఎందుకంటే కేవలం ఈ లోకంలో ఉన్న సుఖభోగాలకు ఆకర్షింపబడి చిక్కుకుంటున్నాం. మన స్వేచ్ఛతో, జ్ఞానంతో చేస్తున్న క్రియ పాపం. ఒకసారి పాపం చేస్తే దుర్గుణాలకు మార్గం ఏర్పడినట్లే. నోవాకాలంలో ప్రజలందరు లౌకిక వాంఛలతో దేవుణ్ణి మరచిపోయి వారి ఇష్టానుసారంగా జీవించారు. దేవుడు వారినందరిని జలప్రళయంతో సర్వనాశనం చేశాడు. ఈనాడు నూతన నిబంధనతో, క్రీస్తు మనందరిని ప్రేమిస్తున్నాడు. ఎవరికిని హాని కలిగించడు. ఎవరి జీవితానికి వారే బాధ్యులు. యూదా ఇస్కరియోతును క్రీస్తు తన అక్కున చేర్చుకున్నాడు. కాని తనకు తానుగా ధనాపేక్షతో దేవుని నుండి దూరదూరంగా వెళ్లాడు. ఎంతదూరం వెళ్లాడంటే ఆత్మహత్య చేసుకునేంత దూరం వెళ్లాడు. ఏ దుర్గుణానికైనా విత్తనం జ్ఞానం, స్వేచ్ఛలను దుర్వినియోగపరచడం వలన చేసిన పాపమే.

**దుర్గుణాలకు పునాది: అలవాట్లు**

ఒకసారి ఒక విద్యార్థుల బృందం సందర్శన కొరకై రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లి అక్కడ ఉన్న ఖైదీలను, పరిసర ప్రాంతాలను చూస్తూ ఉండగా కొందరు ఖైదీలు ఎదురుగా నడుచుకుంటూ వస్తుండగా వారిని తదేకంగా చూస్తూ వారితో సంభాషించాలనే కుతూహలంతో ఒక విద్యార్థి వారి దగ్గరకు వెళ్లి ఒక వ్యక్తిని ఊరు, పేరు అడిగిన తరువాత తను ఈ శిక్షను పొందటానికి కారాగారంలో



ఉండడానికి గల కారణం అడుగగా అతను సమాధానం ఏమిటంటే: 'నేను నా భార్యను కాల్చేసాను' అని చాలా గర్వించదగ్గ కార్యం చేసినట్లుగా చెప్పాడు: అతడు తన జీవితంలో ఒక్కసారిగా హంతకుడిగా, కఠినాత్ముడిగా మారిపోయాడా?

దేవుని ఆజ్ఞలను ధిక్కరిస్తూ జీవించడం వలన పాపం కట్టుకొంటాం. ఒకసారి పాపం చేయడం వలన అదే పాపం మరలా మరలా చేయడానికి, ఒక ఘోరపాపం చేయడానికి ఎక్కువ ఆవశ్యకత ఉంటుంది. ఇలా పాపం చేయడం అలవాటుగా మారినపుడు దుర్గుణాలకు గట్టి పునాది వేసినట్లే. అలవాటు మనిషి వైఖరిని తెలియజేస్తుంది. ఒకరోజు త్రాగి ఇంటికి వచ్చినవాడిని త్రాగుబోతు అని పిలువరు కాని ఒకసారి త్రాగినవాడు మరలా మరలా త్రాగడానికి మొగ్గుచూపుతాడు. ఇలా ప్రతిరోజు త్రాగి ఇంటికి వచ్చి భార్యను ఇబ్బందిపెడుతూ, పిల్లలను సక్రమమైన మార్గంలో పెంచడంలో విఫలమయినపుడు ఆ భర్తను త్రాగుబోతు, ఎందుకు పనికిరానివాడు అని అంటారు. ఒక కార్యం అది మంచిదైన లేదా చెడుదైన తదేకంగా నెరవేరుస్తున్నపుడు అది అలవాటుగా మారుతుంది. చెడు అలవాట్లు సులువుగా, ఉచితంగా మన జీవితంలోకి వస్తుంటాయి. మంచి అలవాట్లు కొరకు కఠినంగా శ్రమించాల్సి ఉంటుంది. ఇప్పుడు క్రైస్తవ సంఘంలోని పెద్దవారు క్రమం తప్పకుండా దేవుని సన్నిధికి వస్తున్నారంటే దానికి కారణం వారి చిన్నప్రాయంలో తల్లిదండ్రులచే, గురువులచే, కన్యాస్త్రీలచే, ఉపదేశులచే, ఇతర దైవప్రజలచేత గుడికి రావడం ఒక అలవాటుగా తీర్చిదిద్దబడడమే. ఎడారిలో ఇస్రాయేలు ప్రజలను మోషే ప్రవక్త నడిపించే కాలంలో వారికి ఇబ్బంది కలిగిన ప్రతిసారి సణుగుకొనడం ఒక అలవాటుగా (నిర్గమకాండము) మారింది. అలవాటు ఆలోచింపనీయదు. పరిసయ్యులకు యేసుక్రీస్తుని ప్రశ్నించడం ఒక అలవాటుగా మారిపోయింది. అందుచేతనే ప్రభువు మంచిపని చేసినా వారి ప్రవర్తన మారలేదు. యేసుక్రీస్తుకు క్షమించడం ఒక (సహజ గుణం) ధ్యేయంగా చూడవచ్చు. అందువలనే ఆయనను హింసించిన వారిని సహితం సిలువపై నుండి క్షమిస్తున్నారు. ఒక మొక్కను భూమిలో నాటిన తరువాత నీరుపోస్తూ ఎరువువేస్తూ ఉంటే కొంతకాలానికి అది ఒక వృక్షంగా మారుతుంది. ఆ తరువాత బలమైన గాలులను సహితం ఆ వృక్షం ఎదుర్కోగలదు. చెట్టు యొక్క బలం, అది ఎదిగిన ఎత్తుపైన ఆధారపడి ఉండదు. దాని ఆధారం

అంతా భూమిలో వేర్లు ఎంత లోతుగా పాతుకుపోతే అంత బలంగా ఉంటుంది. ఇదే రీతిలో అలవాట్లు కూడా. మంచి అలవాట్లు మంచివాడిగా, చెడు అలవాట్లు చెడు వ్యక్తిగా గుర్తింపునిస్తాయి. ఒకవేళ మనం మేల్కొని లేనిపక్షంలో జీవితంలో చెడు అలవాట్లు అతి తక్కువ కాలంలో మహా వృక్షంలా పెరిగిపోతాయి. వృక్షంలోని సగభాగం బయట మరో సగభాగం భూమిలోపల ఉన్నట్లుగా మనిషి జీవితంలో చెడుక్రియలు, దుష్టకార్యాలు, దుర్గుణక్రియలు చోటు చేసుకుంటున్నాయంటే వాటికంటూ ఓ మూలం ఖచ్చితంగా ఉంది.

## దుర్గుణాల నివాసం – ఆత్మ

దేవుడు ఒసగిన ఆత్మ పవిత్రమైంది. ప్రతి వ్యక్తి తాను చేసిన పనిని, చేస్తున్న పనిని, చేయబోయే పని మంచిదో లేక చెడ్డదో అని తెలియపరిచేదే అంతరాత్మ. ఆత్మను ఆధ్యాత్మికతకు ఒక చిహ్నంగాను, న్యాయనిర్ణేతగాను, అంతరంగిక చట్టసభగాను, దైవంగాను పరిగణించవచ్చు. సత్యాన్ని గ్రహించడం, గ్రహించిన సత్యాన్ని బయల్పరచడమే ఆత్మ యొక్క ప్రప్రథమ బాధ్యత. ఇది సంపాదించుకున్నది కాదు. ఇల్లు, కారు, డబ్బు, పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నట్లుగా ఆత్మను సంపాదించలేం. ఎందుకన ఆత్మ దైవ వరప్రసాదం. మీయందు వసించు పవిత్రాత్మ దేవునిచే ఒసగబడింది (1 కొరింతీ 6:19) అని పునీత పౌలుగారు సుస్పష్టం చేశారు. సంపాదించుకోలేని దైవప్రసాదమైన ఆత్మను కాపాడుకోవాలి. మనలో ఉన్న ఆత్మపై మరకలు పడకుండా చూసుకోవాలి. ఆత్మ దుర్గుణాలకు స్థావరంగా మారిపోకుండా కాపాడుకోవాలి. సత్య, అసత్య ఆత్మలను గూర్చి బైబిల్ గ్రంథం (1 యోహాను 4:6) తేటతెల్లం చేసింది. మనం దేవుని వాక్యాన్ని పెడచెవిని పెట్టి లౌకిక వాంఛలకు లోనైతే ఆత్మను కోల్పోతాం. చివరకు ఓ కఠిన శిలగా మన ఆత్మ మారిపోతుంది. మనం మాట్లాడే మాటలు, చేసే పనులు, ఆలోచనలు కఠినమైనవిగా బయటకు వస్తాయి. మన బాహ్యక్రియలు చెడుగా ఉన్నాయింటే అంతరంగికంగా ఆత్మను కోల్పోతున్నట్లే. మొసలి శరీరభాగమంతా ఇనుమువలె గట్టిగాను దాని హృదయం కూడా చాలా కఠినంగా ఉంటుంది అని దైవవాక్కు చెబుతుంది. మొసలిని పోలిన విధంగా మనం కూడా తయారవుతాం. ఒకవేళ దుర్గుణానికి దారి తీస్తూ ఆత్మ అంతయు సాతాను గుప్పిట్లోకి



చేరిపోతుంది. నిత్యం విందుల, వినోదాలతో కాలం గడిపిన ధనవంతుని సాతాను ఘోర నరకంలోనికి కొనిపోయింది (లూకా 16:19,27,28).

## దుర్గుణాలు: అనేకం

ప్రస్తుత కాలంలో ఆనందింపదగ్గ విషయం ఏమిటంటే ఎంతోమంది మరియతల్లి పట్ల ఎనలేని గౌరవం కలిగి జీవిస్తున్నారు. కతోలికులు కాకపోయిన, క్రైస్తవులు కాకపోయిన ఎంతోమంది మరియతల్లిని గౌరవించడం, మర్యాద చూపడం మనం చూస్తున్నాం. మరియతల్లి ఎంతో గొప్పగా గౌరవమర్యాదలకు అర్హులవ్వడానికి గల కారణం ఆమె పవిత్రత, సద్గుణాలే. అందుకే మరియతల్లిని సకల సద్గుణ రాశి అని వర్ణించడం జరిగింది. ఎన్ని సద్గుణాలు ఉన్నాయో అవి అన్నీ మరియతల్లి దేహంలో వాసం చేసాయి. ప్రతి సద్గుణానికి వ్యతిరేఖమైన గుణం దుర్గుణం. సద్గుణం అనేకమైనపుడు దుర్గుణాలు కూడా అనేకమే. కావున సాతాను సకల దుర్గుణ రాశి. మానవునిలో ప్రతిష్ఠింపబడే ప్రతి దుర్గుణం కూడా సాతాను కష్టార్జితమే. క్షణ క్షణం మన జీవితంలో ప్రతిచోట ఒక మంచి పని చేయాలి అనే భావన కలిగి జీవిస్తున్నపుడల్లా సాతాను మనతో ఒక్కొక్క పాపం చేయించి దుర్గుణంకు మార్గం ఏర్పరుస్తుంది. దుర్గుణాలు మనిషిని పూర్తిగా మార్చివేస్తాయి. ముందుగా మనం తెలుసుకున్నట్లుగా "చెడు పని చేయడానికి అలవాటుపడిన దృఢ వైఖరియే దుర్గుణం" అని కతోలిక శ్రీసభ సత్యోపదేశం చెబుతుంది. సాతాను ఒక్క పాపం చేయడానికే నిరంతరం కృషి చేస్తుంది. ఆ తరువాత సాతాను గమ్యాన్ని మనం చాలా సులభతరం చేస్తాము. ఈ దుర్గుణాలు మనిషిలోని మానవత్వాన్ని రూపుమాపి, మరొకరూపాన్ని ఇస్తాయి. తత్ఫలితంగా దుర్గుణాలు కలిగిన వ్యక్తి యొక్క మాటలు, చూపు, ప్రవర్తన ఎదుటివారిని, హింసిస్తూ, దేవుని నుండి వైదొలగిపోయేలా చేస్తాయి. ఒక క్రొవ్వొత్తి వేలకొలది క్రొవ్వొత్తులను వెలిగించగలదు అన్నట్లుగా ఒక దుర్గుణం అనేక దుర్గుణాలకు దారి తీస్తుంది. దుర్గుణాలు అనేకమైన సత్యశ్రీసభలోని పండితులు చావైన ఏడు పాపాలను ముఖ్య దుర్గుణాలుగా పేర్కొంటున్నారు. అవి:

1. గర్వం : ప్రతి పాపంలోనూ ఒకింత గర్వం ఖచ్చితంగా ఉంటుంది. ఇది నాశనానికి దారి తీస్తుంది (పరీక్షించి చూడుడు).

2. అసూయ : ఇతరులు నాశనమైనపుడు మనం సంతోషపడడం, ఇతరులు సంతోషంగా జీవిస్తుండగా మనం బాధపడుతూ ఉండడమే అసూయ. తప్పిపోయిన కుమారుడు ఉపమానంలో పెద్ద కుమారుడు తనకు లేనిదాని గురించి, తాను పొందని దానిని గూర్చి చింతించడం లేదు. తన సహోదరుడు తన తండ్రి వద్ద పొందిన అనురాగం, ప్రేమ, ఆప్యాయత, స్వేచ్ఛలను గూర్చి చింతిస్తున్నాడు.

3. ఆగ్రహం : నిజానికి కోపం మంచిదే. కోపం అన్యాయాన్ని ఎదిరించడానికి సక్రమంగా వాడబడితే చాలా మంచిది. యేసుప్రభువు దేవాలయంలో వ్యాపారం చేస్తున్నవారిపై కోపం చూపారు. కోపం మన కోరిక మేరకు జరుగుతున్న అన్యాయాన్ని సమర్థించడానికి వాడినప్పుడు అది దుర్గుణమే.

4. సోమరితనం (ఆధ్యాత్మిక మాంద్యం) :

జీవితంలోని అత్యున్నతమైన విషయాలపట్ల ఏకాగ్రత లేకుండా దేవుని నుండి దూరమైపోవడమే. ఇది శారీరకమైన సోమరితనం కాదు. ఆధ్యాత్మికమైంది ‘‘నా ప్రాణమా తిని, త్రాగు, సుఖించుము’’ (లూకా 12:19) అనే జీవితాన్ని కొనసాగిస్తే దేవునికి దూరంగా ఉంటాం.

5. అత్యాశ : కోర్కెలు అనేకం అని అందరికి తెలుసు. కోరికలు పుట్టడం సహజం కాని అత్యున్నతమైంది (దేవుని) పొందాలని కోరుకోవాలి. నిత్యజీవితంలో విచ్ఛిన్నమైన, క్రమం లేకుండా ప్రాపంచిక వస్తువుల పట్ల ఆశ కలిగి జీవించడం.

6. తిండిబోతుతనము :

బ్రతకడం కోసం తినాలి. కాని తినడం కోసమే నేను బ్రతుకుతున్నా అనే జీవితాన్ని విడనాడాలి. అవసరమైన దానికంటే, అధికంగా క్రమం లేకుండా తిని, త్రాగి జీవించే శైలి.



7. మోహం : లైంగిక వాంఛలు, క్రియలలో సంలీనమై జీవించే విధానం. సొదొమ, గొమొఱ్ఱ పట్టణాలను దేవుడు నాశనం చేసింది కేవలం విచ్ఛిన్నమైన వారి జీవిత శైలి వలననే. స్త్రీలు, పురుషులు అన్యోన్య మోహముతో తపించారు, ఒకరితో ఒకరు లజ్జాకరంగా ప్రవర్తించారు. వారి జీవితానికి ప్రతిఫలంగా శిక్షను తమ శరీరములందు అనుభవించారు. (రోమీ 1:27).

**ముగింపు**

ఒక వైద్యుడు తాను పొందిన పట్టాతో ఎనలేని సేవలు అందిస్తాడు. ఒక ఇంజనీర్, పోలీస్ ఇలా ప్రతీ రంగంలో వారు పొందిన ప్రావీణ్యతను బయట పంచుతున్నారు. క్రీస్తును స్వీకరించిన మనం మనతోనే ఉంచుకుంటున్నామా? లేక ఇతరులకు పంచుతున్నామా? క్రీస్తుని పంచాలంటే మనం క్రీస్తుని కలిగి ఉండాలి. కలిగి ఉన్న క్రీస్తును ప్రకటించాలి. ఎప్పుడు మన దుర్గుణాలను విడనాడి సామాజిక జీవితంలో జీవిస్తామో అపుడు క్రీస్తుని పరిచయం చేయగలం. ఒక చిన్న పాపమే జ్ఞానాన్ని, స్వేచ్ఛలను దుర్వినియోగపరిస్తే ఆ శైలి (ప్రవర్తన) దుర్గుణాలకు దారితీస్తుంది. మానవులమైన మనం అనునిత్యం దుర్గుణాలు మనలో ప్రవేశించకుండా ఉండడానికి, ఉన్న దుర్గుణాలను నివారించడానికి కృషి చేయాలి.

“ఉన్న స్వేచ్ఛను వినియోగించుకుంటూ విలువైన జ్ఞానం అర్జిద్దాం
ఉన్న జ్ఞానం వినియోగించుకుంటూ విలువైన స్వేచ్ఛను పొందుదాం”

# 10. పునీత మదర్ థెరెసా – సుగుణాల రాశి

– బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్



**ఉపోద్ఘాతం**

మిల మిలమను తారలెన్నో గగనాన
కాంతినిచ్చు తారలెన్ని భువనాన
నరులెందరో జనియించె భువిలోన
ధన్యులెందరు వారిలో ధరలోన
దైవపుత్రులమందురు అందరు
దైవసేవయే లక్ష్యంగా సాగారు కొందరు
ఉదయించేవారు పరమ పునీతులుగా
ప్రేమ, దయ, సేవే వారికున్న సుగుణాలు
త్యాగబలిదానాలే వారికున్న సొగసులు
ఆ పరమ పునీతులందరిలో ఒకరు
మన సహాయ మాతృమూర్తి మదర్ థెరెసాగారు

మనం ఎంతోమంది పునీతుల జీవిత చరిత్రలను గూర్చి చదివి, వారి యొక్క జీవితాన్ని ఒక ఆదర్శవంతమైన జీవితంగ స్వీకరించి, మన యొక్క విశ్వాసాన్ని ముప్పదంతలుగా, అరువదంతలుగా, నూరంతలుగా పెంపొందించుకుంటున్నాం. అటువంటి పునీతులలో ఒక గొప్ప కార్యదీక్షాపరురాలు, నిజాయితీ మూర్తీభవించిన ఓ గొప్ప సేవాజీవి, అనాథుల అభాగ్యుల గుండెలలో వెలసిన ఆశాజ్యోతి, క్రీస్తుప్రభుని యెడల అచంచలమైన విశ్వాసాన్ని కలిగి, జీవితం అనే సాగరంలో ఎన్నెన్నో ఆటుపోటులతో విజయోత్సవంలను అనుభవించి క్రీస్తుకు గొప్ప సాక్షిగా జీవించి తన అమూల్యమైన జీవితమును ఆ క్రీస్తు భగవానునికి అర్పించిన గొప్ప



సంఘజీవి, సుగుణాల రాశి, పాటించి జీవించిన ఆదర్శమూర్తి మన పునీత మదర్ తెరెసా గారు.

**1. జననం – ప్రేరణ**

ఆగష్టు 26, 1910లో మదర్ థెరిస్సా యుగోస్లావియాలో ఉన్న 'స్కోపియే' అనే గ్రామంలో జన్మించారు. ఆమె అసలు పేరు ఆగ్నేస్ గోంన్హా బోజాక్ష్యు అనగా "పుష్పపు మొగ్గ" అని అర్థం. 1929 జనవరిలో భారతదేశానికి వచ్చారు. మఠకన్య శిక్షణ కోసం డార్జిలింగ్‌కు పంపారు. తదనంతరం 1931 మే 24న ఆగ్నేస్ తన ప్రథమ మఠవాగ్దానాలను చేసి, తన పేరును 'థెరిసా'గా మార్చుకున్నారు. ఆ తరువాత కలకత్తాకు వచ్చారు. తన సేవలను తోరేటో పాఠశాలలో అందిస్తున్నప్పుడు, తనే స్వయంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేయాలని ఆలోచించింది. 1946లో కలకత్తా నుండి డార్జిలింగ్‌కు రైల్లో ప్రయాణం చేస్తుండగా ఆమెలో ఒక దివ్యానుభూతి కలిగింది. అన్నింటికీ సిద్ధమై కాన్వెంటు నాలుగు గోడల మధ్యవున్న క్రీస్తుప్రభువును కలకత్తా బయటకు తెచ్చింది. మురికివాడలో ఓ సువార్త మహోద్యమానికి శ్రీకారం చుట్టింది. ఈ అత్యల్పులకు సేవ చేయటమే నిజమైన క్రీస్తు సేవ, దయ, ప్రేమ, మానవత్వం, తన దైవపిలుపు అంతరార్థం అనుకుంది.

**2. పునీత మదర్ థెరెసా – సుగుణాల రాశి**

ప్రతి నిమిషం ఈ ప్రపంచంలో కొన్ని వందల మంది పిల్లలు జన్మిస్తున్నారు. వారితో పాటుగా ఒక దివ్యాత్మ ప్రపంచంలో ప్రవేశిస్తుంది. శాంతి, స్నేహం, దయ, ప్రేమ, సేవ, మానవత్వం సహానుభూతి ధ్యేయమైన ఆ అమృతమూర్తి ఒక దేవదూతే అయివుంటుంది. దేవుడు ఇక్కడి కార్యాలు నెరవేర్చటానికి ఆ బిడ్డను తన దూతగా ఎంపిక చేసాడు. ఇక్కడి లక్షలాది మంది బిడ్డల, అన్నార్తుల ఆకలి తీర్చే, సేదతీర్చే దయామయి. బీదల, నిస్సహాయుల, రోగుల, వికలాంగుల, వృద్ధుల మరణానికి చేరువైన దీనుల కోసం తన జీవితాన్నే ధారపోసిన ఒక అమృతమూర్తి మదర్ థెరెసా.

**2.1 అమృత వర్షిణి – దయార్ద్ర హృదయిని**

ఆమె అమ్మ. కానీ అందరిలాంటి అమ్మకాదామె. అందరి పిల్లలు ఆమె పిల్లలే. అందరికీ సమానంగా ఆప్యాయతను పంచి ఇచ్చే అమృత హృదయం

ఆమెది. నిర్మల హృదయమది. ఆమె మదర్ థెరిసా... మానవత్వం మూర్తీభవించిన మహనీయురాలు. కలకత్తా వీధుల్లో మృత్యువుకు చేరువవుతున్న నిర్భాగ్యులు కావచ్చు, సమాజం వెలివేసిన కుష్ఠు వ్యాధిగ్రస్తులు కావచ్చు. భూకంప బాధితులు కావచ్చు, అంతర్యుద్ధాల్లో అయిన వారందర్నీ కోల్పోయి అనాథులుగా మిగిలిన పసికందులు కావచ్చు. ఎవరైనా సరే.. ఆర్తితో అక్కున చేర్చుకునే అమృత హృదయం మదర్‌ది. దైవమిచ్చిన పిలుపు మేరకు పేదసాదల బతుకులను, తాడిత, పీడిత వర్గాలకు అండగా నిలిచి వారి సేవలో అహర్నిశలు శ్రమించిన అమృతమూర్తి, దయార్ద్ర హృదయిని.

చిన్ననాటి నుండి దయార్ద్ర హృదయురాలు. మదర్ థెరిసాగారి సేవాభావం చిన్నవయసులోనే అందరిని ఆశ్చర్యపరిచింది. ఒకరోజు పాఠశాలకు ఆలస్యంగా ఎందుకు వచ్చావని ఉపాధ్యాయిని ప్రశ్నించినపుడు, ఒక ముసలి వ్యక్తి జ్వరంతో స్పృహ తప్పి రోడ్డుమీద పడిపోతే ఆయనను ఆసుపత్రిలో చేర్పించి వస్తున్నానని థెరిసా ఇచ్చిన సమాధానానికి ఉపాధ్యాయిని మనసు ఆనందంతో నిండిపోయింది. మరి అంతటి దయాసుగుణం కలిగిన వ్యక్తి పునీత మదర్ థెరిసాగారు.

### 2.2 అనాథుల అభాగ్యుల ప్రేమమూర్తి

కతోలిక శ్రీసభ సత్యోపదేశ సంక్షేమం ఒకటవ నిబంధన ప్రకారం ప్రతి మనిషి నుండి దేవుడు కోరేది తనను తెలుసుకొని, ప్రేమించి, సేవించి అటువెనుక మోక్షభాగ్యాన్ని పొందడం. మరి వీటిని పరిపూర్తి చేసే విధానంలో కొందరు కొంతవరకు రానిస్తే, మరికొందరు ఫలవంతమగుటలో విఫలమవ్వడం మనం చూస్తుంటాం. అయితే మరికొందరు ఎవ్వరు ఊహించని రీతిలో దేవుని తెలుసుకొని, ప్రేమిస్తూ, సేవిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తూ మోక్షాన్ని పొందే వారిని కూడా మనం చూస్తుంటాం. ఆ కోవకు చెందిన వారిలో ఒకరు మదర్ థెరిసాగారు.

మనం గుర్తు చేసుకుంటే... "ఆమె మంచి సమరీయునికి ప్రతీక" అని ఆమె జీవితం "ధైర్యసాహసాలతో కూడిన సువార్త ప్రకటన లాంటిది" అని మనం చెప్పుకోవటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే ఆమె ప్రస్తుత సమాజంలో ఎనలేని ప్రేమా సేవలతో ప్రాముఖ్యతను మూర్తీభవించి, మంచి వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నటువంటి వ్యక్తి – మదర్ థెరిసాగారు. ఆమె మాటల్లో



చెప్పుకోవాలంటే "ప్రతి ఒక్కరు అసాధారణమైన జీవితం జీవించడానికి సృష్టించబడ్డారు". ఆ అసాధారణమైన జీవితం ఆ ప్రేమమూర్తి మాటల్లో వినాలంటే "ప్రేమించడం, ప్రేమను పొందడం" ఆ ప్రేమ కేవలం మాటలతో సరిపుచ్చే ప్రేమ కాదు గాని అవధులులేని ప్రేమతో ప్రేమించడం, అంతటితో సరిపెట్టకుండా, ప్రేమించిన వారి నుండి ఏమి ఆశించకపోవడం. ఈ అసాధారణమైన జీవితం ఆమె ఏవిధంగా పొందారు అని అడిగితే వచ్చే సమాధానం, మనం ఒక్క క్షణం ఆలోచించిన మనకు తట్టేది కూడా క్రీస్తు ప్రభుని మాటలే. "నేను మిమ్ము ప్రేమించినట్లే మీరును ఒకరినొకరు ప్రేమించుకొనుడు. మీరు పరస్పరము ప్రేమ కలిగి ఉన్నచో దానిని బట్టి మీరు నా శిష్యులని అందరు తెలుసుకొందురు" (యోహాను 14:34–35). క్రీస్తు ప్రభువు ఏవిధంగా తండ్రి దేవుని ప్రేమను మానవాళికి వ్యక్తపరచటంలో వెనుకంజ వేయలేదో మదర్ థెరిసా గారు కూడా పరిపూర్ణమైనటువంటి హృదయంతో క్రీస్తుని ప్రేమించారు. కాబట్టి ఆయన ప్రేమయందు నెలకొని, ఆయన ఆజ్ఞలు పాటించి, అధికంగా ఫలించారు. తండ్రి దేవున్ని మహిమపరిచారు. ఆ విధంగా క్రీస్తుప్రభుని మాటలు తనలో నిలుపుకున్నారు. కాబట్టి ఆమె కోరినది ప్రతిఒక్కటి ఆమె జీవితంలో ఒసగబడింది. "నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచియున్నచో మీరు ఏమి కోరినను అది మీకు ఒసగబడును" (యోహాను 15:7).

మనం మదర్ థెరిసాగారి జీవితం నుండి నేర్చుకోవాల్సిన ఓ గొప్ప సత్యం – ప్రేమను పంచడమే. కాని ప్రేమను పంచడానికి ముందు ఆ ప్రేమమూర్తిలా ప్రతి ఒక్కరు ప్రేమిస్తూ, ప్రేమను పొందితే, మానవునికి దేవుడు ప్రతిపాదించిన ప్రణాళికను నెరవేర్చిన వారమౌతాం. ఈనాడు మన నుండి ఆ ప్రేమమూర్తి కోరే ప్రేమ అవసరత ఎంత ఉందని మనం ఆలోచిస్తే.. ఆ మాటలు ఆమె ద్వారానే వింటే బాగుంటుంది. ఒకసారి మదర్ థెరిసాగారు ఒక వీధిలో ప్రయాణిస్తున్నారు. చాలామంది ఆ దిశలో ప్రయాణం చేసినా ఎవ్వరు పట్టించుకోకుండ, ఒకవైపు నుండి పురుగులు తీసివేస్తున్న వ్యక్తిని ఆమె చేరదీసారు. కానీ ఆమె చేరదీసారు. ఇతరులు ఆ వ్యక్తి నుండి వచ్చే దుర్వాసనను భరించలేకున్నారు. కానీ ఆమె అతనికి స్నానం చేయిస్తుంటే, అతను అడిగాడు.. ఎందుకు తనకు ఇదంతా చేస్తున్నారని.. అప్పుడు ఆమె ఇచ్చిన సమాధానం "తనను ప్రేమిస్తున్నాను" అని. దేవుని మీద

ఉన్న ప్రేమ తోటి మానవుల మీద చూపితే ఆ ప్రేమ పరిపూర్తి అవుతుంది. మరి ఇలాంటివారు ఇప్పుడు లేరని మనం తలిస్తే మనకు కనువిప్పు కలిగినట్లే. కేవలం ప్రేమను పంచడానికే సాక్షాత్తు దేవుడు సైతం తన ఏకైక కుమారుని పంపారు. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను" (యోహాను 3:16). కాబట్టి ప్రేమను పంచుతూ ప్రేమను పొందుదాం.. ఎందుకంటే "ప్రేమ కావాలి మానవాళికి".

## 2.3 అన్నార్తుల విశ్వసేవామూర్తి

మదర్ థెరెసాకు ప్రేమే దైవం. సేవను నమ్ముకుంది. దేవునిపట్ల భక్తి, పేదలకు సేవచేయటం ద్వారా చేతలతో చూపించింది. అందుకే, ఆమె ఈ విధంగా చెబుతుంది.

"నిశ్శబ్దత ఫలం ప్రార్థన"
ప్రార్థన ఫలం విశ్వాసం
విశ్వాస ఫలం ప్రేమ
ప్రేమ ఫలం సేవ"

వికలాంగులు, మానసిక నిబద్ధతలేని, జీవితం మీద విసిగి వేసారైన నిస్పర్శామాత్రుల వేదన రూపుమాపటానికి అమ్మ బాసటగా నిలిచారు. జీవితానికి ముగింపొక్కటే మిగిలిందనుకున్న లక్షలాది మందికి ఆమె క్రొత్త జీవితం విలువ చూపించారు. తన ఓదార్పు, తన స్వాంతన వారి కళ్లు చెమరించేలా చేసింది. ఇంకా జీవించాల్సిన అవసరం నేర్పింది. అందుకే ఆమె "అమ్మ"యింది. ప్రేమ, విశ్వాసం, సేవ, దయ థెరిసా దగ్గర అమూల్యమైన ఆభరణాలు. ఆమె వ్యక్తిత్వం ప్రపంచానికి చిరపరిచితం. అంతిమ ఘడియల్లో వున్నవారు కూడా సంతోషంతో మరణించేలా చేసే మహత్తరమైన విద్య అమ్మ దగ్గర ఉంది. ఆమె జగమెరిగిన సేవకురాలు – మానవసేవ, ఆర్తజనోద్ధరణలో ఆమె ఎప్పుడూ శిఖరంలాగే నిలిచారు.

ఏనాడు తన పేరు ప్రఖ్యాతులు గురించిగాని, అధికారం కొరకు గాని, హోదా కొరకు గాని, గుర్తింపు కొరకు గాని, ప్రజల మన్నన పొందుటకుగాని ఏ



విధమైన స్వీయాభివృద్ధి ఆమె ప్రయత్నించలేదు. రోగులలోను, బాధాతప్తులలోను, నిర్లక్ష్యముగ విడిచిపెట్టబడిన వారిలోను, అనాధలలోను, యేసుని చూచి వారి పట్ల నిజమైన ప్రేమను సంరక్షణ బాధ్యతను, ఆదరణను చూపగలిగింది. కలకత్తాపురి పునీత థెరేసమ్మ గారు మన ప్రభు యొక్క బోధనలను తు.చ తప్పక పాటించినట్లు చెప్పవచ్చును. "యేసు తనను భోజనమునకైనను, విందునకైనను, నీ మిత్రులను, సోదరులను, బంధువులను, యిరుగు పొరుగు ధనికులను పిలువవలదు. నీవు విందు చేయునపుడు పేదలను, వికలాంగులను, కుంటివారిని, గ్రుడ్డివారిని పిలువుము. వారు నీకు ప్రతిఫలమును ఈయలేరు. కనుక నీవు ధన్యుడవు" (లూకా 14:12–14). నిజమైన ప్రేమకు, నిస్వార్థ సేవకు స్వీయ అభిరుచులు, స్వీయ నియమములు ఉండవు అని తన యొక్క జీవిత విధానం ద్వారా మనకు నేర్పింది, నెరవేర్చింది.

## 2.4 సర్వమతాభిమాని – మానవతామూర్తి

మానవత్వం పరిమళించిన మంచి మనిషి మన మదర్ థెరిసాగారు. ఎక్కడో పుట్టి, దేశాన్ని విడిచి, కన్నవారిని, సొంతవారిని విడిచి, తన సంస్కృతీ సంప్రదాయాలను విడిచి, రక్తబంధాలను విడిచి, ప్రభువుకు యిచ్చిన మాటపట్టుతో మతకన్యగా మన దేశానికి వచ్చి, మన ప్రజలకు సేవలందించిన గొప్ప వ్యక్తి మదర్ థెరిసా. జాతి కుల మత వర్గాలకు అతీతమైన వ్యక్తి. మానవత్వమే ఆమె సుగుణం. అందుకే ఆమె అందరిని ప్రేమిస్తుంది, అందరిని గౌరవిస్తుంది. ప్రపంచ నలుమూలలా మదర్ థెరెసాగారి సేవలను ప్రశంసించనివారు లేనేలేరు. మదర్ థెరెసా కలకత్తా పట్టణంలో స్థావరం ఏర్పరచుకుంది. దిక్కుమొక్కులేని పేద జనావళిని, రోగులను అక్కున చేర్చుకొని వారి ఆక్రందనలకు ఊరటను పాలించి దేవుని రూపాన్ని ప్రతి మనిషిలో చూస్తూ దేవుని ప్రేమను మానవులకు బయలుపరిచారు.

మురికివాడల్లో, చెత్తకుప్పల్లో విసిరివేయబడిన వీరేకాదు, మానవత్వం అందని ప్రతీవారు పేదవారేనంటూ మానవత్వం కోసం తపించే అందరికీ ఆమె అమ్మయింది. స్వచ్ఛమైన మానవత్వాన్ని, దయను, సేవను, ప్రేమను చూపింది. అక్కున చేర్చుకుంది, ఆదరించింది. గౌరవమైన బ్రతుకిచ్చింది. అసలైన అమ్మను, మానవత్వాన్ని స్వచ్ఛతను చాటింది.

### 3. పునీత మదర్ థెరెసా సుగుణాలు – పాటించి జీవించిన ఆదర్శమూర్తి

మదర్ థెరెసాగారు ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయి, ఎన్నో సంవత్సరాలు గడిచిపోయి ఉండవచ్చు, కాని తన యొక్క అపారమైన అంతులేని ప్రేమ, వివేకం ఈనాటికి సజీవంగానే ఉంది. భూమండలంపై జీవించినంతకాలం తాను ఎన్నో జీవిత పాఠాలను పంచుకుంది. వాటిలోనివి చాలా మట్టుకు ప్రేమ, దయ, సేవ, ఇతరులకు సాయం చేయుట, వినయాన్ని కలిగియుండుటపైనే అల్లుకొని ఉండింది. తన అద్భుతమైన జీవ స్వరూపం, మనమందరం అనుసరించేందుకు ఒక ఉదాహరణగా, ఆదర్శవంతురాలుగా మిగిలింది.

ఈ ఆధునిక నవయుగ ప్రపంచంలో మనం ఇతరులకు సేవలు చేయటానికి, సహాయం చేయటానికి సంకోచిస్తాం. ఎందుకంటే మనలో ఉన్నటువంటి తారతమ్యాలు, భేదాభిప్రాయాలు, నాది, నేను, నావారు, నా కులం, నా మతం, నా ప్రాంతం అనేటువంటి భావాన్ని తీసివేయలేకపోతున్నాయి. కాని మదర్ థెరెసాగారు మనలో ఒకరుగా తన జీవితాన్ని ఇతరుల కోసం సేవ చేయటానికి పరిపూర్ణంగా అర్పించుకొని, అహర్నిశలు శ్రమించి, క్రీస్తుప్రభువు నుండి శక్తిని పొందుకొని ఇతరులకు తన జీవితమే ఒక బాటగా, ఉదాహరణగా పాటించి జీవించిన ఆదర్శమూర్తి అని చెప్పటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఆమె జీవితమే ఇతరుల కోసం, ఇతరులే ఆమె జీవితంగా భావించింది అని చెప్పటంలో ఆమె జీవితమే తేటతెల్లం చేస్తుంది. ఆమె ఆదర్శజీవితం ద్వారా మనం ఈ ప్రస్తుత పరిస్థితిల్లో నేర్చుకోవలసిన జీవిత పాఠాలు, సుగుణాలను నేను ఈ దిగువనిస్తూ, మిమ్ములను పాటించమని కోరుతున్నాను.

### 3.1 హృదయపు ఆకలికి మించిన ఆకలి, మరొకటి లేదు

జబ్బులలో కెల్లా అతిపెద్ద జబ్బు నేడు పాశ్చాత్య దేశాలలో టి.బి. లేదా కుష్టు కాదు, చేరదీయకపోవడం, పట్టించుకునేవారు లేకపోవడం, ఆదరణ చూపి, ప్రేమను కురిపించే వారే కరువవడం. శారీరకమైన జబ్బులను మందులతో మనం నయం చేయగలంకాని, ఒంటరితనానికి, నిరాశా, నిస్పృహకు దిక్కులేని స్థితికి, ప్రేమ ఒక్కటే మందు ఒక్క ముద్ద అన్నం తినేందుకు లేక చనిపోయేవాళ్లు అంతకంటే ఎక్కువ వున్నారు. పేదరికం అన్నది పాశ్చాత్య దేశాలలో మరోరకమైన పేదరికం.



అంటే అది ఒంటరితనానికే సంబంధించిన పేదరికం కాదు, ఆధ్యాత్మికానికి కూడ సంబంధించినది. ఎలాగైతే ప్రేమ కోసం ఆకలి ఉందో, అలాగే దైవం కోసం కూడ ఆకలి ఉంది. "పట్టెడు అన్నం కోసం అల్లాడే ఆకలిని తీర్చడం కంటే, గుప్పెడు ప్రేమ కోసం అల్లాడే ఆకలిని తీర్చడం అతి కష్టం". డబ్బు సహాయం చేశామని తృప్తిచెంది ఉండక, డబ్బు ఒక్కటే సరిపోదు, డబ్బు ఏదో విధంగా వస్తుంది కాని, వాళ్ళకు కావలసింది మీ మనసులు, వాళ్ళను ప్రేమించే మీ హృదయాలు. కనుక, మనం వెళ్లిన ప్రతిచోట మన ప్రేమను ఆ మదర్ థెరెసాగారి వలె వ్యాపింపచేద్దాం.

### 3.2 ఒకరిపైన ఒకరికి ప్రేమ కలిగి ఉండాలి. అలా యావత్ ప్రపంచాన్నే ప్రేమించవచ్చు

ఒకరిని ఒకరు ప్రేమించమని యేసు ప్రభువు చెప్పారు. కాని యావత్ ప్రపంచాన్నే ప్రేమించమని చెప్పలేదు. వెళ్లండి బయట ప్రపంచం చూడండి, మీ ఎదురుపడ్డ వాళ్ళపై మీ ప్రేమను చూపండి. మీరు చూపించిన ప్రేమ, మీ స్నేహం మీ సమక్షం ద్వారా వాళ్ళ గుండెల్లో ఒక క్రొత్త వెలుగును అనుభవించేలా చేయండి. మీరు వెళ్లిన ప్రతి చోట ప్రేమను వ్యాపింపజేయండి. అన్నిటికంటే ముందు మీ కుటుంబంలో, మీ పిల్లలతో, మీ భార్యతో, మీ భర్తతో, మీ ఇరుగు పొరుగు వారితో మీ ప్రేమను పంచుకోండి. జీవితంలో మీకు ఎదురైన ప్రతి ఒక్కరిని, మంచిని, ఆనందాన్ని అనుభవించేలా చూడండి. సజీవమైన భగవంతుని దయ, కరుణ, ప్రేమ, సేవ మీలో చూడనివ్వండి, చూసి తరించేలా చేయండి. అది మీ ముఖకాంతి ద్వారా మీ కళ్ళలో కరుణ ద్వారా, మీ చిరునవ్వులో కరుణ ద్వారా దయతో పలికే మీ స్వాగతం ద్వారా చూపండి.

### 3.3 శాంతి – ప్రేమ చిరునవ్వుతోనే మొదలవుతుంది

మనం ఇరువురం కలిసే ప్రతిసారి చిరునవ్వుతో కలుసుకుందాం, ఎందుకంటే చిరునవ్వే ప్రేమకు, శాంతికి అంకురం. నీవు వెళ్లే ప్రతి చోట ప్రేమను వ్యాపింజేయి. నిన్ను కలిసిన ప్రతి వ్యక్తి ఎప్పుడును సంతోషంతో వెళ్ళలేదు అన్నట్టు ఉండకూడదు. ప్రతిసారి నీవు వెదజల్లే చిరునవ్వు, ప్రేమకు కార్యరూపం అవ్వాలి, ఒక బహుమతి అవ్వాలి, ఒక అందమైన అనుభవంగా నిలిచిపోవాలి.

## 3.4 దేవుని ఒకానొక్క స్వరమే, మౌనం

దేవుని కోసం మనం వెదకాలి. కాని ఎక్కడ అలజడి, అల్లర్లు ఉన్నవో, ఎక్కడ అవిశ్వాసం వుందో అక్కడ మనకు దేవుడు కనిపించడు. నిశ్శబ్దానికి దేవుడు మిత్రుడు. ప్రకృతిని చూడండి ఎలా గడ్డి, చేను, మొక్కలు, వృక్షాలు, పూలు నిశ్శబ్దంలో పెరుగుతాయో. ఆకాశంలో సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఎలా నిశ్శబ్దంగా కదిలిపోతుంటాయి. ఆత్మలను కదిలింపజేసేందుకు మనకు నిశ్శబ్దం ఎంతో అవసరం. మన హృదయ నిశ్శబ్దత నుండే దేవుడు మాట్లాడును. నీవు గనుక ప్రార్థనతో, నిశ్శబ్దతతో దేవునికై ఎదురుచూస్తే, దేవుడు నీతో మాట్లాడును. అప్పుడు నీకు తెలుస్తుంది, నీవు ఏమి కాదని, నీలో ఏమిలేదని, ఎప్పుడైతే నీకు అర్థమవుతుందో, నీవు ఏమి కాదని, నీలో ఏమియులేదని, నీలో అంతా శూన్యమేనని, అప్పుడు తెలుసుకుంటావు. నీ లేమిలో, నీ శూన్యంలో ఆ దేవుడే వచ్చి బసచేసి నీలో నిలిచి ఉంటాడని ప్రార్థనలతో లీనమైన ఆత్మలే, నిశ్శబ్దంలో వున్న గొప్ప ఆత్మలు. ఇది సాక్షాత్తు మదర్ థెరెసాగారి జీవితంలో జరిగింది.

## 3.5 విశ్వాసులే విజయవంతులు

దేవుడు నన్ను విజయవంతునిగా ఉండమని, నాకు పిలుపునివ్వలేదు. నన్ను ఒక మంచి విశ్వాసకునిగా ఉండమని పిలుపునిచ్చాడు. పేరు ప్రతిష్ఠ, బంగళా, ఆస్తులు, ఖరీదైన దుస్తులు. ఇవన్నీ సమాజానికి, ప్రపంచానికి ఒక విజయవంతమైన జీవితానికి కనబడే ప్రత్యక్ష సాక్ష్యాలు, కాని విజయాలు, నీవు ఏమిటో అవి నీకు తెలియపరచవు, నిన్ను నిన్నుగా మలచవు. నీ జీవిత రహదారి, నీ జీవిత బరువు నీకు భారమైనప్పుడు నీవు ఏమి చేస్తావు? నమ్మకంగా ఉండి, విశ్వాసంతో నీ జీవిత హెచ్చుతగ్గులలో నీతి, నిజాయితీతో నడచుకో.

మనం కొన్నిసార్లు మన జీవితంలో అనుకుంటాం, మనం చేసేవన్నీ సముద్రంలో పడే ఒక నీటిచుక్కతో సమానమని. కాని ఆ ఒక్క నీటిచుక్క లేకపోతే, సముద్రానికి ఎక్కడో ఒకచోట కొరతగా మిగిలిపోతుంది. సాధారణమైన జీవితం జీవించు, కనుక ఇతరులు సాధారణంగా జీవిస్తారు. నేను చేయగలిగినవి నీవు చేయలేవు, నీవు చేయగలిగినవి నేను చేయలేను. నీవు నేను కలసికట్టుగా గొప్ప పనులు చేయగలం అన్న గొప్ప సత్యాన్ని మనం ఏనాడు మన అనుదిన జీవితాల్లో



మరచిపోకుండా, మన చుట్టూ ఉన్న పేదలను, నిరాశ్రయులను, అభాగ్యులను, అన్నార్తులను, అనాధులను, దిక్కుమొక్కులేని వారిని ఆ మదర్ థెరెసాగారి వలె ప్రేమించుదాం, సహాయం చేద్దాం. మదర్ థెరెసా చేసే సేవ ఒక నీటి బొట్టులాంటిదని చెప్పింది. ఆ కొంత సేవ లేకపోతే ఆ నీటిబొట్టు సముద్రంలో లోటే అవుతుంది.

## ముగింపు

చూశారా ప్రియులారా! మనం ఎంత గొప్ప వ్యక్తిని పునీతురాలిగా కలిగి ఉన్నామో. ఈమె జీవించినంత కాలం ప్రతిరోజును దేవుడు ఇచ్చిన గొప్ప బహుమానంగా భావించి బీదలను, రోగులను, అనాధులను, పసిపిల్లలను ఆదరించి వారికి నిజమైన ప్రేమను, దయను, మానవత్వాన్ని, సేవలను అందించిన గొప్ప తల్లి, ప్రేమమూర్తి, దయామూర్తి, మానవతామూర్తి, సేవామూర్తి మన పునీత మదర్ థెరెసా. ఒకసారి ఆలోచించుదాం. యదార్థమైన కతోలిక జీవితాన్ని జీవిస్తున్న మనమందరం, మన జీవితంలో ఎందుకు ఆ మదర్ థెరెసాగారి వలె మన పొరుగువారి పట్ల సుగుణాలతో కూడిన జీవితాన్ని జీవించలేకపోతున్నాం? కావున మనమందరం కూడా మన దైనందిన జీవితాల్లో మదర్ థెరెసాగారి వలె ఉన్నత భావాలను సుగుణాలను కలిగి ఉండి మన యేసయ్య చూపిన ప్రేమ, దయ, సేవా జీవితాన్ని జీవిస్తూ "మీలో గొప్పవాడిగా ఉండదలచినవాడు, ముందుగా సేవకుడై ఉండవలయును" (మార్కు 10:43) అన్న క్రీస్తు ప్రభువుని పలుకులను మదర్ థెరెసాగారి వలె పాటిస్తూ, స్వచ్ఛంగా బతుకుదాం. స్వచ్ఛంగా సేవ చేద్దాం. స్వచ్ఛమైన క్రీస్తు ప్రేమను ఈ లోకానికి అందించుదాం.

❋ ❋ ❋ ❋

# ముకిలిత హస్తంతో ముగింపు

క్రైస్తవ జీవితం జ్ఞానస్నానంతో ప్రారంభమవుతుంది. శుభవార్తలు, శ్రీసభ బోధించే ప్రతీ విషయాన్ని పట్టించుకొని, అలానే జీవించాలి. ఎందుకంటే, క్రైస్తవ జీవితం సుగుణాల సంధానం. మంచి గుణాలను సంధించుకొని, మంచిగా ఉంటూ, అందరి కనుసన్నల్లో మెలగాలి, స్నేహభావంతో జ్ఞానం కలిగి, సేవాతత్పర భావంతో క్రీస్తువలే జీవించాలి. ఇందుకు మొదట విశ్వాసం కావాలి. ఎందుకంటే, అదే దైవజీవానికి పునాది. నిత్యజీవం పొందటానికి అబ్రహాం లాంటి విశ్వాసం కలిగుండాలి. అయితే, విశ్వాసం మనం కోరుకొనేది అయినా అది దేవుడు ప్రసాదించే దివ్యవరం. అలానే ప్రభు రక్షణయందు నమ్మిక కలిగుండాలి. ఈ నమ్మిక క్రైస్తవ జీవన బండిని నడిపించే ఇంధనం వంటిది. ఎవరైతే దేవున్ని తెలుసుకొని, ఆయన్ని ప్రేమించి, సేవించి, అటువెనుక మోక్షభాగ్యం పొందుతామన్న నమ్మకం మనలో చేటుచేసుకున్నపుడు క్రీస్తు మనలో జీవిస్తున్నట్లే. అపుడు క్రీస్తుతో బాటు దైవప్రేమ మనలో హారతి కర్పూరంలా వెలుగుతుంది. సృష్టికర్త అయిన యావే ప్రభువుతో అనుబంధాన్ని పొందుతాము. పట్టుకొమ్మలయిన నీతి నిజాయితీలతో సంఘంలో మసులుకుంటాం. శాంతియుతమైన క్రైస్తవ జీవితం గుబాళిస్తుంది, బుద్ధి వికసిస్తుంది, వివేకంతో వ్యవహరిస్తాం. పుష్కళంగా నిగ్రహం సంతరించుకుంటుంది. భావోద్వేగాలను అదుపులో పెట్టుకుంటాం. ధర్మదండాన్ని చేతబూనిన క్రీస్తును కొలుచుకుంటూ, క్షణక్షణానికి దృఢత్వం పొందుతాం. పట్టుదల పెరుగుతుంది. ధైర్యంతో క్రీస్తుకు సాక్షులుగా నిలబడతాం. ఇదివరలో దుర్గుణాలకు బానిసయి, బాధ్యతా రహితంగా జీవించిన బ్రతుకులు ఇపుడు క్రీస్తు చలువవల్ల స్వేచ్ఛ పొంది, మనసుకు ఎంతో హాయి అనిపించే మధురమైన విధానం మనలో ప్రకాశిస్తుంది. అందుకు చక్కటి ఉదాహరణ పునీత మదర్ థెరెసా. దేవునికి



ప్రతిరూపం క్రీస్తు అయితే, క్రీస్తుకు ప్రతిరూపాలు పునీతులు. ఈ కాలంలో మదర్ థెరెసా శ్రీసభ ఇచ్చిన అపూర్వ కానుక. ఆ సేవా భావంగల మదర్‌ను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకొని క్రీస్తు శక్తితో ఇతరులకు సేవచేస్తూ జీవితాన్ని ధన్యం చేసుకోవాలి. ధన్యోస్మి.

ఈ సంచికను తీర్చిదిద్దిన ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి గారికి, తగు వ్యాసాలను అందించిన గురు విద్యార్థులకు నా అభినందనలు, దేవుని దీవెనలు.

ప్రేమాశీస్సులతో..<br>
**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**<br>
ప్రధాన సంపాదకులు

❋ ❋ ❋ ❋





# పునీత మదర్ థెరెసా






**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org

*Holycrossprinters 9848145417*